
# కళ్యాణి మంజీరాలు



అమృతలాల్ నాగర్



తెలుగు అనువాదం
**కౌముది**

# కళ్యాణ మంజీరాలు

(నవల)

హిందీమూలం

**అమృతలాల్ నాగర్**

తెలుగు సేత

**కౌముది**

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజయవాడ

**KALYANA MANGEERALU** - *by Amritlal Nagar*

ప్రచురణ నెం. : 2350/616

ప్రతులు : 1000

ప్రథమ ముద్రణ : ఏప్రిల్, 2016

టైటిల్ డిజైన్ : గిరిధర్

© రిజర్వ్‌డ్

వెల : ₹ 120/-

**ప్రతులకు**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520004
ఫోన్ : 0866-2430302
Email : vphpublish@gmail.com

**విశాలాంధ్ర బుక్‌హౌస్**
విజయవాడ, విశాఖపట్నం,
అనంతపురం, గుంటూరు
తిరుపతి, కాకినాడ, ఒంగోలు
శ్రీకాకుళం, కడప, విజయనగరం

**హెచ్చరిక :** ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

**ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ**

*సంపాదకీయం :*

# మంజీరనాదాలు

**ఉ**త్తర భారతదేశంలో సంస్కృత సాహిత్యానికి సమ ఉజ్జీగా దక్షిణాదిన తమిళ సాహిత్యం విలసిల్లింది. అందులో **ఇలంగో రాకుమారుడు రచించిన 'శిలప్పదిగారం' అనే కావ్యం చాలా ప్రసిద్ధమయింది.** దీని రచనాకాలం క్రీ.శ. 3వ శతాబ్ది ప్రారంభంగా విమర్శకులు గుర్తించారు. (రెండో శతాబ్ది చివర అయినా కావచ్చు) కథా ప్రాంతం దక్షిణ భారతంలో పశ్చిమతీరం. **ఆ కాలంలో దక్షిణాదిన హిందూ, జైన, బౌద్ధమతాలు సహజీవనం సాగించినై. ఆ కాలపు కళలను, మతాన్ని, జన జీవితాన్ని నాగరికతను 'శిలప్పదిగారం' ప్రతిబింబించింది. 'శిలప్పదిగారం' అంటే 'కళ్యాణ మంజీరాలు' అనే అర్థం.**

స్థూలంగా కథ ఇది : పుహార్ నగరంలో ఒక ధనిక వ్యాపారి కూతురు కణ్ణకి. అదే ఊళ్ళో కోవలన్ అనే అతను ఒక ధనిక వ్యాపారి కొడుకు. వీరిద్దరికీ పెళ్లి అవుతుంది. అదే ఊళ్ళో మాధవి అనే నర్తకి వుంది. కోవలన్ మాధవి చేత ఆకర్షితుడయి కణ్ణకిని ఉపేక్షిస్తాడు. కొంతకాలానికి కోవలన్ మళ్ళీ కణ్ణకినే చేరుకుంటాడు. కాని అప్పటికే కోవలన్ ఉన్న డబ్బు అంతా పోగొట్టుకుంటాడు. బతుకుదెరువుకోసం మధురై నగరం చేరుకుంటారు. మధురైలో కణ్ణకి తన పాద మంజీరాల్లో ఒకదాన్ని కోవలన్‌కు ఇచ్చి అమ్ముకొని రమ్మంటుంది. కోవలన్ ఒక కమ్మరి దగ్గరికి వెళ్ళి అమ్మజూపగా కోవలన్ దగ్గరిది దొంగ సొత్తని ఆ కమ్మరి ఆరోపిస్తాడు. నిజానికి ఆ ఊరి రాణీగారి మంజీరను ఒకదాన్ని ఈ కమ్మరే దొంగిలిస్తాడు. కోవలన్ తెచ్చింది రెండోది అని ఆ కమ్మరి భావన. ఆ అనుమానంతో కమ్మరి అతన్ని రాజుగారికి అప్పజెప్పాడు. రాజు నిజానిజాలు విచారించకుండా కోవలన్‌ను చంపించాడు. తరువాత కణ్ణకి దుఃఖంతో వచ్చి తన రెండో మంజీరాన్ని చూపి తన భర్త నిర్దోషిత్వాన్ని ఋజువు చేస్తుంది. నిజం తెలుసుకున్న రాజదంపతులు పశ్చాత్తాపంతో ఆత్మత్యాగం చేస్తారు. కణ్ణకి ఆ ఊరిని శపిస్తుంది. ఊరు తగలబడి పోతుంది. తరువాత రెండు వారాల్లో కణ్ణకి అమరత్వాన్ని పొందుతుంది.

ధనికుడు తన భార్యను వదిలి ఇతర యువతుల వలలో పడడం, మళ్ళీ తప్పు తెలుసుకోవటం మొదలైన అంశాలలో కొత్తదనం లేదు. తరువాత కథ నడిపిన తీరులో కొంత ఆసక్తి కలిగించే విధంగా ఉంది. ఆధునికులు నవల అని పిలిచే సాహిత్య ప్రక్రియ లక్షణాలు దీనిలో కనిపిస్తయ్. ఈ కథనే అమృత్‌లాల్ నాగర్ అనే హిందీ రచయిత 'సుహాగ్ కే నూపుర్' అనే నవలగా రాశాడు. శిలప్పదిగారం కథనే ప్రధానంగా తీసుకొని అందులో భౌతిక ప్రపంచ విరుద్ధమైన సంఘటనలను తొలగించాడు. సహజ సంఘటనలను చేర్చి పాత్రల అంతర్మథనాలను, అన్యోన్య సంఘర్షణలను చూపించాడు. మరీ ముఖ్యంగా

మాధవి పాత్రను ఉన్నతంగా చిత్రించాడు. కణ్ణకి కళ్యాణ మంజీరాలు తనకు తెచ్చి పెట్టమని మాధవి కోవలన్‌ను అడుగుతుంది. డబ్బు కోసం కాదు. కణ్ణకి స్థాయిలో కోవలన్ పక్కన తాను గుర్తింపు పొందాలని మాధవి తపన. అంటే సాంఘికంగా తనకు రావాల్సిన న్యాయమైన స్థానం కోసం పోరాడుతుంది. అందుకోసం ప్రేమించిన కోవలన్‌ను కూడా వదులుకోటానికి సిద్ధపడుతుంది. తన బాధ్యతలేని తన కులం మూలంగా తనకు దక్కవలసిన స్థానం తనకు ఎందుకు దక్కకపోవాలని ఆవేదన చెందుతుంది. వేశ్యాకులాన్ని తయారు చేసిన సంఘాన్ని ధిక్కరిస్తుంది. ఎదిరిస్తుంది. చివరికి ఓడిపోతుంది. ఓడిపోక తప్పని కాలమది.

అసమ సాంఘికవ్యవస్థ కొన్ని వర్గాల ప్రజలను సాంఘికమైన అన్యాయాలకు ఎట్లా గురిచేసిందీ, అందులో స్త్రీకి జరిగిన అన్యాయాన్ని ఈ నవల చాలా సున్నితంగా చిత్రించింది. అంతేకాదు ఎదిరించి పోరాడటమే గౌరవప్రదమైనదన్న సందేశాన్ని మాధవి ద్వారా ఈ నవల అందిస్తుంది. ఆ కాలపు సాంఘిక పరిస్థితుల పరిధిలోనే అమృత్‌లాల్ నాగర్ ఎంతో నిపుణతో ఈ చిత్రణ చేశారు. ఆ కాలపు నాగరికతా, వాతావరణం చెడకుండా తన సందేశాన్నందించిన అమృత్‌లాల్ నాగర్ ప్రశంసనీయులు. ఈ నవలను 'కళ్యాణ మంజీరాలు'గా అందెల రవళుల సందడి వినిపించే చక్కటి తెలుగు వచనంగా మలచిన కౌముదిగారు అభినందనీయులు. 'కళంకిని' అనే పేరుతో మొదట అచ్చయింది. అయితే 'కళ్యాణ మంజీరాలు' అనే పేరే దీనికి బాగా సరిపోతుందని ఈ ముద్రణలో ఈ పేరు ఎన్నుకున్నాం.

ఈ నవలకు ముందుమాట కీ.శే. ఆచార్య చేకూరి రామారావుగారు రాశారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వినమ్రతతో వారికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నది. తెలుగుభాషకు, సాహిత్యానికి వారు చేసిన ఎనలేని సేవకు తెలుగుభాషాభిమానులు వేనోళ్ళ కొనియాడుతూనే ఉన్నారు. వామపక్ష ఉద్యమం పట్ల వారి శ్రద్ధాశక్తులను విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్ సదా కృతజ్ఞతతో నెమరు వేసుకుంటుంది.

పౌర సమాజంలో నేడు చోటుచేసుకున్న ఘర్షణాపూరితమైన వాతావరణం రీత్యా, సామాజిక సమతౌల్యాని పెంపొందించడానికి అనువైన మతసామరస్యం సాధించవలసిన అవసరం రీత్యా ఈ నవల ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ప్రయత్నాన్ని తెలుగు పాఠకులు తప్పక హర్షిస్తారని విశ్వసిస్తున్నాం.

అభివందనాలతో

**గడ్డం కోటేశ్వరరావు**

సంపాదకుడు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

# కళ్యాణ మంజీరాలు

## 1

**రా**త్రి రెండో ఝాము దాటక ముందే ఈ వేళ కావేరీ పట్టణం నౌకాశ్రయం వైపు లెక్క లేనన్ని పల్లకీలు, గుర్రాలు, రథాలు పరుగెడుతున్నాయి. గుర్రాల మీద జట్లుజట్లుగా కాగడాలు ధరించిన రౌతులు పరుగెడుతున్నారు. రథాలకు చక్కగా అలంకరించిన ఎద్దుల్ని పూన్చారు.

ఆ జన సమ్మర్దంలో వేరువేరు దళాలకు నాయకత్వం వహిస్తున్న ఇద్దరు యువకుల గుర్రాలు దగ్గరకు వచ్చాయి. కాగడాల వెలుగులో వారు ఒకరి మొహం ఒకరు చూచుకున్నారు.

"ఓ! పాపనాశన్ నువ్వా! అయితే ఈవేళ పొద్దు పడమట పొడుస్తుందనుకుంటాను అవునా?"

"తంబి వస్తున్నాడు కదా ఎదురుకోలుకు రాకపోతే అమ్మా నాన్నా బాధపడ్తారు, అందుకని బైలుదేరి వచ్చేశాను. మరి నువ్వెందుకోయ్ వస్తున్నావు మహాలింగం?"

"సార్థవాహుడు కోవలన్ కోసమనే నేనూ బైలు దేరాను. నిజానికి అదృష్టమంటే ఆ కోవలన్‌ది అదృష్టం. కనకాన్నే కాదు ఎంతో కీర్తిని కూడా తరలించుకొని వస్తున్నాడు."

మహాలింగం వెచ్చగా ఒక నిట్టూర్పు విడిచి "అదృష్టంకాదా మరి. ఇక్కడా అతని కోసం లక్ష్మి వరమాల పుచ్చుకొని సిద్ధంగా వుంది" అన్నాడు.

"అది సరేకాని మహాలింగం! మహాశ్రేష్ఠి కూతురు వివాహం నీతో జరుగుతుందని విన్నాను, మళ్ళీ కొత్తగా నిన్న ఏం విన్నానో తెలుసా?"

"పోనీవోయ్ పాపనాశన్, నాకు బానిస బ్రతుకంటే పరమ అసహ్యం అనుకో. మహాశ్రేష్ఠి ఏమన్నాడో తెలుసా. తన కూతుర్ని పెళ్ళాడిన వాడు పరస్త్రీని మరి కన్నెత్తి చూడకూడదట."

పాపనాశన్ కొద్దిగా నవ్వి "కావచ్చు. కణ్ణకి అతిలోక సుందరి. ఆమెను పొందాక మరొకర్తెను చూచే అవసరమే మరి వుండక పోవచ్చు" అన్నాడు.

"ఎవరన్నారు? ఏ ఆడదాని అందమైనా పూర్తిగా మొగవాడి అధికారంలోకి రానంతవరకే. పూర్తిగా అనుభవించాక ఇక అందులో ఆకర్షణ ఏముంటుంది?"

"మరి వేశ్య అందమో?"

మహాలింగం నవ్వాడు "వేశ్య సంపూర్ణంగా యెప్పుడూ, ఎవరి అధికారంలోకి రాదు పాపనాశన్! అదొక ఎండమావి అందుకే దాని ఆకర్షణ అనంతం."

పాపనాశన్ పెద్దగా నవ్వుతూ, గుర్రాన్ని మహాలింగం ప్రక్కకు అదలించి అతని భుజం తట్టాడు. "ఎవరేమైనా అనుకోనీయవోయ్ మహాలింగం నా దృష్టిలో నువ్వే రసిక శిఖామణివి. ఈ కావేరి పట్టణంలో మరొకడ్ని చూపించమను నీలాంటి వాడ్ని. వర్తక వ్యాపారాలలో కోవలన్ సమర్థుడైతే కావచ్చు కాని నువ్వు రస వ్యాపారివి రూప విపణిలో నీకు మరి పోటీలేదు."

ఇద్దరూ పెద్దగా నవ్వారు. కొంచెం దూరం నడిచాక పాపనాశన్ అసలు సంగతి ఎత్తాడు. "ఈ వేల్టి నృత్యోత్సవంలో నీ లలిత కూడా పాల్గొంటుందా?"

ఔనన్నట్టు తల ఆడించాడు పాపనాశన్.

పెరియన్నాయకి దత్త పుత్రిక మాధవి ఆమెను మించిన నెరజాణ అని విన్నానే. మహాలింగంను ఎగద్రోయాలని అన్నాడు పాపనాశన్. అతని బాణం గురి తప్పలేదు. ఈ మాటతో మహాలింగం గింజుకున్నాడు.

"రాజమాలిక ఎప్పుడూ కులీనలైన వారకాంతలకే దక్కుతుంది పాపనాశన్! ఇక యోగ్యత అంటావా ఆ మాధవి నా లలిత కాలిగోటికి కూడా పోలదు."

"అబ్బే నా ఉద్దేశం అదికాదు. నిన్న సునంద ఎవరితోనో చెప్తూండగా ఆలించాను. ఇంకెక్కడి కులీనతయ్యా బాబూ! ఏనాటి మాటో అది. ఇరవై సంవత్సరాల నాడే అది ఈ సభ నుండి లేచిపోయింది, అంటూంది సునంద. చేలమ్మను గురించి ఎత్తిపొడుస్తుందది. చేలమ్మ కులగణిక కాక పోయినా ఇరవై యేళ్ళనాడే దాని నాట్య కౌశలాన్ని చూచి మహారాజు నియమ భంగం చేశాడు."

"ముసలితనంలో మతి చెడి మహారాజు పప్పులో కాలువేసినా, కులగణిక కాని కారణంగానే చేలమ్మ ఆ ఘనతను నిలబెట్టుకోలేకపోయింది. ఈసారి మన నాట్యాచార్యులు శంకరన్ మొదలియార్ కూడా మదన పతకం పొందడానికి కులీనలైన వంజి కన్యలే తగినవారనే ఉద్దేశంలో ఉన్నారు. అయినా అది ఇరవై ఏళ్ళనాటిమాట. ఆ ఒక్క అపవాదూ తప్పిస్తే, మిగిలిన పతకాలన్నీ వంజి కన్నెలకే వచ్చాయి."

"కులగణికలు కాని వాళ్ళెవరూ నృత్యోత్సవాలలో పాల్గొనలేదు గనుక పతకం వాళ్ళకు లభించలేదనడంలో అర్థంలేదు. ఇన్నేళ్ళకు ఇప్పుడు మాధవి పాల్గొంటున్నది. మా అమరావతి కూడా ఈసారి పతకం మాధవిదేననే ఉద్దేశంతో వున్నట్టుంది."

మహాలింగాన్ని ఉడికించాలని పాపనాశన్ వేసిన పథకం ఫలించింది. కోపంతో అతని కళ్ళు ఎఱ్ఱబడ్డాయి. ఆహాహా... అంటూ వికటంగా నవ్వి వంజివాడలో బిచ్చమడుక్కునే చేలమ్మ శిష్యురాలా లలితను జయించేది. మా లలిత, కొమ్ములు తిరిగిన నాట్యాచార్యుల శుశ్రూష చేసి వుంది తెలుసా" అన్నాడు.

"అయితే ఇకనేం, తథాస్తు" అంటూ పాపనాశన్ గుర్రాన్ని దౌడు తీయించాడు. కొంచెం దూరం వెళ్ళాక మహాలింగం ప్రక్కకు జరిగి రహస్యం చెప్తున్నట్టు "ఒక్కమాట. దుస్సాహసం అనుకోవద్దు. లలిత కోసం స్వర్ణముద్రికలు గుప్పిళ్ళతో విరజిమ్ముతున్నావట?" అన్నాడు.

"తెలివిగల షరాబు యెప్పుడూ బంగారాన్ని పరిశీలించాకే ధర పెడ్తాడు పాపనాశన్. ఈ రోజుతో నా తపస్సు ఫలిస్తుంది. లలిత మదన పతకాన్ని జయించడమూ, లలితను నేను జయించడమూ జరిగిపోతాయి. మరి రేపటి నుండి చూడు నీలాంటి వాళ్ళందరూ మహా లింగాన్ని చూచి కళ్ళు కుట్టుకోవాలి మరి."

"నాలాంటి వాళ్ళు కళ్ళు కుట్టుకోవడం దేనికోయ్ మహాలింగం. పడుచువాళ్ళ కోసం పడిచచ్చే అవసరం నాకు లేదు. నాకేం తక్కువని? ఇంట్లో అందమైన భార్య. సంతలో అమరావతి. నాకు ఏ కోరిక లేదిక."

"ఇది ఉత్త మూర్ఖపు ఆలోచన అంటాను నేను. ఎదిగే ప్రాయంలోనే ఇట్లా గిడసబారి పోయినవాడ్ని రసికుడని ఎవరూ అనరు."

"అననీ అనకపోనీ నాకు చింతలేదు. జీవితంలో ఆడది ఒకటే ముఖ్యంకాదు, అనేకం వున్నాయి. స్త్రీ వ్యామోహంలో పడి లక్ష్మిని కాలదన్నుకోవడం నాకు నచ్చదు."

"ఆహాహ! లక్ష్మీ?" మహాలింగం హేళనగా నవ్వాడు. "లక్ష్మి? లక్ష్మి?" అని చచ్చేవాడు మూర్ఖుడని నా ఉద్దేశ్యం. అదృష్టవంతుడి వెనుక లక్ష్మే! స్వయంగా పరుగెత్తి వస్తుందోయ్ మిత్రమా! నన్ను చూడరాదు. డబ్బు చింత అనేది ఏనాడూ నాకు లేదు. తల్లిదండ్రులకు నా పద్ధతి నచ్చదు. వాళ్ళు మూర్ఖులు అస్తమానం డబ్బు డబ్బు అంటూ చస్తుంటారు. అదృష్టం కలిసివస్తుంటే సంపాదన చింత దేనికి. కలిసివచ్చే యోగం వుంటే పంగు దగ్గరకే గంగ వస్తుందంటారు."

"మరి అదృష్టం కలిసిరానివాడో?"

"నువ్వు నన్ను చూచి ఈర్ష్య పడుతున్నావు పాపనాశన్. అందుకనే నా కీడు కోరుతున్నావు. లలిత మిమ్మల్నందరినీ కాదని నన్నే ప్రేమిస్తుందని అసూయ మీకు. అలా యేడ్చేవాళ్ళనందరినీ యేడ్వనిమ్మంటాను నేను. నాకేం ఫరవాలేదు. నా అదృష్టం నా వెంట వుంది." అంటూనే గుర్రాన్ని ఒక్కటి యిచ్చుకున్నాడు మహాలింగం – అది నాలుగు కాళ్ళమీద దౌడు తీసింది.

❊ ❊ ❊

నౌకాశ్రయంలో జనం క్రిక్కిరిసి వున్నారు. అసంఖ్యాకంగా కాగడాలు వెలుగుతున్నాయి. ఆ వెలుతురులో మణి స్తంభాలమీద రంగు రంగుల జండాలు ఎగురుతున్నాయి. ఎత్తైన వేదికల మీద మేటలు మేటలుగా వర్తకపు దినుసుల బోరాలు పేర్చి వున్నాయి. వాటికి మధ్యస్థంగా రత్న జటితమైన చాందినీలకింద పట్టు బాలీసులకానుకొని నగర మహాశ్రేష్టులిద్దరు ఆసీనులయ్యారు. వారికి ఇవతలగా ఇతర నగర వర్తకులూ వారి పరివారమూ కూర్చున్నారు. అంతా యువసార్థవాహులు కోవలన్ నౌకలకోసమని నిరీక్షిస్తున్నారు. నిజానికి అవి నిన్ననే తీరం చేరవలసింది కాని, తగిన సుముహూర్తంలో వాటిని నగరప్రవేశం చేయించాలని మహాశ్రేష్ఠిగారు ఈ వేళ బ్రాహ్మీ ముహూర్తంలో తీరానికి చేర్చవలసిందిగా తన కుమారునికి ఎదురు వర్తమానం పంపారు. ఈ సుముహూర్తంతోనే మహాశ్రేష్ఠి మానాయకన్ ఏకైక సంతానమయిన కణ్ణకితో కోవలన్‌కు ప్రధానం కూడా జరగవలసి వుంది.

మహాశ్రేష్ఠి మాశాత్తువన్ దక్షిణ భారతమంతటికీ పేరు మోసినవాడు. మధుర, ఇంద్రప్రస్థం వంటి మహానగరాలన్నీ ఇతని వర్తక కేంద్రాలే. మహాశ్రేష్ఠి వర్తక నౌకలు ఉత్తర భారతమంతా తిరుగుతాయి. మహాశ్రేష్ఠి మానాయకన్ వర్తకం ద్వీప ద్వీపాంతరాలదాకా వ్యాపించి వుంది. శూర్పరాక్, బావేర్, మిశ్ర, రోమ్ దేశాలు. సింహళం, సువర్ణ, కటాహ, యవ మొదలైన ప్రసిద్ధ ద్వీపాలలో అతని వాణిజ్య కేంద్రాలున్నాయి.

రెండు సంవత్సరాలయింది. మహాశ్రేష్ఠి మాశాత్తువన్ తన ఏకైక పుత్రుడ్ని సార్థవాహుడ్ని చేసి తన కార్యవాహుల్లోకెల్లా సమర్థుడైన వేల్లి నాథన్‌ను పర్యవేక్షకునిగా ఇచ్చి ఉత్తర దేశాలకు పంపాడు. నగరంలోని ఇతరశ్రేష్ఠి పుత్రులు కూడా అనుభవం గడించడం కోసమని వెంట వెళ్ళారు. అయిదేళ్ళకో మాటు నగర శ్రేష్ఠులందరూ తమ తమ పుత్రుల్ని దళాలుగా ఏర్పరచి, సార్థంయిచ్చి అనుభవం కోసమని విదేశాలకు పంపుతుంటారు. ఈసారి సార్థం వెళ్ళి ఆరునెలలైనా గడవక ముందే వేల్లినాథన్ పర్యవేక్షణలో, కోవలన్ నాయకత్వాన వెళ్ళిన దళం అద్భుత విజయాలు సాధించినట్టు వర్తమానం వచ్చింది. దళనాయకుడు కోవలన్ వెళ్ళిన ప్రతిచోటా తన వ్యవహార కౌశలం చూపి గొప్ప విజయాలను సాధించాడు. తండ్రిని మించిన వాడని కీర్తి పొందాడు.

తన ప్రియ పుత్రిక కణ్ణకి సంబంధాన్ని గురించి మహాశ్రేష్ఠి మానాయకన్‌కి మొదటవున్న ఆలోచన వేరు. ఎవడైనా కులీనుడైన శ్రేష్ఠి పుత్రుడ్ని ఇల్లరికం పెట్టుకుందామనుకున్నాడు. అందుకని మిరియాల వర్తకుడు కుప్పుస్వామి కుమారుడు మహాలింగంకు కణ్ణకినిస్తే సరిపోతుందని ఆలోచించాడు. తీరా అతగాడి ప్రవర్తన చూచి ఆ ఉద్దేశం మార్చుకున్నాడు. తరువాత కోవలన్ ప్రసిద్ధి విని, కణ్ణకిని అతగాడికిచ్చి చేస్తే బాగుంటుందని ఆశపడ్డాడు. కోవలన్ ఇల్లరికానికి అంగీకరించేవాడు కాడు. అయినా ఇది కణ్ణకికి అన్ని విధాలా సరిపోయే సంబంధం. ఈ వియ్యం రెండు సంపన్న కుటుంబాలను ముడివేసి భవిష్యత్తులో కణ్ణకి సంతానానికి విశ్వవిఖ్యాతి తెచ్చి పెడుతుందని మహాశ్రేష్ఠి ఆలోచన. వెంటనే వెళ్ళి మహాశ్రేష్ఠి మాశాత్తువన్‌ను కలుసుకొని కోవలన్ తిరిగిరాగానే ప్రదానం కోసం ఏర్పాట్లు కూడా చేయించాడు. ఇప్పుడు తన కాబోయే అల్లుడికి స్వాగతం చెప్పేందుకు సపరివారంగా కదలివచ్చాడు.

చివరకు నిరీక్షణ ముగిసింది. కావేరీ పుణ్య జలాల్లో దూరంగా మహానౌక తాలూకు ధ్వజమూ - తెరచాపా కనిపించాయి. పతాక స్తంభాల మీద మినుకు మినుకు మంటూ దీపాలు వెలుగుతున్నాయి. ఆప్తుల దీర్ఘకాల సందర్శనం కోసం వేచివున్న బంధుజనంలో ఉత్సాహం పరుగులు తీసింది. శంఖనాదాలు, ఇతర మంగళ వాయిద్యాలు మోగుతున్నాయి. దక్షిణల ఆశతో వచ్చిన బ్రాహ్మణులు, బౌద్ధభిక్షువులు, క్షపణకులు సంప్రదాయానుసారం స్వస్తి మంత్రాలు పఠిస్తున్నారు. వస్తూన్న నౌకలకు స్థలం చాలదనే ఉద్దేశంతో తీరాన వున్న చిన్న చిన్న నావలన్నిటికీ తెరచాపలు విప్పి విడిచిపెట్టారు. నౌకలు సమీపించినకొద్దీ హర్షధ్వానాలు మిన్నుముట్టుతున్నాయి. మొదట కోవలన్ నౌక తీరానికి చేరింది. దాని వెనుకే మరి యాభై నౌకలు వస్తున్నాయి.

దివ్యమైన చోళసింహమూర్తులు చెక్కివున్న నిచ్చెన మెట్లమీదుగా కోవలన్ నౌక దిగివచ్చి, తండ్రికి పాదాభివందనం చేసి తలవంచుకు నిలుచున్నాడు. మహాశ్రేష్ఠి, మాశాత్తువన్ కుమారుణ్ణి గ్రుచ్చి కౌగిలించుకున్నాడు. ఆనందాతిశయంలో ఆయన కళ్ళు అశ్రు పూర్ణాలయ్యాయి. మహాశ్రేష్ఠిగారు తన అల్లుణ్ణి స్నిగ్ధంగా చూస్తూ ఒక ప్రక్కని మౌనంగా నిలబడి పోయాడు.

మహాశ్రేష్ఠి కన్నీటిని కొనవేలితో మీటి "పూజ్యులైన మీ మామగారికి ప్రణామం చేయి నాయనా నీ కోసం ఇంత దూరం శ్రమ అనక వచ్చారు" అన్నాడు.

నిన్న రాత్రే సందేశ వాహకుడి ద్వారా తన సంబంధం వార్త విని వున్నాడు కోవలన్. సిగ్గుతోనూ, సంకోచంతోనూ మామగారికి పాదాభివందనం చేశాడు. మా నాయకన్ పులకితుడై అతడ్ని కౌగిలించుకుని, ఆశీర్వదిస్తూ పంచ రత్నాలను గుప్పిళ్ళతో దిగదుడిచి విసిరేశాడు. యధారీతిని స్వాగతార్థం వచ్చిన ఇతర ప్రముఖులందర్నీ కోవలన్

కలుసుకున్నాడు. బ్రాహ్మణుల, బౌద్ధుల ఆశీర్వాదాలను స్వీకరించాడు. మిత్రులనందరినీ కౌగిలించుకొని క్షేమ సమాచారాలు అడిగాడు.

తీరం అంతటా సంతోషం పొంగులు వారింది. కూలీలు పాటలు పాడుకుంటూ నౌకల మీంచి దినుసుల బోరేలు దింపుతున్నారు. స్వాగతార్థం వచ్చిన బంధుజనం కేరింతలు ప్రాతఃకాల పక్షుల కలవరంతో కలిసిపోయాయి. ప్రభాతం స్ఫటికంలాగా మెరిసింది. ఇంతలో పురోహితుడు వచ్చి శ్రేష్ఠి పుత్రులకు "పవిత్ర కావేరీ జలాలను పూజించిన మీదటే నగర ప్రవేశం, ముందు పూజావిధి నిర్వర్తించా"లని ఆదేశించాడు.

మహాశ్రేష్ఠి మానాయకన్ గారి ఆరోగ్యం ఇటీవల సరిగాలేదు. అందుకని సౌధానికి వెళ్ళిపోయారు. మహాశ్రేష్ఠి మాశాత్తునన్ కూడా వారిని అనుసరించారు. కోవలన్ మిత్రమండలితో కలిసి నవ్వుతూ తుళ్ళుతూ జలపూజ కోసమని స్నాన ఘట్టం వైపు నడిచాడు.

స్నాన ఘట్టం దగ్గర జనసమ్మర్థం లేదు. ఒక ప్రక్కగా ఒక బిచ్చగాడు మాత్రం కూర్చొని కునికిపాట్లు పడుతున్నాడు. రెండువైపులా విరగబూచి వున్న పచ్చగన్నేరు చెట్లు గాలికి వూగుతున్నాయి. దూరం నుండి కూలీల పాటలు అలలు – అలలుగా తేలివస్తున్నాయి.

కోవలన్ స్నాన ఘట్టం మెట్లు దిగుతూండగా ఒక సంఘటన జరిగింది. అద్భుత సౌందర్యవతి మాధవి అప్పుడే జలపూజ ముగించుకొని ఎదురుపడింది. ఆమెను చూసీ చూడ్డంతోనే, "అద్భుతమైన శకునం" అని అరిచాడు కోవలన్ మిత్రుడైన కన్నన్ శ్రేష్ఠి "ఈ త్రిలోక సుందరి ఈ రోజు ఇంద్రోత్సవంలో రాజ పురస్కారం పొందబోతూన్న నర్తకీ మణి. వీరిని గుర్తించావా మాధవీ! శ్రీశ్రీశ్రీ కోవలన్ శ్రేష్ఠి వీరు. విదేశయాత్ర ముగించుకొని ఈరోజే తిరిగి వచ్చారు."

ఈ పరిచయ వాక్యాలు మాధవినేమీ కదిలించలేక పోయాయి. ఆమె నిశ్చలంగానే నిలుచున్నది. కాని ఆమె వెనకవున్న పెరియన్నాయకి మాత్రం కోవలన్‌ను చూచి పొంగిపోయింది. వొంగి వొంగి ప్రణామాలు చేస్తూ "సూర్యచంద్రులు పరిచయ విధేయులు కారు కన్నన్ శ్రేష్ఠీ! ఇది మా మాధవికి కూడా శుభ శకునమే. ఇంద్రోత్సవాల కోసమని జలపూజ చేసి వస్తూ దిగ్విజయంగా తిరిగి వచ్చిన మహాశ్రేష్టిని దర్శించింది. ఇంతకు మించిన అదృష్టం ఇంకేముంటుంది" అంది.

మాధవి తన అందమైన నేత్రాలను కొద్దిగా తిప్పి కోవలన్ వైపు చూసింది. ఇంతసేపూ ముగ్ధుడై ఆమె వైపే చూస్తూ నిలుచున్న కోవలన్ వెంటనే తన మెడలోంచి శూర్పరాక్ నుంచి తెచ్చిన ఆణిముత్యాల హారాన్నొకదాన్ని దీసి మాధవి మెడలోవేస్తూ "మంగళ ముఖీ నీకు జయమగుగాక" అన్నాడు.

పెరియన్నాయకి పొంగిపోయి మళ్ళీ కోవలన్‌కు వొంగి ప్రణామం చేసింది. మిత్రులందరూ హర్షధ్వానాలు చేశారు. అయితే ఆ క్షణంలోనే మాధవి చేసిన పని అందరికీ దిగ్భ్రాంతి కలిగించింది. ఆమె తక్షణమే అమూల్యమైన ఆ హారాన్ని మెడలోంచి తీసి దగ్గరే కునికిపాట్లు పడుతున్న బిచ్చగాడి జోలెలోకి విసిరేస్తూ “ఈ రోజు ధరించవలసింది మహారాజు కంఠ మాలనే తప్ప మరొకటికాదు” అంటూ తిరిగయినా చూడకుండానే గబగబ సాగిపోయింది.

ఈ అవమానంతో కోవలన్ ముఖం బాగా ఎరుపెక్కి పోయింది. అతని మిత్రులూ, పెరియన్నాయకీ స్థబ్దులై అలాగే చూస్తూ నిలుచున్నారు. ఓ క్షణంలో పెరియన్నాయకి తేరుకొని అతి విధేయంగా చేతులు రెండూ జోడించింది. “శ్రేష్ఠి పుత్రులు క్షమించాలి. ఇంకా బాల్యం పోలేదు దానికి. జరిగిందానికి నేను చాలా సిగ్గు పడుతున్నాను మహాశ్రేష్ఠీ!” అంటూన్న ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి. వెంటనే చెంగున ముడివేసుకున్న అయిదు బంగారు నాణేలు విప్పి బిచ్చగాడి జోలెలోవేస్తూ వీటితో నీ అక్కర తీరుతుంది. మాకు పరమ పవిత్రమూ, మంగళ ప్రదమూ అయిన ఈ హారాన్ని నేను తీసుకుంటున్నాను భిక్షూ!” అంటూ ఆ హారాన్ని అందుకొని కళ్ళకద్దుకుంటూ కోవలన్‌కూ అతని మిత్రులకు మళ్ళీ ఒకసారి ప్రణామాలు చేసి ముందుకు సాగిపోయింది.

ఆమె వెళ్ళిన దిక్కునే చూస్తూ “ఘటికురాలే! అయిదు ముద్రలతో ఈ బిచ్చగాడి అదృష్టాన్నే లాక్కుపోయింది” అన్నాడు కోవలన్.

“ఈమె ఇంకా నయం! ఏమీ ఇవ్వకుండానే మనస్సునే హరించుకు పోయిందే మరి ఆమె సంగతో?” అన్నాడు కణ్ణన్ నవ్వుతూ.

“బుద్ధిమంతుడెప్పుడూ వీధుల్లో చేతులుమారే యవ్వన లక్ష్మికి విలువ ఇవ్వడోయి నేస్తం! స్థిరంగా వుండే గృహలక్ష్మినే వరిస్తాడు” అంటూ చరచర ముందుకు సాగిపోయాడు కోవలన్.

ఆ పగలల్లా నగరంలో పలుచోట్ల ఈ సంఘటననే జనం చెప్పుకున్నారు. కోవలన్ తండ్రిగారూ, మహాశ్రేష్ఠి గారూ ఇది విని సంతోషించారు. కోవలన్ సమయోచితంగా ఇచ్చిన ఆ సమాధానం వారికొక గర్వకారణమయింది.

## 2

స్నానఘట్టం దగ్గర జరిగిన సంఘటన మరిన్ని చిలువలు పలువలతో వేశ్య వాడలో గొప్ప చర్చనీయాంశంగా మారిపోయింది. మాధవి తన అజ్ఞానం కొద్దీ కోవలన్‌నే కాదు నగర మహాశ్రేష్ఠులిద్దర్నీ అవమాన పరిచింది. దాని ప్రభావం ఈ వేళ జరిగే ఇంద్రోత్సవం మీద కూడా వుంటుందేమోనని పెరియన్నాయకికి భయం పట్టుకుంది.

మాధవి పెరియన్నాయకి కన్న కూతురు కాదు. యెప్పుడో చిన్నతనంలోనే ఆమె మాధవిని కొనుక్కున్నది. పెరియన్నాయకి కూడా ఆమె తల్లికి కొనుక్కున్న సంతానమే. ఇతర కులాల్లాగే ఈ వేశ్యాకులంలో కూడా కులం పట్టింపు అధికం. అందులోనూ ఈ వంజివర్గం ఇల్లంగాయి అనీ, వలగాయి అనీ రెండు శాఖలుగా విడిపోయింది. ఈ రెండు శాఖల్లోనూ ఆచార భేదాలు శాఖాభేదాలు కొల్లలు.

ఈవేళ నృత్యోత్సవంలో నర్తకీ గణం అసంఖ్యాకంగానే పాల్గొంటున్నా - పోటీ ప్రధానంగా మాధవికీ లలితకు మధ్యేనని అంతా చెప్పుకుంటున్నారు. లలిత రాజమ్మ కూతురు. రాజమ్మ వంజికులంలో బాగా పేరుమోసిన వేశ్య. నగర కోటీశ్వరుల్లో మహాశ్రేష్ఠులిద్దరికీ ఎంత ప్రసిద్ధి వుందో వేశ్యకులంలో ఈమె అంత ప్రసిద్ధురాలు. మొదటినుంచే ఈమెకు పెరియన్నాయకి అన్నా మాధవి అన్నా గిట్టదు. నగర మహానట్టువ, పుహారేశ్వరం మందిర ప్రధాన దేవదాసీ, ఒకరిద్దరు సామంతులు సైతం ఈమె పక్షాన వున్నారు. అంతేకాదు ధనం విరజిమ్మి వంజికులాన్ని యావత్తూ తన గుప్పిట్లో వుంచుకుంది. పెరియన్నాయకికి, మాధవికీ వ్యతిరేకంగా అనేక వదంతులు పుట్టించి ప్రచారం చేయించింది.

గాయకురాలిగా పెరియన్నాయకికి నగరంలో మంచి పేరు వుంది. చాల సంవత్సరాల క్రితమే వర్తకం కోసమని వచ్చిన యవన వ్యాపారి "పన్సా" ఈమె ఆకర్షణలో పడి ఇక్కడే వుండిపోయాడు. అతనివల్లనే పెరియన్నాయకి బాగా సంపన్నురాలై పోయింది. పెరియన్నాయకి తెలివిగలది కనుకనే యవ్వనంలోనే భవిష్యత్తును గురించి జాగ్రత్త పడి మూడేళ్ళ పసిపిల్లను మాధవిని కొని పెంచుకొని, విద్యాబుద్ధులు చెప్పించింది.

చేలమ్మ పెరియన్నాయకి బాల్య స్నేహితురాలే అయినా ఆమెకు పెరియన్నాయకి అంటే పడదు. ఆ పేరెత్తితేనే కస్సుమని లేస్తుందామె; మళ్ళీ మాధవి అంటే ప్రాణమిస్తుంది. ఒకనాటి సంగతి - జనం చేలమ్మ అంటే పడిచచ్చే వారు. ఆమె నాట్యం అంటే చెవి కోసుకునేవారు. ఆ కాలంలోనే ఉత్తమ నర్తకిగా రాజపతకం గెలుచుకుంది చేలమ్మ. అంతులేని వైభవాన్నీ, సౌఖ్యాన్నీ అనుభవించింది. చివరకు అదృష్టం తారుమారై ఆ ధనమూ, సౌఖ్యమూ పోయాయి. తినడానికి లేక వీధుల వెంట తిరిగి అడుక్కుంటుంది. రోగాలు వచ్చి శరీరం పాడయిపోయింది.

రాజమ్మ లంచాలు పెట్టి మాధవికి సరయిన గురువు లభించకుండా చేసినప్పుడు, ఇక గత్యంతరం లేక చేలమ్మే ముందుకు వచ్చింది. నగర నట్టువలందరినీ చీపురుతో సింగారిస్తానని తిట్టి పోసింది. అంతేకాదు మాధవి రాజపతకం గెలుచుకొని నగర వధువుగా ఏనాడయితే ప్రకటింపబడుతుందో ఆనాడే నగర మహానట్టువు లలితకు గురువు శంకరన్

మొదలీ గడ్డం వూడబీకి తన గడ్డానికి అంటించుకుంటానని ఘోరమైన ప్రతిజ్ఞ కూడా ఒకటి చేసి మాధవికి శిక్షణ ఇవ్వడం ప్రారంభించింది. ఈ మాటలు విని వేశ్య వాటికలో అందరూ నవ్వుకున్నారు. ఆనాటి నుండి వారికిదొక హాస్యోక్తి అయిపోయింది. ఇలా నగర నాట్యాచార్యుల వారిని నిందించే సాహసం వంజివాడలో మరొకరికి లేదు.

నగర వీధులన్నీ తిరిగి ఇంద్రోత్సవాన్ని గురించిన చర్చలన్నీ వినివచ్చి ఉసూరుమంటూ ఒక నిట్టూర్పు విడిచి చతికిలబడిపోయింది పెరియన్నాయకి. నగర మహానట్టువు, పుహారేశ్వరం మందిర ప్రధాన దేవదాసి రుద్రమ్మాళ్ రాజమ్మ పక్షాన వున్న కారణంగా స్నానఘట్టం దగ్గరి సంఘటనవల్లా ఈసారి పతకం లలితదేనని అంతా చెప్పుకుంటున్నారు. పతకం రాకపోతే పోయింది. చేలమ్మ నాట్యాచార్యుడ్ని దూషించిన నేరానికి శిక్ష ఎక్కడ పడుతుందోనని బెదురు పట్టుకుంది పెరియన్నాయకికి.

మధ్యాహ్నానికి చేలమ్మ వచ్చింది. నల్లబారిన ఆమె శరీరం మీద తెల్లటి కుష్ఠుమచ్చలు భయం గొలుపుతాయి. ఆ జబ్బు కారణంగా పుట్టిన అసహ్యం, వివశత్వం మరెక్కడా చోటు చాలక ఆమె కళ్ళలోనే గూడు కట్టుకు పోయినట్టు అనిపిస్తుంది. ఒకప్పుడు ఎందరెందర్నో ఆకర్షించిన ఆ కన్నులే ఇప్పుడు భయంకరంగా వుంటాయి.

"ఏమే పెరియన్నాయకీ! నీ కూతురు కోవలన్ మొఖానికి సున్నం పూసి వచ్చిందటగా ఈ వేళ. కోవలన్ అంటే ఎవరో కాస్త తెలుసుకో. నగరానికి మహాశ్రేష్ఠి ఏమనుకున్నావో?"

"నీ ముఖం మండా. నీదాకా వచ్చిందీ సువార్త" పెరియన్నాయకి గొణుక్కుంది.

"నగరిలో ఎక్కడ చూచినా నీ కీర్తి మోగిపోతూంది గదే – ఆహాహా!" పెద్దగా నవ్వింది చేలమ్మ.

పెరియన్నాయకి రెండు చేతులతోనూ ముఖం కప్పుకొని కూర్చుంది. ఈమె దిగులు చూచి మరింత రెచ్చిపోయింది చేలమ్మ.

"ఏడ్వకు – యేడ్వకు. ఏడ్చే రోజులన్నీ ముందున్నాయే పిచ్చి మొహమా. మాధవి సంగతి వదిలెయ్. నువ్వు మాత్రం చిప్ప బుచ్చుకొని ఆ పట్టినప్పాకం సంతలో బిచ్చమడుక్కోకపోతే నా పేరు తిప్పిపెట్టు, పెద్ద పెద్ద కలలు కంటూంది పాపం. ముసలితనంలో హాయిగా ఉయ్యాలలో కూర్చొని, చరచర తాంబూలం మేసి పారెయ్యాలను కుంటున్నావేం, నీ కూతురు పొగరుమోత్తనానికి చివరికి నీకా చిప్పే గతి."

"పోవే దిక్కుమాలిన రాక్షసప్పీనుగా! ముందు పోతావా పోవా లేకపోతే నాగరత్నను పిలిచి బైటికి గెంటించమంటావా?" గొంతు చించుకుంది పెరియన్నాయకి. "నా తలరాత సరిగ్గా లేకనే నిన్ను తెచ్చి తద్దినంలాగా నెత్తికెక్కించుకున్నాను. పైపెచ్చు దాన్ని కూడా నీ చేతుల్లోపెట్టి సర్వనాశనం చేశాను. నీ మూలంగానే కదే దానికంత పొగరు. అయ్యో!

మహాశ్రేష్ఠి కొడుకునా అవమానపరచింది! రాజపతకం రాకపోతే అదేపోయింది. ఇద్దరు మహాశ్రేష్ఠుల లక్ష్మితో నా యిల్లు నిండిపోయేదికదే. ఏడేడు తరాలు కాలుమీద కాలు వేసుకొని రాజభోగాలు అనుభవించే పని."

"ఎవరే అనుభవించేది? అదా నువ్వా? ఎవరికోసం నువ్వు ఏడుస్తున్నది ఏడువ్! బాగా ఏడువు! నీ ఏడ్పు చూస్తుంటే నా కళ్ళు చల్లగా వున్నాయి. ఉత్సవంలో అది మాత్రం గెలవడం ఖాయం. నేనా శంకరన్ మొదలి గడ్డం పీకడం ఖాయం. నువ్వా పట్టినప్పాకమ్ సంతలో బిచ్చమడుక్కోడం ఖాయం! అహహ....!!"

మాధవి చతుశ్శాలలోకి వస్తూనే ఈ సంభాషణ అంతా విని సమాధానం చెప్పింది. "మరీ అంతగా రెచ్చిపోకు అత్తా! అసలే నీరసంగా వున్నావా మరింత అలసిపోతావు. నమ్మకముంచు. రాజహారాన్నీ ఆ శకునపక్షిని కూడా గెలుస్తుంది మాధవి తప్పదు."

మాధవి పెదవుల మీద ఆత్మవిశ్వాసం మెరుస్తోంది.

## 3

ఇంద్రోత్సవాలకని మునుపెన్నడూ లేనంత ఘనంగా అలంకరించారు నగరాన్ని. మహారాజు దరయూరునుండి ప్రతి సంవత్సరం కావేరీ పట్టణం వస్తారు. గొప్పగొప్ప పండితులు సంగీత విద్వాంసులు వచ్చి సభను అలంకరించారు. నగర మహాశ్రేష్ఠులిద్దరూ యెప్పుడూ రాజవంశీకుల సరసనే ఆసీనులౌతారు. ఇప్పుడు కోవలన్‌కు కూడా ఆ గౌరవం లభించింది. మహారాజు దిగ్విజయంగా తిరిగి వచ్చిన ఆ శ్రేష్ఠి పుత్రుడ్ని భుజం తట్టి ప్రశంసించి, ఒక ముత్యాల హారాన్ని కానుకగా యిచ్చారు. సంప్రదాయం మేరకు ప్రధాన నాట్యాచార్యులూ, ప్రధాన దేవదాసీ మొత్తం కార్యక్రమాన్ని నడిపిస్తారు.

అందమైన స్త్రీలు రకరకాల ఆభూషణాలు, ఖరీదైన చీరెలు కావేరీ పట్టణం వైభవానికి చిహ్నంగా అలంకరించుకు వచ్చారు. ఏనుగుకు కనుపించే దంతాలు వేరు, తినేవి వేరుగా ఉన్నట్లే, యువకులు అనుభవించడానికి భార్యల్ని చేసుకుంటే ప్రదర్శన కోసమని వేశ్యల్ని వుంచుకుంటారు. వాళ్ళ దృష్టిలో వేశ్యకంటే సుందరమైనదీ అలంకృతమైనదీ మరొకటి లేదు. వాళ్ళు అలంకారాలకు, శిష్టాచారాలకు మానదండం లాంటి వాళ్ళు. తమ తమ విటుల వైభవానికీ అభిరుచులకు వీళ్ళు ప్రతీకలు.

పతితా, కురూపీ అయిపోయిన కారణంగా చేలమ్మకిప్పుడు రాజదర్బారులో ప్రవేశం లేదు. బైట పాటకజనంతో కలిసి కూర్చున్నది.

మాధవీ, లలితా ఎవరికి ఎవరూ తీసిపోని విధంగా తమ కళాకౌశలాన్ని చూపించి సభికుల్ని ముగ్ధుల్ని చేశారు.

ఇంద్రోత్సవాల చరిత్రలోనే తొలిసారిగా అంతిమ నిర్ణయాన్ని గురించి సభలో తీవ్రమయిన తర్జన - భర్జనలు జరుగుతున్నాయి.

అటు మాధవి వేశ్యమండలికి ముందు వరుసలో - తల్లికి దూరంగా వెళ్ళికూర్చొని కోవలన్‌తో చూపులు కలుపుతూన్నది.

ఎంత ప్రయత్నించినా తన దృష్టిని మాధవివైపు పరుగెత్తకుండా నిలుపుకోలేక పోతున్నాడు కోవలన్. ఆమె నాట్య కౌశలానికి, అందచందాలకు పూర్తిగా వివశుడై అటు పరుగెత్తుతున్నాడు.

లలిత ఆయాసంతో రొప్పుతూ, ఈర్ష్యతోనూ, అసూయతోనూ మాధవి వేపు తీక్షణంగా చూస్తూ తల్లిపక్కన నిలబడింది.

ఇంతలో హఠాత్తుగా మహారాజు ప్రకటన వినిపించి ఈ లోకంలోకి వచ్చింది మాధవి.

"నిర్ణేతలలో ఏకాభిప్రాయం కుదరని కారణంగా ఈ సంవత్సరం పతకం ఎవరికీ ఇవ్వబోవడం లేదనీ, నర్తకీగణం నిరుత్సాహపడకుండా వుండేందుకు గాను ఒక్కొక్క బంగారు హారాన్ని మాత్రం ప్రదానం చేస్తామ"ని ప్రకటించారాయన.

మహారాజు గంభీర స్వరం సభ అంతా ప్రతిధ్వనించింది.

నాట్యాచార్యులు శంకరన్ కోరిక కూడా యిదే. ప్రకటన విని రాజమ్మ కూడా కొంత తేటపడింది. తన కూతురు గెలవకపోతే అదేపోయింది, మాధవికి మాత్రం రాజపతకం లభించకూడదు. ఇది ఆమె కోరిక.

ఇంతసేపూ చూపులతో సాగిస్తున్న ఆట కట్టిపెట్టి ఇవతలికి వచ్చింది మాధవి. సభ ముందు శిరం వంచి ఇలా నివేదించింది.

"గౌరవనీయ ప్రభువులూ, పూజ్యులైన సభవారి సమక్షంలో వారు యిప్పుడు వినిపించిన తీర్పుకు విప్రతిపత్తిగా నా విన్నపాన్ని మహారాజావారి దయార్ద్ర దృష్టికి తేవాలను కుంటున్నాను. ప్రభువుల వారు ఈ దాసీకి అటువంటి అవకాశాన్ని దయచేయించ వలసిందిగా ప్రార్థిస్తున్నాను."

సభ యావత్తు సాశ్చర్యంగా మాధవివైపే చూస్తున్నది. మహారాజు పెదవుల మీద రేఖామాత్రంగా చిన్న నవ్వు పరుగెత్తింది."అనుమతి ఇవ్వబడినది" అన్నారాయన.

మాధవి మళ్ళీ ఒకసారి సభకు ప్రణమిల్లి ప్రారంభించింది : "ప్రభువులవారు న్యాయనిర్ణయాన్ని వాయిదా వేయడం ఇంద్రోత్సవ చరిత్రలోనే ఇది ప్రథమం అనుకుంటాను. ఇది మా నర్తకీ గణాన్ని ఎంతమాత్రం నిరుత్సాహపరచదు కాని కావేరీ పట్టణంలోని మేధావి వర్గానికి తప్పనిసరిగా తలవంపులు తెస్తుందని మాత్రం విన్నవిస్తున్నాను. శ్రీశ్రీ ప్రభువులవారికి న్యాయ నిర్ణయంలో వారు సహకరించలేక పోయారనే అపవాదు మాత్రం

మిగిలిపోతుంది వారికి. నగర నర్తకీగణం, కళారూపిణులైన వంజి కన్యలు ఒకసారి నృత్యం చేసినంతలోనే అలసిపోయేంత బలహీనులు కాదని నా అభిమతం. ప్రభువుల వారు అనుమతినిస్తే, తిరిగి నృత్యం చేయడానికి నేను సిద్ధంగా వున్నాను. అంతేకాదు సరస్వతీ స్వరూపులైన న్యాయనిర్ణేతలు పరమ పూజ్యులైన ప్రభువులవారూ, ఏకాభిప్రాయానికి వచ్చేంతవరకూ నృత్యం చేస్తూనే వుండగలనని మనవి చేసుకుంటున్నాను."

మాధవి నిర్ణయం విని రాజమ్మ బెదురు – బెదురుగా రొప్పుతూ కూర్చున్న లలిత వేపు చూచింది. ఆలోచించుకునే వ్యవధి అయినా లేకుండానే మహా ధర్మాధికారి తన పీఠం నుండి లేచి "ఈ బాలిక నివేదన న్యాయసమ్మతంగానే వుంది. ప్రభువులు ప్రతియోగితలో పాల్గొన్న కన్యలిద్దరికి తిరిగి కళా కౌశలాన్ని ప్రదర్శించే అవకాశం ప్రసాదించడం ధర్మం." అని కూర్చున్నారు.

రాజమ్మ భయ సంకోచాలతో, రుద్రమ్మాళ్, శంకరన్ మొదలియార్‌ల వైపు చూచింది. కాని ఇంతలోనే మహారాజు ధర్మాధికారి సూచన మేరకు తిరిగి నృత్యపరీక్ష జరుగుతుందని ఆదేశించారు.

మళ్ళీ వీణా, కంజరీ, మృదంగమూ మొదలైన వాయిద్యాలన్నీ మ్రోగుతున్నాయి. తిరిగి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడం కోసమని నర్తకీమణులిద్దరూ లేచి నిలబడి సదస్యుల అనుమతి తీసుకున్నారు. అందెల మధుర నాదాలు భవనమంతా ప్రతిధ్వనించాయి.

శంకరన్ విసుక్కుంటున్నాడు. లలిత కోపంతోనూ, ఈర్ష్యతోనూ నిలువెల్ల వణికిపోతూన్నది. చివరకు ఈ కోపమూ, అసూయా ఇవే ఆమెను నిస్తేజపరచాయి. సర్వ శక్తులను సమీకరించుకొని మెరుపులా అభినయిస్తూ, ఎంతో ఆత్మవిశ్వాసంతో వెలిగిపోతూన్నది మాధవి. చేలమ్మ శాస్త్రంతో పాటు అనుభవాన్ని కూడా జోడించి ఆమెను తీర్చిదిద్దింది. అనుభవ రహితమైన పొడిపొడి శాస్త్రం అనుభవయుక్తమైన ఆ సంపూర్ణ కళానైపుణ్యం ముందు నిలువ లేక పడిపోయింది.

ఏదో విధంగా తమ శిష్యురాలికే విజయాన్ని అంటగట్టాలని ప్రధాన నాట్యాచార్యులు, ప్రధాన దేవదాసీ చేసిన ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరయిపోయాయి. ఇప్పుడు సభ అంతా ముక్తకంఠంతో మాధవిని కీర్తిస్తున్నది. సభనంతా సమ్మోహనంతో బంధించి తన యింద్రజాలంలోకి లాగివేసింది మాధవి.

మహారాజు మిన్నుముట్టుతూన్న కరతాళ ధ్వనుల మధ్య ముత్యాలహారాన్ని మాధవి మెడలో వేశారు. మాధవిని నూతన సంవత్సరపు నగర వధువుగా ప్రకటించి వెళ్ళి సింహాసనం మీద ఆసీనులయ్యారు.

ప్రకటన వినగానే మాధవి కోవలన్ వైపు చిలిపిగా చూచింది. విజయోల్లాసమూ గర్వమూ కలిసిన ఆ చూపు మెరుపులా కోవలన్ హృదయాన్ని దూసుకుపోయింది.

చివరకు వార్షిక బహుమతినీ – కోవలన్‌ను కూడా జయించింది మాధవి. ఆమె ప్రతిజ్ఞ నెరవేరింది.

## 4

మాధవి విజయవార్త విని చేలమ్మ పొంగిపోయింది. సభాభవనం నుండి బైటికి వస్తూన్న సభికుల ప్రశంసా వాక్యాలు వింటూ అక్కడికక్కడే పిచ్చిదానిలా గంతులు వేయడం మొదలు పెట్టింది.

ప్రధాన నాట్యాచార్యులు శంకరన్ మొదలి రథం బైటికి రాగానే గబగబ పరుగెత్తుకెళ్ళి రథాన్ని నిలదీసింది. "ఇదిగో మొదలియార్! మర్యాదగా చెప్తున్నాను. నీ గడ్డం గొరిగించి ఇలా యిచ్చేయి. ఈ రోజు నుండే అది నీది కాదిక."

జనం విరగబడి నవ్వుతున్నారు. శంకరన్ గుడ్లురిమి రథాన్ని వేగిరం అదిలించమని సారధికి సైగ చేశాడు.

ఇంతలో పెరియన్నాయకి రక్షక ప్రేమికుడు, యవన వ్యాపరి పన్సా మాధవితోనూ పెరియన్నాయకితోనూ కలిసి బైటికి వచ్చాడు. జనంలోకి రాగానే రథాన్ని నిలిపి పది పన్నెండు గుప్పిళ్ళ రతనాలు మాధవి మీద నుండి దిగదుడిచి విసిరేశాడు. పాటక జనం వాటిమీద విరుచుకుపడ్డారు. హర్షాతిశయంతో పరుగెత్తుకు వచ్చిన చేలమ్మను చూచి మాధవి ముఖం విప్పారింది. ఎదురు వెళ్ళి కౌగలించుకుంది. ఇదంతా చూస్తూ పెరియన్నాయకి ముఖం మాడ్చుకుంది. మాధవి భావావేశాన్ని అణుచుకొని, కౌగిలి విడిచి చేలమ్మకు పాదాభివందనం చేసింది.

"నువ్వూ నాతోపాటే రథం మీద వస్తావు అత్తా! నేనింత గౌరవాన్ని పొందడానికి కారణం నువ్వే. బ్రతికి వున్నంత కాలం నీకు ఋణపడి వుంటాను."

మాధవి చేలమ్మకు ఇంతటి గౌరవాన్నివ్వడం కంటగింపుగా వుంది పెరియన్నాయకికి. తన ప్రేమికుడు పన్సాతో కలిసి అలిగి వెళ్ళిపోవాలనుకున్నది. కాని విజయోల్లాసంతో ధగధగ మెరిసిపోతూన్న అందాలరాణి, నగర వధువు మాధవితో పాటు రథం మీద వెళ్ళాలనే ప్రలోభానికి లొంగి ఆగిపోయింది. నిజానికి ఈ సన్మానం మాధవికి కాక తనకే జరుగుతూన్నట్టు భావిస్తున్నది పెరియన్నాయకి. తనే కదా మాధవిని కొని, పోషించి, విద్యాబుద్ధులు నేర్పించి, ఇంతదాన్ని చేసింది. మాధవికి 'అమ్మ' తను. ఇక నుంచి నగర వేశ్యలంతా తనను చూచి అసూయ చెందుతారు. కొమ్ములు తిరిగిన శ్రేష్ఠి పుత్రులు, అమ్మా! అనుకుంటూ తన చుట్టూ ప్రదక్షణాలు చేస్తారు. పెరియన్నాయకి రథం ఎక్కి మాధవి ఎడమ ప్రక్కన ఠీవిగా కూర్చున్నది.

విజయిని అయిన వంజికన్య మాధవి రథం నగర శ్రేష్ఠి పుత్రుల రథాలు, గుర్రాలు పరుగెత్తుతున్నాయి. ముత్యాలు కుట్టిన పుష్పహారాల్ని వారు రథం మీదికి విసిరేస్తూ, పిచ్చిగా ఆమె వెనుక పరుగెత్తుతున్నారు.

కుల స్త్రీలు గవాక్షాలనుండీ, ఉప్పరిగల మీదుగా, అట్టాలికలనుంచి కాని ఈనాటి దృశ్యాలను తిలకించరు. నిషేధం. అయితే ఒక రిద్దరు నెరజాణలు విజయిని అయి వస్తూన్న నగర వధువును దొంగచాటుగా చూచి ఆ వైభవానికి కన్నుగుట్టి, ఇరుగు పొరుగు అమ్మల్ని పోగుచేసుకొని తమ అసూయని వెళ్ళగక్కుతున్నారు.

కోరికలు చచ్చిన వృద్ధులు, వాటిని బలవంతంగా అణచుకొంటున్న కొందరు కుఱ్ఱకారు, ఉప్పరిగల మీదికెక్కి మాధవి ఊరేగింపును, దాని వెనుక పిచ్చి ప్రేమికుల ఉత్సాహాన్ని చూస్తూ నిలుచున్నారు. తన కొడుకు తన ముందే మాధవి మత్తులో శరీర స్పృహ లేకుండా పరుగెత్తడం చూచి ఒక వృద్ధుడు తల బాదుకున్నాడు. "గొప్పవాళ్ళ బిడ్డ లందరికీ సిగ్గూ బిడియమూ పోయాయి" అంటూ కొందరు మర్యాదస్తులు గొణుక్కున్నారు.

జరగవలసిన లాంఛనాలన్నీ జరిగాక తమ వాడలో గొప్ప ఉత్సవాన్ని ఏర్పాటు చేయించింది పెరియన్నాయకి. భిక్షుకులు, వికలాంగులు గుంపులు గుంపులుగా వచ్చి ఆమె సౌధం ముందు బారులు తీరారు. అందరికీ ఘనంగా అన్నదానాలుచేయించింది. ఆ తరువాత సపరివారంగా పుహారేశ్వరం మందిరానికి వెళ్ళి సంప్రదాయ సిద్ధంగా గజ్జెకట్టి నృత్యార్చన చేసింది. అతిథులందరికీ అక్కడే షడ్రసోపేతమైన విందు ఏర్పాటు చేసింది. విందు ముగిశాక నృత్య గాన సమారోహం ప్రారంభమయింది. తెల్లవార్లు ఎడతెరిపి లేకుండా నృత్య – గానాలు జరిగాయి.

ఆ రాత్రికి రాత్రే తనకోసమని వచ్చిన కోటీశ్వరుల ప్రస్తావనలన్నిటిని త్రిప్పి కొట్టింది మాధవి. లక్షా ఎనిమిది కలంజులు పెట్టి తన ముత్యాల హారాన్ని కొనగలిగిన వాళ్ళ విషయమే ఆలోచిస్తానని ప్రకటించింది.

చతురురాలయిన మాధవి ఆంతర్యాన్ని తెలుసుకున్నది పెరియన్నాయకి. నమ్మకస్తులైన సేవకుల్ని పిలిపించుకొని మాధవి "నీ కోసం పరితపిస్తూన్న" దంటూ కోవలన్‌కు వర్తమానం పంపింది. అంతటితో వూరుకోక వరలక్ష్మి ప్రేమికుడు పాపనాశన్‌ను ఒప్పించి మాధవి గెలుచుకున్న ముత్యాల హారాన్ని కోవలన్ దగ్గరికి పంపుతూ "రత్నాల శ్రేష్ఠి కుమారుడు లక్షా ఎనిమిది కలంజులైనా పెట్టి దీన్ని కొనడానికి సిద్ధపడుతున్నాడు. ఇంత హెచ్చు ధర పెట్టినా మాధవి తన ప్రేమను కాపాడుకోలేకపోతున్నది. అందుకని హారాన్ని మీ సన్నిధికి పంపుతూన్నది. తమ దయ ఎలా వుంటే అలా చేయండి" అంటూ ఒక లేఖ కూడా వ్రాయించింది.

ముందే మాధవి ప్రభావానికి లోనై వున్న కోవలన్ ఈ రాయబారంతో పూర్తిగా లొంగిపోయాడు. హారాన్ని తనవద్దే వుంచుకొని పాపనాశన్‌తో లక్షా ఎనిమిది కలంజులు, పైపెచ్చు కొన్ని రత్నభూషణాలు పంపించాడు. సంతోషవశాత్తూ మాధవి హారం పంపిన రోజునే ఒక విదేశీ వ్యాపారంలో విశేషంగా కలిసివచ్చిందతనికి. అదంతా ఆ హారం వల్ల కలిసివచ్చిన అదృష్టమే అనుకున్నాడు.

నగరం అంతటా కోవలన్ వివాహం ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. మహాశ్రేష్ఠి మాశాత్తువన్ కళ్యాణమంజీరాలు ప్రత్యేకంగా మధుర వెళ్ళి చేయించుకు వచ్చారు. మధుర పాండ్యరాణి కళ్యాణ మంజీరాలు ఆ కాలంలో దక్షిణ భారతమంతా ప్రసిద్ధి చెందాయి. అచ్చం అలాంటివే ఇప్పుడు మహాశ్రేష్ఠిగారు చేయించుకు వచ్చారు. నగరం అంతా ఎంతో వింతగా వాటిని గురించే చెప్పుకుంటున్నారు.

శుక్లపక్ష సప్తమికి లగ్నం నిశ్చయమైంది. పురోహితులవారు వచ్చి లగ్న పత్రికలు వ్రాసి వెళ్ళారు. ఇటేమో మహాశ్రేష్ఠులిద్దరి సౌధాల్లోనూ వివాహపు ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. అటు మాధవితో కలయిక కోసం కోవలన్ రహస్యంగా పథకాలు వేసుకుంటున్నాడు. వారం తిరగక ముందే ఆ ప్రయత్నాలన్నీ ఒక కొలిక్కి వచ్చాయి. కోవలన్ పూర్తిగా సఫలుడయ్యాడు. అతని దయవల్ల మాధవి ఇప్పుడు కన్యకాదు.

## 5

కోవలన్, మాధవి వ్యవహారం యిలా సాగుతూ వుండగానే, నగరంలో అనుకోకుండా కొన్ని సంఘటనలు జరిగాయి. నగర మహాదండనాయకుడికి; అతగాడి విపరీతమైన కామ ప్రవృతి, భోగలాలసత కారణంగా కొన్ని చిక్కులు వచ్చి పడ్డాయి. కోవలన్ కూడా అప్రయత్నంగానే కొంత యిందులో చిక్కాడు.

కొన్ని సంవత్సరాల క్రిందట చేరి రాజ్యం నుండి ఒక మహాజనమండలి తీర్థయాత్ర కోసమని బయలుదేరి కావేరీ పట్టణం వచ్చింది. వాళ్లు తీర్థయాత్ర ముగించుకొని వెళ్ళిపోతున్న సమయానికి, మహాదండనాయకుడు నగర సమీపంలోనే ఒక ఉద్యానవనంలో వేశ్యలతో, నర్తకీగణంతో కొలువుతీరి భోగ విలాసాలలో మునిగి తేలుతున్నారు. అతని వెంటనున్న వేశ్యలలో కొందరి దృష్టి మహా జనమండలిలోని ఇద్దరు అపురూప సౌందర్యవతుల వేపు పోయింది. స్వార్థపూరితమైన ఆ వేశ్యల ప్రేరేపణకు లొంగి మహాదండనాయకుడు అపరాధం చేసి కూర్చున్నాడు. యాత్రీకుల బృందం నగరం దాటుతూ వుండగా, వారిని దొంగలు కొల్లగొట్టారు. వాళ్ళు జవహరీ ఖరీదైన వస్త్రాలు అవీ వున్నవి వున్నట్లు వదిలేసి ఆ ఇద్దరు సుందరులను మాత్రమే తస్కరించుకు పోయారు.

చేరి రాజ్యానికి చెందిన ఈ మహాజనమండలి సభ్యులందరూ బాగా గౌరవ ప్రతిష్టలు గలవారు. అదీగాక చోళ, చేరి రాజ్యాల మధ్య అప్పుడు స్నేహ సంబంధాలు బాగా వృద్ధి చెందుతున్నాయి. చోళ మహారాజు కూడా ఇటువంటి అత్యాచారాలను సహించని న్యాయ మనస్తత్వం గలవారు గనుక వెంటనే నేర పరిశోధన ఆరంభమైంది.

అపహరించుకు వచ్చిన ఆ సుందరులిద్దరిలో ఒకామెను రుద్రగోపి వర్గానికి చెందిన ఒక దేవదాసి తీసుకుపోయింది. రెండవ కన్యను భృత్యవర్గానికి చెందిన దేవదాసి ఎత్తుకు వచ్చింది.

నేర పరిశోధన కోసం వచ్చిన అధికారులతో కలిసి నగరమంతా గాలించి తీవ్ర చర్యలు గైకొనవలసినదని మహాదండనాయకునికి దరయూరు నుండి, మహారాజా వారి ఉత్తరువులు వచ్చాయి. నగరంలో యితనికి బాగా వ్యతిరేకత వున్నది. నగర ముఖ్యులలో అనేకమంది ఆ వ్యతిరేక వర్గంలో చేరి వున్నారు. వీళ్ళంతా అదను చూచుకొని యిప్పుడు దండనాయకుడి దుర్మార్గ చర్యను వాడవాడలా ప్రచారం చేయిస్తున్నారు. చేరి రాజ్యాధికారుల దాకా యీ వార్త వెళ్ళింది. ఇప్పుడు కావేరి పట్టణం యావత్తూ దుష్టుడైన దండ నాయకుడికి వ్యతిరేకి అయింది. పుహారేశ్వరం మందిర మహంతూ, ఇతర దాసీజనం దేవాలయానికి సంబంధించిన వసతి గృహాలలో సత్రశాలల్లో అపరిచితులు కాని, ఆగంతుకులు గాని, నివాసం లేరనీ న్యాయాధికారుల సమక్షంలో సాక్ష్యమిచ్చి మహాదండనాయకుడి గౌరవాన్ని నిలబెట్టాలని ప్రయత్నించారు కాని ఫలితం లేకపోయింది.

రుద్రగోపిక తన యింట దాచి వుంచిన కన్యను రహస్యంగా గొంతు నులిమి నూతిలో పారవేయించింది. అయితే విదేశీ రాజ్యాధికారుల సోదాలో ఆ శవం పట్టుబడింది. దండనాయకుడు చివరకు తన ప్రియురాలైన రుద్రగోపికను సైతం రక్షించలేక పోయాడు.

ఇక రెండవ సుందరి సంగతి, ఆమె సంగీత నాట్యాలలో కౌశలం పొంది ఇప్పుడు దత్తకాబోతున్నది. కొంత ఈ కారణంగా కూడా పాత పాపాలన్నీ పైకి వస్తున్నాయి. మందిరానికి చెందిన ఇతర దేవదాసీలు ఆమె 'దత్త' అవడానికి అంగీకరించడం లేదు. ఈమె తనకు తానై భగవత్కైంకర్యం అవడం లేదనీ పైపెచ్చు అపహరింపబడింది గనుక "హృత" వర్గం క్రిందికి వస్తుంది తప్ప "దత్త" కాదని వారి వాదన.

మహాదండనాయకుడు నేరాన్ని ముందే దేవదాసి మీదికి నెట్టివెయ్యడానికి సకల ప్రయత్నాలు చేస్తున్నాడు. మహంతూ, ప్రధాన దేవదాసీ మొదలైన వాళ్లందరి మీదా అనేక నీలి వార్తలు పుట్టించి ప్రచారం చేయిస్తున్నాడు.

కొత్తగా ఎవరైనా కన్య దేవదాసీ కాబోతున్నప్పుడు ఆ సూత్రధారణ ఉత్సవాలకు నగర వేశ్యల్నీ, విజయినులైన వంజి కన్యలను ఆహ్వానించే ఆచారం వున్నది. అయితే

ఈసారి వాళ్ళంతా నగర మహాదండనాయకుడికి వ్యతిరేక పక్షంలో చేరిపోయి ఉత్సవాలను బహిష్కరించే ఉద్దేశంతో వున్నారు. మాధవి కూడా తమతో కలిసి వస్తుందనీ ఈ అక్రమవర్గీకరణానికి నిరసనగా తను నృత్యంలో పాల్గొనదనీ అంతా భావించారు. నిజానికి మాధవి ఉద్దేశం కూడా అదే! కాని మహాదండ నాయకుడు రహస్యంగా కోవలన్‌ను కలుసుకొని మాధవితో అతడికి గల సంబంధాన్ని బైట పెడ్తానని బెదిరించాడు. ఫలితంగా కోవలన్ లొంగిపోయి, మాధవిని కూడా లొంగిపోయేట్టు చేశాడు.

మహాశ్రేష్ఠి మానాయకన్ కోటీశ్వరుడు. బాగా కీర్తి ప్రతిష్ఠలున్నవాడు. అలా అని అతడు రసమాన్యుడు కాడు. నగరంలో తన పలుకుబడీ ప్రభావాలు ఎలా వున్నాయో తెల్సుకోవడానికి గూఢచారుల్ని కూడా నియమించాడాయన. అటు కుమార్తె వివాహ ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. అల్లుడేమో దారితప్పి వున్నాడన్న సంగతి ఆయనదాకా వెళ్ళింది. అల్లుడు వేశ్యావ్యామోహంలో పడిపోయాడనేది ఆయనకు అభ్యంతరకరం కాదు. కానీ కోవలన్ ఈ ద్వంద్వాకర్షణకు లోనై వ్యవహార జ్ఞానాన్నీ, చివరకు గౌరవ మర్యాదల్ని కూడా పొగొట్టుకుంటాడేమోనని ఆయనకు భయం. వేశ్య అనేది ఒక వినోదం, దాన్ని డబ్బు పారేసి కొంటాము. అంతే కాని కులీనుడైన వాడెవడూ ఆ వినోదం కోసమని గౌరవాన్ని పణంగా పెట్టకూడదని ఆయన ఉద్దేశం.

కోవలన్ బలహీనత కారణంగా దండనాయకుడు తన పబ్బం గడుపుకోవడం కూడా మహాశ్రేష్ఠికి నచ్చలేదు. ఇది ఇంతటితో పోదు ఇక అవసరమైనప్పుడల్లా దండనాయకుడు వాల్తీగా కోవలన్‌ను భయపెడ్తూనే వుంటాడు. అధికారులకు దాసోహమనడం శ్రేష్ఠి పుత్రుల చరిత్రలోనే లేదు. మహాశ్రేష్ఠులిద్దరూ మహారాజావారి తరువాత అంతటి ప్రాభవవైభవాలు కలిగినవారు. సంవత్సరానికి ఒకటి రెండు సార్లు ఏవో ఉత్సవాలకు మహారాజావారు వస్తారు తప్ప మిగిలిన కాలమంతా ఈ యిద్దరు మహాశ్రేష్ఠులే కావేరీ పట్టణానికి అధినేతలనదగినవారు. ఇప్పుడు దీనికి విరుద్ధంగా జరగడం తలవంపులుగా వుంది, మానాయకన్‌కు. ఏదో ఒకటి తేల్చుకోవాలని నిశ్చయించుకున్నాడు. మహాదండ నాయకుడికి విరుద్ధంగా నడుం బిగించి రంగంలోకి వచ్చాడు.

మహాశ్రేష్ఠిగారే స్వయంగా జోక్యం కలిగించుకోవడంతో పరిస్థితులు మరింత విషమించాయి. మహంతూ ముఖ్య దేవదాసీ వెళ్ళి ఆయన పాదాలమీద పడ్డారు. అంతే కాదు, 'దత్త' అవబోతూన్న 'అపహృత' సుందరి కూడా స్వయంగా వెళ్ళి న్యాయాధికారి ముందు పూసగుచ్చినట్లు తన కథ యావత్తు విన్నవించుకుంది.

న్యాయాధికారి ఈమెను అపహరించిన ఆ భృత్యదాసీనీ మహాదండనాయకుణ్ణీ ఖైదు చేసి రాజధానికి పంపించాడు. ఈ దెబ్బతో కావేరీ పట్టణంలో ఇక తిరుగులేని వాడై

పోయాడు మానాయకన్. అంతేకాదు కోవలన్‌తో మాధవికి గల రహస్య సంబంధాలను గూడా తెగతెంపులు చేయించి మాధవికి ముందు గతి లేకుండా చేస్తాడని కూడా నగరంలో వదంతులు వ్యాపించాయి.

## 6

మేడపైన చతుశ్శాలలో కూర్చొని పక్షులతో ఆడుకుంటూన్న మాధవి దృష్టి చిలుకల జంట వున్న పెద్ద పంజరం వైపు పోయింది. స్వరం హెచ్చించి "నాగరత్నా!" అని పిలిచింది.

"వస్తున్నాను చిన్నమ్మా!" తాంబూలపేటిక దగ్గర వున్న నాగరత్న దాన్నలాగే వదిలి పరుగు పరుగున వచ్చి ప్రణామం చేసింది.

"ఈ చిలకల జంటను మళ్ళీ ఒకే పంజరంలో పెట్టావేమే?" గద్దించింది మాధవి.

నాగరత్న ఎంతో భయభక్తులతో తలవంచుకొని సమాధానం చెప్పింది.

"మీరు వద్దన్నారు గాని చిన్నమ్మా! అంత కలివిడిగా వుండే జంటను వేరుచేయటమంటే నాకు మనసొప్పటం లేదు."

"జంటల్ని వేరుచేయడమే వేశ్య అభిమతం. ఇక నుండి వేరు వేరు పంజరాల్లో వుంచు వాటిని తెలిసిందా?"

ప్రకోష్ఠం (ప్రక్క గది) నుండి అప్పుడే పైకివస్తూ పెరియన్నాయకి ఈ మాటలు విని పొంగిపోయింది. "చిరంజీవివి కా అమ్మా! మన వృత్తికీ, గౌరవానికి తగ్గ మాట అన్నావు, మా మధూ వెయ్యేండ్లు బ్రతకాలి" అంటూ మెటికలు విరిచి చెక్కిలి ముద్దు పెట్టుకున్నది.

"నీ కూతురికి తప్పుడు ఆసీస్సులివ్వకే పెరియన్నాయకీ! ఈ రూప-వైభవాలు శాశ్వతాలు కావేవ్!"

అప్పుడే చతుశ్శాల మెట్లమీద కాలుమోపుతూ సమాధానమిచ్చింది చేలమ్మ.

ఈ సమాధానం విని పెరియన్నాయకి మండిపడింది. "అన్నం పెట్టిన యింటికి అశుభం కోరే ముండవి, నువ్వూ నీ మెట్టవేదాంతాలన్నీ దానికేమీ అక్కర్లేదు గాని బైటికి నడువ్. లేదంటావా చీపిరికట్ట...

అర్థోక్తిలోనే అందుకొని నవ్వింది చేలమ్మ. "చీపురుతో తన్ని బైటికి గెంటించి నా పరువు తీస్తావు. అంతేనా? ఓసి పిచ్చి మొహమా. వేశ్యకు కూడా వుంటుందంటే పరువు?" అంటూనే మళ్ళీ పెద్దగా నవ్వడం మొదలు పెట్టింది. ఆ అట్టహాసం అలలు అలలుగా ఇంటినిండా అలుముకుంది.

"అఘోరించావు కాని ఇక అంతటితో నోరు మూసుకో. కేవలం పతకాన్నే కాదు, రాజదర్బారునే గెలుచుకుందది. లక్ష్మీ పుత్రుడు కోవలన్ అంతటివాడు దాని అడుగులకు మడుగులొత్తుతున్నాడే ఇంకా ఏం పరువు కావాలే?"

చేలమ్మ మళ్ళీ నవ్వింది. "హవ్వ! ఇవా పరువు మర్యాదలంటే? ఇవే పరువు ప్రతిష్టలైతే ఒకప్పుడివి నాకూ ఉన్నాయికదే; ఇప్పుడేమయిపోయాయి. కుల స్త్రీనై ముండ మోసినా బాగుండుననిపిస్తుందిప్పుడు. నెత్తిమీద కొంగు వేసుకొని నిక్షేపంలా తిరిగేదాన్ని. అందచందాల అవశేషాలు చూచి లోకం నవ్వి పోకుండా ఆ కొంగన్నా కాపాడేది."

ఈ వాగ్వాద మంతా మౌనంగా వింటూ నిలుచున్నది మాధవి. చేలమ్మ మాటలు, ఆమె అంతరాంతరాల్లో ఎక్కడో తాకాయి. "నాకు ఒకొకప్పుడు ఇదే అనిపిస్తుందత్తా ఈ డాంబికాలు, ఈ స్తోత్రాలు ఇవన్నీ నిజానికి పరువు ప్రతిష్ఠలు కానేకావు."

"నువ్వు బుద్ధిమంతురాలివి బిడ్డా! సౌందర్యాహంకారంతో నేనూ ఒకప్పుడిలాగే ఒక వృద్ధురాల్ని అగౌరవపరచాను. అప్పుడా ముసల్ది ఏమందో తెలుసా? ఒసేవ్! చేలూ అద్దంలో నీ అందమైన ముఖం చూచుకుంటున్నప్పుడల్లా కాస్త నా ముఖం మీది ముడుతల్ని కూడా చూడవే అంది."

ఈ మాటల వాడీ, పలుకు తీరూ రెండూ కలిసి మాధవిని బాగా గాయపరచాయి. అందమైన యవ్వనంలో వృద్ధాప్యపు ముడుతలు, అంటూ స్వగతంగా గొణుక్కుంది. ఆమె కళ్ళలో నీళ్ళు నిలిచాయి. 'నిజం' అక్షరాల నిజం "నువ్వీ రాయి విసిరి నా వెకిలి మనసును గాయపరచావత్తా!" అంది. ఆమె గొంతు వణికింది. కన్నీళ్ళు తిరిగాయి. విసురుగా లేచి తన గదివైపు వెళ్తూ –

"ఒసేవ్ నాగరత్నా! ఆ చిలకల జంటను మరి విడదీయకే" అంది.

❊ ❊ ❊

చేలమ్మ తత్వబోధ విని తన కూతురు ఇలా కుమిలిపోతూ వుండడం చూసి, కస్సుమని లేచింది పెరియన్నాయకి. "ఆ మాధవికి నీ మీద యిష్టముంటే వుంచుకోనీ గాని నేను మాత్రం ఈ మాయదారి గత్తరనిక నా పంచన వుంచుకోలేను మహాతల్లీ సలక్షణంగా ఇంకోదారి చూచుకో."

"మాట మాటకి మాధవి వూసెందుకే ఎత్తుతావు. దానికి నా ప్రాణాన్నిస్తాను. నువ్వు దాని శరీరాన్నే పోషించావు. కాని నేను గుణగణాలను ప్రతిభను పెంచాను. దానిమీద నీకున్నపాటి అధికారాలు నాకూ వున్నాయని తెలుసుకో."

"ఓసి దరిద్రగొట్టు పీనుగా! వేదాంతం చదివితే సాని ప్రతిభ పెరగదే. ఇంతెందుకు ఈ క్షణం నువ్వీ ఇంట్లోంచి విరగడవ్వు" ఆవేశం హద్దుమీరి నోటికి వచ్చినట్టు శాపనార్థాలు మొదలుపెట్టింది పెరియన్నాయకి.

"గతాన్ని కొంచెం గుర్తుంచుకోవే పెరియన్నాయకీ! అస్తమానం నా కాళ్ళచుట్టూతా ప్రదక్షణాలు చేసిన రోజులు కాస్త మతికి తెచ్చుకో. ఇప్పుడేదో ఆ పన్నాశ్రేష్ఠి దయవల్ల కాస్త డబ్బూ దస్కమూ కూడాయని పొంగిపోకు. నా చలువ వల్లనే కదే ఇంతదాని వయ్యావు?"

ఆ తరువాత కథ ఎంతవరకు వెళ్ళాలో, అంతవరకూ పోయింది. పెరియన్నాయకి బాగా రెచ్చిపోయి చేలమ్మను బైటకి గెంటడానికి సిద్ధపడే సమయానికి మాధవి వచ్చి అడ్డుపడింది.

"అత్తకే ఈ యింట్లో స్థానం లేనప్పుడు, నాకూ లేనట్టే అమ్మా. ఆమెతో పాటే నేనూ వెళ్ళవలసి వస్తుంది మరి." శాంతంగానే అయినా తీవ్రంగా చెప్పింది మాధవి.

"వెళ్తావు. ఎక్కడికే నువ్వు వెళ్ళేది? ఆపాటి అధికారం కూడా ఒకటి ఏడ్చిందీ నీకు? ఏనాడైతే మూడు వందల కలంజులు పెట్టి నిన్ను కొని సభ ముందు దత్తం చేసుకున్నానో ఆనాడే నీకా అధికారం పోయింది."

ఈ మాటలు వెనక ఉన్న దర్పాన్ని మాధవి సహించలేక లేచి నిలుచుంది. "కొన్నందుకు న్యాయ సమ్మతంగా నీకు రావలసింది వస్తుంది. అంతేకాని అయినదానికీ కానిదానికీ కాలుకింది చెప్పులా పడివుండడం కుదరదు నాకు" అంటూ ముందుకు నడిచి "పద అత్తా నేనూ నీతోపాటే వస్తాను పద. కొన్న తల్లికి వుండే పాటి అధికారం నేర్పి తీర్చిన గురువుకు వుండకపోదు పద" అంది.

ఈ మాటలకు చేలమ్మ ఏ మాత్రం చలించకుండా గుంభనగానే కూర్చున్నది. కాని పెరియన్నాయకి మాత్రం మళ్ళీ బుడిబుడి దీర్ఘాలు ప్రారంభించి జన్మ జన్మాంతరాలను శపించి శపించి, చేలమ్మ వైపు చేతులు చాపి – చాపి మెటికలు విరుస్తూ "నా కూతుర్ని నాకు కాకుండా చేసే దయ్యం, నిలువునా చావాలి దేవుడా! దానికి నూకలు లేకుండా చేయి దేవుడా! దాని...."

మధ్యలోనే అందుకుంది చేలమ్మ "అనవసరంగా ఎందుకే ఆడిపోసుకుంటావు. వేళాపాళా లేని ఈ భూపాళ రాగం దేనికోసమో కాస్త చెప్పు. నీ కూతురిని నీకు కాకుండా ఎవ్వరూ చెయ్యరు! ఓసి పిచ్చి బొడ్డీ! నా మరువూరప్పాకం, పడ్డి వాప్పాకం కూడళ్ళు నాకు లేవటే అవిచాలు, ఇప్పటికీ నా పొట్టకు సరిపోను రెండు ముద్దలు పెడ్తాయవి" అంటూ లేచి నిలబడింది. మాధవి కూడా లేచి వచ్చి చేలమ్మ భుజం మీద చేయివేసి "అయితే నేనూ నీతోపాటే వస్తాను పద, నువ్వా మరువూరు పాక్కం కూడలి దగ్గర ఆగిపోదువుగాని నేనేమో ఇంకొంచెం ముందుకు వెళ్ళి ఏ కావేరినో చూచుకుంటాను" అంది.

పరిస్థితి తన చేయి దాటి పోతూవుండడం చూచి ఆలోచనలో పడిపోయింది పెరియన్నాయకి. కొద్ది క్షణాలు రుసరుసలాడుతూ కూర్చొని నువ్వూ నీ శిష్యురాలు ఎక్కడేనా చావండి. ఇక నుంచి నా పంచలో కాని కాలుపెట్టావో చూస్కో మరి.... ఇది ఎంతకాలం సాగుతుందో నేనూ చూస్తానుగా" అని అద్దద్దలాడుతూ తన గదివైపు వెళ్ళిపోయింది.

❊ ❊ ❊

పెరియన్నాయకి వెళ్ళిపోయాక మాధవి చేలమ్మ దగ్గరకు వచ్చి "పద అత్తా! ఓ క్షణం నా దగ్గరకూచోని పోదువుగాని" అని చేయిపట్టుకొని లాక్కుపోయి కూచోబెట్టింది. ఆ తరువాత నాగరత్నను పిలిచి పాత్రలో మద్యం నింపి తెమ్మని సైగ చేసింది, మరో పరిచారికను పిలిచి అత్తకోసమని ఒక గది వూడ్చి బాగుచేయమని ఆదేశించింది. ఇంకో సేవకుడ్ని రప్పించి చేలమ్మ కోసమని మరో యిద్దరు పరిచారికల్ని కూడా కుదర్చమని పురమాయించింది.

మాధవి ఇలా తన అధికార దర్పాన్ని చూపుతూ తిరుగుతుంటే చేలమ్మ తదేకంగా ఆమె వైపే చూస్తూ మౌనంగా కూర్చుంది. వుండివుండీ చివరకు "ఏమే మాధవీ! ఒక ప్రశ్న అడగనా?" అంది.

మాధవి సాలోచనగా ఆమెవైపు చూచింది.

"ఏమీలేదు. నీకు చలికాలపు నీరెండ ఇష్టమా? లేకపోతే జ్యేష్ఠమాసం ముదురెండ యిష్టమా? కాస్త చెప్పమ్మా చూద్దాం."

మాధవి దిండు నానుకొని తూలికాతల్పం మీద ఒరిగింది. మరో పట్టుదిండును గడ్డం కింద అదిమిపట్టి మత్తుగా జారగిలబడి కూర్చుంది. చేలమ్మ ప్రశ్న బొత్తిగా అర్థరహితమైందిగా తోచిందామెకు. రెండు క్షణాలు ఆలోచిస్తూ వుండివుండి, ఆమె వైపు తిరిగి "ఇదేమి ప్రశ్న అత్తా?" అంది.

"ఇదా? మతిలేని ప్రశ్న. ముసలి దాన్నయిపోయాను కదూ! అందుకని..." అంటూ వుండగనే మద్యపాత్ర పుచ్చుకొని నాగరత్న లోపలకి వచ్చింది. ఆత్రంగా లేచి ఆ పాత్ర అందుకుంది చేలమ్మ. ఒక గుక్కలో ఖాళీచేసి కింద పెట్టింది. మూతి తుడుచుకుంటూ నాగరత్న వైపొకసారి అనుమానంగా చూచి కళ్ళు చికిలిస్తూ "అభ్యంతరం లేదు. నాగరత్నేగా" అని స్వగతంగా గొణుక్కొని. "అయితే నేనేం చెప్పదలచుకున్నానో ఇప్పుడు చెప్పనా! ఆడది ఎండలాగా వెలిగిపోవడం మంచిదేకాని శీతాకాలపు లేత ఎండలాగా అందంగా మెలగాలి. అంతేగాని జ్యేష్ట మాసపు ముదురు ఎండలాగా ఫెళ ఫెళ లాడకూడదు మధూ! నేను అనుభవ పూర్వకంగా చెప్తున్నానీమాట. నేనూ జీవితాంతం అలాగే మండిపడ్డాను. ఇప్పటికి తెలిసొచ్చింది ఆడదానికి ఆ మిడిసిపాటు మంచిదికాదని."

మాధవి ఈమాటకేమీ సమాధానం ఇవ్వలేదు. ఆమె నాగరత్నం వైపు చూస్తూ గంభీరంగా కూర్చుండి పోయింది. నాగరత్న మద్యపాత్ర మళ్ళీ నింపుతూ వుండటం చూచి మరింత ఆత్రంగా లేచి వెళ్ళి పాత్ర అందుకుంది.

మూడోసారి త్రాగడానికి గిన్నె నాగరత్నవైపు చాపింది చేలమ్మ. ఆమె కళ్ళు మూతలు పడుతున్నాయి. తాగిన ఆనందాన్నంతా కళ్ళలో బంధించాలని చూస్తున్నట్లుందామె. ఆమె

పెదవుల చివర, యెడమ చెవిక్రింద, చెక్కిలి మీద మాడుపైన ఉన్న కుష్ఠు మచ్చలు యిప్పుడు మాధవికి ఇదివరకటిలా జుగుప్సాకరంగా కాక దయనీయంగా కనిపిస్తున్నాయి. ఎంతో ఆశగా లేచి మూడో గిన్నె అందుకుంది. కళ్ళు కొద్దిగా తెరచుకున్నాయి. కేవలం ఆ పాత్రను చూచేందుకే సరిపోతుందా చూపు. పాత్రను రెండు చేతులతోను జాగ్రత్తగా పట్టుకొని పెదవులకు ఆనించుకోబోయింది. అంతే కళ్ళు మూసుకుపోయాయి. గిన్నె చేతుల్లోంచి జారి మద్యం వస్త్రం మీద ఒలికిపోయింది.

మాధవి తదేకంగా ఆమె వైపే చూస్తూ కూర్చున్నది. అలా చూచి చూచి, "అంత బ్రతుకు బ్రతికాక ఈ జీవితం ఎలా అనిపిస్తోందత్తా నీకు?" అంది.

చేలమ్మ మత్తుగా కళ్ళు విప్పి మాధవి వైపు చూస్తూ ముసిముసిగా నవ్వింది. "కాదనకు బిడ్డా! అంత వైభవం అనుభవించి ఇప్పుడిలా అడుక్కుతినడం కొంత కాలం నాకు గుండెకోతగా వున్నమాట నిజమే అబద్ధమెందుకాడాలి. కాని ఇప్పుడిక ఏ బాధాలేదు బిడ్డా? గుండె మండీ మండీ బండబారి పోయింది. నాగరత్నా! ఇంకో గిన్నె అందుకో బిడ్డా! మీ కందరికీ దేవుడు మేలు చేయాలి."

తాగిన మత్తులో చేలమ్మ ముఖ కవళికలు అదో విధంగా కనిపిస్తున్నాయి. మాధవికి, ఆమె ముఖంలో ఇప్పుడొకరకమైన శాంతి అలుముకుంది. మరణం అంతటి చల్లని శాంతి అది.

చేలమ్మ ఇంకా గొణుగుతూనే వున్నది. "బిడ్డా! ఎక్కడో, ఎక్కడో దూరంగా ఓ పూరిల్లూ, దానిముందు యెప్పుడూ పూతపట్టని ఓ ముదురు మామిడిచెట్టూ కనిపిస్తున్నాయి. ఆ యిల్లు నాదే, చిన్నప్పటియిల్లది. నా తల్లీ! ఆమె లాలనా కనిపిస్తున్నాయి. ఊఁ పోనిద్దూ ఆ యిల్లు నాది కాదు, ఆ తల్లీ నాది కాదిక. నా తల్లి ఒక సాని. యాభయ్యో, అరవయ్యో కాకపోతే వందో కలంజులుపెట్టి కొనుక్కుంది నన్ను. నీ తల్లికి మేనత్త అవుతుంది. మీ అమ్మ? అదీ అంతే నన్ను కొన్న నెలకుకొన్నారు దాన్ని అహహా!! అస్తమానం తన్నులు తిని, తిని తెగ ఏడ్చేదది. అది తినే దెబ్బలు చూచే హడలెత్తి నేను పోరుమానుకునే దాన్ని" అంటూ మాగన్నుగా గోడ కానుకొని ఉసూరుమని నిట్టూర్చింది చేలమ్మ. "అదంతా యిప్పటికీ నాకు బాగా జ్ఞాపకమే అయ్యో! అవి ఏమి రోజులే నా తల్లీ!"

అత్త మాటలు వింటూ తన బాల్యాన్ని జ్ఞాపకం చేసుకుంటూన్నది మాధవి. తనూ చిన్నప్పుడు తిట్లూ రాట్లూ తింటూ ఒక లాలనా పాలనా లేక ఎడ్డెగా పెరిగింది. కొంచెం ఊహ వచ్చీరాక ముందే ఈ పెరియన్నాయకికి దత్తయింది. ఇప్పుడు తనంటే ఈ పెరియన్నాయకికి పన్నా శ్రేష్ఠికి ప్రాణం. అయితే అపారమైన ఆ ప్రేమాభిమానాలే యిప్పుడు భారం అనిపిస్తున్నాయి మాధవికి. వీటి ఆడంబరాలు, స్తోత్రపాఠాలు క్షోభగా వున్నాయి.

ఈ వేశ్య జీవితం మీదే వుండి వుండి విపరీతమైన జుగుప్స కలుగుతూన్నది. తనే కులస్త్రీ అయితే సలక్షణంగా ఆ కోవలన్‌ను పెళ్లాడేదికాదా? బరువుగా ఒక నిట్టూర్పు విడిచి "మనమే సంసారులమై వుంటే ఎంత బాగుండిపోను అత్తా?" అంది.

ఈ మాటకు తేలుకుట్టినట్టు అదిరిపడింది చేలమ్మ. "ఏమో! ఎల్లా ఉండేదో ఎవరు చెప్పగలరు? నేనూ అచ్చం ఇలాగే అనుకునేదాన్ని. ఆ అనుకోవడమే చివరకు నా కొంప ముంచింది. లంజనై కూడా కులస్త్రీగా బతకాలని ఎంతో ఉబలాటపడ్డాను. చివరకు ఏమయింది ఆ పంతమే నన్ను తినివేసింది." ఎక్కడో గతంలోకి చూస్తూ చెప్పుకుపోతున్నది చేలమ్మ. ఆమె గొంతు చిత్రంగా ధ్వనిస్తూన్నది.

"నేను నృత్యోత్సవంలో గెలిచినప్పటి సంగతి, ఇప్పటి మన మహారాజు తండ్రి నన్ను చూచి ముగ్ధుడయ్యాడు. ఉత్సవాలు ముగిసిన మరునాడే మా అమ్మకు వర్తమానం వచ్చింది. నా తల్లి సంతోషానికి అంతులేదు. అదృష్టం అంటే నీదేనే అమ్మా అని మాటిమాటికి నన్ను ముద్దాడుతూ నే నెక్కడ వుంటే అక్కడే నా చుట్టూ గుడిగుడిగుంజం తిరిగేది. నేను మండిపడి దులపరించుకు పోయేదాన్ని. నా రూపమూ నా వయస్సూ నావికావు జనం యిష్టం వచ్చినప్పుడు ధనం పారేసి, కొని అనుభవిస్తారు. వీటిని మహారాజు అయితే మాత్రం ఆ ముసలి తొత్తు క్రియా శూన్యమయిన కోరికకు బలికావడానికా ఇంత బ్రతుకు. ఛీ! ఏమి జీవితమది? నా మనసు మసలి పోయేది.

మహారాజే కాదు ఆ మరునాటి నుండే నగర కోటీశ్వరులు, శ్రేష్ఠులు నా చుట్టూ మిడతల్లాగా తిరిగేవారు. ఉత్సవంలో గెలిచిన మొదటి రోజునే మా అమ్మ చేత తన్నులు తిన్నాను. మాధవీ! వేశ్యగా నా జీవితం దండనతోనే ఆరంభమయింది. కనుకనే ఆ తరువాత కాలమంతా జ్యేష్ఠమాసపు ముదురు ఎండలాగా ఫెళఫెళ లాడాను. ఎవ్వరూ నా వేడిని భరించలేక పోయారు. చివరకు నాకు నేనే ఒక భారాన్నయిపోయాను. అందుకే ఈ రోజున నీ తీవ్రత అదీ చూచి నీ భవిష్యత్తు గూర్చి భయపడ్డాను బిడ్డా. ముఖ్యంగా నీ తల్లిపట్ల ఇంత ఉపేక్షాభావం తగదు. రేపు రసికులముందు కూడా ఇదే అలవాటయిపోతే అప్పుడేమి జరుగుతుందో ఆలోచించు. అది ప్రాణాంతకం తల్లీ! కొంప ముంచివేస్తుందది."

చేలమ్మ ఉపదేశంలో స్నేహమూ, సానుతాపమూ వున్నాయి. ఆపేక్ష వుంది. కాని మాధవి హృదయంలో చెలరేగుతున్న తిరుగుబాటు నణచడానికి సరిపోవవి. ఆమె ధోరణి మార్చి "నీ కథ అంతా ఈ వేళ వినిపించాలి అత్తా. లేకపోతే మరి నిన్ను వదిలేదిలేదు" అంది.

"నా కథా? నా కథ వింటావంటే" అంటూ పెద్దగా నవ్వింది చేలమ్మ. వికారమైన నవ్వు ఉన్మాదమూ, అసహ్యమూ, అంతులేని సంఘర్షణతో కూడిన నవ్వు. చాలా సేపటివరకు

ఆ నవ్వు అలలు అలలుగా ఆ గది అంతా చిందుతూనే వుండి పోయింది. చివరకు అతికష్టంగా ఆ నవ్వును ఆపుకుంటూ! "అహహ!" నా కథ చెప్పమన్నావు కదూ? నీ కోరిక విని పాత సంగతులన్నీ మళ్ళీ తలపుకు వస్తుంటే ఎలా వుందో తెలుసా! కార్యం రోజు రాత్రి సంగతులు రెండో రోజున చెలికత్తెలు రేపుతూ వుంటే ఎలా గిలిగింతలు పెడ్తాయో అచ్చం అలాగే వుందనుకో."

చేలమ్మ జీవితాన్ని అదృష్టమూ, దురదృష్టమూ అనే రెండు తీరాలను సమంగా ఒరుసుకుంటూ పోయే నదితో పోల్చవచ్చు. ఆమె కంఠస్వరం కత్తిలాగా వాడి తేరి నీలినీలి ఆకాశపు తెరను చీల్చివేస్తున్నట్లు అనిపిస్తూన్నది మాధవికి. అందుకని ఎక్కడో మినుకు మినుకు మంటూన్న చుక్కలకు ఆవలి జీవితం కనిపిస్తూన్నదిప్పుడు. వేశ్య అనే ఒక అభాగ్య స్త్రీ జీవితం మీది తెర పూర్తిగా తొలగిపోయి భవిష్యత్తు కళ్ళముందుకు వస్తూన్నది.

జీవితంలో అనేక మందితో సంబంధాలు వున్నా చేలమ్మ స్వీకరించింది ఒక్కడ్నే. అతడ్నే ప్రేమించింది. ఆరాధించింది. మిగిలినదంతా అనుభవమే కాని ఆరాధన కాదు. ఆ అనుభవాల్లో ఏ ఒకటి ఆమె హృదయం వరకూ పోనేలేదు. అందుకని ఆమె బ్రతుకంతా తీరని అసంతృప్తితోనే వేగిపోయింది. తనను కొన్న స్త్రీని 'అమ్మా' అని పిలిచింది కాని ఎప్పుడూ ఆమెను తల్లిగా అంగీకరించలేదు. గత్యంతరం లేక పడుపు వృత్తిలో తలదూర్చింది. కాని ఇదీ అంతే. ముసలి మహారాజుకు ప్రియురాలిగా అయితే వుందికాని ఏనాడూ ఆయనను మనస్ఫూర్తిగా స్వీకరించలేదు.

ఆమె శరీర సౌష్టవం, అద్భుతమైన నాట్య కౌశలం, సౌందర్యాన్ని ద్విగుణీకృతం గావించే గర్వమూ జనాన్ని విశేషంగా ఆకర్షించేవి. మహారాజు మరణించాక మరొక రత్నాల శ్రేష్ఠితో చేలమ్మకు సంబంధం కుదిరింది. అతనితో కలిసి ద్వీప ద్వీపాంతరాలు తిరిగింది. రత్నాలశ్రేష్ఠి ఈమె పేరకూడా వేరే పెట్టుబడి పెట్టి వర్తకం నడిపేవాడు. వచ్చిన లాభాలన్నీ ఆమెకే కేటాయిస్తుండేవాడు. తద్వారా స్వల్పకాలంలోనే చేలమ్మ గొప్ప ఐశ్వర్యవంతురాలైపోయింది. ఇంత చేసినా ఆ రత్నాలశ్రేష్ఠిని ఎన్నడూ మనస్ఫూర్తిగా ప్రేమించి ఎరుగదు చేలమ్మ. ఎడమొహం పెడమొహంగా రుసరుసలాడుతూ తిరిగేది. తన స్నేహితులముందైనా కాస్త మప్పితంగా వుండమని తల బాదుకునేవాడతడు. చేలమ్మ పట్టించుకునేది కాదు. చివరకు సికిందరియాలో జరిగిన ఒక సంఘటనతో ఆ రత్నాల శ్రేష్ఠితో కూడా చేలమ్మ తెగతెంపులు చేసుకుంది. ఆ సంఘటనను చేలమ్మే ఇలా చెప్పుకుపోయింది.

"సికిందరియాలో మాకు ఆతిధ్యమిచ్చిన అరబ్బు వ్యాపారికి భారతీయ నృత్యం చూడాలని కుతూహలం కలిగింది. రత్నాలశ్రేష్ఠి తన గొప్ప చాటుకోవడానికి నన్నూ నా

నాట్యాన్నీ ఆకాశానికి ఎత్తివేశాడు. ఆ అరబ్బు వ్యాపారి ఆసక్తినీ, ఉత్సాహాన్ని చూచి నృత్యం చేద్దామనే అనుకున్నాను. అయితే సరిగ్గా ఆ సమయానికే రత్నాలశ్రేష్ఠి నోరు మెదిపాడు.

"ప్రియా! మన మిత్రుడికి ఆనందాన్ని కలిగించు" అన్నాడు.

ఈ మాట వినగానే తేలు కుట్టినట్లయి మండి పడ్డాను. నావల్ల కాదు. నీ ఆజ్ఞలమీద ఆడడానికి పాడడానికి నేనేమన్నా నీ బానిస ననుకున్నావా?" అని తిప్పి కొట్టాను.

దేశంకాని దేశంలో తన మిత్రమండలి ముందు నా ప్రవర్తన రత్నాలశ్రేష్ఠికి బాగా అసహ్యాన్ని కలిగించి వుంటుంది. అతనూ కస్సుమని లేచాడు. అప్పటికప్పుడే తెగతెంపులు అయిపోయాయి. సంవత్సరాలుగా ఉన్న సంబంధం క్షణాల్లో తెగిపోయింది." అంటూ క్షణం ఆగి "గడిచిపోయిన సంగతులన్నీ తలపుకు వస్తుంటే ఏమిటోగా వుంటుంది బిడ్డా! ఆకలి మేలుకున్నట్టవుతుంది" అంటూ కళ్ళు మిటకరించి నాగరత్నవైపు చూచింది.

నాగరత్న ఆమెకు తినడానికేమైనా తెస్తానని చెప్పి లోపలికి వెళ్ళిపోయింది. చేలమ్మ మౌనంగా వుండడం చూసి "తరువాతేం జరిగిందత్తా!" అంది మాధవి.

"తరువాత ఏమి జరుగుతుందో మనందరికీ తెలిసిందే. ఆ దేశంకాని దేశంలో ఏకాకినైపోయాను. రోజూ ఆ అరబ్బు వ్యాపారినే సంతోషపెడ్తూ వుండేదాన్ని. అతడిట్టే నాకు మిత్రుడు, సంరక్షకుడూ అయిపోయాడు. అయితే ఒక సంవత్సరం గడిచిందో లేదో పుట్టి పెరిగిన ఈ దేశమూ, ఈ పరిసరాలు జ్ఞాపకానికి వచ్చి దిగులు గొలిపేవి. అంతకు మించి నన్నక్కడ దిగవిడిచి వచ్చిన ఆ రత్నాల శ్రేష్ఠికి ప్రతీకారం చేయాలనే వాంఛ నన్నక్కడ నిలువనివ్వలేదు. ఒక్కసారి భారతదేశయాత్ర చేశావో రెట్టింపు లాభాలు వచ్చిపడ్తాయని ఆ అరబ్బు వ్యాపారిని నమ్మించాను. కావేరి పట్టణంలో వున్న సార్థవాహులందరినీ పరిచయం చేస్తానని చెప్పాను. అసలే విదేశ యాత్రలంటే కోరికగా వున్నాడేమో వెంటనే ఒప్పుకున్నాడు. అప్పుడే మహాశ్రేష్ఠితో అతగాడికి పరిచయం చేశాను. అప్పట్లో మహాశ్రేష్ఠికి మాత్రం ఏముందని ఏదో చిన్న చిన్న మారుబేరాలు చేస్తుండేవాడు. ఆ పరిచయంతోనే బాగా లాభించి కోటికి పడగెత్తాడు. మహాశ్రేష్ఠికి యిప్పటికీ నేనంటే ఇష్టమే. నా ప్రేమనైతే అతనెప్పుడూ కోరలేదు  కాని నృత్యమంటే పడి చచ్చేవాడు. ఈ కావేరీ పట్టణంలో యింతమంది కళావేత్తలు, శ్రేష్ఠులు, సామంతులు వున్నారా మహాశ్రేష్ఠిని మించిన కళావేత్త ఒక్కడు లేడు."

"తరువాతేం జరిగిందత్తా?"

"తరువాత నా అదృష్టం పండింది. ఏమంటావా ఆ అరబ్బు వ్యాపారి పదిరోజులు జ్వరంతో తీసుకొని ఇక్కడే కన్నుమూశాడు. ఇక్కడి వ్యాపారంలో లాభించిందంతా నా

పేరపెట్టి చచ్చాడు. ఎంత ధనవోఁ ఏడేడు తరాలు కనకాభిషేకాలు జరుపుకోడానికి సరిపోయే ఐశ్వర్యం, అంటూ ఓ నిట్టూర్పు విడిచి, ఏమి లాభములే పోనీ అదీ నాది కాదు. అదృష్టంతో వచ్చి దాంతోపాటే కొట్టుకుపోయిందది" అంది చేలమ్మ.

"మరి ఆ సంపద అంతా నువ్వెవడికో కట్టబెట్టావని మా అమ్మ చెప్తూ వుంటుంది నిజమేనా అత్తా?"

సరిగ్గా సమయానికి భోజన పదార్థాలు అమర్చిన బంగారపు తాంబూళం పుచ్చుకొని నాగరత్న లోపలికి వచ్చింది.

ఆమెను చూచి "భలే సమయానికి వచ్చావే నాగరత్నా! నీ చిన్ని యజమానురాలు వేసిన ప్రశ్నకు నా ఆకలి రెట్టింపయిందనుకో యిప్పుడు" అంటూ సంభాషణ కట్టిపెట్టి చేలమ్మ భోజన సామగ్రిమీద విరుచుకు పడింది.

ఆమె అతి ఆత్రంగా భోజన పదార్థాల్ని పెద్దపెద్ద ముద్దలు చేసి తింటూ వుంటే మాధవి విస్తుపోయి ఆమెవైపే చూస్తూ కూర్చున్నది.

తినడం ముగించుకొని తృప్తిగా త్రేన్చింది చేలమ్మ. దిండు నానుకొని క్షణం సేపు కన్ను మూసింది. ఆ తర్వాత ఒత్తిగిలి ఎర్రటి పెద్ద పెద్ద నేత్రాలతో మాధవి వైపు చూస్తూ, వదిలి వేసిన ప్రసంగాన్ని మళ్ళీ ఎత్తుకుంది.

"నీ తల్లి చెప్పింది నిజమేనే మాధవీ! సిసలయిన లంజ అది. అందుకని సాని గుట్టంతా కొట్టినపిండి దానికి. ఇంత దరిద్రాన్ని అనుభవిస్తున్నాను గాని నే నెప్పుడైనా అతడ్ని పల్లెత్తుమాట అన్నానా చెప్పు."

"మరి అతగాడేమో నిన్ను కాకుండా, ఆ సునంద అంటే పడిచచ్చేవాడట. పైపెచ్చు నిన్ను నడివీధుల్లో పట్టుకొని చావ చితక తన్నేవాడట."

"అంతా నిజమే. ఏదీ అబద్ధం లేదిందులో పిచ్చితల్లీ, మరి సంసారులంతా తన్నులు తినేది ఎవరికోసమనుకున్నావే సానుల మూలాని కాదటే? సంసారి సొత్తు దోచుకునే సాని మేడలు కట్టేది. మరి నేను కుల స్త్రీలాగా మెలగాలని పంతం పట్టానా లేదా? అందుకే నా సర్వస్వమూ ఆ సాని కోసం ధారపోశాను. నేనే స్వయంగా వెళ్ళి ఆ సునందతో చెప్తుండేదాన్ని. సునందా! నన్ను నిలువునా దోచుకో అది నీ ధర్మం కాని అన్నీ అయిపోయాక అతగాడ్ని మాత్రం తన్ని తగలెయ్యకు, అని బ్రతిమాలుకునేదాన్ని. అయినా వినలేదది. తప్పులేదు కులధర్మం పాటించిందది. ఆ మాటకొస్తే నీ తల్లిది కూడా తప్పులేదు. సునంద సాని అందుకని అచ్చం సానిలాగే ప్రవర్తించిందది. పెరియన్నాయకీ అంతే. నేనిప్పుడు నువ్వు కూడా అలాగే వ్యవహరించాలని కోరుతున్నాను మధూ? అని క్రీగంట మాధవి ముఖవైఖరి పరిశీలించి, "ఎవడ్నో ఒకడ్నే ముడివేసుకొని బ్రతుకంతా వెళ్ళమారిస్తే మంచిదే

అనుకో.... నీ తల్లినే తీసుకో ఏనాడైతే ఆ పన్నా శ్రేష్ఠితో మనసు కలిసిందో ఆనాటి నుంచే ఇంకొక దారి దొక్కడం మానివేసిందది. అతగాడివల్లే రెండు చేతులా ఆర్జించింది. కాని ఎప్పుడైనా పుట్టిమునిగి ఆ పన్నాయే స్వయానవచ్చి చేయి జాపాడనుకో చిల్లి గవ్వ ఇవ్వదది. వేశ్య అన్నిటికంటే ప్రేమించేది డబ్బునే ఎందుకంటావా దాని బ్రతుక్కు అంతకు మించి రక్షణ లేదు మరి."

"నీ మాటలు నాకొకసారి బొత్తిగా బోధపడవత్తా? ఆపేక్షలు, అనురాగాలు వదిలి కేవలం డబ్బునా ప్రేమిస్తుంది ఆడది?"

"అయితే నీకు తెలిసినట్టేలే నోరుమూసుకో. ఎంత అయినా ఆ కోవలన్ శ్రేష్ఠి కళ్యాణ మంజీరాలు తెచ్చి నీ కాళ్ళకు వెయ్యడే పిచ్చి తల్లీ. ఆ కణ్ణకి కాళ్ళకే వేసేది. నువ్వూ, నేనూ, నీ తల్లి, నా తల్లి ఈ దిక్కుమాలిన సంత అంతా ఒకప్పుడు కులీనులే అనుకో. అయితే ఎక్కడో మరుగునవున్న ఆ కులీనతవల్ల మనకేమిటి ఒరుగుతుందిప్పుడు. మనం వేశ్యలం వేశ్యల్లాగే నడుచుకోవాలి. అందుకే అంటున్నాను గుర్తుంచుకో, నువ్వు ప్రేమసిద్ధాంతంలోగాని పడ్డావా, నువ్వూ నాలాగే పుతమారిపోతావ్? నాలాగే పూర్తిగా పతనమయిపోతావు. పతనం అంటే జ్ఞాపకం వచ్చిందేవ్ లోకమంతా నాది పతనమంటుందా నేను ఒప్పుకోను. ఒక్కనాటికి ఒప్పుకోను. ప్రాణం పోయినా నాది పతనమనను, అనను," అంటూ పిచ్చిదానిలా గొంతు చించుకొని అక్కడికక్కడే చతికిలబడింది చేలమ్మ.

అంతా విని మాధవి పరధ్యానంలో పడింది. చాలాసేపు అలాగే ఆలోచిస్తూ వుండివుండి, చివరకు చప్పగా నవ్వి, "ఛీ! ఏమిజన్మే ఆడజన్మ సాని అయినా, సంసారి అయినా శాంతిలేదు దీనికి" అని ఉసూరు మంటూ నిట్టూర్చింది.

ఆ గదిలో వున్న ముగ్గురు ఆడవాళ్ళు తమ వయోభేదాన్నీ వర్గభేదాన్ని విడిచి ఆ ఒకే ఒక నిట్టూర్పులో కలిసి పోయారు.

# 7

అవ్యక్తమైన బాధ నుండి పుట్టిన మౌనమేదో ఆ గది అంతటా అలుముకుంది. ఆ మౌనాన్ని చెదరగొడుతూ, తడబడుతూ లేచి నుంచుంది చేలమ్మ. మోతాదు ఎక్కువైందేమో తూలిపడబోయింది. నాగరత్న ఆదుకుంది. ఆమె ఏదైనా తత్కాల శరీర ధర్మాన్ని గాని నిర్వర్తించుకోవడానికని లేచిందేమో అనుకున్నారు వాళ్ళు. చేలమ్మ నిలదొక్కుకొని నిలబడి బొంగురు గొంతుతో "ఓ – చాలా గొప్ప సుఖం పొందాను. ఇక వెళ్తాను. వెళ్ళు, వెళ్ళి అలిగింది కదూ నీ తల్లి. దాన్ని కొంచెం సముదాయించు మాధవీ" అంటూ తూలుతూ చతుశ్శాలవేపు నడిచింది.

మాధవి ఆమె పరిస్థితి తెల్సుకొని "అత్తను చేయిపట్టుకొని నడిపించుకు వెళ్ళు నాగరత్నా. క్రొత్త గదిదాకా దిగబెట్టిరా" అంది.

చతుశ్శాల చివరి భాగాన ఊగుతూ వెళ్తున్నది చేలమ్మ. సూర్యాస్తమయ మవుతూన్నది. ఆ వెలుగులో పక్షులు కలకల లాడుతున్నాయి. వాటి కలకలరావాన్ని అనుకరిస్తూ, నవ్వుతూ, ఆ త్రాగుడు మత్తులో ఎగిరెగిరి పడుతూ నడుస్తున్నదామె. ఒకచోట గడప బొటనవ్రేలికి గుద్దుకొని పడిపోతూ వుండగా నాగరత్న పరుగెత్తివచ్చి ఆదుకుంది. కాని లాభం లేకపోయింది. పట్టు జారి అలాగే కంబళం మీద చతికిలబడింది.

నాగరత్న ఆమెను జబ్బ పట్టుకొని లేపుతూ, "పద అత్తా నేను దిగబెట్టివస్తాను పద" అంది.

"ఊ! ఎందాకని దిగబెడ్తావే. సరే పద."

ఇద్దరూ పాళీ వేపు వచ్చారు. క్రిందికి దిగటానికి మెట్లు అక్కడే వున్నాయి. అక్కడ ఆగిపోయి మెట్లువేపుకు లాగింది చేలమ్మ. "అటుకాదు నీకోసమని ఇప్పుడు ఆమూల కక్ష్య బాగుచేశారత్తా!"

ఆ మాట విని చేలమ్మ కొద్దిగా నవ్వింది. ఆమె ఫాలభాగం మీద ముడతలు తేలాయి. ఒక్క తళుకు ఎప్పుడో నలభై సంవత్సరాల నాటిది దర్పం ఉట్టిపడుతున్న ఆమె ముఖంమీద క్షణం మెరిసి మాయమైంది.

"నా భవంతీ దీనికి రెట్టింపు వుండేది. దానికే తిలాంజలి ఇచ్చేశాను కదా నాగరత్నా! ఇప్పుడీ పెరియన్నాయకి ఇంట రాజభోగాలకు ఆశపడతానా. పట్టినప్పాకమ్ కూడలి చూశావుగా, అదే ఇక నాకు రాజ ప్రాసాదం అనుకో. ఆ శంకరన్ మొదలీగాడ్ని గెలుచుకొని అంతగొప్పదాన్నయి పోయాను నేను. అహహ! ఇక నా వైభవాన్ని చాటుకోవడానికి ఈ భవనమూ, ఈ వాడా చాలవేవ్! మొత్తం నగరమే కావాలి" అంటూ మళ్ళీ విరగబడి నవ్వి భుజంతో నాగరత్నను త్రోసి క్రిందకు నడిచింది.

"అయ్యో! వెళ్ళకు. వెళ్ళకు అత్తా! చిన్నమ్మగారికి తెలిస్తే నా తల పోతుంది" అంటూ వెంటబడింది నాగరత్న.

చేలమ్మ చటుక్కున ఆగిపోయి అక్కడే నిశ్చలంగా విగ్రహంలా నిలబడింది. ఆ గంభీరతను చూస్తే ఆమె క్షణం క్రితం తప్పత్రాగి తూలిన వ్యక్తని ఎవరూ అనుకోలేరు. ఆ తరువాత నెమ్మదిగా మొదలెట్టింది. "చూడు నాగరత్నా! తల్లీ కూతుళ్ళ మధ్య అడ్డుగోడనవడం ఇష్టం లేదు నాకు."

"అందుకని నిల్చున్నపాటున ఎక్కడకని వెళ్తావత్తా?"

దూరంగా ఎక్కడో చూస్తూ మాట్లాడింది చేలమ్మ.

"పుహారేశ్వరం మందిరం మెట్లమీద అడుక్కుతినే ఆడవాళ్ళను ఎప్పుడైనా చూశావా నాగరత్నా? వాళ్ళలో చాలామంది ఆ మందిరానికి అంతకుముందు దేవదాసీలుగా వున్నవాళ్ళే. "నేను దేవదాసిని కానుగా, మహాజనదాసిని. అందుకని ఆ మందిరం మెట్లమీద నాకు అధికారం లేదు. ఆ కోటీశ్వరుల నివాసాలున్న కూడలే నాకు తగింది. ఏమంటావు?"

ఆ మాటలు విని నాగరత్న ఏడ్చింది. రెండు చేతులతోను చేలమ్మ భుజాన్ని పట్టుకొని, తన భుజాన్ని ఆమె భుజం మీద ఆన్చి పసిపిల్లలా విలవిలలాడింది.

"నేను నిన్ను వెళ్ళనివ్వనత్తా! వెళ్ళనివ్వను."

చేలమ్మ ఆమెను మృదువుగా అవతలకు నెట్టి ఆదేశమిస్తున్నట్లుగా "క్రిందికిరా అంది. చేయిపట్టుకొని గబగబ మెట్ల దగ్గరకు లాక్కుపోయింది. నాగరత్నకు కన్నీళ్ళాగడం లేదు. కాళ్ళూ నిలవడం లేదు. చేలమ్మ ఈడ్చుకు పోతూన్నది క్రిందికి వచ్చాక ఆమెను గట్టిగా గుండెల కదుముకొని తల నిమురుతూ ఓదార్చింది.

"నా కోసమని దుఃఖించకు నాగరత్నా! నేనొక్కనాటికీ పస్తులతో చావను కారణమేమిటంటావా? ఈ నగరశ్రేష్ఠులు మహాశ్రేష్ఠులు వీళ్ళంతా ఒకప్పుడు దీపం చుట్టూ మిడతల్లాగా నా చుట్టూ ముసిరినవాళ్ళే. అయితే ఎవరూ నన్ను ఎంగిలిచేయలేక పోయారు. ఇప్పటి ఈ నికృష్టస్థితిలోనూ అప్పటి ఆ ప్రభావం బాగా వుండిపోయింది వారిమీద. నాకు దానం చేసి అయినా నన్ను జయించిన సంతృప్తిని పొందాలని, వాళ్ళంతా ఇప్పుడు నన్ను ఆదుకోవాలని చూస్తారు. అహ! హ! ఇక ఆట్టే చెప్పవలసింది ఏమీ లేదుకాని, కొంచెం మత్తు వదిలాక మాధవితో ఈ సంగతి చెప్పు."

నాగరత్నకు కన్నీళ్ళు పొంగి వచ్చాయి. చేలమ్మ అడుగు ముందుకు వేసిందో లేదో ఇంతలో మృదంగ వాదకుడు మాణిక్యంపిళ్ళే లోపలికి వచ్చాడు. వెక్కి వెక్కి ఏడుస్తున్న నాగరత్నను ప్రతిమలాగా నిలుచున్న చేలమ్మను చూచి చెప్పరాని కుంభకోణమే ఏదో జరిగిపోయిందని భావించాడు. భయం భయంగా తడబడుతూ "అయితే ఈ సువార్త మీదాకా వచ్చిందన్నమాట. శివ శివా! శివ శివా!" అన్నాడు.

చేలమ్మ కనుబొమలు ముడివడ్డాయి. "ఏం ఏమిరా గాడిదా! ఏదైనా క్రొత్త పాచిక తెచ్చావా? అదేం సాగదు కాని వెళ్ళు. వెళ్ళి ఆ పెరియన్నాయకి రొమ్ముల్లో మూతిపెట్టి డబ్బులు పితుక్కో పో నా కొడకా!"

"నువ్వంతే లేవమ్మా నీకు ప్రతి ఒక్కటీ ఆసికంగానే వుంటుంది. అంతా నీలాగే ముష్టెత్తుకోవాలని చెడు ఆలోచన ఎక్కడో."

"అసలు సంగతి ఏమిటో అఘోరించరాదు" దులిపేసింది నాగరత్న.

చువ్వలాగా, పొడుగ్గా పీలగా వుండే ఆడారి మాణిక్యంపిళ్ళే గొంతు చించుకొని అభినయం చేశాడు – చేలమ్మవేపు వేలెత్తి చూపుతూ "ఎక్కడెక్కడైతే ఈ మహాతల్లి శుభ పాదం మోపుతుందో అక్కడ తెగదెంపులు కావలసిందే. విన్నావా? మహా శ్రేష్ఠిగారు అల్లుడ్ని పట్టుకొని ఆ కుష్టుముండతో పూసుకుంటూ, రాసుకుంటూ వుంటుందే అటువంటి మాధవితో స్నేహం ఎట్టా కట్టావని నిగ్గదీశాడు. ఇంకేముంది."

ఆ మాట విని అక్కడికక్కడే అతగాడి చేతిని ఒడిసి పట్టుకుంది చేలమ్మ. "ఏం. నీ ముందే అన్నాడా మహాశ్రేష్ఠి ఈమాట. ఏదీ ఒప్పిద్దూగాని పద. తప్పుడు గాడిదా, అబద్ధమాడావో పురుగులపడి చస్తావు జాగ్రత్త."

"అట్టాగే అట్టాగే ముందీ చేయి విడువు" పిళ్ళే గిలగిల్లాడిపోయాడు.

"ఇక్కడ కాదు. పద. ఇకను ఆ మహాశ్రేష్ఠి భవంతి ముందే చేయి విడిచేది."

"అయ్యో! నేను విన్నానని అన్నానా ఈమాట."

"మరి ఎవరు విన్నారు?"

"ఏమో ఎవరికెరుక. ఊరూ వాడా అట్టుడికినట్టుడికి పోతుంటేనూ" పిళ్ళే నీళ్ళు నమిలాడు. చేలమ్మ పిడికిలి విడిపించుకోలేక జులపాలు రేపుకుంటూ గిజగిజ లాడిపోయాడు. అతడి దుర్గతి చూచి అంత బాధలోనూ నవ్వుకుంటున్నది నాగరత్న.

"లాభంలేదు నిన్ను వీధికెక్కించి తీర్తాను పద కూడలి కెళ్ళాకనే ఇహ నీ సంగతి తేలుస్తాను – చూడండి అయ్యలారా! దొంగనాయాలు వద్దంటే వెంటబడి కావలించు కుంటాడు, కాని గంజి పొంగించుకుంటానంటే చిల్లిగవ్వ రాల్చడు. నా తనువెళ్లే మార్గమేదో మీరే చూపండి అని వారినే నిలదీస్తాను."

"అప్పుడు తెలుస్తుంది ఈ పెద్దలంతా కుష్ఠు ముండను ప్రేమించేవాడ్ని కొంపల్లో వాయిద్యానికి ఎలా కుదుర్చుకుంటారో. నన్ను ముంచేవాడ్ని నాతోటే పుచ్చుకు మునుగుతానురా పిళ్ళే. ఏమనుకుంటున్నావో" అంటూ చేయి పట్టుకొని ఈడ్చింది చేలమ్మ.

పిళ్ళే వేళ్లాడబడ్డాడు. "అమ్మమ్మ ముందీ పిడికిలి వదిలేయి తల్లీ, నీ కాళ్ళు పట్టుకుంటాను. ఏదో బుద్ధి గడ్డితిని నోరు జారాను. జన్మజన్మలకు మళ్ళీ ఈ కూత కుయ్యను."

బ్రతుకుదెరువు పోతుందని గిజగిజలాడిపోయాడు పిళ్ళే. పొగరు విడిచి చేలమ్మ కాళ్ళమీద పడ్డాడు. ఆ పాటున గడ్డం పుచ్చుకొని బ్రతిమాలుతూ, కడుపులో తల దూర్చి ఠపీఠపీమని లెంపలు వాయించుకున్నాడు.

"ఈ పాటికి పోనీ అత్తా! సిగ్గులేదు వీడికి. ఒఠ్ఠి మూర్ఖుడు ఎక్కడో! పెద్దమ్మ గారిచేత ఎన్నిసార్లు చీపురు దెబ్బలు తిన్నాడో లెక్కలేదు. చిన్నమ్మగారైతే చెవులు మెలితిప్పింది. అసలు మాటే మాటాడరు వీడితో" అంది నాగరత్న.

చేలమ్మ పిడికిలి వదిలేసింది. అడ్డకట్టు అంచులతో కళ్ళు ఒత్తుకుంటూ, లేచి నిలుచున్నాడు పిళ్ళై.

వాడి పౌరుషం చూచి చేలమ్మ కూడా నవ్వుతూ "భగవంతుడు సమయానికి నా పరువు నిలిపాడు నాగరత్నా! ఈ చెడ్డపేరు రాకముందే బైటపడ్డాను. నువ్వు సుఖంగా వుండాలి. నా మాధవికి దేవుడు మేలు చేయాలి. అ పరమేశ్వరుడు అందర్నీ చల్లగా చూడాలి నాగరత్నా!"

రెండు చేతులెత్తి గడప దగ్గర దీవిస్తూ నిలుచున్న చేలమ్మ ఆ క్షణంలో అతిలోక సుందరిగా కనిపించింది నాగరత్నకు. ఆ తరువాత ఆమె తలవంచుకుని నెమ్మదిగా ముందుకు నడిచింది. నాగరత్న గుమ్మందాటి రాకముందే ఆమె కనుమరుగైపోయింది.

# 8

మాణిక్యం పిళ్ళై చెప్పగా సంగతంతా తెలుసుకొని గజగజ వణికిపోయింది పెరియన్నాయకి. అనుకున్నదేమిటి? జరిగింది ఏమిటి? ఏమి కానున్నది దేవుడా అంటూ తల పట్టుకొని అలాగే కూర్చుండిపోయింది. మహాశ్రేష్ఠి సామాన్య ఘుటం కాదు. దళారీల నుండి మహారాజుదాకా ఆయనంటే పడిచస్తారు. రాతలిలా గాడిదలు కాస్తూ వుంటే చేతలువూళ్ళేల్తాయా? పోనీ, పన్నాశ్రేష్ఠితో చెప్పి ఏ యవన దళారీకో కట్టబెట్టేస్తాను దీన్ని. పరువుపోనీ, మరియాదపోనీ ఏమయినా కాని, ఇహ దీంతో చావలేనిక అయ్యయ్యో! ఈ సంగతి కాని చెవినిబడిందో, రాజమ్మ, రుద్రమ్మాళ్, ఒకరేమిటి శత్రు పక్షమంతా ముఖం మీదే నవ్విపోతారే. ఏదిదారి దేవుడా! అసలింతకూ పూర్వాపరాలేమిటో ముందుకొంచెం వాకబుచేస్తే, నామతిమండా ఎవర్నీ పంపడం, నాగరత్నా! ఎక్కడ చచ్చావే?"

"అమ్మా!" పరుగు పరుగున వచ్చి నిలుచుంది నాగరత్న.

"చూస్తావేమే మాధవిని రమ్మను. బోయీల్ని పిలిచి వెంటనే పల్లకీ సిద్ధం చేయమని చెప్పు. నువ్వూ వెళ్ళి చప్పున అలంకరించుకొనిరా. బైటకి వెళ్ళాలి."

"ఎక్కడికి అమ్మా! కోవలన్..."

"ఔను"

పెరియన్నాయకి తార్పుడు బుద్ధి బాగా పనిచేస్తున్నదిప్పుడు అందుకని అప్పటికప్పుడు మళ్ళీ ఒక వల సిద్ధం చేసింది.

నాగరత్న మూలంగా సంగతంతా తెలుసుకొని కస్సుమని లేచింది మాధవి. అక్కసుపట్టలేక బాలీసును గట్టిగా నలిపి అవతలికి విసిరేసింది. హు! కులస్త్రీ! నా కంటే ఆ కులస్త్రీతో ఒరిగేది ఏమిటో? ఆమె ధన ధాన్యాలు తేవచ్చు, లక్ష్మితో తులతూగవచ్చు.

కాని నేనూ ప్రేమించాను కదా నాగరత్నా నాకేమీ అధికారం లేదా ఆయన మీద" పొంగి వస్తున్న కోపంతో నిలువునా వణికిపోతూన్నదామె. మాటలు తడబడుతున్నాయి.

నాగరత్న ఆమెకు ఎల్లాగో నచ్చజెప్పి చతుశ్శాలవైపు తెచ్చింది. కూతురి ముఖకవళికలు చూడగానే పరిస్థితి గ్రహించింది పెరియన్నాయకి. ఆమెను హృదయానికి హత్తుకొని తలనిమురుతూ "క్రొత్తలో ఇంతే అమ్మా, అన్నీ ఇల్లాంటి అనుభవాలే ఎదురౌతాయి.... గుండె నీరు చేసుకోవాలి తల్లీ! వెచ్చ జూపినపుడు కాగడమూ, దింపగానే చల్లారడమూ అలవాటవాలి" అంటూ మాధవిని చూచి మళ్ళీ ధోరణి మార్చింది. "మన జాతి ధర్మం ఇంతే తల్లీ నగర వధువులం మనం, మన ప్రేమకూ, డబ్బుకూ లంకె, అన్నిటికన్నా ధనమే ప్రధానం మనకు. ప్రేమా పురుషుడూ దానికి సాధనాలు మాత్రమే ననుకో" అంటూ మళ్ళీ కూతురి ముఖం వైపు పరిశీలనగా చూచి "కోవలన్ విషయంలో అప్పుడే ఆశ నిరాశ చేసుకోలేదు నేను ఇదుగో క్రొత్త పాచిక వేస్తున్నాను చూడు, దేవుడు చల్లగా చూస్తే గెలుస్తాము కూడా."

"పాచికలు ఏమీ అక్కర్లేదులే అమ్మా, నాకు నేనై ఆయన్ను గెలుచుకుంటాను" నాకాళ్ళమీద నేను నిలబడ్తాను. ధనం గొప్పదో ప్రేమ గొప్పదో ఈ దెబ్బతో తేల్చుకుంటాను చూడు."

డబ్బు పట్ల ఉపేక్షాభావం చూపుతూన్న కూతురి ధోరణికి విసుక్కుంది పెరియన్నాయకి. "నీకింకా పసితనం పోలేదు. ఆ ధనం కోసమేగా ఇంతగడ్డీ కరిచేది. అది ఒకటి లేకపోతే ఇహ ఈ రసికుల మొహం ఎవరు చూస్తారు."

"ధనం కోసమని ఎవరన్నారమ్మా! నేను ఓం ప్రథమంగా చూచినప్పుడు, అసలాయన పూర్వాపరాలేమిటో తెలియందే నాకు."

"అది నిజమేకావచ్చు. నువ్వప్పుడా లక్ష్మీపుత్రుడ్ని అతగాడి లక్ష్మినీ తన్నేసి వెళ్ళిపోయావు గదే – రాచ మాలికనే కాదు, కోవలన్‌ను కూడా గెలుచుకోవాలి సుమా, అని నేను హెచ్చరించిన మీదటనేగా నువ్వతడ్ని వలలో వేసుకొనడం మొదలు పెట్టింది."

తల్లి ధోరణి అర్థంకాక విసుక్కుంది మాధవి. "ఇంతకూ నీ కోరిక ఏమిటమ్మా చెప్పు?"

"ఏమీలేదు నువ్వా కోవలన్ పేర ఒక లేఖ వ్రాయాలి. ఈ అహంభావాన్ని కాస్తా అవతలికి నెట్టి, అందులో ప్రేమ అనీ, విరహమనీ బాగా తూకమైన మాటలు పెట్టు. తక్షణమే తమ దర్శనం కాని తీరుకు, మీ మాధవి ప్రాణత్యాగం చేసుకోడానికి సిద్ధంగా వుందని వ్రాయి."

"ఉత్తరం చూచాక మరి ఆయన రాలేదనుకో అప్పుడు నేను ప్రాణత్యాగం చేసుకోవడం నీకు సమ్మతమేనా అమ్మా!"

"పెడసరం మాటలు కట్టిపెట్టి ముందు ఉత్తరం పూర్తి కానీ, నాగరత్న చేత పంపుతాను. పన్నా ఉద్యానవనంలో కలుసుకునే ఏర్పాట్లు చేస్తున్నాననీ, ఆయన గౌరవ మర్యాదలకే మాత్రం భంగం కలగదని వ్రాయి. చూస్తానుగా లేఖ వ్రాయడంలో నీకెంత నేర్పు వున్నదో."

కూతురిని తన గదిలోనే దిగవిడిచి బైటికి వచ్చింది పెరియన్నాయకి. నాగరత్నను కూడా తనతో రమ్మని సైగచేసి, చాటుగా వెళ్ళి ఆమెతో గుసగుసలాడింది. చేలమ్మ వెళ్ళిపోయిన సంగతి తెలుసుకొని పొంగిపోయింది. "పీడా విరగడయింది. పోనీ, హోమం చేసి చేతులు కాల్చుకున్నట్టయింది దాంతో. నృత్యోత్సవం నాడు చూశావుగా అంతజనంలో దాన్ని కావటేసుకుంది, తన ప్రక్కన రథం మీద కూర్చోబెట్టుకు వచ్చింది. లోకంమీద మూకుడు గప్పడం ఎవరికి చేతనవుతుందే నాగరత్నా! కుష్ఠుముండను ఎవరైనా అసహ్యించుకుంటారు తప్పేముంది. ఇక పీడావిరగడై పోయిందిగా? పోనీ! కోవలన్ గాని దాని ప్రసక్తి ఎత్తుతే నేనే తన్ని తగలేశానని చెప్పు. అంతేకాదు మాధవి కాని నేను కాని దాని అంటూ సొంటూ ఎరగవంనీ అదెక్కడో మూల పంచన బడి చచ్చేదని చెప్పు. విన్నావా నాగరత్నా! ఎలా అయినా ఈ వేళ కోవలన్ శ్రేష్ఠిని లాక్కురావాలి నువ్వు. ఇదిగో ఈ బంగారపు హారం నీ బహుమతి. ఎలా చేస్తావో చూస్తాగా."

పన్నా నిర్మించిన సుందరోద్యానం సముద్రతీరానికి ఈశాన్యంగా వున్నది, గ్రీక్ శిల్ప సౌందర్యం వుట్టి పడుతుందక్కడ. తన స్వదేశం రోమ్ నుండి చిన్నవి పెద్దవి అందమైన శిల్పాలు అనేకం తెచ్చి ప్రతిష్ఠించాడు పన్నాశ్రేష్ఠి. బంగారు, వెండి ఫలకాల మీద సుందర చిత్రాలు అనేకం వేయించాడు. అరబ్బీ దేశం నుండి రత్నకంబళాలు తెప్పించి ఆసనాలు ఏర్పాటు చేయించారు. దేశదేశాల నుండి తెప్పించిన చిత్ర విచిత్రమైన పక్షుల్ని వెండి, బంగారు పంజరాల్లో పెంచుతున్నారక్కడ.

రకరకాల ఫలపుష్ప వృక్షాలు, నౌకా విహారాల కోసం కృత్రిమమైన సరస్సులు, దివ్యభవనాలు, మంటపాలు వున్నాయి. వనం చుట్టూ ఎత్తయిన గోడ, అగడ్తా ఉద్యానప్రవేశ, నిష్క్రమణల కోసమని నాలుగు ఉన్నత ద్వారాలు ఉన్నాయి. నాలుగోద్వారం సముద్రాభిముఖంగా తెరచుకుంటుంది. అక్కడే కోవలన్ కోసం నిరీక్షిస్తూ కూర్చున్నది మాధవి.

అవసరమైన ఏర్పాట్లన్నీ ముందే చేయించింది పెరియన్నాయకి. ఉద్యానవనానికి సమీపంగా కొబ్బరితోపులో అశ్వం దిగి సముద్రాభిముఖంగా వున్న రహస్య ద్వారం గుండా లోపలికి వస్తాడు కోవలన్. ఎప్పటికప్పుడు అతని వార్త తెలిపేందుకు దారిలో అక్కడక్కడా పరిచారకుల్ని, దాస దాసీజనాన్ని నియమించింది.

అతి రహస్యంగా దాగుతూ దాగుతూ బైలుదేరాడు కోవలన్. మామగారి మనోభావం తెలుసుకున్న నాటి నుండీ జాగ్రత్తగా మసలుకుంటున్నాడు. వేల్లినాథన్ కూడా వివాహ సంబంధాన్నీ, దాని ప్రతిష్ఠను కాపాడడానికి కొంతకాలం వేశ్యాసంపర్కం మానవలసిందని ఏకాంతంలో సలహా ఇచ్చివున్నాడు. తన తండ్రికి అసలీ గొడవలేవీ పట్టవు.

మాశాత్తువన్ శ్రేష్ఠి తన జీవితంలో ఎప్పుడూ ఇటువంటివి ఎరుగడు. ఎప్పుడో పదేండ్లనాడే భార్యపోయినా శీలాన్ని కాపాడుకుంటూ వస్తున్నాడతను. అప్పటినుంచీ తనకు వాణిజ్యమూ, కోవలన్, రెండేరెండు లక్ష్యాలుగా పెట్టుకున్నాడు. ఇప్పుడు కోడలి కోసం ఎదురుచూస్తూ ఎంతో ఆనందాన్ని అనుభవిస్తున్నాడు. కొడుకు దారి తప్పిపోయాడని, ఆ సంగతి తన వియ్యంకుడిదాకా పోయిందని తెలిస్తే అతడెంతగానో బాధపడి పోయేవాడే.

ఎంతయినా తండ్రి బాధపడడాన్ని సహించలేడు కోవలన్. ఇప్పుడిప్పుడే వృద్ధిలోకి వచ్చాడు తను. మంచి వ్యవహర్తగా రాణిస్తున్నాడు. మహాశ్రేష్ఠి తన వ్యవహారాలన్నీ కొడుకుపరం చేసి తనొక పరిశీలకుడిగా మాత్రమే వుండి పోయాడు. వర్తక వాణిజ్యాలన్నీ కోవలన్ చక్కగా అజమాయిషీ చేసుకుపోతున్నాడు. అందుకని అపవాదు అన్నా అపకీర్తి అన్నా భయపడిపోతున్నాడు. అసలే ఆ దేవదాసీ వ్యవహారంలో అనవసరంగా తను నలిగిపోయాడు. దండనాయకుడు తన బలహీనతను పట్టుకొని తనను డబాయింపుకు గురిచేశాడు. ఎప్పుడూ జరగకూడనిదేదో జరిగిపోయినట్లు సిగ్గుపడుతున్నాడు కోవలన్. అయినా మాధవి ఆకర్షణ నుండి తప్పుకోలేక పోతున్నాడు. జీవితంలో ఆ తొలి కలయికకు సంబంధించిన మాధుర్యాన్ని మరచిపోలేక పోతున్నాడు. మాధవికి నారీత్వాన్నీ తనకు పురుషత్వాన్నీ ప్రసాదించిన మధుర సంపర్కం అది.

అదీగాక మాధవి అపూర్వ సౌందర్యమూ, ఆమె కళాభినివేశమూ, వాక్చాతుర్యమూ బాగా ఆకట్టుకొని కదలకుండా చేస్తున్నాయి. అయితే అంత మాత్రానికి పరువు ప్రతిష్ఠల్ని, వాణిజ్యాన్ని పణంగా పెట్టడం నచ్చడం లేదతనికి.

కణ్ణకితో వివాహ సంబంధం కూడా వ్యవహారిక దృష్టితో ఆనందాన్నీ మానసికంగా ఖేదాన్ని కలిగిస్తూన్నది కోవలన్‌కు. కుబేరుడైన మహాశ్రేష్ఠిని మామగా పొందడం ఎంత సంతోషదాయకమో, ఆయన కుమార్తెను భార్యగా స్వీకరించడం అంత బాధగా వుందతనికి. అసలే తన చెడునడత సంగతి మహాశ్రేష్ఠిదాకా పోయింది. ఇక కల్యాణ మంటపంలో కన్యాదాత ముఖం చూడలేడు తను. అంతేకాదు భవిష్యత్తులో కూడా అతని ముందెప్పుడూ తలెత్తుకు తిరగలేడు.

నాలుగు నెలల క్రితం తను నూతనంగా నగరప్రవేశం చేసిన నాటి సంఘటన జ్ఞాపకం వచ్చింది కోవలన్‌కు. ఆనాడు మాధవికీ తనకూ జరిగిన సంభాషణ నగరమంతా

మారుమ్రోగిపోయింది, తన తండ్రీ మహాశ్రేష్ఠి – మిగిలిన పరివారమంతా ఆ సంగతి విని పొంగిపోయారు. తన శీలాన్ని గుణగణాలను ఎంతగానో స్తుతించారు. తిరిగి నాలుగు నెలలైనా కాకముందే ఇది పొక్కింది. అంత గౌరవం మీదట ఇంత అవమానం, క్షోభ, వీటితో తల తిరిగి పోతున్నది కోవలన్‌కు.

అతడు మాధవిని కలుసుకొని నాలుగు రోజులే అయింది. నిజానికి ఈ నాలుగు రోజులే నాలుగు యుగాలుగా గడిపాడు. పగలెల్లాగో గడిచిపోతున్నది కాని రాత్రులు గడవడం గగనమైపోతున్నది. మానసిక దౌర్బల్యం పగలల్లా అణగి మణగి వుండి ప్రొద్దుగూకగానే విజృంభిస్తూన్నది. అందుకని తెల్లవార్లు అశ్వం మీదనో తప్పితే తన కర్ణీ రథం మీదనో ఎక్కడెక్కడో నిర్జన ప్రదేశాలలో తిరుగాడుతూ గడుపుతున్నాడు.

కోవలన్ ఈ వేళ సాయంత్రం వ్యాపార వ్యవహారాలన్ని ముగించుకొని సౌధానికి తిరిగి వస్తూ, దారిపక్క మోకాళ్ళ మీద తలవాల్చుకొని దీనంగా కూర్చున్న స్త్రీ నౌకర్తెను చూచాడు. సేవకుడ్ని పిలిచి, ఎవరో పాపం ఆపదలో వున్నదిలాగుంది. సంగతేమిటో తెలుసుకోండని, పురమాయిస్తూనే తనే ఆమెను సమీపించి "ఎవరమ్మా మీరు? ఏం పనిమీద వచ్చారు?" అని ప్రశ్నించాడు. వెక్కిళ్ళు పడుతూ లేచి నిలుచున్నది నాగరత్న. ఏడుస్తూ కోవలన్ పాదాల మీద పడింది. మరణాసన్న అయివున్న తన యజమానురాలికి చికిత్సను యాచిస్తూ అతి నేర్పుగా అభినయించింది. నాగరత్న చాతుర్యానికి నిర్ఘాంతపోయాడు కోవలన్. సేవకుడు వెళ్ళిపోగానే కంచుకంలో దాచిన లేఖ తీసి అతని చేతిలో పెట్టింది నాగరత్న.

లేఖ చదివి తపించి పోయాడు కోవలన్. మార్గాంతరం ఏమిటా అని పరిపరి విధాల ఆలోచించాడు. పన్నా ఉద్యానంలో కలయిక సంగతి తెలుసుకొని కొంత ఊరట పడ్డాడు. ఒక వైపు సంకోచమూ భయమూ పీకుతూ వున్నా మాధవి లేఖా, నాగరత్న సంభాషణా అతడ్ని వివశుడ్ని చేశాయి. మాధవితో కలయిక అనే మధుర ప్రస్తావనను త్రోసిపుచ్చుకోలేక పోతున్నాడతడు.

ప్రొద్దుగూకాక సౌధం వెనుక ద్వారం దగ్గర నమ్మకస్తులైన పరిచారకుల్ని వుంచి విహారం కోసం అంటూ బైలుదేరాడు. ఒకరిద్దరు మిత్రులతోను, వ్యవహార్తలతోను కబుర్లాడుతూ అటూ ఇటూ రాత్రి ఝాము న్నర వరకు తిరిగి తిరిగి రెండవ ఝాము ప్రవేశిస్తూ వుండగా ఎలా అయితేనేం సంకేత స్థలానికి చేరుకున్నాడు. ఇంతలో పెరియన్నాయకి సేవకుడొకడు వచ్చి కళ్ళెం పుచ్చుకున్నాడు. రెండవ సేవకుడు ఒంగి ఒంగి దండాలు పెడుతూ మార్గం చూపుతూ ముందు నడువగా సముద్రాభిముఖంగా వున్న రహస్య మార్గం గుండా ఉద్యానంలోకి ప్రవేశించాడు.

ఈ సందర్భంలోనే తన ప్రేమికుడు పన్నా శ్రేష్ఠిని కూడా అవసరమైన పని అంటూ కబురు పంపి పిలిపించింది పెరియన్నాయకి. ఒకవేళ కోవలన్ వచ్చిన రహస్యం గాని పొక్కితే అప్పుడు పన్నాతో బేర సారాలను గురించి చర్చించడానికి వచ్చాడని తప్పుకోవచ్చు. మరొకవిధంగా పాత ప్రేమికుల కలయిక క్రొత్త జంటకు మౌన ప్రేరణ నిచ్చినా ఇవ్వవచ్చు.

పన్నాశ్రేష్ఠి మాధవితో కూర్చొని పాచికలు ఆడుతున్నాడు. మాధవి అంటే ప్రాణం ఆయనకు. పెరియన్నాయకి వారి కోసమని దండలు గుచ్చుతూ కూర్చున్నది. మధ్య మధ్య పన్నాశ్రేష్ఠికి మద్యంపాత్ర నింపి అందిస్తూన్నది. తాంబూలం ముడిచి ఇస్తూన్నది. అప్పుడప్పుడు తనూ త్రాగి ఆకూ వక్కా వేసుకుంటున్నది. కాని ఆమె చూపంతా కోవలన్ వచ్చే మార్గం మీదే పరచుకొని వుంది. మాధవీ, పన్నా – ఫాతేర్, ఫీలియా – తండ్రీ కూతుళ్ళు నవ్వుతూ తుళ్ళుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

కోవలన్ వస్తున్నాడని తెలియగానే ఆడుతూ ఆడుతూ వున్న పాచికల్ని అలాగే విసిరేసి నిలుచున్నాడు పన్నా. "వద్దు వద్దు వెళ్ళవద్దు. మీరు కూర్చోండి" అంటూ అడ్డుతగలపోయింది పెరియన్నాయకి. "కోవలన్ రాగానే రెండు తియ్యటి కబుర్లు చెప్పి ఇద్దరం కలిసి వెళ్ళిపోదాం" అంది.

"వద్దు పుయెల్లా! (ప్రియతమా) అతడి తండ్రీ, మామా కూడా నాకు ప్రాణ మిత్రులు, ఇటువంటి వ్యవహారాల్లో ఎటువెళ్ళి ఎటువచ్చినా కాస్త కనుమరుగు వుండాలి" అంటూ ప్రేమగా పెరియన్నాయకి వీపుతట్టి వెనుకదారిని తన సౌధం వేపు వెళ్ళిపోయాడు పన్నా.

మొదటే తన సంకల్పం భగ్నమయినందుకు కొంత చిరాకుపడింది పెరియన్నాయకి. ఆ వెంటనే క్రొత్త ఆలోచన ఒకటి కొట్టుకువచ్చి సర్దుకుని లేచి నిలబడింది. తత్తరలాడుతూ "ఇటుపడుకోవే. ఆ పట్టు దుప్పటినిండా ముసుగు తన్ని పడుకో. కాస్త అలకా అదీ వుండాలా వద్దా. ఓసి, నవ్వబోకే అసందర్భపుదానా. ఈపాటికి అతను వచ్చేవుండాలే."

మాధవి సన్నగా నవ్వి కళ్ళు మిటకరిస్తూ "ఇది ప్రేమ వ్యాపారమా అమ్మా!" అంది.

పెరియన్నాయకి పళ్ళు కొరుకుతూ గొంతు తగ్గించి "అంతే అనుకో. లేవకే వస్తున్నాడూ" అంది.

కోవలన్ వస్తూనే ఇద్దరినీ చూచి, పెరియన్నాయకిని ఉద్దేశిస్తూ "నమస్కారం అమ్మా!" అన్నాడు. "ఇదేమిటి మాధవి ఏడుస్తున్నదా!" అని ఆమెవేపు నడిచాడు.

"నేనేం చేయను నాయనా నాలుగు రోజులు మీరు రాకపోయేసరికి ఇల్లా అయిందిది. దీన్ని ఓదార్చలేక నా తల ప్రాణం తోకకు వస్తున్నది. ఎప్పుడు వస్తారమ్మా! ఇంకా ఎప్పుడు వస్తారు. ఎప్పుడు ఎప్పుడని, నా ప్రాణాలు తోడేసింది. తిండీ తిప్పలూ లేవు. సరికదా కంటిమీద కునుకే కరువై పోయిందనుకోండి. దీన్ని ఓదార్చలేక నాకు ఏడ్పు వచ్చేది"

ఏడ్పు గొంతుపెట్టి అభినయించింది పెరియన్నాయకి."దిగులు పడకమ్మా! మూడుముళ్ళూ పడగానే నిన్నూ, నీ ప్రేమను మరిచిపోయే బాపతుకాదులేవే కోవలన్‌శ్రేష్ఠి, అని లక్ష విధాల నచ్చజెప్పినా వింటేనా! ఒకటే ఏడ్పు, ఒకటే కలవరింత. అయ్యో రాత ఏమని చెప్పను నాయనా! మీ కోసమని ఇలా పిచ్చిదయి పోయింది."

మాధవి ప్రక్కనే ముభావంగా కూర్చొని పెరియన్నాయకి చెప్పేదంతా వింటున్నాడు కోవలన్. ఆమె మాటల్లో తన మనస్థితే గోచరిస్తున్నదతనికి. ఆమె చెంగు తాకితే చాలు ఉత్తేజితుడయ్యే స్థితిలో వున్నాడు. రెండు చేతులతోను ముఖం కప్పుకొని పడుకున్నది మాధవి. కోవలన్ మృదువుగా ఆమె చేతిని నిమురుతూ "మాధవీ ఇటు చూడు, ఇటుచూడవూ!" అన్నాడు.

విసురుగా చేతిని త్రోసివేసి అవతలికి తిరిగి పడుకున్నది మాధవి. తను లేచి అటు వెళ్తూ వుండగా ఆమె తిరిగి ఇటు ప్రక్కకు ఒత్తిగిల్లుతూ వుండడం చూసి "వినవూ?" అన్నాడు కోవలన్.

మాధవి వినకుండానే ఒత్తిగిలి పడుకున్నది.

"ఇది నీ అదృష్టమనుకో అమ్మా! దేవుడు లాంటి వారు దొరికారు నీకు. జన్మాల తపస్సు. ఇది నీ పూజాఫలం అనుకో" హితోపదేశం చేసింది పెరియన్నాయకి.

"రాతిబొమ్మకు పూజా పుష్పాలమీద వ్యామోహం వుండదే అమ్మా కటికిరాతికి పువ్వుల విలువలేం తెలుస్తాయని. వీరు నిజంగా దేవుడే అయినా నా పూజకు, నా తపస్సుకు క్షణం విడిచి వుండేవారా నన్ను" అంది మాధవి. చివరి మాటలంటూ ఆమె గళం రుద్ధమయింది. పైట చెంగుతో కన్నీళ్ళు ఒత్తుకుంది.

చేతులు వూపుకుంటూ అభినయించింది పెరియన్నాయకి.

"ఏమోనమ్మా కాలపుతంతు, ఇలాంటి చోద్యాలు మేం ఎరుగం తల్లీ! ఇంతసేపూ రాలేదో అని ఏడ్చిందా వస్తే బిగిసి కూర్చుంది. ఏమన్నా అవండి. మధ్యన నాకెందుకు. ఇదిగో నేను వెళ్తున్నాను" అంటూ ఒక పూలదండ అందుకొని దాని చివరలుముడివేస్తూ బైటికి నడిచింది. కొంచెం దూరం వెళ్ళి ఆగి ఏమి జరుగుతున్నదో అని క్రీగంట చూస్తూ నిలుచున్నది.

పెరియన్నాయకి వెళ్ళగానే మాధవిని గట్టిగా కౌగలించుకొని ఆమె చూపుల్లో చూపులు కలపాలని చూస్తున్నాడు కోవలన్.

"రాతి బొమ్మకు ప్రాణ ప్రతిష్ఠ చేసిన దానివి నీకే దీనిమీద విశ్వాసం లేదే ఇతరులేం నమ్ముతారు మాధవీ"

కౌగిలిలోకి బిగిసుకునే విదిలించుకున్నట్లు అభినయిస్తున్నది మాధవి. పెడమొహంగా వుంటూనే క్రీగంట చూస్తున్నది. కడకంట తీవ్రంగా చూచి, ఎత్తిపొడుపుగా "తెస్తున్నారుగా పూజారిణినీ ఇక మీకు పూజకేం కొదువలెండి" అంది.

ఆ మాటకు కోవలన్ నవ్వి ఆమెను గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు. నుదురు ముద్దాడి "అది లోక రీతి ప్రియా! ఆ లాంఛనాన్ని నిలపడానికే ఆ పూజారిణి. రేపు జరుగబోతున్నది వివాహోత్సవం కాదు, ఐశ్వర్య యజ్ఞమనుకో. మహాశ్రేష్ఠి ధనాన్నే అందులో హవిస్సుగా విడుస్తున్నాను. దాంతో మాశాత్తువన్ వంశ ధనలక్ష్మి ఒక్క వెలుగు వెలుగుతుంది. అసలు ఉద్దేశం తెలిసిందా మాధవీ."

ఆ మాట విని విసురుగా కౌగిలి విడిపించుకుంది మాధవి.

"ఆ వెలుగు కోసమని ఈ వెలుగును ఆర్పివేయాలా స్వామీ! ధన దాహం తీర్చుకోవడమే మీ లక్ష్యమైతే అది నా దగ్గర కూడా వుందిగా."

ఈ మాటలు కోవలన్ గుండెల మీద కత్తివాటులా నాటాయి. అతని అభిజాత్యం పూర్తిగా దెబ్బతిని తోక తొక్కిన త్రాచులా లేచాడు "మాధవీ" అని గర్జిస్తూ కత్తి దూశాడు. తను వూహించని ఈ హఠాత్పరివర్తనకు బెదిరిపోయి, గజ గజ లాడుతూ ప్రక్కకు తప్పుకున్నది మాధవి. కోవలన్ ఉగ్రరూపం చూచి ఆమె శరీరం తీగెలా వణికిపోతున్నది.

మాధవి భయస్వరూపం చూచి కోవలన్ కోపం కొంత శమించింది. అతడు ఉద్రేకాన్ని బలవంతంగా అణచుకునే ప్రయత్నం చేస్తూ స్వగతంగా గొణుగుకున్నాడు. "ఈ క్షణంలోనూ నిన్ను ప్రేమిస్తున్నానన్న స్పృహ కొంత వుండిపోయింది. దేనికీ లొంగనివాడ్ని ఆ ఒక్కదానికి వివశుడ్నయిపోతున్నాను. అది ఒక్కటీ లేకపోతే ఈ క్షణంలో ఏమీ జరిగిపోయేదో" అంటూ ఆ తరువాత అందులో కాస్త దర్పాన్ని కూడా కలిపి మళ్ళా మొదలు పెట్టాడు. "నగరహరా, మధురా, శూర్పరాక్, బార్బరికోస్ ద్వీపాలూ, భారతదేశం నాలుగు చెరగులు, తన కీర్తితో ముడివేసి కొమ్ములు తిరిగిన కోటీశ్వరుల్నే పాదాక్రాంతుల్ని చేసుకున్న మహాశ్రేష్ఠి మాశాత్తువాన్ పుత్రుడి ముందు ఇంత మాట అని ఏ వేశ్య అయినా బ్రతికిపోయేదేనా? అసాధ్యం."

అయితే క్రోధావేశాన్ని చివరకు ప్రేమావేశమే జయించింది లాగున్నది. ఖడ్గం విసిరేసి అతడు గంభీరంగా కూర్చున్నాడు.

కోవలన్‌ను ఈ రూపంలో ఎప్పుడూ చూడలేదు సరికదా వూహించనైనా లేదు మాధవి. అతని పౌరుషం యొక్క తేజస్సు ఆమె గర్వాన్ని నిస్తేజపరచింది. మాధవి లోపల కోవలన్‌ను గాఢంగా ప్రేమిస్తున్న స్త్రీ ఆ క్షణంలో మేలుకుంది. ఆమె కంఠమూ, కళ్ళూ, మనస్సు కన్నీళ్ళతో రుద్ధమయ్యాయి. పరుగున వెళ్ళి అతని కాళ్ళను కావటేసుకుంది. పాదాలమీద

తల మోపి వెక్కి వెక్కి ఏడుస్తూ "మీ పాదధూళిని నేను, నన్ను చంపండి. అంతం చేయండి. మీ చేతుల్లో ప్రాణాలు వదిలినా పుణ్యలోకం ప్రాప్తిస్తుందేమో ఈ పాపిష్ఠి జన్మకు."

కోవలన్ కాళ్ళకు మాధవి మెత్తటి బాహువులు సంకెళ్ళలా బిగుసుకుంటున్నాయి. తల ఎత్తి నీళ్ళ గిన్నెల్లా వున్న కళ్ళతో కోవలన్‌ను చూస్తూ మాట్లాడుతున్నదామె. "అభాగ్యురాలైన ఈ కులట ప్రేమను లోకం ఎప్పటికీ నమ్మదు, చివరకు మీరూ విశ్వసించరు మహాశ్రేష్ఠి! ఛీ! ఇటువంటి బ్రతుకు బ్రతికేకంటే చావడం మేలు" అంటూ గుండెపొంగును అణచుకోలేక లేచి నిలుచున్నది మాధవి; "మీకెందుకు అంతశ్రమ శ్రేష్ఠీ! ఈ పాపిష్ఠి జన్మను నాకు నేనే అంతం చేసుకుంటాను" అని గబ గబా వెళ్ళి కోవలన్ విసిరేసిన ఖడ్గం అందుకుంది. అదిచూచి తక్షణమే పరుగెత్తి ఆమెను పొదివి పట్టుకున్నాడు కోవలన్. ఖడ్గం విదిలించి దూరంగా పారేసి మాధవిని బలంగా దగ్గరకు లాక్కుని గుండెలకు హత్తుకున్నాడు.

"నీ ప్రేమను నేను నమ్ముతున్నాను మాధవీ! అందుకే నా జీవితాన్ని పూర్తిగా నీ చేతుల్లో వుంచాను. ఈ ప్రేమ ఎప్పటికీ ఇలాగే వుంటుందని వాగ్దానం చేస్తున్నాను. కాని వంశ ప్రతిష్ఠకు మచ్చరావడం మాత్రం నచ్చదు నాకు. ఆ ఒక్క కళంకాన్ని నేను చూడలేను."

"అది మీ మాధవి కూడా సహించలేదు స్వామీ! నా హృదయానికి, జీవితానికి వెలుగు నిచ్చే సూర్యుణ్ణి కళంకపరుస్తాను! మీ మాధవి అటువంటిది ఊహించదు కూడా" అని తన శిరస్సును కోవలన్ హృదయంలో గ్రుచ్చి, ఒక చేయి నడుముపైనా, మరొక చేయి మెడమీద వేసి గట్టిగా కౌగిలించుకొని మాట్లాడుతున్నది మాధవి. కోవలన్ ఆమె శిరస్సును రెండు చేతులతోను గట్టిగా అదిమిపట్టి నేత్రాలలోకి చూస్తూ నిలుచున్నాడు. ఆమె కనురెప్పలు సిగ్గుతో వాలాయి. వయస్సూ, సిగ్గూ దోబూచులాడుతోన్న కళ్ళతో సూటిగా చూస్తూ అందామె "ఎందుకో అనవసరంగా మాటజారాను. మీరేకదూ! ముందు పరిహాసానికని మహాశ్రేష్ఠి గారి సంపద ప్రస్తావన తెచ్చారు."

"ఔను, మానాయకన్ చెట్టియార్ ఏకైక సంతానాన్ని పరిణయమాడి ఆ ఐశ్వర్యాన్ని గ్రహించడం మాశాత్తువన్ వంశాంకురానికి తగిందే, అందులో తప్పేమీ లేదు మీదు మిక్కిలి వంశ ప్రతిష్ఠ అది... కాని..."

"కాని – ఈ పతిత దానాన్ని కూడా తమరు గ్రహింపక తప్పదు రసరాట్! మీ మాధవి ప్రేమదానాన్ని మీరు స్వీకరించ లేరా?" అంటూ జాలిగా కోవలన్ వైపు చూచింది. ఆ చూపులో మత్తూ, మాధుర్యమూ తొణికిసలాడాయి. మళ్ళీ కౌగిలి విడిపించుకొని, అతని పెదవుల్ని వెచ్చగా ముద్దాడి మద్యపాత్రవేపు వెళ్తూ "నాగరత్నా!" అని పిలిచింది.

కోవలన్ ఆమెను అనుసరించాడు. "నీ ప్రేమదానాన్ని పొందడానికి నిత్యం భిక్షా పాత్రతో యాచకుడ్నయి నీ ద్వారం ముందు నిలుచుంటాను మధూ! సరేనా."

మద్య పాత్ర నింపుతోన్న మాధవి ఆ మాటకు సమాధాన మివ్వడానికి శిరస్సు పైకి ఎత్తింది. ఇంతలో నాగరత్న వచ్చింది. యజమానురాలి అంతర్యం తెలుసుకొని ప్రశ్నించకుండానే బంగారు పళ్ళెంలో రకరకాల మధురపదార్థాలు తెచ్చి అమర్చింది. ఆ తరువాత ఒక క్షణం నిలుచుని తలవంచుకొని వెళ్ళిపోయింది. నాగరత్న వెళ్ళాక చల్లగా నిట్టూర్చింది మాధవి. మద్య పాత్రను కోవలన్ వేపు జరుపుతూ చప్పగా నవ్వి దగ్గరికి జరిగి "ఇంకా ఎన్ని రోజులుంటారు భిక్షూ?" అంది.

"రేపు సప్తమికి ధర్మమూ, సంఘమూ ఏకమై నా ఆరాధ్య దైవాన్ని బలవంతంగా నా గుండెల్లోంచి పెకలించుకుపోయి ఇంకొకరి హృదయంలో ప్రతిష్ఠిస్తారు. ఏమీ చేయలేను నేను, అసహాయురాలైన ఒక బీద పూజారిణిలా చేతులు నలుపుకుంటూ వుండిపోతాను. మనసిచ్చి, ప్రేమించి, ఆరాధిస్తున్నా అధికార పూర్వకంగా మీరు నావారని చెప్పుకునే హక్కు లేదు నాకు, ఎందుచేత? నేను స్త్రీని కాదు, వేశ్యను, స్త్రీ సహజమైన గుణాన్ని దాని సహజ సుందర రూపాన్ని పొంది కూడా ఆడదాని కుండే అధికారాలు లేవు నాకు" అంటూనే దుఃఖం పొంగి వచ్చి ఆమె కళ్ళు అశ్రు సిక్తాలయ్యాయి.

దుఃఖంతో జేవురించిన మాధవి ముఖం ఈ క్షణంలో ఎంతో దయనీయంగా వుంది. ఆమె ఆంతర్యంలోని కటువైన సత్యం తాలూకు కాంతి వెలుగుతూంది ఆమె ముఖంలో. ఆమె మాటల్లోని ఆవేదన కోవలన్‌కు కొంత కొంత అర్థమయినా అతని హృదయాన్ని మాత్రం పూర్తిగా దూసుకు పోలేదది. మత్తు వూపులో ఆమె వేపు చేయి జాపుతూ "నీ భయం నిరర్థకం మాధవీ! నేనెప్పుడూ నీ వాడ్నిగానే వుంటాను" అన్నాడు.

"ఉంటారు దొంగ సొత్తులాగ. లోకం కణ్ణకి సౌభాగ్యాన్ని మాధవి దోచుకుందని దెప్పుతుంది. కాని పెళ్ళి అనే ఒకానొక బూజుపట్టిన నైతిక ధర్మ పాశంతో బంధించి ఆ కణ్ణకీ నా జీవిత సర్వస్వాన్ని బలాత్కారంగా లాక్కుపోయిందని ఎవరైనా అంటారా చెప్పండి? ఎవరూ అనరు."

రెండు నిమిషాలు మౌనంగా గడిచాయి. కోవలన్ తన ఆలోచనలన్నీ ఈ విషయం మీదకే మళ్ళించి యోచిస్తూ కూర్చున్నాడు. ఆ తరువాత మౌనం విడిచి గంభీరంగానూ, మెల్లగానూ ప్రారంభించాడు – "ఈ లాంఛనాన్ని నవ్వుతూ స్వీకరించడమే నీకూ నాకూ మేలు మాధవీ, ఎందుకంటావా ఇది నీ నా ఇష్టా ఇష్టాలకు సంబంధించిన సమస్య కాదు, సంఘ నియమం. తప్పనిసరి ఇది."

"ఎందువల్లో?"

“సంతానం కోసం.”

“నేను కనలేనా సంతానాన్ని?”

మాధవి నేత్రాల్లో ఒక విధమైన తిరుగుబాటు మెరుస్తూన్నది. సుందరమైన ఆమె ముఖం ఆంతరికమైన ఆ పితూరీతో జేవురించి మరింత అందంగా వెలిగిపోతూన్నది.

కోవలన్ అటు వైపు చూడకుండానే ఖాళీచేసిన మద్యపాత్రను ఆమె ముందుకు విసిరి, గర్వంగా “నీ సంతానాన్ని ఏ కుల వధువూ పతిగా స్వీకరించదు ప్రేయసీ! మరో కటు సత్యమిది” అన్నాడు.

ఈ సమాధానంతో మాధవి ముఖం పాలిపోయింది. అయితే అప్పటికప్పుడే ఆ విఘాతం నుండి తేరుకొని సన్నగా నవ్వింది! “అయితే నేను కేవలం ఆట బొమ్మను అంతేనా? అందరు మానవుల్లాగే నాకూ గుణగణాలనూ, అవయవాలను సమంగానే ఇచ్చింది ప్రకృతి; కాని హక్కులను మాత్రం లాక్కుంది. అంతేనా? నా ప్రేమకు ప్రతిఫలం ప్రేమకాదు కామం. నేను ప్రేమిస్తే దానికి ప్రతిగా మీరు నన్ను కామిస్తారు. భేష్! ఇదేనా మీ న్యాయం.”

“అది ఏదైనా అవనీ గాని, అంతగొప్ప అసంభవాన్ని ఇప్పటికప్పుడు సంభవం చేయలేను నేను. అయితే ఒకటి మాత్రం వాస్తవం మధూ! నువ్వా నృత్యోత్సవంనాడు రాజమాలికనే కాదు నా హృదయాన్ని కూడా గెలుచుకున్నావు. నీ రూపమూ, గుణమూ నీ వాక్చాతుర్యమూ నాలో వెలిగించిన ఈ ప్రేమ జ్యోతిని ఆర్పివేయడం కుబేరుడైన మహాశ్రేష్ఠి కూతురి తరం కాదు.”

కోవలన్ ఆవేశాన్ని రెప్పవాల్చకుండా చూస్తూ కూర్చున్నది మాధవి. మళ్ళీ అలా కూర్చునే చేరువకు జరిగి వచ్చింది. తన శరీరాన్ని మృదువుగా అతని మీద మోపి, అతన్ని బాలీసు మీదికి జార్చి, సూటిగా చూస్తూ ‘మీరన్నమాట వాస్తవమేనా?” అంది.

కోవలన్ త్రాగి వున్నాడు. అయితే ఆ త్రాగుడు మత్తుకన్నా మాధవి తాలూకు మత్తే అధికంగా పనిచేస్తున్నదిప్పుడు. మాధవిని గట్టిగా హృదయానికి అదుముకొని! “నా ప్రేమ పరీక్ష కోసం నిరీక్షిస్తున్నది మాధవీ చెప్పు. దాన్ని నిరూపించుకోడానికి నేనే సాహసం చేయాలో చెప్పు.”

మాధవి నల్లని కళ్ళలో ఒక్క క్షణం వజ్రపు ములికి మెరిసింది. క్రీగంట అతనివైపు చూచి ఆ తరువాత దూరంగా జరిగి వెళ్ళి అతని వేపే మళ్ళీ తదేకంగా చూస్తూ కూర్చుంది. కొన్ని క్షణాలు గడిచాక శిరస్సు వంచుకొని అరచేతిమీద గడ్డం ఆనించి “సాహసం చేస్తారా?” అంది.

"ఇంకా ఆలస్యమెందుకు కోరుకో మధూ!" కామావేశపరుడు కోవలన్ తన ప్రేమబలాన్ని నిరూపించుకోవడానికి ఆత్రపడుతున్నాడు. పడుకునే ఆమెవైపు బాహువులు చాచి "ఊఁ!" అన్నాడు.

మాధవి అవతలికి జరిగి బిగిసి కూర్చున్నది. ఆమె చూపులు సూదుల్లా అతని కళ్ళల్లో గుచ్చుకుంటున్నాయి. ఆ చూపులు త్రిప్పకుండానే "అడుగుతున్నాను ఆడి తప్పకూడదు సుమా మరి" అంది.

"ఇంకా జాగు చేయకు, త్వరగా కానీ, నాకూ, నా ధనలక్ష్మికీ వశమైంది. ఏదైనా సరే, సిద్ధంగా వున్నాను."

కొద్ది క్షణాలు ఒకరినొకరు అలాగే తదేకంగా చూస్తూ కూర్చున్నాక మాధవి కుదురుగా కూర్చుని "ఇదిగో అడుగుతున్నాను జాగ్రత్త" అంది. "కణ్ణకి తొలి రాత్రి కావాలి నాకు – ఆ కలల రాత్రి మీరు నా దగ్గర వుంటారు. మీ కణ్ణకి నాగరత్నలా మన ఇద్దరికీ పరిచర్యలు చేస్తుంది."

ఆదమరిచి నిశ్చింతగా నిద్రపోతూన్న సమయంలో వాడి బల్లాన్ని గుండెల్లో గ్రుచ్చినట్లు ఎగిరి పడ్డాడు కోవలన్. నిర్ఘాంత పోయి కళ్ళు తెరచుకొని అలాగే చూస్తూ వుండిపోయాడు. బాధతోనూ; తాపంతోనూ అతని మనస్సు విలవిల్లాడి పోయింది. అప్రయత్నంగానే "కణ్ణకి... ఇక్కడా? నీ దగ్గర!!" అన్నాడు.

"ఏం. అయిపోయిందా పరీక్ష. ఇంత చిన్న విసురుకే ఆరిపోయిందా అంత అఖండ ప్రేమజ్యోతి. వెళ్ళండి చెట్టియార్ ఇక నుంచి ఎవరి ముందూ ఇలా ప్రేమ అనీ గీమ అనీ ప్రగల్భాలు పలక్కండి" విసురుగా లేచి నిలుచుంది మాధవి.

ఆమె ఎంత విసురుగా అయితే లేచిందో అంతకు రెట్టింపు బలంతో ఆమెను పొదివి పట్టుకున్నాడు కోవలన్. గాఢంగా కౌగిలించుకొని "నువ్వు నా ప్రాణానివి మాధవీ, నీ కోసం ఏమైనా చేస్తాను" అన్నాడు. అతని కళ్ళు కామాగ్నితో కణకణ మండుతున్నాయి. "నేను మాట ఇస్తున్నాను. శోభనం రోజు రాత్రి రెండు ఉన్నత కుటుంబాల లక్ష్మి కణ్ణకి నీ కాళ్ళకు పారాణి పెడుతుంది."

ఆ మాటవిని పొంగిపోయింది మాధవి. ఈ విజయం తనకొక గర్వకారణ మనిపించిందామెకు. చేలమ్మ, పెరియన్నాయకి వంటి పేరుమోసిన వేశ్యల అనుభవాన్ని మించి, ఇప్పటివరకూ ఏ ప్రేమికుడూ ఇవ్వలేని దాన్ని తను తన ప్రేమికుడినుండి పుచ్చుకుంది. ఈ విజయోల్లాసంలో తను ముగ్ధురాలై, కోవలన్‌ను కూడా ముగ్ధుడ్ని చేసింది మాధవి.

# 9

పట్టినప్పాకమ్ కూడలిలో పాతది రాతిమంటపం ఒకటి వుంది. రకరకాల శిల్పాలతో లతలతో చూడముచ్చటగా వుంటుందది. ఏనాడో ఎవడో శిల్పి వూరికే వుండలేక తన పనితనాన్నంతా దానిమీద చూపించాడు. పెరియన్నాయకి ఇల్లు విడిచాక నిజంగానే ఆ మెట్లమీద పీఠం వేసింది చేలమ్మ. వచ్చీ రావడంతోనే అక్కడి జనాన్నందరినీ ఆకట్టుకుంది. మరి నాలుగు రోజులు గడిచేసరికి ఆ కూడలికే ఒక వింత ఆకర్షణ అయిపోయింది. శృంగార గీతాలు పాడుతూ కూర్చుంటుంది. వున్నట్లుండి ఏమి పురుగు తొలుస్తుందో అందెలు లేకుండానే లేచి నాట్యం చేస్తుంది. అందరినీ ఎగతాళి చేస్తూ నవ్విస్తుంది. దారిని పోయే వాళ్ళతో పెడసరమాడి వాళ్ళను రెచ్చగొడుతుంది.

ఈ కావేరీ పట్టణంలో నర్తకి చేలమ్మ అంటే ఎరుగని వారు ఎవరూ లేరు. నగరంలో బాగా పేరుమోసిన కోటీశ్వరులు, శ్రేష్ఠులు, గొప్ప గొప్ప మర్యాదస్తులు అందరూ ఈ కూడలిలోనే వుంటారు. వీధులకు రెండువేపులా వారి ఉన్నత సౌధాలు బారులు తీరాయి. ప్రతి సౌధానికి పైన అట్టాలికలు, చంద్రశాలలు వున్నాయి. ఒక్కొక్క అట్టాలిక, చంద్రశాల, ఒక్కొక్క కళాఖండం.

ఇప్పుడీ సుందర భవనాలలో వుంటూవున్న, మహాజనులు శ్రేష్ఠులు, కోటీశ్వరులు వయసులో వుండగా చేలమ్మ అంటే పడి చచ్చినవారే. ఒకనాడు మహాగర్విష్ఠి మహాసుందరి చేలమ్మ పాదాల మీద తలలు మోపి వీళ్ళల్లో చాలామంది ఆమె ప్రేమ భిక్షను యాచించిన వాళ్లే. అయితే ఇప్పుడు కుష్టురోగీ, కురూపీ అయిన చేలమ్మ విసిరే వాడి బాణాలు వారి గుండెల్ని దూసుకుపోతున్నాయి. నర్మగర్భితంగా వుండే ఆ హాస్యోక్తులు, ఎత్తి పొడుపులు వినలేక తలలు వంచుకుంటున్నారు వాళ్ళు.

ఇటు యువకుల్ని గూడా ఏదో విధంగా ఆకర్షిస్తూనే వున్నది, చేలమ్మ – నగర వధువు, జగన్మోహిని, కళాధి దేవత మాధవి ఈమె శిష్యురాలు – ఇది ఆ ఆకర్షణకు కారణం.

కోటీశ్వరుల భవనాలలో పనిచేసే దాసదాసీ జనానికి, మిఠాయిలూ అమ్ముకునే జంగిడీల వాళ్ళకు కూడా చేలమ్మతో సరసమాడే అవకాశం దొరికిందిప్పుడు. తీరిక సమయాలలో వచ్చి చుట్టూ ముసురుకుంటున్నారు.

“మందిరాల్లో దేవదాసీలు ముసిలాళ్ళయి పనికి రాకుండా పోతారా వెళ్లగొడ్తారు వాళ్ళను. ఆ ముండలు తాము దేవదాసీలుగా వున్న మందిరం మెట్లమీదే కూర్చొని చివరకు బిచ్చమఁడుక్కుంటారు. మరి నేను దేవదాసిని కానుగా, ధనవంతుల దాసిని అందుకని ధనవంతుల కూడలికే వచ్చేశాను అడుక్కోవడానికి” అని అందరితోనూ చెప్తూ వుంటుంది

చేలమ్మ. ఆ దారిని నడిచే ఐశ్వర్యవంతులు, శ్రేష్ఠులు చేలమ్మ విసుర్లకు సిగ్గుపడి ఉత్తరీయాలతో తలలు చాటు చేసుకొని తప్పుకుపోతున్నారు. పాలపొంగు లాంటి వాళ్ళ మిథ్యా గౌరవాలను, డాంబికాలను ఆ సిగ్గు నీళ్ళ చిలకరింపులా అణచి వేస్తున్నది. చేలమ్మకు చాటుమాటుగా ఆశించినంత భిక్షా ధనం వచ్చి పడుతూన్నది.

మహాజనవాడలో జరుగుతూన్న ఈ తంతు మహాశ్రేష్ఠి మానాయకన్ దాకా పోయింది. ఆయన చేలమ్మను ఎప్పుడూ ప్రణయ భిక్ష కోసం యాచించలేదు కాని ఆమె నాట్యం అంటే చెవికోసుకునేవాడు. ఆమె గొప్ప నర్తకి అని అభిమానం ఇప్పటికీ వుండి పోయింది ఆయన మనస్సులో. అదీగాక ఇప్పుడామె వల్ల గొప్పవాళ్ళ గౌరవానికే ముప్పు వచ్చిపడింది. వెంటనే కల్పించుకొని ఏదో ఒకటి చేయక తప్పదనే నిర్ణయానికి వచ్చాడాయన. నమ్మకమైన పరిచారకుడ్ని పిలిచి "పువ్వులవాడలో సౌధాన్ని కొని ఇస్తానని, గౌరవంగా బ్రతికేందుకు భృతి ఏర్పాటు చేయిస్తానని, ఈ భిక్షా వృత్తి మానుకోవలసిందని" చేలమ్మకు వర్తమానం పంపాడు.

* * *

మహాశ్రేష్ఠిగారి అభిమానాన్ని పొంది చేలమ్మ పువ్వుల వాడలోకి వచ్చిందో లేదో మళ్ళీ ఆమెపట్ల ఆకర్షణ, భయమూ ప్రశంసలూ మ్రోగిపోతున్నాయి. ఈ వార్త విని మాధవి ఆనందానికి అంతులేదు. అప్పుడే నాగరత్నను వెంటబెట్టుకొని అత్తను పరామర్శించడానికి వచ్చింది.

తిరిగి ఇదంతా చూచేసరికి పెరియన్నాయకి భయంతోనూ, అసూయ కారణం గానూ మంచం పట్టే స్థితికి వచ్చింది. తన కూతురు ఆ చేలమ్మ వ్యామోహంలో పడి తనకు కాకుండా పోతుందేమోనని దిగులు పట్టుకుంది ఆమెకు. దానికితోడు మాధవి చీటికి మాటికి చేలమ్మ దగ్గరకు వస్తూ పోతూ వుండడం మరింత కంటగింపుగా తయారయింది. పోనీ అల్లా అని తన కూతురిని కట్టుదిట్టం చేసి తన అదుపాజ్ఞల్లో వుంచుకునే శక్తి కూడా లేకుండా పోయింది పెరియన్నాయకికి. ఇంతమంది వెళ్ళి చేలమ్మను పరామర్శించి వస్తున్నా ఆమె బాల్య సఖి అయిన ఈ పెరియన్నాయకి మాత్రం ఆమె గడప తొక్కలేదు. ఏనాటికైనా ఆ చేలమ్మే తన యింటికి రాక తప్పదని ధీమాతో కూర్చున్నది. అయితే ఇప్పుడా ఆశే కొంచెం కొంచెంగా నిరాశ అవుతూ విసుగు పుట్టిస్తున్నది. అట్లా ఆపైన మరి నాలుగు రోజులు గడిచేసరికి చేలమ్మ అంటే ఆమెకు కోపమూ ఈర్ష్యా పెరిగిపోయాయి. దారితోచక తత్తరలాడడం ప్రారంభించింది. ఇక మాధవి సంగతి చూద్దామా అంటే ఆమె తెల్లవారనివ్వదు; కాలకృత్యాలు ముగించుకొని ముస్తాబు చేసుకొని చేలమ్మ భవంతికి

దారితీస్తుంది. పగలల్లా అక్కడే నృత్యాభ్యాసం, మధ్యాహ్నం భోజనం కూడా అక్కడే. ఒకోసారి రాత్రిళ్ళు కూడా అక్కడే వుండి పోతుందామె.

ఆ రోజు మధ్యాహ్నం పెళ్ళి పిలుపు వచ్చింది. మహాశ్రేష్ఠి కణ్ణకి వివాహ సందర్భంలో నృత్యం కోసమని ఆహ్వానంగా తాంబూలమూ, ఓ ముత్యాలహారమూ పంపారు. ఈ శుభవార్త వెంటనే మాధవికి అందించాలని ఆరాట పడుతోన్నది పెరియన్నాయకి. ఆమెను వెంటనే పిలుచుకురమ్మని ఒక పరిచారకుడ్ని పంపింది. కాని మాధవి తిరిగి రాకపోగా రాత్రికి కూడా అక్కడే వుండిపోతానని కబురు చేసింది. ఆ వర్తమానంతో పెరియన్నాయకి ఒళ్ళుమండి వెంటనే ఇంకొక సేవకుడ్ని పంపాలని అనుకున్నది కాని; అసలే అది శతపెంకి బిగిసి కూర్చున్నదంటే తిరిగి తన త్రాడే తెగుతుందని ఆ పూటకు చేలమ్మకు ఇన్ని శాపనార్థాలు పెట్టి తెల్లవారు ఝామునే మళ్ళీ ఒక సేవకుడ్ని పంపింది. ఆ వచ్చిన వాడ్ని పట్టుకొని ముఖం వాచేట్టు చివాట్లు పెట్టింది మాధవి. పైపెచ్చు కోవలన్ ఆదేశానుసారం తనిక ఇక్కడే వుండిపోతానని కూడా కబురు పంపింది.

ఆ కబురు విని ఎగిరి పడింది పెరియన్నాయకి. అక్కసు పట్టలేక తిరిగి శాపనార్థాలు ప్రారంభించింది. చెరువుకు తూమెత్తినట్లు అనర్గళంగా తిట్టిపోస్తూ వెంటనే బోయీల్ని పిలిపించి మేనా సిద్ధం చేయించి చేలమ్మ ఇంటికి బైలుదేరింది.

చేలమ్మ ఇంటిముందు ద్వారపాలకులు నిలుచున్నారు. ఇల్లు క్రొత్తదే కొంత భాగం ఇంకా నిర్మాణంలోనే వుంది. చిత్రకారులు కుడ్యాలమీద చిత్రాలు వేస్తున్నారు. ఆమె కోసమని ఈ ఇంటిని తాత్కాలికంగా అద్దెకు తీసుకున్నారు మహాశ్రేష్ఠి. ఇద్దరు సేవకుల్ని, ఇద్దరు ద్వారపాలకుల్ని, మరో ఇద్దరు పరిచారకుల్ని కూడా ఆయనే ఏర్పాటు చేశారు.

అంతా కొరకొరా చూచుకుంటూ ముందుకు నడిచింది పెరియన్నాయకి. ఇది చేలమ్మ పూర్వపు వైభవానికి దీటు వచ్చేదేమీ కాకపోయినా తన ఇంటి చీకటికొట్టంలో పడివుండే ముండకు ఈపాటి మర్యాదలు జరగడం కడుపుమంటగానే వుందామెకు.

తన బాల్య సఖి పెరియన్నాయకి ప్రాంగణం దాటి మెట్ల మీదుగా వస్తూ వుండడం చూచి పొంగిపోయింది చేలమ్మ. "దయచేయండి. దయచేయండి యవనమహారాణి గారూ! మాధవీ కాస్త ఇటు చూడు నీ యింటికి వచ్చిందెవరో?" అంది.

ఆ మాటవిని పెరియన్నాయకి కస్సుమని లేచింది. అద్దదలాడుతూ "ఆసి దరిద్రగొట్టు మొహమా! ఇది మాధవి ఇల్లు ఏనాటి నుంచి అయిపోయిందే... ఏదీ ఎక్కడుందది నిలుచున్న పాటుని చెవులు మెలేసి లాక్కుపోదామని వచ్చాను దాన్ని."

చతుశ్శాల నుండి నాగరత్న పరుగు పరుగున వచ్చి పెద్ద యజమానురాలికి ఒంగి ఒంగి దండాలు పెట్టింది. "పెద్దమ్మగారూ! చిన్నమ్మ పూజలో వున్నారు ఇప్పుడే వస్తారు."

"చప్పున సిద్ధం కమ్మను దాన్ని, నేనిక్కడ ఆట్టేసేపు వుండను" అని ముక్కూ మొహమూ వుబ్బించి రుసరుసలాడ్తూ, నాగరత్నకు ఆదేశాలు ఇస్తూ, కాలు మీద కాలు వేసుకొని ముక్కాలి పీట మీద ఠీవిగా కూర్చుంది పెరియన్నాయకి.

ఆ వేషమూ, దర్పమూ చూచి లోలోపల ముసిముసిగా నవ్వుకుంది చేలమ్మ. కొంచెం ఏడ్పించాలని కూడా బుద్ధిపుట్టిందేమో నాగరత్నను పిలిచి "మీ పెద్ద యజమానురాలితో చెప్పు నాగరత్నా! కోవలన్ శ్రేష్ఠి మాధవిని, ఆ దౌర్భాగ్యపు ముండ పెరియన్నాయకి కొంపకు ఇక పంపించ వద్దని, మరీ మరీ హెచ్చరించి పోయాడు" అంది.

ఈ మాట వినేసరికి పెరియన్నాయకి పొంగుకాస్తా చప్పగా జారిపోయింది. అయితే ఆ పిరికి బైట పడకుండా వుండేందుకు గాను మరింత బిగిసి కూర్చొని "ఆయనెవరు ఆ మాట అనటానికి? దాన్ని పెంచి పోషించి విద్యాబుద్ధులు నేర్పించడానికి లక్షలు విరజిమ్మాను. ముందు నా ఋణం తీర్మానం చేసి దాన్ని నీ యింట్లోనే అట్టి పెట్టుకుంటావో లేకపోతే మరే చండాలుడికన్నా ధారాదత్తం చేస్తావో ఆపైన నీ ఇష్టం మరి ఆ తరువాత నేను కాదు నా చెప్పుకూడా ఇటు తిరిగి చూడదేమనుకుంటున్నావో" అంది.

"ఎటే చూడంది నా కెళ్ళా లేకపోతే ఆ ఛండాలుడి కెళ్ళా" చిరునవ్వు నవ్వుతూనే మళ్ళీ ఒక విసురు విసిరింది చేలమ్మ.

పెరియన్నాయకి ఆమెవైపే తీక్షణంగా చూస్తూ కూర్చున్నది. చేలమ్మ తనను ఎగతాళి చేస్తున్నట్లు తెలుసుకుందామె. ఇంతలో మాధవి వచ్చి తల్లికి పాదాభివందనం చేసింది. పెరియన్నాయకి ఆమెను చేయి పట్టుకులాగి తన ప్రక్కని కూర్చుండబెట్టుకొని వీపు నిమురుతూ "శుభవార్త తెచ్చాను మధూ! మహాశ్రేష్ఠి నీకు ఆహ్వానం పంపారు" అంది.

"ఆహ్వానమా ఏం ఆహ్వానమమ్మా?" అంది మాధవి కనుబొమలు విరిచి.

"కణ్ణకి పెళ్ళికి నృత్యం కోసమని, అంతేనా?... " పెరియన్నాయకి బదులు తనే కల్పించుకొని పూర్తిచేసింది చేలమ్మ. "గొప్ప సమారోహాలే జరుగుతున్నాయిలే ఈ పెళ్ళికి. దరయూరులో మన మహారాజు పెళ్ళికంటే గొప్ప ఉత్సవాలే ఇక్కడ జరుగుతాయని విన్నాను. జరక్కేంలే? వియ్యంకులిద్దరూ ఇద్దరేనాయె వీళ్ళ వైభవం ముందు పాండ్య, చోళ, చేర రాజుల వైభవం కూడా తీసి కట్టేనా; మరి మళ్ళీ మళ్ళీ చేయబోయి చేసేది కూడా లేదుకదా. ఇద్దరికీ ఇదే చివరి శుభకార్యం. కోడలి కోసమని అచ్చం పాండ్యరాణి మంజీరాలవంటివే చేసిన కంసాలితోనే ఇవీ చేయించారట. ఇది గొప్ప అవకాశం బిడ్డా మధురనుండీ, కంచినుండీ, సింహళం నుండీ పేరుమోసిన నర్తకీమణులందరూ వస్తున్నారిప్పుడు. దేశదేశాల నుండి శ్రేష్ఠులు, కళావేత్తలు వస్తారు. వారి ముందు ఈ కావేరీ పట్టణం గౌరవాన్ని నిలపాలి నువ్వు" చేలమ్మ తన ధోరణే తనదిగా చెప్పుకుపోతున్నది.

పెరియన్నాయకి కళ్ళింతింత చేసుకొని పరమానందంగా ఆ వర్ణన అంతా వింటూ కూర్చున్నది. కాని ఇవతల మాధవి మనస్సు మసలిపోతున్నది. ఆమాటలు ఆమె అణువణువులోనూ మంటలను రేపుతున్నాయి. తను ఆ మహాశ్రేష్ఠి సంతానాన్ని ఎందుకు కాకపోయానా అనే సంతాపంతో విలవిలలాడిపోతున్నదామె, తనే ఓ కులస్త్రీ అయివుంటే తను మెచ్చిన వరుడ్ని అగ్నిసాక్షిగా పెళ్ళాడి, సుఖించే స్వేచ్ఛ వుండేది తనకు. ఆ అదృష్టం లేకపోగా గాయం మీద కారం చల్లినట్టు ఈ ఆహ్వానం ఒకటా, తన ప్రియుడ్ని తనకు కాకుండా చేసేదాని పెళ్ళికి వెళ్ళి మంగళహారతులు పాడాలి తను, ఆ సభామంటపంలో అది బంగారు సింహాసనం మీద తన ప్రియుడిప్రక్కన కూర్చుని ఎంచక్కా కులుకుతూ వుంటే, కేవలం ధనం కోసమని దాని ముందు గజ్జెకట్టి తైతక్కలాడాలి తను, ఛూత్! తనకు అక్కర్లేదా ధనం తను కోవలన్‌ను ప్రేమిస్తున్నది. తన కళ; తన శరీరం, తన అందం అతని సొత్తు "ఆ నర్తకీమణులతో పోటీపడడానికి ఇది నృత్యోత్సవం కాదత్తా! డబ్బు కోసమని వస్తున్నారు వాళ్లు. నగర గౌరవానికి సంబంధించిన ప్రసక్తి లేదిందులో" అంది.

"ధన లోభం లేంది ఎవరికే? ఏం వుంటే యేం తప్పా?" చేతులు ఆడించుకొంటూ మొదలు పెట్టింది పెరియన్నాయకి. "డబ్బాశ లేందెవరికో కాస్తంత చెప్పు ఈ రాజులు, మహారాజులు ధనం కక్కుర్తితోనేగా ఇతర రాజ్యాల్ని కొల్లగొట్టేది. ఈ మహాశ్రేష్ఠులు స్వస్థలాన్ని విడిచి, సప్త సముద్రాలు దాటి వెళ్ళేది మరి దేనికోసమనుకుంటున్నావ్! ఉద్యోగులు, బ్రాహ్మలు, శ్రమణకులు, డబ్బు అక్కర్లేంది ఎవరికో కాస్త చెప్పు. ఆ డబ్బనేదే లేక ఓ పూట పస్తుండవలసిన సమయం రానీ అప్పుడీ ప్రేమ గొప్పదో డబ్బు గొప్పదో తెలుస్తుంది నీకు. అంతెందుకు చూడరాదు నీ ఉపాధ్యాయిని" అంటూ చేలమ్మ వైపు గొప్పగా చేతులు వూపుతూ అభినయించింది "డబ్బంటే గౌరవం లేకేగా మరువూరుప్పాకం కూడలికి పరుగెత్తింది" అంది.

"అవసరమైతే బిచ్చమడగటానికి నేనూ సిగ్గుపడనమ్మా?" లోపల మండుతూ వున్నా పైకి శాంతంగానే సమాధానం చెప్పింది మాధవి.

ఈమాట విని మరింత ఎగిరి పడింది పెరియన్నాయకి. ఓర్పు పూర్తిగా చచ్చిపోయి, పిచ్చిదానిలా నోరు పారేసుకుంటూ ఇహను చిందులు త్రొక్కడం ప్రారంభించింది. "అయితే చావు ముదనష్టపుదానా? ఏనాడు ఎన్నెన్ని పాపాలు చేసుకున్నానో అవన్నీ ఈ నాటికిల్లా పట్టి కుదుపుతున్నాయి. ఇక ఇక్కడే శాశ్వతంగా నీ గోరీ కట్టుకో. ఈ వేళ్టినుంచే నీకూ నాకూ సరి. నీ కోసమని పెట్టిన సొమ్మంతా మూటగట్టి ఏనాడో ఆ కావేరీలో పారేశాననుకుంటాను. నాగరత్నా! పద నువ్వు నా పరిచారికవి" అని ధన ధన కాళ్ళు తాటిస్తూ ద్వారం వైపు నడిచింది పెరియన్నాయకి.

ఆ ధోరణి అంతా మౌనంగా చూస్తూ నిలుచున్నది చేలమ్మ. పెరియన్నాయకి ఇలా వెళ్ళిపోతూండటం చూచి "ఆగవే పెరియన్నాయకీ ఆ పసి దాంతో పాటు నువ్వూ మతి పోగొట్టుకోకు" అంది.

చేలమ్మ ఆదేశం విని క్షణం ఆగిపోయింది పెరియన్నాయకి.

చేలమ్మ మాధవి వైపు తిరిగి "బిడ్డా ప్రేమకోసం ధనాన్ని తిరస్కరిస్తున్నావు మంచిదే. కాని నువ్వీ త్యాగం చేసేముందు నీ ప్రియుడి సంగతి కూడా కొంచెం ఆలోచించు మరి. నీ మూలంగానే అతగాడూ ధనాన్ని కాదని నీతో వస్తాడేమో తెలుసుకో. కేవలం నీ ప్రేమ ధనంతోనే సంతృప్తి చెంది నీతోపాటు భిక్షాటనానికి అతడూ సిద్ధపడతాడా?"

అత్త మాట విని కొద్దిగా మీమాంసలో పడింది మాధవి. ఆమె నుదుట ప్రశ్నలు రేఖలు తేరాయి. మనస్సు సాధ్యాసాధ్యాల మధ్య ఘర్షణ పడుతూన్నది. కోవలన్ శ్రేష్ఠి తనకోసం ఐశ్వర్య త్యాగం చేయగలడా? తన వంశ ప్రతిష్ఠ కోసం ప్రాణాలనైనా వదులుకొనే కోవలన్, మహాశ్రేష్ఠి ధనాన్నే తన ఐశ్వర్య యజ్ఞానికి ఆహుతి చేసే కోవలన్ తన కోసం భిక్షా పాత్రతో తిరిపానికా! ఇంకా నయం ఇటువంటి ప్రస్తావన కాని అతని ముందెత్తానో, ఈ సారి దూసిన ఖడ్గం రక్తం చూడకుండా ఒరలోకి వెళ్ళదు మరి, ఆమె మనఃస్ఫటికం మీద వెలుగు నీడలు దోబూచులాడుతున్నాయి. ఇటువంటి ఆలోచనలలో వుండి వుండి కోవలన్ మీద కోపం వస్తున్నదామెకు.

చేలమ్మ తననే సమర్థిస్తూ మాట్లాడటం చూచి కొంచెం తమాయించుకొని మెల్లగా తిరిగి వచ్చింది పెరియన్నాయకి. చేలమ్మ వేసిన ప్రశ్నకు ఆలోచనలో పడ్డ కూతురి వాలకం చూస్తే తన ఆశ ఫలించేట్టుగానే కనిపిస్తున్నదామెకు. అందుకని ఆమె ఎదుట కుదురుగా కూర్చొని, హితోపదేశం మొదలు పెట్టింది. "పిచ్చిదానా పసితనం పోలేదు నీకింకా. ఓ రహస్యం చెప్పనా! ఎవ్వడూ మనల్ని ప్రేమించడు. మనమూ ఎవ్వర్నీ ప్రేమించం. మన దాపుకి ఎవడు వచ్చినా అవసరం గడుపుకోవడానికే. మనమూ అంతే, అవసరం కోసం ప్రేమిస్తున్నట్లు నటన చేస్తాం. నీ కింకా లోక జ్ఞానం లేదు తల్లీ!

మాధవి మనస్సు అల్లకల్లోలంగా వున్నది. ఆమెలో రకరకాల ఆలోచనలు ఎగిరెగిరి పడుతున్నాయి. అయితే దేని పట్టులోనూ చిక్కడం లేదామె. చివరకు తల అడ్డంగా వూపి తన నిశ్చితం బైట పెట్టింది. "ఏమైనా గాని నేనక్కడికి వెళ్ళి గజ్జె కట్టనమ్మా! నా తరం కాదది."

ఈ మాట అంటూనే విసురుగా లేచి తన గదివైపు వెళ్ళిపోయింది మాధవి.

పెరియన్నాయకి ముఖంలో తత్తర, విసుగూ ఒకదాని వెంట ఒకటి ప్రకటితమవు తున్నాయి. అంతా గమనిస్తూ ముభావంగా కూర్చున్నది చేలమ్మ. ఒకే విషయాన్ని గురించి

ఇద్దరూ ఎదురు బొదురుగా కూర్చొని ఆలోచిస్తున్నారు. ఆ తరువాత మరి కోపం పట్టలేక దీర్ఘాలు మొదలు పెట్టింది పెరియన్నాయకి. "ఎంత దిక్కుమాలిన బ్రతుకు దేవుడా! అంటూ" శోకాలు ప్రారంభించింది.

పెరియన్నాయకి ప్రలాపాలకో అంతూ పంతూ లేదు. అట్లా వాగి వాగి, గట్టిగా రెండు నిట్టూర్పులు విడిచి మళ్ళీ అందుకోవడానికని క్షణం విరామం ఇచ్చిందామె.

చేలమ్మ యధాపూర్వం, ఆలోచిస్తూ గుంభనంగా వుండిపోయింది. పెరియన్నాయకి ఆమె ముందు కూర్చొని కళ్ళొత్తుకుంటూ చీదుతూ, కూనిరాగం తీస్తూనే వున్నది. నిజానికి వీళ్ళిద్దరూ ఎదురుబొదురుగా, ఇంత సవ్యంగా ఎప్పుడూ కూర్చొని ఎరుగరు. ఇప్పుడిది మాధవి మీది కోపంతో చేలమ్మను మంచి చేసుకోవాలని పెరియన్నాయకి పాచికయి వుంటుంది.

నాలుగు క్షణాల్లోనే మళ్ళీ కుదురుకొని లేచి నిలుచున్నది పెరియన్నాయకి. "నా సంగతంతా నీకు తెలుసుగా చేలూ! అసలే కరాఖండి మనిషిని నేను. ఇదిగాని ఈ బెట్టుసరి విడిచి సరిగా ఒక దారికి రాక పోయిందో క్షణం నా యింట్లో వుండనివ్వను దీన్ని. నిజం చెప్పు చేలీ! దీనికెందుకే సవతివైరం. సంసారి అయివుండి ఇటువంటి గత్తరనంతా నెత్తిమీద పెట్టుకుందనుకుంటే అదొక మాట, కాని సంతలో చేతులుమారే సానిదానికటే ఈ గీర్వాణం! ఇదేమన్నా కాస్త బుద్ధున్న పనేనా చెప్పు చేలీ! ఏ మొగాడైనా మన దగ్గరకి దేనికని వస్తాడసలు. ఇంటిపోరు పడలేకో! బైటి యాష్టంతా దులుపుకుందామనో వస్తాడు. ఆ కాస్సేపు వాడ్ని సంతోషపరచాలి మనం. విటుడికి మనకూ మధ్య వుండే సంబంధం అదొక్కటేగా.అదొక్కటీ లేనప్పుడిక ఎవడైనా మన ముఖం ఎందుకు చూస్తాడో చెప్పు? దీని వాలకం చూస్తున్నావుగా హయ్యయ్యో! ఇదటే తంతు ధూ!! ఎక్కడో కులం చెడబుట్టిందిది. చెప్తున్నానుగా దీని కోసమని కావేరిలో దిగలేను నేను" ఇదే తన చివ్వరి తీర్పుగా వినిపించి మరి తిరిగి చూడలేదు పెరియన్నాయకి. ధన ధన అడుగులు తాటిస్తూ బైటికి దూసుకుపోయింది.

పెరియన్నాయకి వెళ్ళిపోయిన తరువాత కూడా చాలా సేపు చేలమ్మ ఆ ధ్యాసలో ఆలోచిస్తూ కూర్చుండిపోయింది. ఇంతలో నాగరత్న వచ్చి ఆమె పక్క కూర్చుంది. ఆ అడుగుల చప్పుడు విని ఆమె వైపు తిరిగి చూచింది చేలమ్మ. నాగరత్న కళ్ళలో నీళ్ళు నిలిచాయి. ఆమె చేలమ్మ మోకాలి మీద తల ఆన్చి దగ్గుత్తికతో! "ఏమి కానున్నదత్తా! ఏమిటిదంతా?" అంది. "చిన్నమ్మ ఏమో పట్టినపట్టు వదలదు. అటు పెద్దమ్మకు కూడా ఆమె చిక్కులు ఆమెకున్నాయి మరి. ఏం జరుగుతుందో ఏమిటో?" అంది.

పూర్తిగా ఆలోచనల్లో మునిగివుంది చేలమ్మ. చాలాసేపు అలాగే వుండి, వుండి నాగరత్న భుజం మీద చేయివేసి "అంతా సవ్యంగానే జరుగుతుంది నాగరత్నా!" అంది. దిగులు, దిగులుగా వున్న ఆమె ముఖంమీది సన్నటి చిరునవ్వు పరుగెత్తింది. "చివరకది గురుదక్షిణ ఇస్తుందా ఇవ్వదా? ఏమే?"

చేలమ్మలో ఆత్మవిశ్వాసం వెలుగుతూన్నది క్షణం ఆగి మళ్ళీ నాగరత్న చేయి మీద చేయి వేసి "లే! లే! వెళ్ళి మీ పెద్ద యజమానురాలికి కాస్త ధైర్యం చెప్పిరా. లేకపోతే ఈ దిగులుతోనే కుళ్ళి చచ్చిపోతుందది. కాస్త గుండె నిబ్బరం చేసుకొమ్మని చెప్పు. మహాశ్రేష్ఠి గారి భవనంలో మాధవి సలక్షణంగా నృత్యం చేస్తుందని చెప్పు" అంది.

స్త్రీ పురుషుల పరస్పర ప్రేమసంబంధం సహజమైంది. ఏ విధమైన హెచ్చు తగ్గులు లేనిదది. మరి అటువంటి సానికి అభినయంగానూ సంసారికి సమస్యగానూ ఎలా పరిణమించిందో? ఆదినుండీ అర్థం కాని చిక్కు సమస్యగానే వుండిపోయింది చేలమ్మకు. సూర్యరశ్మిని కొందరికి చీకటిగానూ, కొంతమందికి వెలుగుగానూ చూపడం ఎలా సాధ్యమవుతుందో? జీవితాంతం ఎదురు దెబ్బలు తినీ తినీ తల బొప్పి కట్టినా అర్థం కాలేదామెకు. జీవితాంతం ఈ ప్రశ్నల వాడికి బలి అవుతూనే వచ్చిందామె. ఇప్పుడు తనలాగే మాధవి కూడా ఈ చిక్కు ప్రశ్నకు గురి కాకూడదు. ఈ ప్రశ్నార్థకం కొడవలి నుండి మాధవిని రక్షించుకోవడం ద్వారా యవ్వనంలో తను చేసిన తప్పులన్నింటికి ఇప్పుడు ప్రాయశ్చిత్తం చేసుకోవాలనుకుంటున్నదామె.

చేలమ్మ ఆ పగలల్లా మాధవి ముందు మళ్ళీ ఈ ప్రస్తావన ఎత్తలేదు. కాని వంజివాడలో పలుతావులకు తిరిగి మాధవి అపూర్వమైన నృత్య ప్రదర్శనం ఇస్తుందనీ, కనీ వినీ ఎరుగని కొత్త బాణీల్లో తను ఆమెకు తరిఫీదు ఇస్తున్నాననీ, వదంతులు వ్యాప్తిచేసి వచ్చి, ఏమీ ఎరగనట్లే మౌనంగా వుండిపోయింది.

వార్త క్షణాలమీద నగరమంతా అల్లుకుపోయింది. దేశ దేశాల నర్తకీగణం ముందు మాధవి దివ్యంగా నృత్యం చేసి కావేరీ పట్టణం గౌరవాన్ని ఇనుమడింప చేస్తుంది. మహాశ్రేష్ఠిగారికి కూడా ఈ వార్త ఎంతో ఆనందాన్ని కలిగించింది. కణ్ణకి వివాహోత్సవానికి జరిగే ఈ నృత్యాలు మళ్ళీ నృత్యోత్సవాలను మించి పోతాయని అంతా చెప్పుకుంటున్నారు.

నగరమంతా రసికగణం, కళావేత్తలు, సామాన్య జనం ఆ అద్భుత నృత్యాన్ని గురించి ఇంతగా చెప్పుకుంటున్నా మాధవికి తెలియదిది. అయితే ఆ మరునాటి నుండి ఎడతెరిపి లేని నృత్య సాధనం ప్రారంభమయింది. చేలమ్మ అనుభవం క్షణ క్షణమూ మాధవిని తీర్చిదిద్దుతున్నది. రెండు మూడు రోజులు గడిచేసరికల్లా తను అభ్యసించిన క్రొత్త వరుసల్ని అద్భుతంగా ప్రదర్శించి చేలమ్మను ఆశ్చర్యంలో ముంచివేసింది మాధవి. ఆ క్రొత్త

బాణీలు ఆమెకెంతో ఆనందానుభూతిని కలిగించాయి. నృత్యం అవగానే లేచి చేలమ్మకు పాదాభివందనం చేసింది.

చేలమ్మ ఆమెను లేపి గాఢంగా హృదయానికి హత్తుకుంది. ప్రేమతో ఆమె శిరస్సు ముద్దాడి, రెండు చేతులు ఆమె భుజాలమీద వేసి అనురాగం ఉట్టిపడుతూన్న స్వరంతో "ఏమి లాభమే! నావంటి అభాగ్యురాలు ఇంకొకర్తి ఈ లోకంలో వుంటుందా మాధవీ! ఇంత ప్రతిభావంతురాలైన శిష్యురాలి కళను సభికులతో కలిసి కూర్చొని చూచే అదృష్టం లేకపోయాక, ఏం చేస్తాంలే రాత ఇది" అంది.

ఈ మాటలు విన్న మాధవి ముఖం పాలిపోయింది. ఆమె కళ్ళు నీళ్ళతో నిండి పోయాయి. చేలమ్మను గట్టిగా కౌగిలించుకొని "అసలు అభాగ్యురాలిని నేనత్తా! బ్రతికి వున్నంత కాలం ఈ కోతను సహించాలి నేను" అంది.

ఆ రోజే తను కణ్ణకి పెళ్ళికి నృత్యం చేయబోతున్నట్టు తెలిసింది మాధవికి. చేలమ్మ గురుదక్షిణ మిషతో ఆమెను మరి నోరెత్తకుండా చేసింది. మరి దారిలేదు మాధవికి. తన ఆంతరిక ద్వంద్వాన్ని తట్టుకోవడానికి వేరే ఉపాయమేదీ లేదిక. అందుకని తనకు మిగిలిన ఈ ఒక "కళ"లోనే తనను తాను పూర్తిగా లీనం చేసుకోవాలని నిశ్చయించుకున్నది. ఆ ద్వంద్వాన్నే తెచ్చి తలకు చుట్టుకున్నది.

తన అహం అనేది ఒక హిమాలయం లాంటిది మాధవికి. ఆకాశాన్ని తాకుతూ నిత్యం అజేయంగా వుంటుందది. అయితే ఆ అజేయమైన హిమాచలమే ప్రతి క్షణం కరుగుతూన్నది. ఆ అహంతోపాటు ఈ సత్యమూ ఆమె ముందు వుంది ఇప్పుడు.

## 10

సప్తమీనాటి తిథి కావేరీ పట్టణం చరిత్రలోనే చిత్ర విచిత్రమైన అనుభవాలతో, ఆనందోల్లాసాలతో కూడుకొని వస్తున్నదీసారి. దక్షిణ భారతమంతటికీ తిరుగులేని మహాశ్రేష్ఠు లిద్దరు తమ సంతానానికి వివాహ సమారోహాలు ప్రారంభించారు. దేశ దేశాలనుండీ కోటీశ్వరులయిన శ్రేష్ఠులు, మహాశ్రేష్ఠులు అతిథులుగా వచ్చి కావేరీ పట్టణం నిండి పోయారు. వారికందరికీ మహాజనవాడ ఉన్నత సౌధాలలో పెద్ద ఎత్తున విడుదులు ఏర్పాటయ్యాయి.

నగరంలోని చిన్న చిన్న వర్తకులంతా ఇదే అదనుగా ఎంచి వీధి వీధినా అంగళ్ళు తెరిచారు. నగర వీధులన్నిటా ఇప్పుడు జనసంచారం బాగా పెరిగిపోయింది. సాయంకాలాలు వాహ్యాళికి బైలుదేరిన అతిథుల్ని వీధుల్లో జనం వింతగా చూస్తూ వాళ్ళను గురించే రకరకాల ఊహాగానాలు సాగిస్తున్నారు. భిక్షుకుల జయ జయ ధ్వానాలతో;

ఆశీర్వచన మంత్రాలతో వీధులు మారుమ్రోగిపోతున్నాయి. వేశ్యలు అందకత్తెలయిన తమ తమ కన్నెల్ని చక్కగా అలంకరించి అతిథి శ్రేష్ఠుల్ని ఆకర్షించుకోవడానికి రాత్రి కనుచీకటి పడేవరకూ ద్వారాల ముందే వుంచుతున్నారు.

ముత్యపు చిప్పలతో పళ్ళేలు, రకరకాల ఆటవస్తువులు తయారు చేయడంలో కావేరీ పట్టణానికి విశ్వప్రశస్తి వున్నది. వాటిని వర్తకులు విదేశస్థులకు అమ్మి ఇబ్బడి ముబ్బడిగా డబ్బు చేసుకుంటున్నారు. శ్రేష్ఠులు, రత్నాలు, ముత్యాలు, కస్తూరి, పునుగు, జవ్వాజి, మిరియాలు, లవంగాలు, ఏలకులు మొదలైన సుగంధ ద్రవ్యాలు అమ్ముతూ వుంటే యాచకులు, బ్రాహ్మణ పురోహితులు శ్రమణకులేమో ఆశీర్వచనాల్ని అమ్ముకుంటున్నారు. ఎటు చూసినా జనం నవ్వుతూ త్రుళ్ళుతూ చలోక్తులు విసురుకుంటూ, పరిహాసాలాడుతూ పరిహాసాలకు గురవుతూ కనిపిస్తున్నారు. ఇద్దరు వియ్యంకులనూ, వారి వైభవాన్నీ కొందరు పొగుడుతూ వుంటే కొందరేమో నూతన దంపతుల ఈడు జోడును వర్ణిస్తూ కథలల్లుకు పోతున్నారు. శ్రేష్ఠి వర్గం ఆశ్రితులూ, సేవకులు సంబంధీకులు ఎటు విన్నా వారిని స్తోత్ర పాఠాలతో, పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. కణ్ణకి కళ్యాణ మంజీరాల ప్రశంస ఏ నోట విన్నా అంతా యింతా కాదు. మాటలు కాదు అచ్చం పాండ్యరాణి మంజీరాలను పోలి వుంటాయవి. ఒక మహాశ్రేష్ఠి గారికి తప్ప మరెవ్వరికీ అటువంటివి కొనడం సాధ్యం కాదు. మరి వివాహోత్సవానికి మాధవి ఇవ్వబోతూన్న లోకోత్తర నృత్య ప్రదర్శనం అదీ అసామాన్యమే. దానిని గురించి వింతలు విడ్డూరాలతో అతిశయోక్తులు మారు మ్రోగిపోతున్నాయి.

ఉత్సాహోల్లాసాలతో, బంగారు నాణేల గలగలతో వసంతాల రంగులతో కూడి ఇంతకాలంగా ఎదురుచూస్తున్న ఆ సప్తమీతిథి రానే వచ్చింది. బ్రాహ్మీ ముహూర్తంలో శుభలగ్నం సమీపించగనే వధూవరుల జీవితాలను మంత్ర శక్తితో కలిపి ముడివేశారు. పవిత్రమైన అగ్నిని ఇందుకు సాక్షిగా వుంచారు. పురోహితుల మంత్ర పఠనంతో కల్యాణ మంటపం ప్రతిధ్వనించింది.

కల్యాణం జరిగాక కూడా మహాశ్రేష్ఠి భవంతిలో పగలస్తమానమూ వధూవరులతో ఏదో తంతు జరుగుతూనే వుంది. ఏమేమిటో ఆచారాలు, పూజలు, ఏదేదో కర్మకాండ కాని అసలు ఆకర్షణ అంతఃపురానిదే, పల్లకీలమీద పల్లకీలు వస్తున్నాయి. మేనాలు దిగుతున్నాయి. కోట్లు ఖరీదు చేసే వజ్రాభూషణాలు ధరించిన శ్రేష్ఠి కన్యలు, ధనాఢ్యుడయిన మహాశ్రేష్ఠి గారి భవంతికి విచ్చేస్తున్నారు. అంతఃపురంలో ఎక్కడ చూచినా వారి వజ్రాలంకారాల మీద ప్రతిఫలిస్తూన్న కాంతికిరణాలే మిరుమిట్లు గొలుపుతున్నాయి. దాస దాసీ జనానికి మెసిలే అవకాశమే దొరకడం లేదసలు. త్రొక్కిసలాడుతూ శరీరాలు శరీరాలు

రాసుకుంటూ తిరుగుతున్నారు. చిలిపివాళ్ళు సమయం చూచి వచ్చేపోయేవాళ్ళను పరిహాసాలతో రెచ్చగొడుతూ గిలిగింతలు పెడుతూ మనసు తీర్చుకుంటున్నారు.

"ఆ చూపులు కొంచెం వాల్చుకో తల్లీ! పనివేళ పోయి ఆ భాండాగార అధికారి గారి నడిగి ఓ బుట్టెడు తమలపాకులు పట్రా."

"అయ్యయ్యో! నా నాగరం ఎక్కడో జారిపోయిందమ్మా! నా మతి మండా పోయి ఎంతసేపయిందో చూచుకోనేలేదు నేను."

"ఎక్కడ చచ్చావే చంద్రా? అవతల పురోహితుల వారికి హవనం కోసం నెయ్యి కావాలిట. నిన్ను తగలెయ్య! ఆ శూర్పరాక్ అమ్మగారికి జలపాన సామాగ్రి పెట్టనేలేదటగా. నాకు తెలుసు. నా తల తీయిస్తావు నువ్వు."

"ఉండవమ్మా! ఇంత పొద్దెక్కిందా కాస్త తాంబూలం వేసుకునే తీరిక చిక్కలేదు. అరిచి, అరిచి గొంతు పగిలిపోతూన్నది ఎక్కడో."

"హరి నీ తెలివి తెల్లారా ఆ క్షీరాన్నభాండం అలా ద్వారబందానికేసి కొట్టావేమయ్యా? పట్టపగలు చూపానదు. అంతా గుడ్డి వెధవలు ఎక్కడో."

"పోనీవయ్యా! పాపం తిట్టమాక. క్షీరసాగరంలో సచేల స్నానం చేసే అవకాశం మళ్ళీ మళ్ళీ రాదు, పోనీ."

"ఒసే నాగరత్నా! కాస్త జనం కోసమైనా ఆ పమిట సరిచేసుకో తల్లీ!"

పగలల్లా ఇదే తంతు, ఇదే అలజడి నవ్వులు, కేరింతలు, వసంతాలు, వీటితోనే పొద్దు వాలిపోయి, రాత్రి వచ్చేసింది.

నృత్య సమారోహం కోసమని భవనం ముందు పెద్ద పందిరి వేశారు. శుభ్రమైన ధవళవస్త్రాల చాందినీలతో అద్భుతంగా అలంకరించారు దాన్ని. పెద్ద పెద్ద అరటి తూండ్లు తెచ్చి స్తంభాల పక్కన నాటారు. లతలతో, పువ్వులతో, మొగలి రేకులతో రకరకాల అలంకారాలు చేశారు. పరివారం కోసం, అతిథుల కొరకూ ఉత్తమ ఆసనాలు, బాలీసులు ఏర్పాటు చేశారు. ముఖ్య మంటపాన్ని బంగారు, వెండి స్తంభాల మీద అందంగా అమర్చి రత్నాల తోరణాలు తీర్చారు. పందిరి అంతటా వజ్రాలు పొదిగిన గాజు కుప్పెల దీపాలు వేళ్ళాడదీశారు. వధూవరుల కోసమని కల్యాణ మంటపంలో ప్రత్యేకంగా స్వర్ణ సింహాసనాలు వుంచారు.

మాధవి నృత్యోపాధ్యాయని చేలమ్మకు కూడా ఒక ఉత్తమ ఆసనాన్ని ప్రక్కనే ఏర్పాటు చేయించాడు మహాశ్రేష్ఠి గారు. వివాహోత్సవానికి ఆమెకు కూడా గౌరవాహ్వానాలు వెళ్ళాయి.

దివ్యమైన పట్టు అంగవస్త్రాలు నడుములకు చుట్టుకొని, బంగారు జరీ పనితనంతో ధగ ధగ మెరిసిపోయే వల కుళాయిలు తొడిగి, మెడలకు మేలిమి జరీపట్టాలు చుట్టుకొని మిత్రదేశపు శ్రేష్ఠులు ఆసీనులయ్యారు.

యూనానీలు మడలమీదికి బిగించి కట్టే పాదరక్షలు వేసుకున్నారు. సన్నని వలిపెపు అంగీలు తొడిగి, పట్టు దట్టీలతో నడుములు బిగించుకొని, ఆపాదస్కంధం ధగధగ మెరిసిపోయే వల్లెవాట్లు వేసుకున్నారు.

రోమ్ అతిథులు అందమైన పట్టు దట్టీలతో బంగారు వర్ణపు శిరోజాలను కట్టుకొని కూర్చున్నారు.

కొందరు గుబురు మీసాలను వంపులు తీర్చుతూ తేలు కొండీలలా మెలితిప్పుతూ వుంటే, కొందరేమో తమ పొడుగాటి గడ్డాలను సున్నితంగా నిమురుకుంటూ ఏఏ విషయాలో నెమరువేసుకున్నారు. కొందరు పాపం అతి స్థూలకాయులు రథ చక్రాల వంటి వృష్ఠాలను బరువుగా ఆసనాలమీద మోపి, ఆయాసపడుతూ, అప్పుడప్పుడూ బొజ్జల్ని బుజ్జగించు కుంటూ లోకాభిరామాయణం మొదలుపెట్టారు.

శ్యామ వర్ణస్థులైన భారతీయ శ్రేష్ఠులు అంచులమీద బంగారు నక్షత్రాలు కుట్టిన పొడుగాటి అంగీలు తొడిగి, వాటిపైన ఉత్తరీయాలు వేసుకున్నారు. ముత్యాలు, మరకతాలు, వజ్రవైడూర్యాలు పొదిగిన వారి ముద్రికలు, కంకణాలు, కుండలాలు, కిరీటాలు ధగధగ లాడిపోతున్నాయి.

అతిథుల్ని సుందరమైన పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించి యథోచిత ఆసనాలు చూపు తున్నారు. వారు ఆసీనులవగానే సేవకులు పరుగు పరుగున వచ్చి, పట్టు ఉత్తరీయాలతో పాదాలు తుడిచి గంధలేపనం చేస్తున్నారు. రకరకాల ఆసనాలు మద్యాలు నింపిన పాత్రలు అందిస్తున్నారు.

శ్రేష్ఠిగణం ఏదేశానికాదేశం జట్లు జట్లుగానూ, విడిగానూ కూర్చున్నారు. ముఖ్య మంటపం ఇంకా నిర్జనంగానే వున్నది. అక్కడ వధూవరులు వారితోపాటు చోళరాజ వంశీకులు, పాండ్యరాజ్య ప్రతినిధులు, మధుర, కాశీ, శ్రావస్తీ నుండివచ్చిన శ్రేష్ఠిగణం మొదలైన ముఖ్య అతిథులు ఆసీనులౌతారు.

అప్పటివరకు ఆసీనులై వున్న అతిథులకు మిశ్రాదేశపు ఇంద్రజాలికులు కొందరు హస్తలాఘవాన్ని సమ్మోహన చమత్కారాల్ని చూపుతూ వినోదాన్ని కలిగిస్తున్నారు.

దేశీదళం నుండి లేచి విదేశ జట్టులోకి వెళ్తూ రోము దేశపు దళారీ క్లాండియస్, మిరియాల వర్తకుడు పాపనాశన్ వీపు చరిచాడు. "ఈజిప్షియన్లతో కలిసి కూర్చోకు పాపనాశన్! వీళ్ళంతా మాంత్రికులు నిన్ను నీలి సముద్రపు చేపను చేసి మింగివెయ్యగలరు సుమా!" అన్నాడు.

ఆ మాట విని ఈజిప్షియన్ శ్రేష్ఠి అమహోజు అందుకున్నాడు. సున్నటి గడ్డం, పొడుగాటి ముక్కు, పల్చటి పెదవులు, వాడిచూపు, వెడల్పాటి కళ్ళూ, అమహోజువి.

క్లాండియస్ వైపు చూడకుండానే పల్చగా నవ్వుతూ పాపనాశన్‌తో అన్నాడు, “ఆ వైఖరి చూడండి చెట్టియార్! ఈజిప్టును మంత్రించి తమ గుప్పిట్లో వుంచుకున్నారు ఈ రోమన్లు. పైగా మమ్మల్ని దెప్పుతారు. చేసేది వీళ్ళు, పేరేమో ఏమీ తెలియని ఈ ఈజిప్షియన్లది.”

పాపనాశన్, ‘క్లాండియస్’ను కోరి తన దగ్గర కూచోబెట్టుకున్నాడు. అతను వచ్చి ప్రక్కన కూర్చున్నాక “ఇక శలవివ్వండి రోమన్ శ్రేష్ఠీ!” అన్నాడు. అయితే క్లాండియస్ కంటే ముందు అమహోజే ప్రారంభించాడు. “ఏమిటి చెప్తారు వీళ్లు, ఒక నాడు సంస్కృతీ సభ్యతలకు ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మా మిశ్రదేశాన్ని వీళ్ళూ, పారశీకులు, యవనులు కలిసి సర్వనాశనం చేశారు. వీళ్ళ ఆగస్టసు మా సంపదనంతా దోచుకుపోయి వాళ్ళ రోమునగరం నింపుకున్నాడు.”

అమహోజునోట రోమ్ సమ్రాట్టు ‘ఆక్టేవియస్ ఆగస్టసు’ నింద. సహించలేక పోయాడు ‘క్లాండియస్’ అతని ఎఱ్ఱ ఎఱ్ఱటి బుగ్గలు కోపంతో మరింత ఎరుపెక్కి పోయాయి. “పోల్కస్ మీద ఒట్టు వేసుకు చెప్తున్నాను మిత్రమా! నువ్వంటే నాకు ప్రేమే, కాని నీకంటే నాకంటే కూడా నా సమ్రాట్టునే ప్రేమిస్తాను నేను. ఇన్ని శతాబ్దాల చరిత్రలో విశాల రోమ్‌దేశం యుద్ధమనేది ఎరుగకుండా ఎప్పుడు వుందో కాస్త చెప్పు. ఈ ఆగస్టసు పాలనలోనే. ఇంత వ్యాపారమూ, ఇన్ని కళలూ, శాస్త్రాలు, ఇంత పాండిత్యం, ఇంత శిల్పం ఇదంతా ఆగస్టసు పరిపాలన చలువే.”

“అది ఆగస్టసు చలువ కానేకాదోయి నేస్తం. ఆ ఇంత వాణిజ్యమూ, ఇంత శాస్త్రమూ, ఇంత కళా వున్నదే ఆ “యింత” కంతాకూడా మా ఈజిప్షియన్ సంస్కృతే కారణమనుకో. చివరకుమీరు పూజించే ఆ దేవీ దేవతలు కూడా మావారే, మీరు ఏదేశమైతే మొత్తం ప్రపంచానికే నాగరికతను ప్రసాదించిందని చెప్పుకుంటారో, ఆ గ్రీకు దేశం కూడా చాలా చాలా మాకు ఋణపడి వున్నదనే చెప్పాలి.”

ఆ ఇద్దరు శ్రేష్ఠుల జాతీయ దురభిమానం బాగా ముదిరిపోతూ వుండడం చూచి వెంటనే ఆ ప్రసంగాన్ని మండిపోతున్న మిరియాల ధర మీదికి మళ్ళించాడు పాపనాశన్.

ముఖ్య అతిథులందరూ కూడా వేంచేశాక వధూవరులు వచ్చి ఆసనాల్ని అలంకరించారు. పెళ్ళికూతురు కణ్ణకి, రాగరంజితాలైన కోమల చరణాలకు ఆ లోకోత్తరమైన కళ్యాణ మంజీరాలు ధగధగా మెరిసిపోతున్నాయి.

రకరకాల స్వాగత సత్కారాలు ఆరంభమయ్యాయి. చిన్న చిన్న సంగీత నృత్య వినోదాలు ముగిశాక మాధవి వంతు వచ్చింది.

చివరకు ఆ రోజుకిక నృత్య ప్రదర్శనలు ముగిశాయి. “మాధవి కళాధి దేవత! అందాల రాణి, కావేరీ పట్టణానికే ఆమె గర్వకారణం” అంటూ అందరూ ముక్త కంఠంతో ఆమెను అభినందించారు.

# 11

పదహారు సంవత్సరాల తరువాత, ఇంత కాలానికి మహాశ్రేష్ఠి మాశాత్తువన్ గారి ఉన్నత సౌధం కోడలు కణ్ణకి రాకతో మళ్ళీ కళ కళ లాడిపోతున్నది. ఆమె కళ్యాణ మంజీరాలు ఆ భవనంలో కుణుక్కుణుమంటూ అందరి చెవులకూ విందు చేస్తున్నాయి.

మహాశ్రేష్ఠి సంతోషానికి అంతులేదు. కణ్ణకి తమ పూర్వులు ఏనాడో చేసుకున్న తపస్సుకు ప్రతిఫలమని భావిస్తున్నారాయన. కోవలన్ తల్లి పోయాక ఆ భవనం తాలూకు గదులు చాలావరకు బీగాలు వేసి వుంటున్నాయి. ఇల్లాలే లేనప్పుడు ఆ యింటి నెవరు చూస్తారిక? ఇప్పుడు మళ్ళీ గృహస్వామిని వచ్చింది. గృహ ప్రవేశం జరిపాక, పూజా పునస్కారాలు మొదలైన తంతు అంతా జరిపించి, మహాశ్రేష్ఠిగారు కోడలిని అంతఃపురపు ముఖ్య కోశాగారం లోపలికి పిలుచుకు వచ్చాడు. ముందు వధువు చేత లక్ష్మి పూజ చేయించి ఆ తరువాత తాళపు చేతులు ఆమె చేతుల్లో పెట్టారు. ముప్ఫై ఏళ్ళకు పూర్వం మహాశ్రేష్ఠిగారి తల్లిదండ్రులు కణ్ణకి అత్తగారిచేత కూడా ఇక్కడ ఇలాగే పూజలు జరిపించారు. ఆనాటి జ్ఞాపకాలన్నీ మనసులో మెదిలి ఆయన హృదయం కరిగిపోయింది. తను కన్ను మూసే సమయానికింకా కోడలు రాలేదు. అందుకని భర్తగుజారతున కోడలి పేర అప్పగింతలు చేసి కన్ను మూసిందా ఇల్లాలు. ఇప్పుడా పవిత్ర కర్తవ్యాన్ని నిర్వర్తించి మహాశ్రేష్ఠి బరువు దింపుకోవాలనుకుంటున్నాడు.

ఈ అంతఃపుర ప్రకోష్ఠంలోని ధనలక్ష్మి ఏడేడు తరాల నుండీ ఎప్పుడూ గడపదాటి పోలేదు. పైపెచ్చు ఏటేటా వృద్ధి చెందుతూన్నది. వ్యాపారరీత్యా గొప్ప సంకటమేదైనా వచ్చిపడినప్పుడు, ఇంటి పెద్ద ఈ కోశాగారం నుండి ఋణం తీసుకోవచ్చు కాని అందుకు ఇల్లాలి అనుమతి వుండాలి.

అప్పగింతలు అయాక కోడలిని దగ్గరకు పిలుచుకొని, “తరాలుగా మా గృహలక్ష్ములే ఈ ధనలక్ష్మిని కాపాడుతూ వస్తున్నారు. వారి ప్రాతివ్రత్య ప్రభావం వల్లనే ఇది దిన దిన ప్రవర్ధమానం అవుతూ వచ్చింది. ఇప్పుడు నీ చేతుల్లో కూడా అలాగే ఇది వర్ధిల్లాలని ఆశీర్వదిస్తున్నానమ్మా!” అన్నారు.

ఆ పగలంతా దాన ధర్మాలు, క్రతువులు, పూజలు గొప్పగా జరిగాయి. బ్రాహ్మణ పురోహితుల, క్షపణకుల, యాచకుల జాతకాల్లోంచి ఈవేళ శని తొలిగిపోయాడని చెప్పు కున్నారు అంతా. ఆ తరువాత మరి తొలి రాత్రి వచ్చింది.

స్త్రీలు ఆటపాటలతో, సరసాలతో, కవ్వింపులతో శృంగార సెజ్జను అలంకరించారు. పెళ్ళి కుమార్తెకు పన్నీటి స్నానం చేయించి, అగరు ధూపంతో శిరోజాలను ఆర్చి పచ్చ కర్పూరపు కాటుక తీర్చారు. మొగలి రేకులతో జడను ముడిచి రకరకాల అలంకారాలన్నీ

పూర్తి చేశారు. కణ్ణకి పరిచారికా, ఆమె ప్రియసఖి అయిన దేవంతి ఆమెను కక్ష్య వరకూ నడిపించుకొని వచ్చింది. అక్కడకి వచ్చి కళ్యాణ మంజీరాల మధుర మంద్ర శబ్దం తటాలున ఆగిపోయింది. దేవంతి ఆమెతో గుసగుసలాడుతూ, నవ్వుతూ ఏమిటో ఆదేశాలు ఇస్తూన్నది.

కణ్ణకి వణుకుతోన్న చేతులతో దేవంతి బాహువుల్ని పొదివి పట్టుకొని "దేవంతీ! నా కుడి కన్ను అదురుతున్నదేమిటే అంది?" భయం వల్ల ఆమె గొంతు జీరబోయింది.

దేవంతి కణ్ణకిని గట్టిగా హృదయానికి హత్తుకొని తన కౌగిలింతలో ఆమెకు వెచ్చదనాన్నిచ్చింది. "భయపడకు సోదరీ! ఇది అశుభశకునం కాదు, క్రొత్త అయినందువల్ల వచ్చే తడబాటు" అంది.

ప్రకోష్ఠం తలుపు మెల్లగా తెరుచుకుంది. కిలకిలా నవ్వుతూ, ఆమెను మెల్లగా లోపలకు నెట్టి, తను తప్పుకున్నది దేవంతి. అపూర్వమైన ఆ కళ్యాణ మంజీరాలతో కలిసి కణ్ణకి శరీరం మీది రకరకాల అభూషణాలు మంద్ర మధురంగా మ్రోగుతూ మాట పెకలని పెండ్లికూతురుకు బదులుగా కోవలన్‌కు ప్రణామం చేశాయి. ఆ తరువాత తలుపు మూసుకుపోయింది. బైటనుంచి గొళ్ళెం వేసిన చప్పుడు వినిపించింది.

భయమూ, సిగ్గూ సంకోచము వీటితో మొగ్గలా ముడుచుకుపోయి ఓ మూలని వొదిగింది కణ్ణకి. సన్న సన్నగా పడుతూన్న దీపకాంతిలో మూగ భవిష్యత్తులాగా అస్పష్టంగా నిలుచున్నదామె.

హఠాత్తుగా లేచి ఆమెను సమీపించాడు కోవలన్. ఆమె నిట్టూర్పులు స్తంభించాయి. కుడి కన్ను అదిరింది. ఆమె చేతిని బలంగా పట్టుకొని విదిలిస్తూ "నువ్వెవరు?" అన్నాడు కోవలన్.

ఈ మాటలో తను ఎన్నడూ వూహించని కఠినత్వం ధ్వనించింది. ఆ విదిలింపులో తను కోరిన మెత్తదనం ఎక్కడా చిక్కలేదు కణ్ణకికి. అసలు తను వూహించిన కఠోరత కానీ, భయం కానీ ఇది కానేకాదు. ఇప్పటివరకూ తన అనుభవంలోకి రానిదేదో ఆ సమయాన భర్త నుండి వూహించిందామె. తన మనసులో వున్న ఆ సుందర చిత్రానికి పూర్తి వ్యతిరేక సందర్భం ఎదురయిందిప్పుడు. ఆమె కుడి కన్ను అదురుతూనే వుంది. రెండవసారి భర్త తీవ్ర స్వరం ఆమె చెవుల్లో మ్రోగింది.

"ఎవరు నువ్వు?"

అయ్యయ్యో! ఇదేమి ప్రశ్న! ఏమిటి దీనికి సమాధానం? తన సౌభాగ్య దేవత సమక్షంలో; ఎక్కడోఉన్నత సౌధాలలో అతి గారాబంగా, అసూర్యంపశ్యలాగా పెరిగి పెద్దదయిన మాయామర్మం ఎరుగని ఓ పడుచు ఏమి సమాధానం చెప్తుతుంది దీనికి. సమాధానం కోసం ఆమె పెదవులు తడబడుతున్నాయి. మాటలు వెతుక్కుంటున్నదామె.

"ఎవరు నువ్వు? చెప్పవేం?" మెల్లిగానే గద్దించాడు కోవలన్. అయినా సింహ గర్జనలా గది అంతా ప్రతిధ్వనించిందా స్వరం.

ఇక తప్పదు అనుకుంది కణ్ణకి. వణకుతోన్న చేతులతో భర్త పాదాలను స్పృశించి "కేవలం తమ చరణదాసి!" అంది.

"ఔను నేను వినదలచుకున్నది కూడా ఆ మాటే! పురుషుడు భార్యా రూపంలో స్త్రీని దాసిగాచేసి ఇంటికి తెచ్చుకుంటాడు. సామాన్య స్త్రీని వీధుల్లో సామాన్య ధరకు కొంటే, కులస్త్రీని ఇలా దాసిగా చేసుకోవడానికి సంచులు విప్పాలి ఇదే తేడా, తెలుసుకున్నావా? మాట్లాడవేం?"

ఏమీ సమాధానం ఇవ్వలేదు కణ్ణకి.ఆమె కుడి కన్ను అదురుతూనే వున్నది. ఆమె పుట్టుక నుండి వస్తూన్న అభిజాత్యం, ఆత్మాభిమానం జీవితంలోని ఈ ఒక్క విదిలింపుకే కుప్పకూలి పోయాయి. తను ఇప్పుడు మహాశ్రేష్ఠిగారి ముద్దుబిడ్డకాదు, కోవలన్‌కు చరణదాసి. తన జీవితంలో వచ్చిన ఈ గొప్ప మార్పును గమనించి ఆమె తల వంచుకొని ఆ పరిస్థితులకు ఒదిగే సహజ శాంతస్వరంతో...

"ఔను తెలుసుకున్నాను" అంది. ఆమె కుడి కన్ను అదురుతూనే వుంది. పతిచేస్తున్న సింహగర్జనలకు, కాఠిన్యానికి ఆమె హృదయం వూగిపోతూన్నది.

అసహ్యంతోనూ అహంతోనూ ఆమెను కించపరచాలని చూస్తున్నాడు కోవలన్. "పెద్ద అందగత్తెనని గర్విస్తున్నావేమో, నా దృష్టిలో ఈ అందానికి గుడ్డిగవ్వ విలువ లేదు తెలుసా? తెలుసుకున్నావా? లేదా?" మళ్ళీ గద్దింపుగా ఉరిమాడు.

"ఔను, తెలుసుకున్నాను."

"అయితే నువ్వీ క్షణం బైటికి రావాలి. జ్ఞాపకం వుంచుకో ఈ సంగతిగాని ఏ మాత్రం పొక్కిందో జాగ్రత్త"

ఆమె సమాధానం ఇవ్వలేదు. మౌనంగా భర్తను అనుసరించింది. రహస్య మందిరం గుండా చిత్రశాల చతుశాలలు, ప్రకోష్ఠం దాటి ఇవతలికి వచ్చారు.

కణ్ణకి మెత్తని చేతిని బలంగా పొదివి పట్టుకొని తన తొందరే తనదిగా ఈడ్చుకు పోతున్నాడు కోవలన్. శూన్య మనస్సుతో అలా భర్తచేత ఈడ్వబడుతూ వెంట పరుగెత్తుతూన్నది భార్య కణ్ణకి. ఇప్పుడామె కుడికన్ను అదరడం లేదు. బహుశా అపశకునం కూడా చరమావస్థకు చేరి భయరహితం అయిపోయి వుంటుందేమో?

❊ ❊ ❊

రాత్రి ఝాము న్నర గడిచిపోయింది. మాధవి భవంతిలో దీపాలు మౌనంగా వెలుగుతూ కోవలన్ కోసం నిరీక్షిస్తున్నాయి. పెరియన్నాయకి ఒక ప్రక్కని నోరు మూసుకొని మౌనంగా

కూర్చొని వుంది. ఉద్యాన రహస్య ద్వారం మీదే చూపులు నిల్పి రథాల టకటకల కోసం ఆలకిస్తూ కూర్చుంది నాగరత్న. ఝాామున్నర గడిచిపోయింది కాని ఒక్క రథమూ రాలేదు. ఎప్పటినుంచో ఆ మార్గం చీకట్లు పులుముకొని అలాగే నిర్జనంగా వుండిపోయింది.

ఆకు అలికిడైతే ఉలికిపడుతూన్నది మాధవి. ఈవేళ తన జీవితంలోని ఒక గొప్ప కోరిక సిద్ధించబోతూన్నది. ఆ విజయం తాలూకు పులకరింతతోనే ఉదయం ప్రక్క నుంచి లేచిందామె. పగలల్లా ఈ ఆనందంతోనే పొంగిపోయింది. ఈ ఆనందం ఒక వైపూ, ప్రతీకారవాంఛ ఒకవైపూ ఆమె మనస్సును వూపివేస్తూ వుంటే భవనం అంతా అతి వ్యాకులంగా తిరిగింది, తిరుగుతూనే వుండిపోయింది. ఈమెచేత ఈ పంతం మాన్పించాలని పగలల్లా ప్రయత్నాలు చేసి చేసి విసిగి పోయింది పెరియన్నాయకి. కోపం పట్టలేక ఒకటి రెండు సార్లు నాలుగు వేసింది కూడా, పట్టినపట్టు విడువలేదు మాధవి.

రాత్రి రెండో ఝాాములో పడింది గాని కోవలన్ జాడ లేదు. ఎదురుతెన్ను చూచి చూచి విసుగెత్తి పోయింది మాధవి. ఆమె ముఖం ప్రతీకార జ్వాలతో భగభగ మండిపోతూన్నది. అయితేకోవలన్ రాకపోవడమే ఆనందంగా వుంది పెరియన్నాయకికి. కాని ఆ ఆనందాన్ని ఏ మాత్రం వెలికి రానీయకుండా ముభావంగా కూర్చుంది.

రాత్రి మూడో ఝాాము నడుస్తూ వుండడం చూచి మాధవి నిలువెల్లా కణకణ మండిపోతున్నది. పన్నాశ్రేష్ఠి ఉద్యాన ముఖద్వారం దగ్గర ద్వారపాలకుడు రెండు గంటలు కొట్టాడు. అవి రెండూ ఆమె హృదయం మీద మంటల్లాగా అంటుకుపోయాయి. గుండె మంటను చల్లార్చుకోడానికి నాలుగోసారి మద్యం పుచ్చుకొని గిన్నె అవతలకి విసిరేసింది. ఆమె పరిచారికల్లో వీణావాదకురాలొకామె వుంది. యజమానురాలి వ్యాకులపాటు చూచి ఆమె వ్రేళ్ళు మెల్లిగా ప్రక్కనే వున్న వీణాతంత్రులమీదికి వెళ్ళాయి దాంతో అగ్ని గుండంలో నెయ్యి గుమ్మరించిట్లు భగ్గుమన్నది మాధవి. తన శక్తినంతా ఒడ్డి బిగ్గరగా అరిచింది.

"ఆపు, వెధవ రొద. పగలగొట్టి అవతలకు విసిరేయి. ఆ వీణను. ఈ దిక్కుమాలిన అందెల్ని కూడా పట్టుకెళ్ళి ఆ కావేరిలో గిరవాటేసిరా. ఈ కావేరీ పట్టణంలో ఇహను కల్యాణ మంజీరాల మహిమ హద్దుమీరి పోయింది కదూ!" అంటూ విసురుగా లేచి దగ్గరవున్న గజ్జెల్ని పుచ్చుకొని గల్లుమని విసిరేసింది. బాలీసుల్ని, మెత్తల్ని మెత్తగా నలిపి దాసీల ముఖాన కొట్టింది. ఎవ్వరూ కిమ్మనలేదు, అంతా నివ్వెరపోయి అలాగే నిలుచుండిపోయారు. మాధవి కేకలే విని పరుగెత్తి వచ్చిన పెరియన్నాయకి కూడా ద్వారం పట్టుకొని అలాగే నిలబడిపోయింది. తల్లిని చూచి మాధవి కోపావేశం రవ్వంత జంకిందికాని ఆ సంకోచం క్షణికమే తల్లి వేపు చూడకుండానే మళ్ళీ మొదలుపెట్టింది.

“వేశ్యలు కూడా వారికే స్తోత్రపాఠాలు చదువుతూ తిరుగుతూ వుంటే కులస్త్రీల మహిమ పెరగకేం చేస్తుంది? ఎంతయినా కోవలన్ ఒక మొగవాడేగా? అదీగాక ఇప్పుడాయన భవంతిలో కొత్తగా కళ్యాణమంజీరాలు వచ్చాయా?” అంటూనే ఏడ్చింది మాధవి. ఆమె కళ్ళు అశ్రుసిక్తాలయ్యాయి.

దాసీలను వెళ్ళిపొమ్మని సైగచేసి, మాధవి దగ్గరకు వచ్చి వీపు నిమురుతూ కూర్చున్నది పెరియన్నాయకి.

“నువ్వు నన్ననవసరంగా అపార్థం చేసుకుంటున్నావు తల్లీ! లేనిపోని ఆశలన్నీ పెంచుకొని ఇంత చిచ్చు నెత్తిన పెట్టుకున్నావు. ఈ రోజున నేను చెప్పేది గట్టిగా కొంగున ముడి వేసుకో! కులీనుడైనవాడు ఎంత రసికుడైనా, పెళ్ళాంమీద వాడికి ఎంత అసహ్యమున్నా వుండనీ ఇటువంటి సందర్భాల్లో మాత్రం ఆ పెళ్ళానికే  విలువిస్తాడు.”

ఈ మాట విని మాధవి పళ్ళు తాటించింది. కోపంతో ఆమె పిడికిళ్ళు బిగుసుకు పోయాయి. నాగుబాములాగా కస్సుమని లేచి, అదే ఆ విలువనే నాశనం చెయ్యాలి నేను... మొగాడితో కలిసి ఆ ఏడడుగులు నడిస్తేనేనా ఆడదానికి విలువ?”

“పిచ్చిదానా ఏం మాటలవి? లోకంలో కులస్త్రీ అనీ వేశ్య అనీ ఆదినుంచీ వున్నదే ఇది. ఏ యోని నుండయితే పుట్టామో దాని ధర్మాన్ని పాటించాలి. ఇల్లాలిని వీధికెందుకు లాగాలి? ఆ నాలుగు గోడల మధ్యే కాలి చావనీ దాన్ని.”

పిచ్చిగా నవ్వింది మాధవి. “ఔనౌను. కులస్త్రీ ఏకాంతంలో ఎవ్వరూ చూడకుండా కాలుతూవుంటే, మనమేమో సభ ఎదుట నగ్నంగా నిలబడి కాలిపోవాలి. ఔనులే సానికి అంతా బహిరంగమేగా, అంతరంగం లేదు దానికి.”

“బాగా జ్ఞాపకం వుంచుకో, సాని పుట్టింది సంసారుల్ని కాల్చడానికి గాని తను కాలడానికి కాదు. అటువంటి దెవర్తయినా వుంటే అది చేలమ్మలాగా మూర్ఖురాలు తప్ప మరొకత్తె కాదు. ఈ ప్రేమా గీమా అనేది నిజమైన ప్రేమికుల వ్యవహారం అమ్మా! మనదంతా నాటకమే కనుక ఆ మంటల ప్రస్తావన మనకొద్దసలు.”

“ప్రేమ అనేది నాటకమా అమ్మా! అయితే నాకీ నాటకం అక్కర్లేదు నిజవేఁ కావాలి. నేను కోవలన్‌ను నిజంగానే ప్రేమిస్తున్నాను. కులస్త్రీ కంటే గొప్పగా ప్రేమిస్తున్నాను. ప్రేమించడం ప్రేమించబడటం అనేది మనిషి పుట్టుకతోనే పుచ్చుకొని వచ్చే అధికారమమ్మా! బ్రతికుండగా ఆ అధికారాన్ని వదులుకోలేను నేను.”

“అయితే. చేలమ్మకు పట్టినగతే నీకూ తప్పదు. సాని సంసారి అయినా లోకం దాన్ని సానిలాగే చూస్తుంది. ఇది లోకరీతి బిడ్డా.”

తల్లి ఓదార్పు మాటలు మాధవి అహంకారాన్ని ఆర్పడానికి బదులు మరింత రెచ్చగొడుతున్నాయి. కోవలన్ ఘాతుకత్వం మీదా, కణ్ణకి అదృష్టం మీదా వుండి వుండి

మండిపోతుందామెకు. ఇంతలో ఒక పరిచారిక రొప్పుకుంటూ వచ్చి ఉద్యానం రహస్య ద్వారం వద్ద కోవలన్ రథం ఆగి వుందనీ, కణ్ణకి కూడా అతని ప్రక్కనే వుందని, శుభవార్త చెప్పింది.

ఆ క్షణం మాధవి కళ్ళల్లోంచి ఆనందం చుక్కలు చుక్కలుగా రాలి పడింది. ఆమెలో ఉల్లాసం కట్టలు త్రెంచుకొని పరుగులు తీస్తున్నది. త్రిలోకాలను జయించిన విజయినిగా తనకు తాను భావించుకుంటుందామె. ఎదురు వెళ్ళడానికని లేచి నుంచోగానే పెరియన్నాయకి ఆమె చేయి పట్టుకొని,

"నీ కెప్పుడూమేలు కలగాలి బిడ్డా! తప్పు చేయడం సహజమే కాని చేసిన తప్పును సవరించుకోవడంలో గొప్పతనం వుంది. కణ్ణకి మహాశ్రేష్ఠి కోడలు ఆమెనే మాత్రం అవమాన పరచకు సుమా! మనం ఆమెకు దివ్యమైన స్వాగతం ఇద్దాం" అంది.

తల్లి మాటలు వినడంలేదు మాధవి. ఆమె కళ్ళు తెరచుకొని, కోవలన్, కణ్ణకి ఎప్పుడు లోపలికి ప్రవేశిస్తారా అని చూస్తూ నిలుచున్నది. బయట వరండాలో నాగరత్న మాటలు వినిపిస్తున్నాయి. "వూహూఁ! ఒప్పుకోను చెట్టియార్! ఈవేళ ముత్యాల హారం బహుమతి పుచ్చుకుంటాను మీ దగ్గర." కోవలన్ నవ్వుతూ అంటున్నాడు "ఓ, అలాగే, అలాగే, శంఖాలమాల ఇప్పిస్తాను నీకు."

మాధవి సమక్షంలో నవ్వుతూ నిలుచున్నాడు ఆమె ప్రేమికుడు కోవలన్. పెరియన్నాయకి తత్తరలాడుతూ వెళ్ళి నాగరత్నను చివాట్లు పెట్టింది. "అట్లా గుడ్లప్పగించి చూస్తూ నిలుచుంటావేమే పిచ్చి మొహమా! సాక్షాత్తూ పార్వతీ పరమేశ్వరులు వేంచేశారు మన ఇంటికి" అంటూ అద్దదలాడుతూ వెళ్ళి కణ్ణకి కాళ్ళు పట్టుకొని "నువ్వు సాక్షాత్తూ పార్వతీ దేవివి తల్లీ! నీ పాద ధూళి ఎక్కడా? ఈ కొంప ఎక్కడా?" అంది.

మాధవికి స్పృహలేదు, కోవలన్ నేత్రాలలోకి తదేకంగా చూస్తూ నిలబడి పోయింది. ఆమె కన్నుల్లో ఏదో మత్తు, ఏదో కాంతి సముద్రపు అలల్లాగా రెపరెపలాడుతూన్నది. కోవలన్ కూడా అలాగే ఆశ్చర్యచకితుడై ఆమె వైపు చూస్తూ నిలుచున్నాడు. ఆమెలో ఇంత వైభవం, ఇంత ఆకర్షణ ముందెన్నడూ చూడలేదతను. బాహ్య ప్రపంచం తాలూకు అస్తిత్వాన్నే మరచిపోయి కేవలం కళ్ళూ కళ్ళూ చూచుకుంటున్నాయి. మాధవి చూపుల్లో చూపుగాను, ప్రాణంలో ప్రాణంగానూ మారిపోయి అతనిలో ప్రవహిస్తూన్నది. పురుషుడి అహం అనేది కేవలం ఒక రసాకర్షణలోనే లీనమైపోయి స్త్రీనే తన ఐశ్వర్య సర్వస్వంగా భావిస్తూన్నదిప్పుడు.

మరికొంత సేపటికి ఇద్దరికీ స్పృహ వచ్చి ఉలికిపడ్డారు. కోవలన్ కళ్ళలో ఇప్పటికీ విజయుడైన ప్రేమికుడి తాలూకు వెలుగు వెలిగిపోతూనే వున్నది. మాధవిని ఉద్దేశించి నవ్వుతూ "నీ కోసమని ఒక క్రొత్త దాసీని తెచ్చాను చూచావా?" అన్నాడు.

సహనం మూర్తీభవించినట్లు తలవంచుకొని నిశ్చలంగా నిలుచున్నది కణ్ణకి.

పెరియన్నాయకి కోవలన్ మాటలకు హడలిపోతూ, "తప్పు నాయనా! నవ్వులాటకు కూడా అటువంటి మాట రాకూడదు. సాక్షాత్తూ లక్ష్మీదేవి, మహాశ్రేష్ఠిగారి కోడలీమె, ఆమే మేమూ సమానమా?" అంది. వెంటనే రొంటి నుంచి ఇన్ని నాణాలు తీసి దిగదుడిచి మెటికలు విరుచుకొని "చప్పున ఆ బంగారపు ముక్కాలిపీట ఇలా పట్టుకురా నాగరత్నా!" అంది.

పీట తేవడానికి వెంటనే లేచి ద్వారం వైపు పరుగెడుతూన్న నాగరత్నను నిలిపి "ముందు నా గజ్జెలిటు ఇచ్చి వెళ్ళు" అంది మాధవి. నాగరత్న తిరిగి వచ్చింది.

కత్తుల వంటి చూపుల్ని కణ్ణకి మీదికి విసురుతూ ముందుకు నడిచి అంది మాధవి. "మొన్నను తన వివాహోత్సవానికి ఈ కులస్త్రీ తన భవనంలో నా ప్రియుడి ప్రక్కన కూర్చొని, నా నృత్యం చూచి కులికింది. మరి ఈవేళ ఇది నా భవనం. ఇప్పుడు నేనూ నా ప్రియుడూ కూర్చొని ఆనందిస్తుంటే ఈ ఇల్లాలేమో గజ్జెకట్టి ఆడుతుంది."

మాధవి మాటలు తీవ్రమైన ద్వేషంతో మండిపోతున్నాయి. పెరియన్నాయకి దేన్ని గురించయితే భయపడుతూన్నదో, అది మాధవి వ్యవహారంలో పూర్తిగా ప్రత్యక్షమయిందామెకు. ఆమె భయం భయంగా కోవలన్ వైపుచూచి పెద్దగా నవ్వింది. వెంటనే ధోరణి మార్చుతూ, మాధవిని చెయ్యెత్తి కొట్టబోతున్నట్లు అభినయించి! "ఎన్ని వేషాలు నేర్చావే నంగనాచీ! మహాశ్రేష్ఠి గారి కోడలితో ఇదా హాస్యవాఁడే పద్ధతి" అంటూ కణ్ణకి కంటబడకుండా మాధవిని జబ్బ పట్టుకొని లాగి కళ్ళతోనే గద్దించింది.

మాధవి విసురుగా చేయి విదిలించుకొని "ఇది పరిహాసం కాదమ్మా! నిజంగానే అంటున్నాను. కణ్ణకి నా ముందు నృత్యం చేయవలసిందే తప్పదు. ఒకానొక బూజు పట్టిన సంఘ నియమాన్ని అడ్డం పెట్టకుని నా ప్రేమికుడికి సర్వాధికారిణి అవాలని చూచే ఈ కులస్త్రీలో నన్ను మించిన ప్రత్యేకత లేమున్నాయో చూడాలి నేను."

ఈ మాటలు విని పెరియన్నాయకి అద్దదలాడింది. "సందు చిక్కిందని మిట్టిపడబోకే ముదనష్టపుదానా?" అంది.

"చాల్లే వూరుకో అమ్మా! తలనెరిసి, రక్తమంతా ఎప్పుడో చప్పగా చల్లారిపోయిన నీకు నా ఆవేశమే అర్థమవుతుంది. ఎవరినైతే నేను, నృత్యగీతాలతో, రూపురేఖా విలాసాలతో, అద్భుతమైన కళాప్రతిభతో, ఆకర్షించి అలంకరింపచేశానో అటువంటి రసిక శ్రేష్ఠుడ్ని ఆకట్టుకోవడానికి ఈ స్త్రీలో ఎటువంటి ప్రత్యేకతలున్నాయో నేను చూడడం తప్పా? గజ్జెలు ఇవ్వవేం నాగరత్నా?" అంది.

తత్తరలాడుతూన్న నాగరత్న చేతుల్లో అందెలు బలిపీఠం ఎక్కబోతూన్న మేకపిల్లలాగా మేమే లాడాయి.

పెరియన్నాయకి త్రాన్పడి అలాగే, నిలుచుండి పోయింది. ఆమెకు నాలుక పిడచకట్టి మాట పెగలడం లేదు. కోవలన్ కళ్ళు మూసుకొని మౌనంగా పక్కమీద పడుకున్నాడు. నాగరత్న గజ్జెలు పుచ్చుకొని, కణ్ణకి, మాధవికి మధ్యస్థంగా నిలుచున్నది.

మాధవి ఆమె చేతుల్లోంచి గజ్జెలు లాక్కొని కణ్ణకి వైపు చూచి. "అందెలు ధరించండి కొత్త కోడలు గారూ" అంది.

"నాగరత్నా!" కోవలన్ కళ్ళు మూసుకునే నాగరత్నను పిలిచి మద్యం నింపుకు రమ్మని ఆదేశించాడు.

కణ్ణకి మవునంగా వుండిపోవడం చూచి, "ఊఁ గజ్జె కట్టరేమండీ పతివ్రతా శిరోమణీ బెల్లం కొట్టిన రాయిలాగా నిలుచుండిపోయారేం. ఓ సందేహిస్తున్నారా?" అంది మాధవి.

కణ్ణకి నెమ్మదిగా తల ఎత్తి మాధవివైపు చూచింది. ఆ చూపులో వున్న సౌమ్యతను తట్టుకోలేక వెంటనే తల వంచుకుంది మాధవి. "సందేహమేమీ లేదు సోదరీ!" శాంతమూ సంయమమూ నిండిన ఆమె స్వరం విని తల ఎత్తింది మాధవి. కణ్ణకి మాటలు కాలుతూన్న పెనం మీద నీటిచుక్కలాగా వచ్చి పడ్డాయి.

"సందేహమేమీ లేకపోతే మరి ఏమిటో జాగు" రెట్టించింది మాధవి.

కణ్ణకి మళ్ళీ గొంతు ఎత్తింది.

"సోదరీ! నా పాదాలను కల్యాణ మంజీరాలతో అలంకరించారు పతిదేవులు. ఈ అందెలు, ఇవి నీ పాదాలకే శోభ ఇస్తాయి సుమా!"

ఈ కల్యాణ మంజీరాలు అనేమాట, బరువైన మూటను గోతిలోకి విసిరేసినట్టు వచ్చి మాధవి హృదయాన్ని తాకింది. అయితే తన విజయోల్లాసంలో ఆ గుండె కుదుపును తట్టుకొని వ్యంగ్యంగా కోవలన్ వైపు చూచింది, "ఓహో కల్యాణ మంజీరాలా" అంటూ కణ్ణకి వైపు నిర్లక్ష్యంగా ఓ చూపు విసిరి "ఔను. విన్నాను. ఈ అమూల్య మంజీరాల మూలకంగానే ఇక్కడి కులస్త్రీల కందరికీ నువ్వంటే అసూయ అని కూడా విన్నాను. కాని వీటితో, నువ్వు నీ భర్తను ఆకట్టుకోలేవు వయ్యారీ! ఆ శక్తి నా అందెలకు తప్ప నీ కల్యాణ మంజీరాలకు లేదు" అంది.

కణ్ణకి యథాపూర్వం శాంతంతోనూ, సౌమ్యంగానూ సమాధానం ఇచ్చింది "నీ అందెలంటే నాకు ఈర్ష్యలేదు సోదరీ!"

కణ్ణకి స్వరం శాంతంగానే అయినప్పటికీ దృఢంగా వుంది. ఆ దృఢత్వం అజేయం అనిపించింది మాధవికి. తన బలహీనతను తలచుకొని మరింత కుమిలిపోయింది. విసురుగా లేచి కణ్ణకి వైపు వెళ్తూ "ఉన్నత కులస్థురాలినని గర్వం నీకు. మాది నీచకులమని నువ్వు నన్నసహ్యించుకుంటున్నావు. అంతేనా?" అంది. శాస్త్రీయంగా సాధనచేసిన, తంత్రివంటి ఆమె గొంతు బొంగురుపోయింది.

"నువ్వంటే నాకు అసహ్యం లేదు సోదరీ! నీ దోషమేమ్మున్నది? పరిస్థితుల కారణంగానే నువ్విలా వున్నావు"

ఈ సమాధానంతో పూర్తిగా ఓడిపోయింది మాధవి. నిజానికి తన ఉద్దేశం కూడా ఇదే. అయితే ఇటువంటి పరిస్థితులు మరి తనకే ఎందుకు వున్నాయి. వున్నా వాటిని వేలెత్తి చూపే అధికారం ఇతరులకు, అందునా తన ప్రియుడ్ని తన నుంచి లాక్కున్న ఐశ్వర్యవంతురాలైన ఈ కులస్త్రీకి ఎందుకు వుండాలి? కణ్ణకిని గొంతునులిమి చంపేద్దామనిపించిందామెకు, కాని అంత సాహసం లేక పెద్దగా కేకవేసి కోవలన్‌తో చెప్పుకుంది. "వింటున్నారా, మీ ముద్దుల పెళ్ళాం నా పరిస్థితుల్ని ఎలా ఎత్తి పొడుస్తున్నదోను."

సగం స్పృహ సగం మత్తులో వూగిపోతున్నాడు కోవలన్. నాగరత్న చేతుల్లోంచి మద్యపాత్ర లాక్కుంటూ "ఓ, చూస్తున్నాను. నేను సన్యాసం పుచ్చుకోవడానికి ఈ రాత్రి ఇంత బ్రహ్మాండమయిన ముహూర్తం ఎలా కుదిరిందా అని ఆలోచిస్తున్నాను." అన్నాడు.

ఈ మాట విని పెరియన్నాయకి బెదిరి బ్రతిమాలుతున్న ధోరణితో, "వద్దు నాయనా! వద్దు, వద్దు అంతమాట అనొద్దు" అంటూ ముందుకు నడిచింది.

"రా అమ్మా! రా, కూర్చో, ప్రక్కమీద జరిగే పెరియన్నాయకికి చోటు ఇస్తూ "సెజ్జమీద వుండగానే సన్యాసం పుచ్చుకుంటానా అమ్మా! భయపడకు. ఇదిగో నా ముందు రెండు స్త్రీ రూపాలను చూస్తున్నా నిప్పుడు. శోభనం రోజురాత్రి ఇటువంటి అనుభవం, ఎంత భాగ్యశాలికో" అంటూ పెద్దగా నవ్వాడు. ఆ నవ్వుకు అదిరి మద్యం గిన్నె ఒంటిమీదే ఒలికిపోయింది. నాగరత్న వెంటనే ఒంగి అతని వస్త్రం పిండుతూన్నది. కోవలన్ ఆమెవైపు పసిపిల్లవాడిలా మొహం వేళ్ళాడ వేసుకొని అబ్బురంగా చూస్తూ కూర్చున్నాడు.

ఈ అసందర్భానికి మండిపడింది మాధవి. కాని కోవలన్‌ను ఏమీ అనలేక ఆ కోపం తల్లిమీదికి మళ్ళించింది! "అమ్మా! నువ్వు ముందు వెళ్తావా? వెళ్ళవా? ఇక్కడ్నుంచి నీకేం పనమ్మా ఇక్కడ?" కసురుకుంది.

"ఓ నిజమే ఇది యవ్వనపు పొంకం కోరికల తీపు ఇక్కడ మీకేం పనమ్మా! మీరు వయసు మళ్ళిన వాళ్ళు, పులుపు చచ్చిన వాళ్ళు, తైలం ఇంకిపోయి తడబడుతూన్న దీపాలు కదా మీరు. రసభంగం చేయకుండా ముందిక్కడ్నుంచి వెళ్ళిపోమ్మా! నాగరత్నా! రా! నా ప్రక్కని కూచో నువ్వు నింపి ఇస్తూ వుండు నేను తాగుతూ పోతూ వుంటాను. మొగవాడ్ని అర్థం చేసుకోవడంలో స్త్రీ కన్నా సారాయే నయం నాగరత్నా! అందుకనేగా తాగడం. ఊగడం. ఇదే సిద్ధాంతంగా పెట్టుకున్నాను.. రా! నా ఒడిలో కూచుని నన్ను తాగించు" అంటూ నాగరత్నను భుజం పట్టుకొని కౌగిలిలోకి లాక్కున్నాడు కోవలన్.

కోవలన్ ఇలా నాగరత్నను గట్టిగా పట్టుకొని ముద్దు పెట్టుకోవడం చూచి మండిపోయింది మాధవి. ప్రక్కనే ముక్కాలిపీటమీద వున్న దీపపు సమ్మె ఎత్తి నాగరత్న వేపు విసిరేసింది! "చావు, దొంగముండా! చెట్టియార్! మీరు నా ముందే నా దాసీతో...?"

"ఔను నా యిష్టం. నువ్వూ నా దాసీవేగా నీ అంతస్తేమిటో కానకుండా నా దర్జాను తన్నే సాహసం నీకెలా వచ్చింది మాధవీ! నాగరత్నా! నిన్ను నిన్ను నేను ఆజ్ఞాపిస్తున్నాను ఈ మాధవిని నాలుగు తన్ని బైటికి గెంటెయ్" గర్జించాడు కోవలన్.

నిలుచున్న పాటున రాయి అయిపోయింది మాధవి. కోవలన్ క్రోధావేశంతో లేచి నిలుచున్నాడు. త్రాగుడూ కోపము రెంటితో అతని కళ్ళు రక్తం గక్కుతూ భయంకరంగా వున్నాయి. ఒక చేత్తో నాగరత్నను పొదివిపట్టుకున్నాడు; విధిలేక అతని బలమైన బాహువుల్లో బొమ్మలాగా వేళ్ళాడుతూన్నదామె. కణ్ణకి ఇంత జరుగుతూ వున్నా ఏమీ జరుగనట్టే యథాపూర్వకంగా శాంతమూర్తిలా తల వంచుకొని నిలబడి వుంది.

నాగరత్నను విడిచి ముందుకు నడిచాడు కోవలన్. మాధవి ఎదుటకు వచ్చాడు. చూపులు చూపులు ఢీకొన్నాయి, ఛెళ్ళుమని మాధవి చెంప మోగిపోయింది.

"ఇంత అహంకారమా నీకు. నాతో తులదూగాలని చూస్తావా? దాసీ అంగట్లో అమ్ముడుపోయే బొమ్మవి నాతోనా? తొలుగు దూరంగా."

దెబ్బతిని అభిమానంతో ఏడుస్తూ నిలుచున్నది మాధవి వెక్కిళ్లుపడుతూ ఆమె ఏదో చెప్పబోయింది కాని గొంతు పెగలకముందే ఆమెను అవతలకు నెట్టేసి ముందుకు నడిచాడు కోవలన్. ఆ కుదుపుకు క్రిందపడబోతూన్న మాధవిని నాగరత్న వచ్చి ఆదుకుంది.

అలా వెళ్తూనే క్షణం ఆగి కణ్ణకి ముఖంలోకి చూచాడు కోవలన్. బరువుగా వాలిన కనురెప్పలతో శాంతం మూర్తీభవించినట్టు నిలుచున్న ఆమె సౌమ్యరూపం చూచి అతని శిరస్సు వాలిపోయింది. ఎంతో ఆపేక్షగా వచ్చి పక్కని నిలుచున్నాడు. తీవ్రమైన గ్రీష్మంలో ఎక్కడెక్కడో ఎడారుల్లోంచి నడిచి, డస్సివచ్చిన తరువాత చల్లని నీడలో నిల్చున్నట్లనిపించిందతనికి. అతడు కణ్ణకి వైపు సరిగా కన్నెత్తి చూడడం ఇదే మొదటిసారి. "ఇంత అద్భుత సౌందర్యరాశికి, శాంతమూర్తికా ఇంత అపకారం తలపెట్టాను. ఈ తొలిరాత్రి పాపం ఈ సాధ్వి ఎంత ఆవేదనకు గురయిందో కదా!" అనుకున్నాడు. "ఓ పాపిష్ఠి కులటకోసమని ఇన్ని ఇబ్బందుల్లో ఎందుకు చిక్కానురా దేవుడా! ఆ గాజు పెంకు కోసమని ఇటువంటి రత్నాన్ని కాలదన్నుకున్నాను. ఛీ! ఛీ!" తనమీద తనకే అసహ్యం వేసి విలవిల లాడిపోయాడు కోవలన్.

కోవలన్ మనస్సు ఆ ఆత్మగ్లానిని ఢీకొని తిరిగివచ్చి పిడుగులా మాధవిమీద పడింది. నాగరత్న ఒడిలోపడివున్న మాధవి వైపు జుగుప్సతోను, అసహ్యంతోను చూచాడు.

"ఎలా, ఎలా సాధ్యమయింది? ఈ కులటకు, దీని హృదయం శరీరం ఇన్ని నీచ సంస్కారాలతో కుళ్లి కంపు గొడుతున్నాయే? ఎల్లా ప్రేమించాను దీన్ని, పైపెచ్చు ఈ వేశ్య వ్యామోహంలో పడి, ఇంతవరకూ పరువూ,ప్రతిష్ఠ వివేకం గల కులీనుడెవడూ చేయని అపరాధం చేసి కూర్చున్నాను" అని, కణ్ణకిని ఉద్దేశించి :

"ఓ కులలక్ష్మీ! నన్ను క్షమించు ఒక గంటముందు ఇదే దృష్టితో నిన్ను చూసి వుంటే, ఈ తొలిరాత్రి ఈ విధంగా నా చేతిభిక్షతో బ్రతికే ఈ విషనాగిని అహంకారానికి గురయ్యేది కాదు, పద వెళ్దాం."

కోవలన్ ద్వారం దాటి వెళ్తూ వుండడం చూసి ఒక్క ఉదుటున పరుగెత్తి వచ్చింది మాధవి. అతని వెనుక మెల్లగ అడుగులు వేస్తున్న కణ్ణకి ఆ విసురుకు తూలి పడబోయింది. కోవలన్ వెనుక్కు తిరిగి ఒక చేత్తో ఆమెను పట్టుకున్నాడు. రెండోచేత్తో మాధవిని విసిరేస్తూ "తొలుగు, దూరంగా నన్ను ముట్టుకునే యోగ్యత లేదు నీకు."

గొంతు పెగలలేదు మాధవికి. భయం భయంగా తల్లి దగ్గరకు ఒదిగి నిలుచుంది. ముందుకు నాలుగడుగులు వేసి, ఆగి పెరియన్నాయకిని ఉద్దేశిస్తూ గర్జించాడు కోవలన్ "జ్ఞాపకముంచుకో! ఈ సంగతి ఎవరికైనా తెలిసిందో నువ్వూ నీ ముద్దుల కూతురు మొసళ్ళకు ఆహారమవుతారు జాగ్రత్త తార్పుడుముండ ఎక్కడో" అంటూ భార్య చేయిపట్టుకొని గబగబ ముందుకు సాగిపోయాడు.

## 12

శోభనం రోజు రాత్రి జరిగిన సంఘటన నగరమంతా గుప్పుమన్నది. కులీనులైన రసికులకు ఇదొక అపూర్వమైన ఉదాహరణ అయితే కులస్త్రీలకు నగర వధువులకు ఈ వార్త భూకంపంలాంటిది. సహజ సాధుస్వభావం గల మహాశ్రేష్ఠి కూడా ఈసారి సంగతేమిటో చూడాలని పట్టుపట్టి కూర్చున్నాడు. ముత్యాల వర్తకుడు షణ్ముగం చెట్టియార్ చేతికి అందివచ్చిన ఇద్దరు కొడుకులూ ఇదే వ్యసనానికి బలి అయిపోయారు. మూడోవాడు పాపనాశన్‌కు కూడా ఈ జబ్బు అంటుకోవడంతో ఆ తండ్రి కడుపు మసిలిపోయి వెంటనే వెళ్ళి అన్ని సంగతులు మహాశ్రేష్ఠితో చెప్పుకున్నాడు.

తన పుత్రుడ్ని గురించి ఇటువంటిది వూహించడం కూడా అసహ్యం అనిపిస్తూన్నది మహాశ్రేష్ఠిగారికి. ఈ కోవలన్‌ని గురించే ఎన్నో పొగడ్తలు విన్నారాయన. స్వల్ప వయస్సులోనే సాటిలేనివాడుగా పేరు పొందిన ఒక్కగానొక్క కొడుకు పెళ్ళి ముచ్చట కూడా తీర్చుకొని సంతృప్తి చెందాడు. అంత సంతృప్తి ఆనందంలో అనుకోకుండా వచ్చిపడిన ఈ విఘాతాన్ని తట్టుకోలేక పోతున్నారాయన.

శ్రేష్ఠిగారు ఈ విషయమై కోవలన్‌ను గాని, కణ్ణకిని గాని కదపకుండానే ముందు వేల్లినాథన్‌కు కబురు పెట్టారు. వేల్లినాథన్ జరిగిన దాన్ని బలపరచడమే కాక లోగడ దేవదాసి వ్యవహారంలో కోవలన్ వేసిన తప్పటడుగు సంగతి కూడా వివరించాడు.

వ్యవహారం అంతా విని శ్రేష్ఠిగారి ముఖం పాలిపోయింది. కొంచెం సేపు గంభీరంగా కూర్చొని కులమూ, సంస్కారమూ చూచి బిడ్డనిచ్చిన ఆ తండ్రికి ఇహ ఏమని సమాధానం చెప్పను దేవుడా! అంటూ మెల్లగా లేచి అంతఃపురంవైపు వెళ్ళారు. రహస్యమందిరంలో ఒక మూల ఒంటరిగా కూర్చొని కణ్ణకిని పిలిపించారు.

“తల్లీ, నాకు కోవలన్ ఒకటి నువ్వొకటి కాదు. నువ్వీ ఇంటి దీపానివి అమ్మా! నన్ను నీ తండ్రిగా భావించుకొని నిజం చెప్పు తల్లీ, నిన్నటి రాత్రి కోవలన్ నిన్ను ఎక్కడికైనా పిలుచుకు వెళ్ళాడా?”

కణ్ణకి ఎప్పటిలాగే శాంతమూర్తిలా తలవంచుకొని “లేదు అప్పా” అంది కాని అలవాటు లేని అబద్ధమాడ బోయేసరికి గుండెచప్పుడు గొంతులో ధ్వనించింది.

“మరి నిన్న నువ్వు భవంతిలోనే వున్నావా?”

“అవును అప్పా”

“నీ భర్త?”

“అవునండీ”

మహాశ్రేష్ఠి క్షణం కణ్ణకి ముఖం వైఖరి పరిశీలనగా చూచి లేచి నించున్నాడు. చల్లగా ఓ నిట్టూర్పు విడిచి “బిడ్డా! నీ శీలంతో నీ తండ్రి వంశం ధన్యమయింది. ఇప్పుడీ అబద్ధంతో నా గౌరవాన్ని కూడా నిలబెడుతున్నావా అమ్మా! రెండు విధాలా మహాశ్రేష్ఠి అదృష్టవంతులే! నేనే దౌర్భాగ్యుణ్ని” అంటూ తల పట్టుకొని మెల్లగా ప్రకోష్టంలోకి తిరిగి వచ్చారు. ఆత్మగ్లానితో అక్కడ కొంచెం సేపు తచ్చాడి, గబగబా మెట్లెక్కి పై అంతస్తుకు వెళ్ళారు. అక్కడా కుదుట పడక రెండవ అంతస్తు మీదికెక్కారు. అక్కడా మనశ్శాంతి చిక్కలేదు. తమ పూర్వులు సాధించిన వంశ ఔన్నత్యాన్ని అందుకోవడానికి తహతహ పడుతున్న వాడిలా పై ఉప్పరిగ దాకా ఎక్కి వెళ్ళారు. ఇప్పుడీ వంశ గౌరవ మర్యాదల మీద కోవలన్ కొట్టిన దెబ్బతో పూర్తిగా మతిపోయిందాయనకు.

కొంతసేపటికి కోవలన్‌ను వెంటబెట్టుకొని వేల్లినాథన్ వచ్చాడు. కోవలన్ యిప్పుడు తీవ్రంగా పశ్చాత్తాప పడుతూన్న సంగతి శ్రేష్ఠిగారికి వివరించి ఏదోవిధంగా సమాధాన పరచాలని అతడి సంకల్పం. కాని కొడుకు పేరు వినేసరికి ఆయన తల అడ్డంగా వూపుతూ తన అసమ్మతిని తెలియజేశారు.

జరిగిన దానికి కోవలన్ నిజంగానే ఇప్పుడు దుఃఖపడుతున్నాడు. కణ్ణకి శీలమూ, శాంత స్వభావము అణిగివున్న అతని అంతరాత్మను ప్రజ్వలింపచేశాయి. అంతేకాదు ఆమె ఉత్తమ సంస్కారం అతని పౌరుషాన్ని కూడా రేపెట్టి అతడ్ని వివశుడ్ని చేస్తూన్నది. ఆ మహాపరాధానికి తండ్రి తనను కఠినంగా దండించి వుంటే దాని వల్లనైనా కొంత వూరట కలిగేదతనికి. కాని కనీసం తనను చూచే అవకాశాన్నయినా ఇవ్వడానికి నిరాకరించారాయన. దాంతో తనవల్ల జరిగిన అపరాధానికి ప్రతిక్రియగా ఏదో ఒకటి చేసి తన పౌరుషాన్ని, తేజస్సును ఏదోవిధంగా తిరిగి పొందాలనే పట్టుదల అతనిలో పెరిగిపోయింది. కోవలన్ కోమటి, పడిపోయినప్పుడల్లా కాలు నిలదొక్కుకొని లేవడం వచ్చునతనికి, అందుకే అతను నేరుగా కణ్ణకి దగ్గరకు వెళ్ళాడు. ఆమెను దేవీ! అని సంబోధించాడు.

"ఇప్పుడు నేనీ సంఘటనను వేరే దృష్టితో చూస్తున్నాను దేవీ! నిన్నటి రాత్రి నువ్వా అగ్ని పరీక్షతో నన్ను పూర్తిగా గెలుచుకున్నావు. ఆ అగ్నికే నేను కూడా మూర్ఖత్వాన్ని సమూలంగా ఆహుతి యిచ్చి ఈ జ్ఞానాన్ని పొందాను. ఇక మన భవిష్యత్సౌధం పుటమెత్తిన మేలిమిబంగారంతో నిర్మించుకుందాము. అందుకు నీ సహకారం ముఖ్యం. ఈ క్షణం నీవు నన్ను మనస్ఫూర్తిగా క్షమించాలి."

కణ్ణకి సిగ్గుతో శిరస్సు వంచుకున్నది. క్షణం గడిచాక భర్త కళ్ళలోకి చూస్తూ "ఇప్పుడు మీరు పలికిన ప్రతిమాటలోనూ నా హృదయమే ప్రత్యక్షమౌతూన్నది. ఇక క్షమించడమంటారా, ఎవరు ఎవరిని క్షమించాలి! తప్పు మీదీ కాదు, నాదీ కాదు. మీ యిద్దరి మధ్యకు విధి నన్నీడ్చుకు వచ్చింది" అంది.

"ఇప్పుడదంతా మరిచిపో కణ్ణకీ! వర్తకుడు బేరంలో కాస్త పొరపాటు పడ్డాడు. కాని గొప్ప అదృష్టశాలి వాడు. ఓడిన బేరంలోనే చివరకు జీవితమంతా గెలుచుకున్నాడు."

తండ్రిగారి ఆవేశం చల్లారక పోవడంతో కోవలన్ వెంటనే మామగారి దగ్గరకు పరుగెత్తాడు. అక్కడ తన నేరాన్ని వున్నది వున్నట్టు ఒప్పుకొని క్షమాపణ కోరుకున్నాడు. మహాశ్రేష్ఠి గారు అల్లుడ్ని రహస్య మందిరంలో కూర్చుండబెట్టి చాలసేపు వేశ్యాసంగమాన్ని గురించి వారి కపటప్రేమని గురించి హితబోధ చేస్తూ వుండిపోయారు.

"ఇవిగో నా అనుభవాలన్నీ యిస్తున్నాను పుచ్చుకో వీటిని. ఇవి నిన్ను నిత్యం కవచంలా కాపాడుతాయి. ఒక మాట ఎప్పుడూ గుర్తువుంచుకో నాయనా! వర్తకుడు వస్తువులతో బేరం చేస్తాడు కాని వాటి వ్యామోహంలో తగులుకోడు. ఏ ధనం కోసమైతే యెంతటి నికృష్టానికైనా అతగాడుపాల్పడతాడో దాన్ని ప్రాణాపాయం వచ్చినప్పుడు గడ్డిపోచ కంటే హీనంగా విసర్జిస్తాడు. వాడికి పరపతి కావాలి, పరువు మర్యాదలు కావాలి. వాటిని

ప్రాణంకన్నా ఘనంగా వాడు చూచుకుంటాడు. వ్యాపారి యెప్పుడూ చేసిన తప్పును దిద్దుకుంటాడునాయనా. ఇప్పుడు నీ గౌరవ మర్యాదల్ని వృద్ధి పరచుకోవడానికి ప్రయత్నాలు సాగించు.”

ఆ తరువాత మహాశ్రేష్ఠిగారు తన వర్తకపు అజ్మాయిషీ అంతా అల్లుడి పరం చేశారు. అప్పటికప్పుడు తన పరివారాన్నీ, కార్యవాహకుల్నీ సమావేశపరచి ఇక నుండి తన వ్యవహారాలన్నీ కోవలన్ చూచుకుంటాడని ఒక ప్రకటన కూడా చేశాడు. ఈ విధంగా రెండు గొప్ప ధనాగారాలు వేరుగా వుంటూ కూడా ఈ నాటికి ఒకే అధికార సూత్రంతో ముడిపడ్డాయి.

గిడ్డంగులు రెంటికీ కోవలన్ అధిపతి అయ్యాడన్న వార్త వర్తకగణంలో గొప్ప సంచలనాన్ని కలిగించింది. అంతేకాక నగరంలోని యువక దళారీలందరు కోవలన్ పర్యవేక్షణ కింద ఒక దళంగా ఏర్పడ్డారు. దాని ఫలితంగానే యిప్పటి వరకు మధ్య రకం దళారీగా యెంచబడే మిత్రదేశపు దళారీ అమహెూజు ఇప్పుడు పెద్ద పెద్ద సార్థాలు సాగిస్తున్నాడు. తిరుగులేని విదేశీ దళారీగా పేరు మోగిపోయిన పన్నా శ్రేష్ఠి పలుకుబడి హఠాత్తుగా పడిపోయింది.

ఒకవైపు అబిసీనియాలో అరబ్బు – ఆఫ్రికన్ మహా సామ్రాజ్యం విస్తరిస్తూన్నది. దాని ప్రముఖ నౌకా కేంద్రం అడ్యూలస్. ఇక్కడే అరబ్బు వర్తకులూ – భారతీయ శ్రేష్ఠులూ కలుసుకుంటూ వుంటారు. అరబ్బులతో చేసుకున్న ఒప్పందం కారణంగా భారతీయులు అడ్యూలస్ దాటివెళ్ళరు. అదీకాక అడ్యూలస్ పైన సముద్రపు దొంగల భయం విపరీతం. సముద్రయానం అతి ప్రమాద భూయిష్ఠం. దోపిడీ దొంగలు ఓడల్ని కొల్లగొట్టటమే కాక సార్థవాహుల్ని కూడా చంపి సముద్రంలో పారేస్తుంటారు. అయితే రోమన్ వ్యాపారస్తులు సమర్థులు. ఎన్నో సముద్రయానాలు చేసి యెంతో అనుభవాన్ని గడించినవారు. తుఫాన్లు వస్తే యితర ఉత్పాతాలు యెదురైతే సమయానుకూలంగా సార్థాన్ని యెల్లా రక్షించుకోవాలో తెలుసు వాళ్ళకు. చివరకు సముద్రపు దొంగల బారి నుండి కూడా వాళ్ళు నేర్పుగా తప్పించుకొని బైటపడుతుంటారు. అంతేకాక రోము సామ్రాట్టు అగస్టసు కూడా విదేశ వాణిజ్యం పట్ల విశేష శ్రద్ధ చూపుతున్న కారణంగా భారతదేశపు ప్రముఖ నగరాలన్నిటిలోను యితర విదేశీయులందరికంటే రోమన్లే బాగా కుదురుకొని తమ వాణిజ్యాన్ని అభివృద్ధి పరచుకుంటున్నారు.

ఇన్ని రక్షణలు – ప్రత్యేకతల దృష్ట్యా పన్నాశ్రేష్ఠి వ్యాపారం హఠాత్తుగా దెబ్బతింటుందని యెవరూ అనుకోలేదు.

అటు వేశ్యవీధిలో రెండు మూడు రోజులుగా పెరియన్నాయకికీ, మాధవికి వ్యతిరేకంగా జరుగుతూన్న ప్రచారం జనం వింటున్నారు. కొంతమంది నగర వధువులు ముఖ్యంగా లలితా, ఆమె తల్లి రాజమ్మా కుట్రపన్ని కులీనుల కన్యను ఘోరమైన అవమానానికి గురిచేసిన వారిని వెంటనే నగర బహిష్కారం చేయించ వలసిందని మహాజనవాడలో యింటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు.

ఇంత తతంగం జరుగుతూన్నా పెరియన్నాయకి రక్షకుడు పన్నాశ్రేష్ఠి వర్తకం దెబ్బతినడానికి కారణం ఇంకా సామాన్య జనానికి బోధపడడం లేదు. వ్యాపారి తన వేశ్యల్ని వ్యాపార సంబంధాల్ని పెంచుకోవడానికి ఉపయోగించుకుంటాడు. కాని ఒక వేశ్యకోసమని తన వర్తకం దెబ్బతినడం గిట్టదతనికి. పైపెచ్చు రోమన్ నాణాల రూపంలో గలగలలాడే ధనలక్ష్మి కోసం అన్నింటినీ త్యజించే భారతీయ వ్యాపారి కూడా హఠాత్తుగా ఇలా ఎందుకు మారిపోయాడో వారెరుగరు.

ఏది ఏమయినా నగర వర్తకులు హఠాత్తుగా చిక్కుల్లో పడిపోయారు. పన్నా ధాటికి ఆగలేక పోయిన దళారీలందరితో కోవలన్ సంబంధాలు పెట్టుకున్నాడు. మహాశ్రేష్ఠి చేయూతతో వాళ్ళంతా దుమ్ము దులుపుకొని లేచి నిలుచున్నారు. తెల్లవారి లేచే సరికే పరిస్థితులు  తలక్రిందులుగా మారిపోయాయి. ఇప్పుడు చిన్న చిన్న పిల్ల కాలువలన్నిటికీ పొంగువచ్చి పెద్ద పెద్ద నదులతో పోటీ పడుతున్నాయి. పెద్దపెద్ద శ్రేష్ఠులు దళారీలు ఈ మార్పును అర్థం చేసుకోలేక బుర్రలు బద్దలు చేసుకుంటున్నారు. వేశ్యవాడ నుండి మహాజనవాడ వరకు కావేరీ పట్టణం ఈ చర్చలతోనే అట్టుడికి పోతున్నది.

## 13

మాధవికి విపరీతమైన జ్వరం. స్పృహ లేకుండా పడివుంది. రెండు మూడు రోజులయింది సంధికూడా చూసి ఇప్పుడు కొంచెం ఉపశమించింది. పన్నాశ్రేష్ఠి సొంత వైద్యుడొకాయన వచ్చి ఔషధం వాడి వెళ్తున్నాడు. నగర వేశ్యలెవరైనా వైద్యుల్ని కట్టుకొని విషం  పెట్టిస్తారేమోననే భయంతో వారినెవర్నీ పిలువలేదు పెరియన్నాయకి.

పాపం కొద్దిరోజులుగా పెరియన్నాయకి దుఃఖానికి అంతులేదు. వాడవాడ అంతా ఆమెను బహిష్కరించే పుకార్లతో మ్రోగిపోతున్నది. సాటి వేశ్యలు – శ్రేష్ఠులు వారి దాసదాసీ జనం రకరకాల వార్తలు పుట్టించి ప్రచారం చేస్తున్నారు. మాధవిని బహిష్కరించవలసిందిగా రాజధాని నుండి ప్రత్యేకంగా రాజాజ్ఞ వెలువడబోతూన్నదని, కోవలన్ వెళ్ళి పన్నాశ్రేష్ఠితో రహస్య సమాలోచనలు జరుపుతున్నాడని వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా కోవలన్ పన్నాల కుంభకోణ మేమిటో బోధపడక మరీ దిగులుపడి పోతున్నది పెరియన్నాయకి. నగర శ్రేష్ఠుల  ప్రభావానికి లొంగి పన్నాశ్రేష్ఠి తన నెక్కడ విడిచి వెళ్ళిపోతాడోనని బెదిరి పోతూన్నది.

రెండు రోజులయింది పన్నా రాక. మాధవి జబ్బుపడ్డ వార్త విని తన వైద్యుడ్ని పంపి వూరుకున్నాడు. అవకాశం చిక్కగానే వస్తానని చెప్పి పంపాడు. ఆ అవకాశం యిప్పటికింకా రాలేదు. పైపెచ్చు పన్నాశ్రేష్ఠి పుట్టిముంచడానికి కోవలన్ అన్ని పాచికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం తెచ్చింది నాగరత్న. పెరియన్నాయకి బెంబేలుపడి వెంటనే నాగరత్నను పన్నా శ్రేష్ఠి దగ్గరకు పంపింది. కాని నాగరత్న ఎంత ప్రయత్నించినా అతడ్ని కలుసుకోలేక పోయింది.

పెరియన్నాయకి కోవలన్‌నూ జ్వరంతో పడివున్న మాధవినీ కలిసి తిట్టిపోస్తూ, కొంచెం సేపు తనను తాను తిట్టుకుంటూ గంతులు వేస్తున్నది. నాగరత్న వీవన చేత బుచ్చుకొని మాధవి తలవైపు కూర్చొని వుంది. ఇంతలో కోష్ఠం వెలుపల సందడి వినిపించి ఇద్దరూ ఒకేసారి బయటికి చూచారు. పెరియన్నాయకి కన్నుల్లో మెరుపులు పరుగెత్తాయి. ప్రియుడ్ని ద్వారం ముందు చూడడంతోనే ఆమె కన్య అయిపోయి యెదురుగ్గా పరుగెత్తింది. నాగరత్న లేచి నిలబడి యజమానికి సగౌరవంగా అభివాదం చెప్పింది.

బంగారు రంగు గడ్డం, నీలి నేత్రాలు గొప్ప వ్యక్తిత్వంతో మెరిసిపోయే పన్నా శ్రేష్ఠి ముఖంలో విచారఛాయలు కనిపిస్తున్నాయి. అయినా అలవాటు మేరకు నవ్వడానికి ప్రయత్నించాడు. పెరియన్నాయకిని ఆలింగనం చేసుకొని నుదురు ముద్దాడి "ఎలా వుంది దాని పరిస్థితి" అన్నాడు.

"కలవాట్లు ఆగి రెండు ఘడియలైంది. సంధి చూపినప్పట్నించి ఒకటే కలవరింతలు."

అతడు వింటూ మాధవి దగ్గరకు వచ్చాడు. మాధవికి స్పృహలేదు. చందనమూ, కర్పూరమూ రంగరించిన పట్టీ నుదుట అంటించి వుంది. పన్నా ప్రక్కనే కూర్చుని ఆమె తల నిమిరాడు. నిప్పు కణికలా మండుతూన్న ఆమె చేతిని తన చేతుల్లోనికి తీసుకొని తదేకంగా ఆమె వైపేచూస్తూ "నిప్పుతో చెలగాటమాడావు బిడ్డా! నువ్వు కాలింది కాక నగరం నగరం అంతా కాల్చివేశావు" అన్నాడు.

పన్నాతో ఏకాంతంగా మాట్లాడాలని తహ తహలాడుతూన్నది పెరియన్నాయకి. అతడ్ని చేయిపట్టుకొని చిత్రశాలలోకి నడిపించింది. తనే అతని అంగీ తీసి కొక్కానికి తగిలించింది. సాదరంగా కూచోబెట్టి "ఆసనం తెప్పించ మంటారా?" అంటూ గవాక్షంలో నుంచి బైటికి చూచింది.

ఇది త్రాగే సమయం కాదు, పనిపాటలు చూచుకునే వేళ, అయినా పెరియన్నాయకి ప్రేమ పూర్వకమైన అభ్యర్థనను కాదనలేక, నవ్వుతూ "తెప్పించు" అన్నాడు. "బహుశా ఇక నుండి తాగుడు తప్ప వేరే పనేది వుండకపోవచ్చు" అంటూనే మళ్ళీ నవ్వాడు. ఈ మాట విని స్తబ్ధుగా కూర్చుండిపోయింది పెరియన్నాయకి. పన్నా ఆమె వైపు చూచాడు

ఇద్దరి కళ్ళల్లోనూ ఒకే ప్రశ్నార్థకం, ఒకే వివశత్వం మెదిలాయి. ప్రియుడి మనోభావం గ్రహించి తనే లేచి సురాపాత్ర అందుకుంది. "మీకు పనివుంటే వుండనివ్వండి ఈ వేళ నేను మిమ్మల్ని పోనివ్వను స్వామీ" అంది.

మద్యపానం వల్ల పన్నా మనస్సు కొద్ది కొద్దిగా కోలుకుంటున్నది. పెరియన్నాయకి చందనం తెచ్చి అతని చేతులకు, వక్షస్థలానికి లేపనం చేసింది. పుష్పహారాలు మెడలోవేసి, కౌగిలించుకొని, సురాపాత్ర నింపుతూ కూర్చుంది. ప్రియుడి కోరిక మేరకు ఒకటి రెండుసార్లు తనూ పుచ్చుకుంది. ఆ తరువాత అతని పాదాలువత్తుతూ అవకాశం చూచి అసలు ప్రస్తావన తెచ్చింది.

"మాశాత్తువన్ కొడుకు తమ వద్దకు వచ్చాడా?"

"మాశాత్తువన్ కొడుకే కాదు. మహాశ్రేష్ఠి అల్లుడు కూడా ఆహహ! ఆ రెండు తిరుగలి రాళ్ళ మధ్యన చిక్కి బైటపడడం ఎవరిచేత నవును. అహ!హ!" ఓటమీ, దుఃఖమూ నిండిన నవ్వు గదిఅంతా చెదిరిపోయింది.

"ఏమి చెప్పాలని వచ్చాడు మీతో?"

"మిమ్మల్నిద్దర్నీ ఇంట్లోంచి బయటకు వెళ్ళగొట్టమని చెప్పడానికి."

ఈ మాట విని పెరియన్నాయకి ముఖం కోపంతో కొడిదులిపిన వత్తివలె ప్రజ్వలించింది. కాని తత్తరపాటూ, భయమూ ఆ జ్యోతిని ఇట్టే ఆర్పివేశాయి. కొయ్యబారినట్టు పన్నావైపు చూస్తూ వుండిపోయింది.

"నేను తగిన సమాధానమే చెప్పాను. చూడు నాయనా! ఇది గోరుకూ వేలికీ సంబంధించిన సమస్య. పెరిగిన గోరు తీసివెయ్యడమంటే అభ్యంతరం లేదు. కాని మొత్తం గోటినే విచ్ఛేదం చెయ్యమంటావా అది ఒక వేలుకే కాదు మొత్తం శరీరానికే సంబంధించిన సమస్య అయిపోతుంది, కష్టం మరి అన్నాను."

పెరియన్నాయకి మరింత ప్రేమతోనూ, గౌరవభావముతోనూ అతని వైపు చూచింది. "మీకు వ్యతిరేకంగా అతడేదో వ్యూహం పన్నుతున్నాడని విన్నాను నిజమేనా?"

"పన్నుతున్నాడు కాదు. పన్నడం కూడా అయిపోయింది. అంగడిలో నేను ఖరీదు చేయడానికి దినుసులేవీ మిగలకుండా చేశాడు. నా పాలి శ్రేష్ఠులందరినీ చీలదీసుకుపోయి తనదళంలో కలుపుకున్నాడు. ఇదంతా కేవలం కోవలన్ ప్రతిభేకాదు, మహాశ్రేష్ఠి పనితనం. కోవలన్‌కు నేనిచ్చిన సమాధానం విని అతని వళ్ళు మండి వుంటుంది. మనబిడ్డ ఆయన కుమార్తె పట్ల తీరని అపచారం చేసింది. మనం కూడా అంగీకరించక తప్పదిది."

పెరియన్నాయకి కళ్ళలో నీళ్ళు నిండాయి. "నేనెంత నచ్చజెప్పాను. ఈ మూర్ఖురాలు వింటేనా అయ్యో ఏమని చెప్పను"

"పోనీ నాతో ముందే చెప్పి వుంటే నేనైనా నచ్చజెప్పి వుండేవాడ్ని"

పన్నా గొంతులో కోపం ధ్వనించింది. పెరియన్నాయకి తల వంచుకుంది.

రెండు క్షణాలు దీర్ఘంగా ఆలోచించి ఒక నిశ్చయానికొచ్చినట్టు దృఢ స్వరంతో, దర్పంతో చెప్పుకు పోయాడు పన్నా.

"మిమ్మల్నిద్దర్నీ నానుండి వేరుచేసి శిక్షించాలని వాళ్ళ ఆలోచన. కాని దాన్ని అంగీకరించడం అసలు మానవత్వానికే కళంకం నా వల్ల కాదిది."

"ఈ తుచ్ఛ ప్రాణులిద్దరి కోసమని అంత గొప్ప త్యాగం చేస్తారా స్వామీ!"

పన్నా కనుబొమలు చిట్లించి ఆశ్చర్యాన్ని ప్రకటించాడు. "త్యాగమా! ఇంత మాత్రానికే పన్నా దరిద్రుడై పోతాడా పెరియన్నాయకీ, వర్తకంలో ఈ మాత్రం నష్టపడుతూనే వుంటాం. దీనికోసమని మిమ్మల్ని వదలుకుంటానా".

ఈ మాటలతో పెరియన్నాయకి మనస్సు ద్రవించి కులస్త్రీ సంబంధమైన గర్వాన్ని చూపుతూ వయ్యారంగా జరిగి వచ్చి అతని వక్షస్థలం మీద శిరస్సు ఆనించింది. పన్నా ఆమె చెక్కిళ్ళు పుణికి "పరిస్థితులిలా వున్నాయి. ఇద్దరు మహాశ్రేష్ఠులతో వైరం వచ్చిపడింది. ఏం చేయాలిక ఈ మూర్ఖపు పిల్లను" అంటూ చల్లగా నిట్టూర్చాడు.

వక్షస్థలం మీద తలమోపి అతని అంతరంగ రహస్యాల్ని వింటూన్న దానిలా వుండిపోయింది పెరియన్నాయకి. వున్నట్లుండి హఠాత్తుగా కౌగిలి విడిపించుకొని లేచింది తన రెండు బాహువులు అతని మెడలోవేసి, సూటిగా చూస్తూ "నాకు మీకంటే ఈ మాధవి ఎక్కువ ఏమీకాదు స్వామీ! మహాశ్రేష్ఠితో వైరం రావడానికి ఇదే కారణమైతే జబ్బు నయం అవనీండి. ఇంట్లోంచి పంపించి వేస్తాను దీన్ని" అంది. ఇప్పటికి పెరియన్నాయకి మనస్సులో చక్కటి పాచిక తయారయింది. వెంటనే దాన్ని ఆచరణలో కూడా పెట్టివేసింది.

"నేను కేవలం వ్యాపారినే కాదు, పెరియన్నాయకీ మానవుడ్ని కూడా ఆమాటకొస్తే మిగిలినవన్నీ ఆ తరువాతనే. అన్ని అనుబంధాలూ ఈ ఒక్క సంబంధం ముందు తీసికట్టే. లే! లే! నాకు స్నానానికి ఏర్పాటు చేయించు, నువ్వూ అలంకరించుకొని సిద్ధమవు. ఇవాళ అలా నగరం తిరిగి వద్దాము. మాధవిని గురించి ఆలోచించకు. నాగరత్న వుంటుంది. నేను బ్రేకస్‌తో చెప్పి వచ్చాను. మందుల పెట్టె పుచ్చుకొని ఈపాటికి వస్తూనే వుంటాడు."

తమకు వ్యతిరేక ప్రచారంలో అట్టుడికి పోతున్న నగరంలో పన్నాతో బహిరంగంగా బైలు దేరటం భయోత్పాతంగానే వున్నా లోలోపల సలుపుతూన్న కోరికల్ని అణుచుకోలేక పోతున్నది పెరియన్నాయకి – పన్నాశ్రేష్ఠితో రథం మీద పక్కనే కూర్చొని తిరగటం ఒక గొప్ప. అదీకాక అతని మాటల్లో అంతరిక వుద్దేశం కూడా ఏదో వున్నట్లనిపించి మరింత ఆకర్షిస్తూన్నదామెను.

దుస్తులు మార్చుకోవడానికి లోపలికి వెళ్తూండగా ఆ రహస్యం కూడా తనే వెల్లడించాడు పన్నా. "ఈ సమస్యను నేను మాధవి నుండి విడదీసి మహాశ్రేష్ఠి మెడకే చుట్టాలను కుంటున్నాను. ఆ విధంగా ప్రజల మనసుల్లో వున్న భ్రమలను తొలగించాలి. ముందు క్లాండియస్ దగ్గరకు వెళదాం. షణ్ముగం చెట్టియార్‌ని కూడా మనం కలుసుకోవాలి. వివాహానికి పక్షం రోజులు ముందునుండే కోవలన్ మా దగ్గరికి రావడం మానేశాడని నువ్వు చెప్పాలి. ఆ తరువాత అసలు సంగతి నేను వివరిస్తాను. మిశ్రా, ఫినీషియన్ వర్తకులతో లాలూచీపడి మహాశ్రేష్ఠి వర్తకరంగాన్ని తల్లకిందులు చేయాలని ఈ వ్యూహం పన్నినట్టు ఒప్పిస్తాను. మార్గంలో ఎక్కడైనా చేలమ్మ గాని కనిపించిందో, ఆ వినోదం కూడా చూద్దువుగాని "

# 14

మాధవికి పెరియన్నాయకికీ వ్యతిరేకంగా నగరంలో పుట్టిన వదంతులన్నీ చేలమ్మ వింటూన్నది. విని, విని చివరకు తను కూడా రంగంలోకి రాక తప్పదనే నిర్ణయానికి వచ్చింది. పెరియన్నాయకిని ఎంతగా ద్వేషిస్తూన్నదో మాధవిని అంత ప్రేమిస్తున్నది తను.

మాధవి తన శిష్యురాలే కాదు తన జీవిత సర్వస్వం. అన్ని విధాలా పతనమై పోయిన తన పడుపు బ్రతుకుకు విజయ పతాకం లాంటిది మాధవి. ఆమె తప్పు చేసింది నిజమే, కాని ఆ తప్పు వెనకవున్న మంటను చూడదేం ఈ సమాజం. మొగవాడు మహారాజు ఏదైనా చెల్లుబడే వాడికి, చిత్తూ –బొత్తూ తనదేనంటాడు. మొదలంటా మింగివేసి ఇదే న్యాయమనీ మీసం మెలివేస్తాడు, మరకట న్యాయం వీడిది. ఔరా కోతీ!

చేలమ్మ గుండెమంట ఒక వికట హాసంగా వెలికి వచ్చింది. ఈ నవ్వే ఆ మొగ మహారాజుల పట్ల ఆశనిపాతం. అది పిడుగు పడేముందు మెరిసే మెరుపు – ఉన్నట్టుండి ఒక రోజున ఎవరికీ చెప్పకుండా మాయమై మూడో రోజున అతి విచిత్రమైన రూపంలో నగర కూడలిలో జనం మధ్య ప్రత్యక్షమయింది చేలమ్మ.

పన్నా, పెరియన్నాయకీ రథం మీద బైలుదేరారు. దూరంగా ఒకచోట కూడలిలో జనం గుంపులు గూడి కేరింత లాడుతున్నారు. మధ్య మధ్య నవ్వులు చప్పట్లు వినిపిస్తున్నాయి. పన్నా సన్నగా నవ్వుతూ, పెరియన్నాయకి వైపు తిరిగి "ఇది తప్పక చేలమ్మ గుంపే అయి వుంటుంది" అన్నాడు.

చెక్కవి రెండు కోతి బొమ్మల్ని ముత్యాలు కట్టిన పట్టు గుడ్డలతో, నగలతో బాగా ముస్తాబు చేసి అక్కడ వుంచింది చేలమ్మ. ఒకటి వేశ్య బొమ్మ, రెండవది గృహిణిది. రెండు బొమ్మలకూ తోకలున్నాయి. తను స్వయంగా మహాశ్రేష్ఠి వేషం వేసుకున్నది. పట్టుగుడ్డ

ఎంటిచుట్టి తోకగా వేళ్ళాడదీసుకున్నది. గడ్డమూ, మీసాలు తగిలించుకొని అచ్చం మహాశ్రేష్ఠిలా అభినయిస్తూన్నది.

"ఈ గడ్డం ఎవరిదే చేలూ?" గుంపులోంచి ఒకడు ప్రశ్నించాడు.

"ఇది శంకరన్ మొదలిది"

"మరిఈ మీసాలో?"

"అమ్మో! ఇవి చాలా ఖరీదైన మీసాలు ఈ ప్రపంచంలో ఎంతమందయితే మహాశ్రేష్ఠులు,మహా ధనవంతులున్నారో వాళ్ల మీసాల్లోంచి ఒక్కొక్క వెంట్రుకే పీకి తెచ్చాను. పొరపాటున ఏదైనా మీసం మిగిలిపోతే వచ్చి పీకించుకోండి" నవ్వుల మధ్య, కేరింతల్ని చీల్చుకుంటూ లేచి నిలుచుంది చేలమ్మ. ఢమ ఢమ ఢమరుకం వాయిస్తూ గొంతు విప్పింది.

"నేనే వానర శ్రేష్ఠిని.
వాణిజ్యానికి పరమేష్ఠిని
ఇది నా సతి, అనుకూలవతి
ప్రేమ రూపిణీ, ధర్మచారిణీ, గృహిణి.
నేనే వానర శ్రేష్ఠిని."

ఆ తరువాత వానర శ్రేష్ఠి కులస్త్రీ బొమ్మను ఎత్తి ముద్దుపెట్టుకొని పొగడ్తలు మొదలుపెట్టాడు. "ఓ! నా ముద్దుల పెళ్ళామా? నా జీవితేశ్వరీ! నా సర్వస్వమా! నువ్వు నాకు పిల్లల్ని కనిపెడ్తావు – నాకాళ్ళొత్తుతావు. రక్తసంబంధాలు ఏర్పర్చుతావు. నా సంపదనంతా మోస్తావు. నా దాస దాసీ జనాన్ని అజ్మాయిషీ చేసి సంసారం నడుపుతావు. నువ్వు నా సంఘ మర్యాదవు ప్రాణేశ్వరీ నా సర్వస్వం నువ్వే – ఆః!"

"బ్రతిమిలాడినా – అలుక మానవేమే
ఓ! నా సతి నా ముద్దుల పెళ్ళామా –
ఈ లోకం నా వ్యాపారానికి లోకువ
వింటావా సరి లేకుంటే చూడిక"

"వినవూ? అయితే చావు," వానర శ్రేష్ఠి కులవధువును పట్టుకొని నాలుగు ఉతికాడు – బూతులు తిడ్తూ నగలు, దుస్తులూ వూడలాక్కున్నాడు. తోక కూడా పీకి తన తోకకు తగిలించుకొని వేశ్య దగ్గరికి వెళ్ళాడు. అక్కడ కూడా ముందు పొగిడి లాలించి చివరకు పేచీ పడ్డాడు. దాన్నీ కొట్టి, దుస్తులూ, నగలు లాక్కొని ఆ తోక కూడా తన తోకకు వేళ్ళాడదీసుకొని మీసం మెలివేశాడు. "ప్రతిష్ఠ పెళ్ళానిది కాదు, వేశ్యదికాదు నాది. ఈ లోకంలో మరి నా తోకకు ఎదురులేదు" అంటూ తోకమీద గీతాలాపన మొదలు పెట్టాడు. జనం విరగబడి నవ్వుతున్నారు. కులస్త్రీలు ఉప్పరి గల మీద నుండి గవాక్షాల నుండి ఈ తంతు అంతా చూస్తున్నారు.

నగర శ్రేష్ఠులందరికీ నిలువునా తలలు తీసివేసినట్లుగా వుందిది. వారి నీడలో వుంటూనే వారి గౌరవ మర్యాదల మీద, బురద చిమ్ముతూన్నది చేలమ్మ. వాళ్ళ దంభమూ దర్జా నడివీథుల్లో అలగా జనం ముందు నవ్వుల పాలౌతూన్నవి. కాని ఏమీ చేయడానికి ఆమె మీద ఎవరి పెత్తనమూ లేదు. ఒకానొక సమాజ వ్యవస్థనే ఘోరమైన విమర్శకు గురిచేస్తూన్నదామె. పదునైన హాస్యాన్ని ఖడ్గంలా మిథ్యా గౌరవాల మీద ప్రయోగిస్తున్నది.

చేలమ్మ ప్రదర్శనల ప్రభావం క్రమేపీ అక్కడి సమాజం మీద పడుతూన్నది. ఆ వ్యంగ్య విఘాతాలకు కునుకుతూన్న నైతిక పక్షం కొద్దికొద్దిగా మేలుకుంటున్నట్లనిపిస్తూన్నది. మత గురువుల నైతిక ప్రబోధాలు ఎక్కువవుతున్నాయి. నగర ధనికుల బిడ్డలు అప్పటికే చాలా వరకు చెడిపోయారు. సంఘ నియమాలు విచ్ఛిన్నమవుతున్నాయి. యువకులు పెద్దల ఆదేశాలు కాలదన్ని విశృంఖలంగా వ్యవహరిస్తున్నారు. అటువంటిది మహాశ్రేష్ఠుల కృషితో నగరంలో క్రమేపీ ఒక నైతిక ఆందోళన తిరిగి మొలకెత్తుతూన్నది.

ఇప్పుడు వేశ్యవాడలో అనుభవం గల వేశ్యలందరు విటుల ప్రేమాతిశయం హద్దు మీరకుండ ఒక కంట కనిపెట్టి చూచుకుంటున్నారు. వృద్ధ వేశ్యలు బాగా రాత్రి అవకముందే తమ తమ వుంపుడుకత్తెల్ని విడిచి ఇళ్ళకు వెళ్లిపోవలసిందని విటుల్ని బలవంత పెడుతున్నారు. కొంత కాలం వరకు ఏవో దేవీ ఉత్సవాలకు, సామాజికోత్సవాలకు తప్ప పెళ్ళిళ్ళకు పేరంటాలకు సమష్టి సురాపానాన్ని, నృత్య గాన గోష్ఠులను కూడా మానివేశారు.

ఇంత మార్పు వచ్చినా కావేరీ పట్టణం నుండి వేశ్య లెవరూ పొట్ట గడవక వలసోయిన వారు లేరు. ఈ గొడవల వల్ల వేశ్య విపణిలో వ్యాపారం కొంత మందగించినా వాళ్ళ భవిష్యత్తు కేమీ మొప్పం రాలేదు. ఈ కావేరీ పట్టణపు శ్రేష్ఠుల శ్రీమంతుల సంస్కృతీ సభ్యతలు శతాబ్దాలుగా ఈ నగర వధువులతో ముడిపడి వున్నాయి. ఇప్పుడు వారిని కాదని ముందుకు వచ్చే సమర్థత లేదు వారికి. అయితే ఈ పరిణామాల కారణంగానే అంగడిలో ఇప్పుడు కన్యల క్రయ విక్రయాలు బాగా మందగించాయి.

పన్నాకూ ఆయన సహచరులకు ఈ గొడవేమీ లేదు. వాళ్ళంతా తమ తమ రక్షిత వేశ్యల్ని తీసుకొని బహిరంగంగానే స్వేచ్ఛా విహారాలు చేస్తున్నారు. వారి వనవిహారాలు విదేశ శ్రేష్ఠులతో సమష్టి సురాపానాలు యధేచ్ఛగా జరుగుతూనే వున్నాయి. వారితో సంబంధాలు వున్న భారతీయ వ్యాపారులు వచ్చినా అదేతంతు సాగుతున్నది.

ఈ రోము వ్యాపారి పన్నాశ్రేష్ఠి చతురుడు, నీతి మంతుడు, కావేరీ పట్టణంలో ఇతనికున్నన్ని పేరు ప్రతిష్ఠలు మరో విదేశీ వ్యాపారికి లేవు. భారతదేశంలో ఇతని కున్న ప్రసిద్ధిని గుర్తించిన కారణంగానే పాండ్య, చేర రాజ్యాలలోలా ఇక్కడ రోము ప్రత్యేకంగా తన ప్రతినిధిని నియమించలేదు. ఇక్కడ పన్నాయే రాజ ప్రతినిధి. ఆ విధంగా అగస్టస

ఉత్తరువులు వున్నాయి. ఇప్పుడు దాన్ని అద్భుతంగా వినియోగించుకున్నాడు పన్నా. రోము వర్తక నీతికి విరుద్ధంగా జరుగుతున్న కుట్రలోగాని పాల్గొన్నారో స్వదేశాలలో వున్న గిడ్డంగులన్నీ మూయించి వేస్తానని గ్రీకు, మిశ్రా వర్తకులందరినీ బెదిరించాడు. ఈ పథకం అద్భుతంగా పనిచేసింది. వర్తక గణంలో పన్నాపట్ల వున్న బిగింపు కాస్తా సడలిపోయింది. స్వదేశంలో గిడ్డంగులులేని వర్తకులు ఏ కొద్దిమందో చీలిపోయి అమహోజుతో కలిశారు తప్ప మిగిలిన వారందరూ తటస్థులు గానే వుండిపోయారు.

అమహోజుకు కూడా మిశ్రాలోని సికందిరియా నగరంలో ఒకపెద్ద వర్తకపు గిడ్డంగి వుంది కాని అతనీ బెదరింపుకు ఏ మాత్రం లొంగలేదు. "మా మిశ్రాలో గోరీలు, గోపురాలు తప్ప ఇప్పుడేమున్నాయి. రోమన్ సామ్రాజ్యం ఎలాగూ మా వర్తకలక్ష్మి మీద కన్ను వేయక తప్పదు. వేయనీయండి అది మా దేవీ దేవతల బానిస, మా దేవతల్ని మేల్కొలిపే మంత్రాలు ఎలాగూ మా వద్ద వుండనే వున్నాయి" అంటూ ఎదురు తిరిగాడు. అమహోజు మాటల ప్రభావం గూడా వర్తక గణంమీద పనిచేస్తూనే వున్నది. రోమ్ భారతదేశంలో ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకున్నందు వల్ల నష్టపడిన వర్తకులంతా వెళ్ళి అతనితో కలిశారు. దీనితో పరిస్థితుల్ని గమనించి మహాశ్రేష్ఠిగారు కూడా తిరిగి పన్నాతో సంధి సంప్రదింపులు మొదలుబెట్టారు కాని పన్నా దురదృష్టం అంతటితోనే ఆగిపోలేదు. అతని జల సార్థాలను మహాశ్రేష్ఠి వత్తాసుతో సముద్రపు దొంగలు రెండుసార్లు దోచుకున్నారు. ఈ విఘాతాన్ని పన్నా తట్టుకోలేక పోయాడు. అతడీ దెబ్బతో దరిద్రుడే అయిపోయాడు. ఆ తరువాత కోవలన్ శ్రేష్ఠి పెద్ద సార్థంతో సతీ సమేతంగా విదేశయాత్రలకు బైలుదేరుతున్నాడన్న వార్త వచ్చింది. దాంతో స్వలాభానికి లోభించే వర్తక గణం అంతా వెళ్ళి మహాశ్రేష్ఠితో చేరిపోయింది.

## 15

దిగంతాల వరకూ సముద్రం వ్యాపించి వుంది. మరొక ప్రపంచం పొడలేని అనంత జలరాశి, భయంకరమైన ఆ నీలి, నీలి వైశాల్యంలో భర్త కౌగిలి ఒక్కటే శ్రీరామ రక్ష కణ్ణకికి. దేవంతీ – ఇతర చెలికత్తెలు అది కాస్తా అవకాశంగా తీసుకొని బాగా ఆటలు పట్టిస్తున్నారామెను. "భలే సందు చిక్కిందిలే మన 'కణ్ణు'కు భయాన్ని అడ్డం పెట్టుకొని అస్తమానం కౌగిలి విడువనంటున్నది కదూ. అయినా ఇంకా మన దగ్గర ఎందుకుంటుందిలే" ఇదీ వాళ్ళ ధోరణి. నవ్వులతో, వెక్కిరింతలతో ఎద్దేవా చేస్తున్నారు వాళ్ళంతా.

సిగ్గు ముంచుకు వచ్చి తల దించుకుంటుంది కణ్ణకి. కోవలన్ కూడా ఉన్నట్లుండి ఏదో ఒక జల జంతువును చూపించి పరిహాసానికి భయపెడ్తున్నాడామెను. ఏదైనా పెద్ద

జలచరం కాని కనబడిందో అదిరిపడి కోవలన్‌ను కౌగిలించుకుంటున్నది. ఆమె ఆ అమాయకమైన భయమే అద్భుతమైన ఆనందాన్నిస్తూన్నది కోవలన్‌కు.

ఆడ పిల్లలకు చదువు చెప్పించే సంప్రదాయం తమ కుటుంబాల్లో లేకపోయినా కణ్ణకికి చక్కగా చదువు సంధ్యలు చెప్పించారు మహాశ్రేష్ఠి. ఆమె పెళ్ళికి మూడేళ్ళ ముందుగానే తల్లి స్వర్గస్తురాలైంది. అప్పటి నుండి అంత పెద్ద భవంతిని, సముద్రం లాంటి పెద్ద సంసారాన్ని దిద్దుకు వచ్చింది కణ్ణకి. పెళ్ళి అయాక అత్తవారి సంసారాన్ని కూడా సవరించి ఒక దరికి తెచ్చింది. దాసదాసీ జనాన్ని బంధుగణాన్ని వారి వారి తాహతులనుబట్టి ఎలా గౌరవించాలో ఎవరికి తగిన పనులు వారికి ఎలా పురమాయించాలో బాగా తెలుసు ఆమెకు.

కణ్ణకి సమక్షంలో పరమానందాన్ని అద్భుతమైన సౌఖ్యాన్ని అనుభవిస్తున్నాడు కోవలన్. ఆమె తెలివితేటలకు సంసార జ్ఞానానికి ముగ్ధుడౌతున్నాడు. అయినా అతని హృదయంలో ఒకవైపు మాధవి మెదులుతూనే వున్నది. కణ్ణకి నిత్యమూ అతని పాద దాసిలా సేవలు చేస్తున్నది. పరిపూర్ణమైన ప్రేమాదరాలలో ఒక విధమైన మూక యాజమాన్యం కూడా ఒకటి వుంది. ఆమె వ్యక్తిత్వమూ, గాంభీర్యమూ తెచ్చిపెట్టిన యాజమాన్యం అది. మాధవి సంగతి అలా కాదు. ఆమె దాసి మాత్రమే కాదు స్నేహితురాలు కూడా. ఆమె లాలించి, ప్రేమించి ఆకర్షించుకుంటుంది. పొగుడుతుంది. తిడుతుంది. కోరిక విజృంభించినప్పుడు అవతలికి నెట్టి అందకుండా ఏడిపిస్తుంది. అందుకని విలువైన బేరంలాగా మాధవి అతి ప్రియంగా కనిపిస్తుంది కోవలన్‌కు.

కణ్ణకి సంగతి వేరు. ఆమె అనురాగం సహజమైంది. కొంత హక్కు, కొంత విధి నిర్ణయమూ, కలిసి దాని ఆకర్షణను కొంత మేరకు తగ్గించినట్లు అనుభూతి పొందుతున్నాడు కోవలన్. ఆమె పొత్తు విరామ చిహ్నం లేనందువల్ల అసంపూర్ణంగా తోచే అందమైన వాక్యంలా వుంటున్నది. అయితే ఈ మానసిక అశాంతిని, తన దృఢ ప్రతిజ్ఞతో ఎక్కడికక్కడ అణచుకు వస్తున్నాడు. మరెప్పుడూ దారి తప్పనని శపథం చేసుకొని వున్నాడు గనుక నిష్ఠగా వుంటూ ఏక పత్నీవ్రతాన్ని పాటిస్తున్నాడు.

సముద్రయానం సర్వదా సుఖ ప్రదమైనదేమీ కాదు. ఉండి ఉండి ఏదో ఒక తుఫాను హఠాత్తుగా వచ్చి పడుతూ వుంటే ఆకాశాన్ని తాకే అలల మీద మోహావేశపరుల హృదయాల్లాగా అంత పెద్ద నౌకలూ, ఊగిపోతూ వుంటే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని భగవన్నామం జపిస్తూ కూచునేవారు. కొన్ని నౌకలకు సంధి రంధ్రాలు విచ్చుకొని లోపలికి నీళ్ళు వచ్చేవి. వెంటనే కళాసులు అద్దదలాడుతూ, మైనమూ, ఉన్ని పెట్టి ఎప్పటికప్పుడు వాటిని మూసివేసి నీళ్ళు తోడి వేస్తుండేవారు. భయంకరమైన హోరు 'తెరలు దించండి'

‘చుక్కాని జాగ్రత్త’ ‘లంగర్లు వేసెయ్యండి’ అనే కేకలూ, కళాసుల కోలాహలం, నావికుల తత్తరపాటూ, మబ్బులు దట్టంగా కమ్ముకు వచ్చి పట్టపగలు కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటి. ఇంతలో సూర్యోదయమయ్యేది. కష్టాలన్నీ పోయి సుఖ సౌఖ్యాలు ప్రత్యక్షమైనట్టుగా నీలి నీలి ఆకాశంలో అందంగా సూర్యుడు మెరసి పోయేవాడు. అప్పటికప్పుడు బంగారు రంగు కిరణాలు, సముద్ర జలాల్లో తళ తళ మెరిసేవి.

ముజా, ఆడ్యూలన్, బార్నికా మొదలైన ప్రముఖ రేవు పట్టణాలను దాటి కోవలన్ సార్థం సికందిరియా చేరుకుంది.

సికందిరియా నగరం మిశ్ర దేశానికి ఆయువు పట్టు. అక్కడి వ్యాపారులలో యూనానులు, రోమనులు, పిజీషియన్లు, యూదులు, చైనీయులు, భారతీయులు ప్రముఖులు. అలెగ్జాండరు ఆక్రమణ తరువాత కొంతకాలం దాని మీద యవనుల ప్రభావం బాగా వుండేది. ఆ తరువాత రోమన్లు దాన్ని ఎక్కడికక్కడ అణచివేసి సికందిరియాను తమ వ్యాపార కేంద్రంగా మార్చుకున్నారు. మిశ్రదేశం ఒక గోవులాంటిదైతే దాని పొదుగు ఈ సికందిరియా నగరం. పాలను చుక్క మిగల్చకుండా పితుక్కుపోతున్న వారు రోమన్లు. రోమను మిశ్ర యవన సంస్కృతులకు కూడలి ఈ సికందిరియా నగరం. మిశ్రదేశపు దేవీ, దేవతలను, వాళ్ళ సౌర పంచాంగాన్నీ యవనులు రోమన్లు పుచ్చుకపోయి తమతమ సంస్కృతులలో లీనం చేసుకున్నారు. ఏథెన్సులోను, రోమ్ మొదలయిన యూరపు పట్టణాలలోను ఇప్పుడు మిశ్ర దేశపు దేవతల మందిరాలున్నాయి. మిశ్ర పురోహితులు యూరపు శిష్ట సమాజంలో ఇప్పుడు బాగా గౌరవాదరాలను పొందుతున్నారు. అయితేనేమి మిశ్రదేశం ఇన్ని విశిష్టతలు కలిగి వుండి కూడా రోమన్లకు బానిస.

సికందిరియా అతి సుందరమైన నగరం. దాని అట్టాలికలు ఆకాశాన్ని తాకుతూ వుంటాయి. రాజ మార్గాల మీద రథాలు, ఒంటెలు, కంచర గాడిదలు, వర్తకపు దినుసులతో విధీ విరామం లేకుండా తిరుగుతూ వుంటాయి. నానా జాతుల రకరకాల భాషలు మాట్లాడే స్త్రీ పురుషుల స్వరాలతో అక్కడి పగళ్ళూ రాత్రులూ సందడిగా వుంటాయి.

సికందిరియాలో కోవలన్ దంపతులు ‘సికందర్’కు అతిథులుగా వున్నారు. ఈ సికందర్ కావేరీ పట్టణంలోని ‘అమహోజు’కు సోదరుడు. రాజోచితంగా వారిని ఆహ్వానించి ఆతిథ్యం ఇస్తున్నాడు. తన గిడ్డంగిలో పనిచేసే ఒక భారతీయ ఉద్యోగిని వారికి ద్విభాషిగా వుంచాడు. కోవలన్, సికందర్ చర్చల్లో కావేరీ పట్టణంలో ఇటీవల వచ్చిన మార్పులే ప్రధానాంశంగా వున్నాయి. ఈ వ్యవహారంలో కోవలన్ను, సోదరుడు అమహోజును పూర్తిగా సమర్థిస్తున్నాడు సికందర్.

కోవలన్ దంపతులు గౌరవార్థం గొప్ప విందు ఏర్పాటు చేశాడు సికందర్. అతిథులందరికీ లిఖితపూర్వకంగా ఆహ్వానాలు పంపాడు. మిశ్రా వృక్షజాతుల్లో ఒకటైన పేపిరస్ బెరడుతో చక్కటి కాగితాలను తయారుచేసి ఉపయోగిస్తున్నారు వాళ్ళు.

పెద్ద పెద్ద రాతి స్తంభాలున్న వరండాలో అందమైన కుర్చీలను అమర్చారు. రంగు రంగుల వస్త్రాలు తెచ్చి కుర్చీలమీద వేశారు. స్తంభాలు, గోడలు, పైకప్పులు చిత్ర విచిత్రమైన రంగులతో శిల్పాలతో నిగనిగ లాడుతున్నాయి. నాలుగు వైపులా గోడలకు వారగా, పెద్ద పెద్ద రాతి విగ్రహాలున్నాయి. అమహోజు, సికందర్, పూర్వీకులకు సంబంధించిన విగ్రహాలవి. గదులకు అక్కడక్కడా తెరలు వేళ్ళాడుతున్నాయి.

సభామంటపంలోకి అతిథులందరూ ప్రవేశించగానే హార్పు, ఫ్లూటు ఆల్గోజులు మొదలుపెట్టారు. దాసీ జనం ధగధగ లాడుతున్న కళాత్మకమయిన పాత్రలతో విలువైన మద్యం నింపి అందిస్తున్నారు. అతిథుల్ని పుష్పమాలలు వేసి చేతులకు పుష్పగుచ్ఛాలు అందించి వారి పాదాలకు సుగంధ ద్రవ్యాలు పూసి ఆసీనుల్ని చేస్తున్నారు. నర్తకీగణం ఒకవైపు పాటలు పాడుతూ నాట్యం చేస్తూ అతిథిశ్రేష్ఠుల్ని రెచ్చగొడ్తూ ఆదరం, నమ్రతా, తొణికిసలాడే ప్రవర్తనతో వారిని సంతోషింపచేస్తూ వాళ్ళు కైపులో విసిరే చెణుకులను వింటూనే తెలియనట్లు తిరుగుతున్నారు.

ఇక్కడ స్త్రీలు, సారాయి, సంగీత వాయిద్యాలు ఇవన్నీ ఏదో ఒక వర్తక సంబంధాన్ని ప్రేరేపించడానికి ఉద్దేశింపబడిన సాధనాలు మాత్రమే! వీటి కైపులో ఆస్వాదనలో, స్పర్శలో, స్వర్గాల్లో కేవలం బంగారు నాణాల గల గల తప్ప మరేమీ వుండవు.

కోవలన్ తన వాక్చాతుర్యంతో ఇక్కడి వ్యాపారులందరినీ ఇట్టే ఆకట్టుకున్నాడు. సతీసమేతంగా తమ తమ ఆతిథ్యాలను స్వీకరించవలసిందిగా ఆహ్వానాలు కుప్పలు తిప్పలుగా వచ్చి పడుతున్నాయి.

కోవలన్ సతీసమేతంగా ప్రముఖ మిశ్ర దేవతలను సందర్శించుకున్నాడు. కొన్నివేల సంవత్సరాల క్రితం మరణించిన రాజుల, రాణుల, ఫరవుల్ల సమాధి గృహాలు (పిరమిడ్లు) చూచాడు. అక్కడి పురోహితులకు, దరిద్రులకు విశేషంగా ధన దానాలు చేశాడు.

సికందరియాలో తమ వ్యవహారాలన్నీ ముగించుకొని త్వరలోనే రోమ్‌కు ప్రయాణమవ్వాలని చూస్తున్నది కోవలన్ దళం. ఇంతలో కావేరీ పట్టణం నుండి వర్తమానం వచ్చింది. వెంటనే స్వదేశానికి తిరిగి రమ్మని రహస్య వర్తమానం పంపాడు మహాశ్రేష్ఠి. కోవలన్ ఉన్న సరుకంతా అక్కడే విడుదల చేసి మామగారి ఆజ్ఞమేరకు సార్థాన్ని స్వదేశానికి లంగరెత్తమని ఆదేశమిచ్చాడు.

## 16

విదేశ యాత్రలు ముగించుకొని తిరిగి వచ్చాక కోవలన్ పేరు ప్రఖ్యాతులు బాగా ఇనుమడించాయి. సార్థంలో తనతో పాల్గొన్న శ్రేష్ఠి పుత్రులందరికీ అనుకున్న దానికంటే ఎక్కవగానే ముట్టజెప్పి, సంతోషపరిచాడు. ఆ విధంగా శత్రుభావంతో ఉన్న ఒకరిద్దరు శ్రేష్ఠుల్ని కూడా తనవైపు లాక్కున్నాడు. తండ్రిగారు పోయాక అతని బాధ్యతలు మరీ పెరిగిపోయాయి. అయినా మహాశ్రేష్ఠి గారి అండదండలు అతనికెంతో ప్రోత్సాహాన్నిచ్చి ముందుకు నడిపిస్తున్నాయి.

మాశాత్తువన్ గారు పోయాక రెండు కుటుంబాల ధనాగారాలకు వాణిజ్యానికి అధిపతి అయి ఇప్పుడు శత్రువుల అసూయకు కూడా అందకుండా పోయాడు కోవలన్. విదేశాల నుండి వచ్చినప్పటి నుంచి నిత్యం మామగారి సమక్షంలోనే వుంటున్నాడు. కావేరీ పట్టణంలో యిప్పుడు చక్రవర్తులతో సమానమైన గౌరవాదరాలున్నాయి అతనికి. గొప్ప గొప్ప వాళ్ళు, మహాశ్రేష్ఠులు చెట్టియార్‌లు, అస్తమానం అతని చుట్టూ అడుగులకు మడుగులొత్తుతూ తిరుగుతున్నారు.

మహాశ్రేష్ఠి పుణ్యమా అని ఇదివరకే బాగా నలిగి వున్న 'పన్నా' ఇప్పుడు కోవలన్ విదేశయాత్రలతో మరింత చితికిపోయాడు. వున్న కాస్త పలుకుబడి దిగజారిపోయి మనోవ్యాధితో తీసుకుంటున్నాడు. అసలీ చోళ రాజ్యాన్నే విడిచిపెట్టి, పాండ్యరాజుల అండలో వున్న మధురకు వలస వెళ్ళాలని ఆలోచిస్తున్నాడు. మధురతో అతనికి మంచి వర్తక సంబంధాలున్నాయి. కాని పన్నా ఈ ప్రస్తావన ఎత్తినప్పుడల్లా పెరియన్నాయకి భయంతో ఒణికిపోతున్నది. పన్నా వెళ్ళడమనేదే జరిగితే తనూ అతనితో పాటు వెళ్లక తప్పదు. తను వెళ్ళవలసివస్తే తన ధన సంచయం ఎలాగూ పన్నా కంటబడకుండా వుండదు. తను ఇంత ధనవంతురాలినని తెలిస్తే మనిషి బాగా దెబ్బతిని వున్నాడు. పెట్టుబడికని అడిగినా అడగవచ్చు. అప్పుడు పెద్ద ఇబ్బందిలో పడిపోతుంది తను. తిరస్కరించనూ లేదు, ఇవ్వనూలేదు.

పెరియన్నాయకికి పన్నాకు సంబంధం ఈనాటిది కాదు. ఈమె పన్నాను గొప్పగా ప్రేమిస్తున్న మాట కూడా నిజమే. కాని వీటన్నిటికన్నా ధనం ముఖ్యం ఆమెకు. అవసరమైతే ప్రాణాన్నైనా ఇస్తుంది కాని ధనం ఇవ్వలేదు.

అసలింతకూ కారణం మాధవి. ఆమె పేరంటేనే చిరాకుపడుతుంది పెరియన్నాయకి. మాధవే తన చెప్పుచేతల్లో వుంటే, సమయం ఏదైనా వచ్చినప్పుడు పన్నాను కూడా వదులుకోవడానికి వెనుకాడకపోయేది తను. అదలా వుండగా పైపెచ్చు కోవలన్ సురక్షితంగా తిరిగి వస్తే ఉత్సవాలు ఘనంగా జరిపిస్తానని మణి మేఖలాదేవికి మొక్కుకున్నది మాధవి. ఇప్పుడా ఉత్సవాలకు ధనం కావాలని రోజూ ఏడుపించుకు తింటున్నది.

మళ్ళీ ఈ గొడవ కాని పన్నా చెవిని బడ్డదో ప్రమాదం. కోవలన్ పేరెత్తితేనే మండి పడుతున్నాడు. అటు మహాశ్రేష్ఠి విన్నా ప్రమాదమే. వద్దు మొర్రో అని మొత్తుకున్నా వినేట్టాలేదు మాధవి. అదే తప్పనిసరయితే తన భవిష్యత్తు ఏమిటో తను నిశ్చయించు కోవాలని వుంది పెరియన్నాయకికి.

ధనం కోసం తను పన్నాను వదలుకుంటుంది. ధనం కోసం మాధవిని కూడా విడిచేస్తుంది. కాని ఉండేది ఎక్కడ? ఎవరి సహాయంతో బ్రతుకుతుంది? ఏమి చేస్తుంది? ఏమీ బోధపడడం లేదామెకు.

గడచిన రెండేళ్ళ అనుభవాలతోనే జీవితం అంతా పండిపోయినట్లు అనిపిస్తుంది మాధవికి. ఆ రెండు సంవత్సరాలు వెళ్ళాయి. ఉరుములు, మెరుపులతో ఆమెను ముంచెత్తి తుఫాన్లతో క్షణాలు పర్వతాల్లాగా వచ్చి మీద పడుతుంటే రోజొక యుగంలా గడిచిపోయింది. ఇప్పుడా సంతాపమూ, కన్నీళ్ళు లేవు. ఆత్మ వేదనను వెలిబుచ్చడానికి అవి రెండూ సరిపోవడం లేదిప్పుడు.

రోజులు శూన్యంగా గడిచిపోతున్నాయి మాధవికి. పెరియన్నాయకితో మాట్లాడటమంటే విసుగు. ఎదురైతే ముఖం చాటు చేసుకొని వెళ్లిపోతుంది. చేలమ్మ కనిపించక నెలలు గడిచాయి. ఎటు వెళ్ళిందో, ఎక్కడ వుంటున్నదో తెలియదు. ఏదో సార్థంతో కలిసి ఎటో తీర్థ యాత్రలకు వెళ్ళినట్లు వర్తమానం తెచ్చింది నాగరత్న. వాడకట్టులోని శత్రు పక్షాల వాళ్ళిప్పుడిప్పుడే కాస్త రావడం పోవడం చేస్తున్నారు. కాని వాళ్ళతో కూచుంటే తన మనస్తాపం రెట్టింపు అవుతున్నది మాధవికి. దెప్పి పొడవడానికో లేకపోతే పెరియన్నాయకిలాగా హితోపదేశాలు చేయడానికో వస్తున్నారు వాళ్ళు. ఇక మిగిలింది నాగరత్న మాత్రమే. ఓపినంతవరకు తనతో బాధను కలిసిపంచుకొని అనుభవిస్తుందామె. కాని ఆత్మవేదన లాంటి సున్నితమైన విషయాలు అర్థం కావు ఆమెకు.

ఇప్పుడు మాధవి తత్వం పూర్తిగా మారిపోయినట్టు కనిపిస్తున్నది. ఎప్పుడూ ఏమేమిటో గొణుగుతూ వుంటుంది. వుండి వుండి ఏవేవో పాటలు ప్రారంభించి పాడుతూ, పాడుతూ ఆపివేస్తుంది. అర్ధరాత్రి అందరూ నిద్రించే సమయాన చంద్రశాలమీదికెక్కి చుక్కల్నీ చంద్రుడ్నీ చూస్తూ అలాగే వుండిపోతుంది.

అలంకరించు కోవడమనేది ఇంచుమించు మానిందనే చెప్పాలి. ఒకటి రెండు సార్లు పన్నా కోపపడిన తరువాత కాస్త తల దువ్వుకోవడమూ అదీ చేస్తున్నది. పన్నా ఎదుట వున్నపుడు ఆయన కోసమని కాస్త నవ్వుతూ తుళ్లుతూ మాట్లాడేది తప్ప మిగిలిన సమయాలలో మామూలే.

మాధవి ఆత్మలో, అహంకారంలో, నిట్టూర్పులలో నిండిపోయాడు కోవలన్. కోవలన్‌ను అవమానించడం ఒక మహా అపరాధమని తెలుసుకొని, ఇక ముందలా జరగకూడదనే నిర్ణయానికి వచ్చిందామె. ధన గర్వాన్ని, కళా సౌందర్య గర్వాలను వదులుకుంది కాని నృత్యోత్సవ సభలో కోవలన్‌ని గెలుచుకున్న గర్వాన్ని మాత్రం జాగ్రత్తగా అట్టి పెట్టుకొని తపించిపోతున్నదామె.

తను కోవలన్‌తో గడిపిన పగళ్లూ, రాత్రులూ వాటికి సంబంధించిన జ్ఞాపకాలు కూడా ఇప్పుడు పాతబడి బాగా వెలసిపోతున్నాయి. వాటి స్మృతి శరీరాన్ని దహించుకోవడానికి తప్ప వియోగ క్షణాలను తియ్యదనంతో నింపడానికి వుపయోగపడటం లేదు. కాని నృత్య సభలో కోవలన్ మాటిమాటికీ తనవైపు చూడడం, ఆ నవ్వూ, సిగ్గూ ఎప్పుడూ మరపుకు రావడం లేదు మాధవికి. ఆమె జీవితంలో ప్రప్రథమంగా విజయిని అయిన మధుర క్షణం అది. దాన్ని, అటువంటి క్షణాన్నే మళ్ళీ మళ్ళీ పొందాలని తహతహలాడుతున్నదామె.

రోజూ క్రమం తప్పకుండానే తెల్లవారు ఝామున్నే, తులసిపూజ, దీపారాధన చేస్తూన్నది. మధుర పదార్థాలు తినడం పూర్తిగా మానేసింది. కోవలన్ సురక్షితంగా స్వదేశానికి తిరిగివస్తే, ఉత్సవాలు అన్ని విధాలా ఘనంగా జరిపిస్తానని మణిమేఖలా దేవికి మొక్కి, ముడుపు కట్టుకొని మరీ వచ్చింది.

మాధవి మనస్సు ఇంకెవరిమీదనైనా లగ్నమయ్యేటట్లు చూడాలని పెరియన్నాయకి ఎన్నో ప్రయోగాలు చేసింది. కాని అవన్నీ పూర్తిగా విఫలమైపోయాయి.

ఇంతలో మహాశ్రేష్ఠి మాశాత్తువన్ జబ్బు పడ్డారు. రెండు నెలలు దానితోనే తీసుకొని కన్నుమూశారు. అందుకని అల్లుణ్ణి వెంటనే తిరుగు ముఖం పట్టవలసిందిగా మహాశ్రేష్ఠిగారు వర్తమానం పంపిన సంగతి కూడా వ్యాపించింది.

ఆ వార్తవిని పొంగిపోయింది మాధవి. కోవలన్‌ను మహాశ్రేష్ఠి తనకోసమే రప్పిస్తూన్నట్లు సంబరపడిపోయింది. అప్పటినుంచి రోజులు లెక్కిస్తూ కూర్చోవడం తప్ప వేరే పని లేదామెకు. పదే పదే నాగరత్నను నౌకాశ్రయానికి పంపి సమాచారం తెప్పించుకునేది.

క్షణాలు యుగాలుగా గడిచాక చివరకు కోవలన్ వచ్చాడన్న వార్త వచ్చింది. నగరమంతా ఆనందోత్సవాలు జరుగుతున్నాయి. ఇంతకాలమూ ఎంతో ఆతురతతో ఎదురు చూచిన మాధవి ఈ వార్తవిని ఎంతగానో కృంగిపోయింది. ఇంతకాలమూ అతడు విదేశాలకు వెళ్ళడాన్ని ఒక నెపంగా పెట్టుకొని ఇంతవియోగాన్ని ఈదుక వస్తోంది. ఇప్పుడేం కారణం చూపుతుంది మరి. తను కోవలన్ కోసం మొక్కిన మణిమేఖలాదేవి ఉత్సవాలు, అన్నదానాలు అద్భుతంగా జరపాలి. కోవలన్ సైతం విని ఆశ్చర్య చకితుడవ్వాలి. ఇదీ ఇప్పుడు మాధవి సంకల్పం. కాని ఈ సంకల్పాన్ని ఎంతకూ కొనసాగనివ్వడం లేదు పెరియన్నాయకి.

ఈ వేళ ఇక ఉత్సవాల సంగతి అటో ఇటో తేల్చుకుందామనే గబగబా పెరియన్నాయకి కక్ష్యలోకి వచ్చింది మాధవి. పట్టుదలా, కోపమూ, ఆమె కళ్ళల్లో మెరుస్తున్నాయి. సంగతి ముందే కనిపెట్టి లాలనగా ఆమె చెయ్యి పట్టుకొని ఒళ్ళో కూర్చోపెట్టుకుంది పెరియన్నాయకి. దాసీ జనాన్ని వెళ్ళిపొమ్మని సైగచేసింది. ఈ వేళ ఇక సాకులవల్ల ప్రయోజనం వుండదని గ్రహించి నేరుగా అసలు ప్రస్తావన ఎత్తింది.

"చూడమ్మా ఇది కేవలం నీ సంగతి కాదు. కేవలం నా ఒక్కర్తెదీ కాదు. ఇందులో మనిద్దరి స్వార్థమూ వుంది. నీ ప్రియుడి కోసమని నువ్వెలా కుమిలిపోతున్నావో నేనూ అంతే అనుకో. ఇది వరకటిలాగా అనుకోకు తల్లీ! ఇప్పుడు నిన్ను పూర్తిగా అర్థం చేసుకున్నాను. కాని నా పరిస్థితి కూడా కాస్త గమనించు. నేను ముమ్మాటికీ నీ మేలు కోరుతున్నాను. కన్న కడుపుకంటె పెంచిన ప్రేమ గొప్పది."

మాధవి మౌనంగా వింటూకూర్చున్నది. ఆమె వదనం అతి శాంతంగా నిర్వికారంగా వుంది. పెరియన్నాయకే మొదలు పెట్టింది.

"అసలు సంగతి నీతోనేనింతవరకూ చెప్పలేదు. ఆయన అసలీ నగరం విడిచి వెళ్ళిపోదామని అంటున్నారు. నువ్వు దీన్ని ఏ మాత్రం ఒప్పుకోవని తెలిసే నీతో అనలేదిది. ఇప్పుడు నన్నేం చేయమంటావో చెప్పు మాధవీ! నేనెన్ని చిక్కుల్లో వున్నానో నీకెలా చెప్పడం? ఆయన కట్టుకున్న భర్తకాదు. నువ్వు పుట్టిన బిడ్డవీ కాదు. కాని సమయంగాని వచ్చిందో ఆయన్నీ, నిన్నూ ఇద్దర్నీ విడిచిపెట్టి నా దారేదో నేను చూచుకోగలను. కాని ఆయన ప్రేమ – అభిమానం గుర్తు కొచ్చినప్పుడల్లా నేను వేశ్యననే మాట పూర్తిగా మరచిపోతున్నాను బిడ్డా! ఏం చేయను. ఇటు నిన్ను విడుచుకోలేను ఆయననూ విడువలేను."

"మరి దీనికి పరిష్కారమేమిటమ్మా."

కొద్ది క్షణాలు మౌనంగా చూస్తూ వుండి "జూదం" అంది పెరియన్నాయకి గంభీరంగా. మాధవి మాట్లాడకుండా ఆమెవైపే చూస్తూ కూర్చుంది.

"చూడు మాధవీ! నువ్విలా ఉత్సవాలు జరపడం వల్ల నీకు మేలు కలుగుతుందని కదూ నీ ఉద్దేశం. కాని ఈ సంగతి మళ్ళీ మహాశ్రేష్ఠి గారికి తెలిస్తే ఏమౌతుందో ఆలోచించు. పన్నావల్ల భయంలేదు. ఆయన్ను ముందే మధుర వెళ్లే ఏర్పాటు చేస్తాను. కాని ఏదైనా అనర్థం కాని వచ్చిపడిందో ఈ నగరం విడిచి నాతో మధుర వస్తానని, అక్కడ తిరిగి కొత్త జీవితం ప్రారంభిస్తానని మాట యివ్వు నాకీ వాగ్దానం చేసి నీ యిష్టం, ఏవీ ఉత్సవాలు జరుపుకుంటావో జరుపుకో – నాకేం అభ్యంతరం లేదు."

మాధవి చాలాసేపటివరకు ఆలోచిస్తూ కూర్చొని, చివరకు ఒక నిర్ణయానికి వచ్చినట్లు "ఉత్సవాలు జరగవలసిందే అమ్మా" అంది.

"మరి వాగ్దానం సంగతో?"

"అది నేను చెయ్యలేనమ్మా! నీ భవిష్యత్తును పాడు చేయడం కూడా ఇష్టం లేదు నాకు. నేను చేసే దానికి ఫలితాన్ని నేనే అనుభవిస్తానమ్మా! చెట్టియార్‌కు నాకూ సంబంధం కొద్దిరోజులదే అయినా, ఆయన యిచ్చిన నగలూ, నాణాలు లక్షకు మించి వుంటాయి కదూ? నువ్వు నన్ను కొని ప్రేమించిన విద్యా బుద్ధులు నేర్పించావు. కన్నతల్లి కంటే మిన్నగా ఇంత కాలమూ నా మంచీ చెడూ చూశావు. ఆ చెట్టియార్ వుంచిన లక్షా నువ్వుంచుకొని మిగిలిన దానితో నాకో చిన్న యిల్లు కొనిపెట్టమ్మా! నా జీవితం ఏదో నేను చూచుకుంటాను."

పెరియన్నాయకి చాలా సేపటివరకు ఆలోచనల్లో మునిగివుండి చివరకు తేరుకొని, "నువ్వు వేరు పడుతున్నావు సరే మరి మీ తండ్రికి ఏమని సమాధానం చెప్పను?"

"ఈ ప్రశ్నకు సమాధానం నీలోని వేశ్యాబుద్ధే సమాధానం యివ్వగల్గుతుందమ్మా! ముందు నేను చెప్పిన ఏర్పాట్లన్నీ కానివ్వు ఆ తరువాత ఆయన ముందు నువ్వు ఏదో ఒక నాటకం ఆడలేకపోవు."

"ఆయన నిన్ను బలవంతం పెట్టి మళ్ళీ తీసుకురావటానికి ప్రయత్నిస్తేనో!"

"ఆ సంగతి నేను చూచుకొంటాను. నా అదృష్టం బాగా వుండీ ఆయనగాని సుముఖులయ్యారో నాకింకేం కావాలమ్మా! ఆయన మనసు మారడానికైనా నేను వేరుగా వుండటం తప్పనిసరి."

పెరియన్నాయకి చాలాసేపు అలాగే ఆలోచిస్తూ వుండిపోయింది. నిజమే మాధవి చెప్పినట్లు ఆమె బుద్ధికి కూడా ప్రస్తుతం అంతకుమించి గత్యంతరమంటూ ఒకటి కనిపించడం లేదు.

## 17

మాధవి వేరే కాపురం పెట్టడం కావేరీ పట్టణం రసికులను ఇతర సామాన్య జనాన్ని కూడా ఆశ్చర్యంలో ముంచివేసింది. ఈ ఘటన జరగడానికి వారం రోజుల ముందే భవనాన్ని దివ్యమైన ఉద్యానవనాన్ని అమ్మివేసి మంది మార్బలంతో పన్నా కావేరీ పట్టణం వదిలి వెళ్ళిపోయాడు. పెరియన్నాయకి ఇప్పుడు తన భవంతిలో ఒంటరిగానే వుంటున్నది. ఆమె నిస్సహాయ స్థితి ఆమె శత్రువర్గానికి పరమానందంగా వుంది. సానుభూతి మిషతో వచ్చి, దెప్పిపొడుస్తూ కసి తీర్చుకొని వెడ్తున్నారు.

నృత్యోత్సవంలో ఓడిపోయినప్పటి నుండి మళ్ళీ ఇటు తిరిగి చూడని రాజమ్మ సైతం లలితను వెంటబెట్టుకొని అప్పుడే రెండుసార్లు వచ్చి వెళ్ళింది.

"మాధవి ఆ కోవలన్ శ్రేష్ఠి వలలోపడి పిచ్చిదైపోయింది. అందుకని నేనే వెళ్ళగొట్టాను దాన్ని. మహాశ్రేష్ఠిగారితో మా బోటి వాళ్ళకెందుకు చెప్పండి. ఈ పిచ్చిలో పడి అదిచేసే అకార్యాలకిక ముందు నేను బాధ్యురాల్ని కాదలుచుకోలేదు." అని చూడవచ్చిన వాళ్ళందరికి నూరి పోస్తున్నది పెరియన్నాయకి! అంతేకాదు పన్నా శ్రేష్ఠి మధురలో కుదురుకోగానే తానూ కావేరీ పట్టణం విడిచివెళ్ళి పోతానని కూడా చెప్తున్నది.

అంతా వింటూ ముభావంగా వుండిపోతున్నది మాధవి. మాధవి మౌనమూ, పెరియన్నాయకి ప్రచారము, మాటకారుల పనితనంతో కలిసి నగరం అట్టుడికి పోతూన్నది.

ఈ వార్తలన్నీ కోవలన్ చెవినపడ్డాయి. మహాశ్రేష్ఠిగారు వెంటనే జాగ్రత్తపడి మాధవినీ పెరియన్నాయకినీ ఇటు కోవలన్‌ను ఒక కంట కనిపెట్టి వుండవలసిందనీ తన గూఢచారులను ఆదేశించాడు. అయితే ఈ సంఘటనల ప్రభావం కోవలన్ మీద అంతగా వున్నట్లేమీ కనిపించడంలేదు. కోవలన్ ఎప్పటిలాగే తన పనిలో లీనమై ఉన్నట్లు కనిపిస్తున్నాడు. కణ్ణకిని ఇది వరకటిలాగే చూసుకుంటున్నాడు. వయస్సు తెచ్చిపెట్టే చొరవా, గడుసుదనమూ ఇక అల్లుడ్ని కదిలించలేవని తెలుసుకొని సంతోషిస్తున్నాడు మహాశ్రేష్ఠి.

మాధవి వేరే కాపురం పెట్టడం, అన్ని వైభవాలనూ కాలదన్ని అతి సాధారణమైన జీవితాన్ని గడుపుతూ వుండడమూ కోవలన్‌ను కదిలించకపోలేదు. అయితే తనను తాను నిగ్రహించుకొని బలవంతంగా మాధవిని మరచిపోయేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆమెను మరచిపోవాలనే అస్తమానం వ్యాపార గొడవల్లో మునిగి తేలుతున్నాడు. నృత్య గాన గోష్ఠులు, సురాపానమూ ఇతర విలాస, విహారాలు విడిచి జైన్ సాధువుల బోధలు వింటూ కూర్చుంటున్నాడు. ఎప్పుడూ ఏదో ఒక వ్రతమో, సమారాధనో జరిపించి కణ్ణకితో అన్నదానాలు, సంతర్పణలు ఘనంగా జరిపిస్తున్నాడు. పట్టణమంతా కోవలన్ దంపతులు పుణ్యదంపతులనీ వారిది ఆదర్శ దాంపత్యమనీ ఎటువిన్నా బాగా పేరు మోగుతున్నది.

❊ ❊ ❊

మణిమేఖలాదేవి ఉత్సవాలను ఘనంగా జరిపించింది మాధవి. పుర ప్రముఖులకూ, బంధుజనానికి, బ్రహ్మాండమైన విందు ఏర్పాటు చేసింది. రాత్రి తెల్లవార్లూ నృత్య గానాలు జరిగాయి. తన విరోధి పక్షానికి నాయకురాలైన రాజమ్మను, లలితనూ నాట్యాచార్యులు శంకరన్ మొదలినీ, పుహారేశ్వరం మందిర ముఖ్యదాసి మాతా రుద్రమ్మాళ్‌ని కూడా ఆహ్వానించింది. కాదనకుండా అందరూ వచ్చి ఆసీనులు అయ్యారు. నగర శ్రేష్ఠి పుత్రుల కోసం వేరే ఉన్నతాసనాలు ఏర్పాటు చేయించింది. విదేశీ వ్యాపారులలో అమహోజు మాత్రమే వచ్చాడు. పెరియన్నాయకి కూడా వచ్చింది. కానీ, మాధవితో మాటా మంతీ లేకుండా నేరుగా వెళ్ళి అతిథుల్లో కలిసి కూర్చుంది. ఇటు వంటి సంతోషసమయంలో

చేలమ్మ లేకపోవడం అతిథులందరికీ ఎంతో వెలితి అనిపించింది. ఇంతకాలంగా ఆమెఎక్కడ వున్నదో?ఎలా ఉన్నదో? ఎవరికీ తెలియదు.

అలంకారమేమీ చేసుకోలేదు మాధవి. ఆమె వదనం సాత్విక తేజస్సుతో వెలిగి పోతూన్నది. ఉత్సవంలో లలిత స్వయంగా గజ్జెకట్టి నాట్యం చేసింది. అందరూ మాధవిని కూడా ఎంతో బలవంత పెట్టారు కానీ ఒప్పుకోలేదామె. తాను వ్రాసిన గీతాలు కొన్ని పాడి వినిపించింది. చివరకు అలా గీతాలు పాడుతూ పాడుతూనే మాతా రుద్రమ్మాళ్ ఒడిలో స్పృహ తప్పి పడిపోయింది.

ఈ ఘటన ఆధారం చేసుకొని నగర శ్రేష్ఠి పుత్రులందరూ 'మాధవి ఆ కోవలన్ కోసం ఎప్పుడో ప్రాణాలు విడుస్తుం'దని చెప్పుకుంటున్నారు. దీంతో లోగడ విరోధ భావంతో వున్న వారందరికి ఆమె పట్ల జాలి కలుగుతూన్నది. అమహోజు వెళ్ళి కోవలన్‌తో అంతా పూసగుచ్చినట్టు వివరించాడు. ఇది విన్నాక ఇహను పని – పాటల మీద మనస్సు నిలవడం లేదు కోవలన్‌కు. పైకి గంభీరంగానే కనిపిస్తున్నా మనశ్శాంతి లేదు. మాధవితో తను గడిపిన ప్రతి క్షణమూ ప్రళయంగా విజృంభించి అతని మనస్సును వూపి వేస్తున్నది. అయినా నీతీ, వివేకము, వీటిని మించి కణ్ణకీ, మహాశ్రేష్ఠి అంటే వున్న భయమూ, అతని ఉద్వేగాన్ని ఎక్కడ కక్కడ అడ్డుకుంటూ వస్తున్నాయి. అవకాశం చిక్కితే నగరం విడిచి ఎటైనా వెళ్ళిపోదామనిపిస్తున్న దతనికి. అనుకున్నట్లుగానే కొత్త ఓడ ఒకటి కట్టుబడి అయి వచ్చింది. ఆ రెండవ రోజునే దాని జల సంతరణ ముహూర్తం పెట్టారు. ఈ నెపంతో రెండు మూడు రోజులు నగరం విడిచి కణ్ణకితో కూడా ఓడమీదే గడపాలని నిశ్చయించుకున్నాడు కోవలన్.

ఓడలో అస్తమానం భార్య సాన్నిధ్యంలో వుంటూ కొంచెం స్థిమిత పడ్డాడు కోవలన్. నాలుగవరోజున కప్తాను వచ్చి తుఫాను హెచ్చరికలు చేసి వెళ్ళాడు. ఓడను తీరానికి చేర్చడానికి అనుమతి కోరడానికి మరికొందరు నావికులు కూడా వచ్చారు. మరీ అంత అవుసరమౌతే తీరానికి చేరువగా తీసుక వెళ్లండి గానీ రేవు చేర్చకండని ఆదేశాలిచ్చాడు కోవలన్. ఇప్పుడూ నగరానికి దూరంగానే వుండాలని ఆలోచిస్తున్నాడతను.

బాగా అలంకరించిన ఓడ కక్ష్యలో భోజనం ముగించుకొని కూర్చొని వున్నాడు కోవలన్. ముందు భాగంలో వారి వినోదం కోసం కోడి పందేలు జరుగుతున్నాయి. కణ్ణకి చూస్తూ ఆనందిస్తున్నది. కోవలన్ కూడా వాటి పౌరుషాన్ని చూస్తూ మౌనంగా కూర్చున్నాడు.

భర్త మనస్సు వ్యాకులంగా వుండడం గమనించిందిలా వుంది. దేవంతిని ఏదైనా హాస్య కథ వినిపించమని కోరింది కణ్ణకి. కథ ప్రారంభించి చెప్పుక పోతూన్నది దేవంతి.

కోవలన్ వింటూనే వున్నాడు కాని, మనస్సు అన్యాసక్తంగా వుండడం వల్ల అది రక్తి కట్టడం లేదు. చెదిరి పోతూన్న భర్త మనస్సును ఏఏ రససూత్రాలతో అయితే పట్టివుంచాలని చూస్తున్నదో అవి పట్టు చిక్కక ముందే తెగిపోతున్నాయి. ఈసారి దాసీ జనాన్ని పిలిచి ఏవైనా హాస్య రసగీతాలు పాడమని ఆదేశించింది. కానీ, కోవలన్ వద్దని సైగ చేసి అందరినీ పంపించి వేయమన్నట్టు చేయి వూపాడు. అందరూ వెళ్ళిపోయాక ఆమె వైపు తదేకంగా చూస్తూ అలాగే స్తంభించిపోయాడు కోవలన్.

తనూ అలాగే చాలాసేపు మౌనంగా వుండి – వుండి చిరునవ్వుతో "ఎందుకిలా రెప్ప ముడవకుండా చూస్తారు. ఈవేళ నేనేమైనా వింతగా కనిపిస్తున్నానా" అంది కణ్ణకి.

ప్రశ్న విని మనస్సులో వున్న దొంగ పట్టుబడిపోయినట్టు అనిపించి ఉలిక్కిపడ్డాడు కోవలన్. కట్లు తెంచుకొని పారిపోవడానికి ఇదే అదును అన్నట్లు ముందుకు వెడ్తూన్నది మనస్సు. కాని కణ్ణకి ప్రశ్నించిన తీరూ, ఆ అమాయకత్వమూ, ముఖ్యంగా వెన్నెల సరస్సుల్లా మిలమిల్లాడుతూన్న ఆమె కళ్ళు ఆ విద్రోహ భావాన్ని అక్కడ కక్కడే అణచి వేశాయి. మళ్ళీ కుదురుకుని కూర్చొని "ఏమీ లేదు, నా విశృంఖలతత్వాన్ని అణచివేసే శక్తి నీ కళ్ళకు ఎలా వచ్చిందా అని ఆలోచిస్తున్నాను. కణ్ణకీ!" అన్నాడు.

వినయమూ, సిగ్గూ ముంచుకువచ్చి తలవంచుకొన్నది కణ్ణకి "ఇదంతా మీ దయ, మీ ప్రభావమే. నా ప్రత్యేకత ఏమీలేదు."

"మనిషి మనస్సు ఎంత విచిత్రమైనది కణ్ణకీ! ఒకప్పుడు ఇంత అద్భుత సౌందర్య రాశిని అది కన్నెత్తి చూడడానికి కూడా అంగీకరించలేదు. ఇప్పుడు చూడు మరి." సిగ్గుతో శిరస్సు వంచుకొని కూర్చున్న కణ్ణకి వైపు చూస్తూ చెప్పుకుపోతున్నాడు కోవలన్. మాటలు అప్రయత్నంగా వెలువడుతున్నాయి. అలా – చెప్తూ చెప్తూనే గవాక్షం నుండి బయటకు చూచాడు. బైట వాతావరణం భయంకరంగా వుంది. ఆకాశం మబ్బుల కోటలో బందీగా మారిపోయింది. ఆ కోటను బ్రద్దలు కొట్టి దాన్ని అందుకోవటానికి సముద్ర గర్భంలో గొప్ప విప్లవం చెలరేగుతూన్నది.

ఆ సముద్రంతో తన స్థితిని పోల్చుకున్నాడు కోవలన్. తన హృదయ జలధి కూడా ఇప్పుడు వాక్సంయమమనే కోటను పగలగొట్టి బైటకి వురకాలని చూస్తున్నది. సముద్రం వైపు చూపు నిలిపే మాట్లాడుతున్నాడు. "చివరకు నీకిది చెప్పక తప్పడం లేదు కణ్ణకీ! తప్పదు. నీతో చెప్పెయ్యాలీ విషయాన్ని! నా మనస్సెందుకో ఎవరినీ ప్రేమించలేక పోతూన్నది కణ్ణకీ! దాని చివర ఒకటి ఎప్పుడూ ఆకాశంలో ఎగురుతూ వున్నట్లు వుండి పోతుంది."

మరింత శాంత స్వరంతో ఓదార్చింది కణ్ణకి. "భయపడకండి స్వామీ! మామగారి మరణం వల్ల మీరిలా అయిపోయారు. ఆ విఘాతానికే మీ మనస్సు చలించి పోయింది."

"అన్ని పనులు సక్రమంగానే చూచుకుంటున్నాను. యథాప్రకారం వర్తక వాణిజ్యాలు నడుపుతున్నాను. శిష్టాచారాలు పాటిస్తున్నాను. ఇవన్నీ చేస్తూనే వీటిమీద అసహ్యం కలుగుతున్నది. ఈ వర్తక వ్యాపారాల్ని కుల మర్యాదల్ని, ఈ సభ్యతల్ని తన్ని పారేసి స్వేచ్ఛగా ఆకాశంలోకి ఎగిరిపోవాలనిపిస్తూంటుంది."

"నాకు మటుకు ఇలాంటి ఆలోచనలు రావు స్వామీ! నా జీవిత సర్వస్వం మీరే మిమ్మల్ని పొందాక నాకు కొరత అంటూ ఏముంటుందిక."

"ఏదో ఒక కొరత వుండడమే ఈ సంక్షోభానికి కారణం కాదు. అయితే నా మనస్సిలా అయిపోయినప్పుడల్లా నువ్వు వచ్చి నా కళ్ళ ముందు నిలుచుంటావు. నిన్ను చూశానో అంత తిరుగుబాటూ నీటి చుక్క తగిలిన పాలపొంగులా చప్పగా చల్లారి పోతుంది. నీ ప్రభావానికి ఇంత ఎందుకు లొంగి పోతున్నానా అని, నా మీద నాకే సందేహం కలుగుతూ వుంటుంది కణ్ణకీ."

ఆమె సంకోచంగా భర్తవైపు చూసింది. దగ్గరికి జరిగివచ్చి అతని మీద చేయి వేసి "నా మీద ఒట్టువేసి చెపుతున్నాను స్వామీ! నాకు మంత్ర తంత్రాలేమీ తెలియవు" ఎంతో అనునయమూ, అమాయకత్వమూ ధ్వనించాయి ఆమె స్వరంతో.

"అన్ని మంత్రాలకన్నా నీ శీలం గొప్పది. చూడరాదూ నా అంత గర్విష్ఠి కూడా నీకు దాసోహమంటున్నాడు. నిన్ను నిజంగా నాకంటె గొప్పదానివని భావిస్తున్నాను కణ్ణకీ! బహుశా గొప్ప అనే భావం వల్లనే కావచ్చు నువ్వంటే నాకు ఒకొకసారి అసూయకూడా?"

ఈ మాటవిని వణికిపోయింది కణ్ణకి. ఆకాశం క్షణంలో తన ధోరణి మార్చుకుంటున్నట్లు అనిపించింది ఆమెకు. బైట తుఫాను హెూరు వినిపిస్తూన్నది. ఈ కొననుంచి ఆ కొనకు మెరుపులు పరుగెత్తుతున్నాయి. అప్పుడే ఒక పరిచారిక వచ్చి లోపలికి రావడానికి అనుమతి కోరుతూ బైట నిలబడింది. నగరహారా నుంచి వచ్చిన దూత సంగతి చెప్పడానికి వచ్చిందా పరిచారిక.

"ఇప్పుడు కలుసుకునే అవకాశం లేదు" అంటూ తలతిప్పి వెళ్ళిపొమ్మంటూ సైగచేశాడు కోవలన్.

"వద్దు. వద్దు, ఏ అవసరమైన పనిమీద వచ్చాడో పాపం. దూతను చూడకుండా తిప్పి పంపడం ధర్మం కాదు పిలిపించండి" అంది కణ్ణకి.

"సరే రమ్మను."

"దూత ఆ కనుపడుతూన్న పడవలో వున్నాడు స్వామీ! తమతో ఏదో అత్యవసర రాజకార్యం వుండి వచ్చాడట. ఏకాంతంగా మాట్లాడాలని వేడుకుంటున్నాడు."

కణ్ణకి అనుమతితో అయిష్టంగానే లేచి దాసీని అనుసరించాడు కోవలన్. నిచ్చెన మీదుగా రెండవ పడవ మీదకు వచ్చి "ఎక్కడ ఆ దూత" అన్నాడు. దాసులు చేతులు జోడించి దండాలు పెట్టుకుంటూ తెరలు వేళ్ళాడుతూన్న పడవ కక్ష్యవైపు చూపుతూ ముందుకు నడిచారు.

కోవలన్ దగ్గరకు వెళ్ళి తెర తొలగించాడు. తన కళ్ళను తాను నమ్మలేక పోయాడు. కక్ష్యలో పట్టె మంచం మీద మాధవి పడివున్నది. రెండు పాదాలు ఆమె హృదయానికి హత్తుకొని నాగరత్న వెక్కి వెక్కి ఏడుస్తూన్నది. కోవలన్‌ను చూచి "చిన్న యజమానురాలు విషం పుచ్చుకున్నారు స్వామీ! ఇక జీవించరు" అంటూ మరింత పెద్దగా శోకాలు మొదలు పెట్టింది.

ఆ దృశ్యం చూచాక అంత నిగ్రహమూ నీరు కారి పోయింది. ఇక నిలదొక్కుకోలేక పోయాడు కోవలన్. "మాధవీ!" అంటూ పెద్దగా ఓ కేకవేసి కుప్పకూలి పోయాడు.

బైట తుఫాను హెూరు విపరీతంగా వుంది. ఓడకూ పడవకూ మధ్య గాడాంధకారం అలుముకుంది. గాలి ఊపుకు ఓడ ఒక వైపుకూ, పడవ ఇంకొక వైపుకూ చెదిరిపోయాయి. వుండి వుండి ఖణేల్మని మెరిసి భయంకరంగా ఉరిమింది. కణ్ణకి గడ గడ వణికిపోతూ దేవంతిని కౌగిలించుకొని "దేవంతీ! నా ప్రాణం ఎక్కడికో ఎగిరిపోయినట్లుందే దేవంతీ." అని కేక వేసింది.

ఓడ చీకటి అలల మీద అచ్చం ఆమె హృదయంలాగే వూగిపోతూన్నది.

## 18

కోవలన్ మాధవిని తీసుకొని కావేరి తీరాన ఉన్న ఒక గ్రామానికి చేరుకున్నాడు. అక్కడే ఆమెకు చికిత్సలు, ఉపచారాలు జరిగాక నాలుగు రోజులలోనే కోలుకొని మామూలు స్థితికి వచ్చింది. ఇద్దరు ప్రేమికుల కలయిక కన్నీళ్ళతో విరహ వృత్తాంతాలతో, ప్రతిజ్ఞలతో మరింత బలాన్ని కూర్చుకుంటూన్నది. నాగరత్న నిత్యం వారి సేవలో మునిగి వుండి రోజూ క్రొత్త – క్రొత్త బహుమతులను పొందుతున్నది. బాహ్య ప్రపంచం స్పృహ లేదు వారికి. వారం రోజులు గడిచే సరికి పూర్తిగా కోలుకొని మామూలు స్థితికి వచ్చింది మాధవి. అప్పుడప్పుడు కోవలన్ వద్దన్నా వినకుండా నృత్యం చేయడానికి కూడా సిద్ధపడుతూన్నది.

పూర్వ సుఖసంతోషానుభూతుల్ని తిరిగి పొందగలుగుతున్నాడు కోవలన్. వర్తక, వాణిజ్యాలు , సంపద, సర్వస్వమూ మరచిపోయాడు. కణ్ణకీ, మహాశ్రేష్ఠిగారు అప్పుడప్పుడూ మనస్సులో మెదిలినా వారిమీద కోపమూ, విసుగుదలా కలుగుతున్నాయి.

పొరపాటున కూడా మహాశ్రేష్ఠి సంగతి కానీ, పన్నా ప్రస్తావన గానీ, ఎత్తడం లేదు. మాధవి కణ్ణకిని మాత్రం కల్పించుకొని తరచు పొగుడుతూ వుంటుంది. అయితే ఇప్పుడా పొగడ్త కూడా కోవలన్‌కు కోపాన్ని తెప్పిస్తూన్నది. పదిహేను రోజులై పోయింది తనకోసం కాకపోయినా కనీసం కణ్ణకి కోసమని అయినా నగరానికి వెళ్ళి రమ్మని రోజూ బలవంత పెడుతూన్నది మాధవి. తప్పక వెళ్తానని ప్రమాణం కూడా చేశాడు. కానీ తీరా వెళ్ళవలసి వచ్చేసరికి భయంతో అడుగు ముందుకు పడడం లేదు.

లోకం సంగతీ, మహాశ్రేష్ఠిగారు తలపుకు వచ్చి భయపడుతున్నాడు. మాధవి ఊరుకోవడం లేదు. రోజు రోజు వేధించుకు తింటూంది. చివరకు మాధవి కోసమని అయినా బైలుదేరక తప్పలేదు కోవలన్‌కు. తనకు ఇంతగా సింహస్వప్నమై పోయిన ఆ మామగారిపట్ల ఒక విద్రోహ భావాన్ని మనస్సులో పెట్టుకొని ప్రయాణమయ్యాడు. అడుగు ముందుకు వేస్తూనే హఠాత్తుగా తన నిశ్చయాన్ని మార్చుకున్నాడు. ఎవరేం చేస్తారు నన్ను, నేనేమీ వారికి బానిసను కాను వాళ్ళు చెప్పినట్లు పడివుండటానికి "నేనిలా ఒంటరిగా ఒక్కనాటికీ వెళ్ళను మాధవీ. పద నువ్వూ నాతోపాటే వస్తావు. వెంటనే అంతా సిద్ధం కానీ. ఈ గొప్ప గొప్ప వాళ్ళంతా నీ ముందు తలలు వంచుకునేటట్లు చేస్తాను చూడు"

కావేరీ పట్టణం వచ్చి మాధవి కొన్న ఆ చిన్న ఇంట్లోనే కాపురం పెట్టాడు కోవలన్. ముఖ్య కార్యవాహుడు వేల్లినాధన్‌ను పిలిపించి ఇన్ని రోజులు లెక్కా డొక్కా ఒప్పగించుకున్నాడు. తను లేని సమయంలో మామగారు కుదుర్చుకున్న వర్తక ఒప్పందాలన్నీ కసికొద్దీ రద్దుచేసి పారేశాడు. తల వంచుకొని మౌనంగా వుండిపోయాడు వేల్లినాధన్. చివరకు అతడు ఆజ్ఞ తీసుకొని వెళ్ళిపోతూ వుండగా వెనక్కి పిలిచి పన్నా శ్రేష్ఠి క్లాండియన్‌కు అమ్మిన ఉద్యానవనాన్ని ఎంతైనా సరే కొని క్రయం పుచ్చుకొని రావలసిందని ఆజ్ఞాపించాడు. "చిత్తం" అంటూ వెళ్ళిపోయాడు వేల్లినాధన్.

ఆ రెండవ రోజునే ఉద్యానవనం కొన్న వార్త చెప్పడానికని వచ్చాడు వేల్లినాధన్. దాంతోపాటు లెక్కలకు సంబంధించిన గణికెలూ, అవసరమైన అంకెలు కూడా వప్పజెప్పి తాళపు చేతులు గుత్తి కూడా తీసి వుంచుతూ "వయసు మీరిపోయింది బాబూ, ఈ కాని వయస్సులో ప్రపంచ వ్యవహారాలన్నీ ఒదిలించుకొని దైవ, సంకీర్తనం చేసుకోవాలని బుద్ధి పుట్టింది. మరి! ఇక నాకు శలవు ఇప్పిస్తే...!"

మాట పూర్తి అవనీయలేదు కోవలన్. మధ్యలోనే అందుకొని "ఇంతకుముందు ఎప్పుడూ ఇటువంటి మాట మీ నోట రాలేదు. ఇప్పుడు హఠాత్తుగానే దేవుడి మీద మీకీ భక్తి పుట్టుకొచ్చిందా?" అన్నాడు తీక్షణంగా.

"చిత్తం! ఇప్పుడా తలంపు కలుగుతూన్నది. ఐదు తరాల నుండి మా పూర్వులు తమ ఉప్పు తింటూ వస్తున్నారు. తమ వంశ ప్రతిష్ఠను, గౌరవ మర్యాదల్ని కాపాడడం లోనూ వారు కానీ, నేను కానీ ఎటువంటి లోపమూ రానివ్వలేదు." వేల్లినాధన్ గొంతు వణికింది. కనుగొనలు నీళ్ళలో నిండాయి. నిలదొక్కుకొని నిలబడి "ఇంతకాలమూ దిన దినాభివృద్ధి చెందిన లక్ష్మిని నా చేతులమీదుగానే..." మరి మాట పెగల్లేదు వేల్లినాధన్‌కు.

"తరువాత కూడా శలవియ్యండి. అదేమిటో నేనూ తెలుసుకుంటాను."

"చిత్తం! అసలు లక్ష్మే చపలురాలని ప్రసిద్ధి! అందునా ఇప్పుడు లక్ష్మీపతే స్వయంగా విముఖుడై వెలుపలికి వచ్చేశాడు. ఇక ఆ లక్ష్మి ఎలా నిలువగలుగుతుందో తమరే శలవియ్యండి బాబూ!"

వేల్లినాథన్ హెచ్చరిక కోవలన్‌లో నిద్రాణంగా వున్న చైతన్యాన్ని కొడి దులిపి మళ్ళీ ఒకసారి ప్రజ్వలించేటట్లు చేసింది. కానీ, ఆ కాస్త స్పృహకే పిచ్చివాడైపోయాడు కోవలన్. ఇప్పుడు ఏకాస్త పూర్వ స్పృహ రేగినా సహించలేకపోతున్నాడు. నిత్యం మాధవి మత్తులో పడివుండడమే ఎంతో హాయనిపిస్తూందతనికి. అందుకు అవరోధాన్ని కలిగించేవన్నీ ఆగ్రహాన్ని రేపుతున్నాయి.

"మహాశ్రేష్ఠిగారూ, ఆయన ముద్దుల కూతురూ తమకీ పాఠం నేర్పి పంపించి వుంటారు. అంతేనా? మీరెవరూ లేకపోతే నేను దివాళ తీస్తానని మీ వూహ అయి వుంటుంది పాపం! మీ ఆశలన్నీ అడియాసలు చేస్తాను చూడండి నేను. నా చేతులు మీదుగా మిమ్మల్ని మాన్పించే ప్రసక్తే లేదు. మీ కిష్టం లేకపోతే విరమించుకోవచ్చు."

వృద్ధ కార్యవాహుడు వేల్లినాధన్ మహాశ్రేష్ఠిగారి కొలువు విరమించుకున్న వార్త కూడా పట్నమంతా గుప్పుమన్నది. 'ఏనాటి కార్యవాహుడో ఎంత అనుభవశాలో మాశాత్తువన్ గారి వంశానికేదో మూడిందని అందరూ చెప్పుకుంటున్నారు.

## 19

ఇప్పుడు కోవలన్ మాధవితో పన్నా ఉద్యానవనంలో వుంటున్నాడు. అతన్ని పూర్తిగా ఆకట్టుకోవడానికి రోజు కొక విధంగా ముస్తాబై దేవకన్యలా ప్రత్యక్షమౌతున్నది మాధవి.

ప్రతిరోజు ఏదో ఉత్సవమనీ, వ్రతమనీ ఏర్పాటు చేసి నగరంలో తనకు ప్రతి కక్షులుగా వున్న వాళ్ళ నందరినీ పేరు పేరునా ఆహ్వానించి సత్కారాలు చేసి పంపుతున్నది. రాజమ్మ కూతురు లలిత కూడా ఇప్పుడామెకు మంచి చెలికత్తెగా మారి పోయింది. ఆమె ఇప్పుడు కోవలన్‌తో మరదలు వరుస కలిపి అస్తమానం వేళాకోళాలు పట్టిస్తూ కూర్చుంటుంది. ఆ విధంగా కోవలన్ దగ్గర రోజూ మంచి మంచి బహుమతులను

పొందడమేగాక, ఆ ప్రాపకంతోనే ఆమె ప్రేమికుడు మహాలింగం వ్యాపారం ఇప్పుడు బాగా అభివృద్ధిలోకి వచ్చింది. అంతే కాదు ఇప్పుడు నగర శ్రేష్ఠులకు ఎవరికీ ఏ సహాయం కావలసి వచ్చినా తమ-తమ వేశ్యల్ని మాధవి దగ్గరకు పంపి ఇట్టే పొందగలుగుతున్నారు. అలా శ్రేష్ఠి పుత్రుల కార్యాలు గట్టెక్కించినందుకు లంచాలుగానూ, బహుమతుల రూపంలోనూ, లెక్కలేనంత ధనరాశి వచ్చి పడుతూన్నది మాధవికి. ఆ రోజు శోభనం రోజు రాత్రి జరిగిన సంఘటనతో ఆమెలోని వేశ్యా ప్రవృత్తి కొడిదులిపినట్లయ్యింది. ఇప్పుడు కోవలన్ రసికత్వాన్ని రేపెట్టి లాభం పొందడానికి ఎన్ని విధాల ప్రయత్నాలు అవసరమో అన్నీ ఆమె చేస్తూన్నది.

ఇప్పుడు మాధవితో కలిసి బహిరంగంగానే సాయంకాలాలు నగర భ్రమణానికి వెడుతున్నాడు కోవలన్. వాళ్ళిద్దరూ రోజూ మహాజనవాడ ముఖ్యవీధినే 'చేరి' మార్గం వరకూ వెళతారు. కేరళ నుండి వచ్చే సరుకు అంతా దిగే రేవు ఇదే. ఇక్కడ తెల్లని ఇసుక తిన్నెలమీద ఎత్తైన పతాక స్తంభాలపై రెపరెపలాడుతూ వుండే జండాలు దేశ - దేశాల నుండి దిగే సరుకులకు కాపలాదార్లుగా వుంటాయి. రాత్రిళ్ళు అసంఖ్యాకమైన దీపాల కాంతిలో ఆ రేవు కోరికలు పొంగులెత్తుతూ వుండే యువక హృదయంలాగ ధగ-ధగలాడిపోతూ వుంటుంది. రేవు పొడుగునా, పువ్వులూ, చందనమూ, రంగులు, మిఠాయిలు అమ్మే అంగళ్ళ దీపాల వెలుగులు రసికుల్ని నిలదీసి తనవైపు లాక్కుంటూ వుంటాయి. రక-రకాల నగలు అమ్మే కంసాలుల అంగళ్ళు బారు తీరి, ఇడ్డెన, పట్టు అమ్మే సుందరుల జంగిడీల చుట్టూ శలభాల్లాగ జనం ముసురుకొని వుంటారు. తీరం చేరువున చేపలవాళ్ళు నావలమీద తాబేటి చిప్పల దీపాలు మిణుకుమంటూ వింతగొలుపుతాయి. రక-రకాల భాషలు మాట్లాడే విదేశీయులు భాండాగార కాపలాదార్లు రాత్రి అవగానే వెలిగించే ఉజ్వలమైన కాగడాలతో నౌకలకు మార్గనిర్దేశం కోసం కట్టిన దీపగృహాల జ్యోతులతో ఈ కావేరీ పట్టణం ఓడరేవు రాత్రిళ్ళు స్వర్గంలా ప్రకాశిస్తూ వుంటుంది.

రేవు తీరంలో కొంత భాగాన్ని పూర్తిగా విహారాల కోసమని ప్రత్యేకించారు. రాజవంశీయులు, అధికారులు, శ్రేష్ఠి పుత్రులు, తమ-తమ స్నేహితులతో, వేశ్యలతో, బంధుగణంతో జట్లు-జట్లుగా ఇక్కడ విహరిస్తూ వుంటారు. కోవలన్ కూడా మాధవిని వెంటబెట్టుకొని తరచు ఇక్కడికి వస్తూ వుంటాడు. అప్పుడు పాన గోష్ఠులు, విహారాలు ముమ్మరంగా సాగుతాయి.

ఇప్పుడు సంధ్యా సమయమయ్యింది. ఉద్యానవనం అట్టాలిక మీద నిలబడి అస్తమయ సూర్యుని కాంతిలో అద్భుతంగా మెరిసిపోతూన్న మేఘాల్ని చూస్తూ ఆలోచనల్లో మునిగిపోయాడు కోవలన్.

తన చిట్టచివరి వింత – వింత కాంతి సంపదలతో మబ్బు కన్నెల్ని అలంకరించి సూర్యుడు అస్తమిస్తున్నాడు. తన వివేకం కూడా ఇంతేనేమో? మరి దానికి ఉదయమనేది వుండదేమో? అనే ఆలోచన వచ్చి గతుక్కుమన్నాడు కోవలన్. విహారం కోసమని అద్భుతంగా ముస్తాబై వచ్చిన మాధవి కోవలన్ అన్యమనస్కంగా వుండటం చూచి తన రెండు బాహువులూ అతని మెడలో వేసి శిరస్సు భుజం మీద మోపి, తనూ అలాగే అస్తమిస్తూన్న సూర్యునివైపు చూస్తూ వుండిపోయింది. కొద్ది క్షణాలు గడిచాక "సూర్యభగవానుడి కాంతిలో మబ్బు కన్యలెలా మెరిసిపోతున్నాయో నేనూ అంతే స్వామీ, మిమ్మల్ని పొందాక నా అంతరంగం కూడా ఇలాగే మెరిసిపోతున్నదిప్పుడు" అన్నది.

కోవలన్ అది వినిపించుకోలేదు, "ఈ సృష్టిలో ఎన్నో విచిత్రాలు జరుగుతూ వుంటాయి మాధవి! విషం మ్రింగేది ఒకరైతే ఇంకొకరికి ప్రాణాపాయం సంభవిస్తుందిక్కడ" అంటూ సన్నగా నవ్వి "చూడరాదూ! విషం పుచ్చుకున్నది మాధవి అయితే కోవలన్ అభిజాత్యం చచ్చి వూరుకున్నది. దాన్నిక కణ్ణకి సహచర్యం కూడా బ్రతికించలేదు మాధవీ! ఇంత ఎర్రని ఆకాశంలో ఆ నల్లని రేఖలు ఏమిటనుకున్నావు అదిగో ఆ విషమే ఇలా చారలు కట్టి వుంటుంది."

భయంకరమైన ఈ అనుభూతిలో ఈ మాటలు వెనుక ఏనాడో అణగారిపోయిన ఏదో శక్తి మళ్ళీ తళుక్కుమని మెరిసినట్లయ్యింది.

❊ ❊ ❊

చెదిరిపోయిన హృదయాలను కలిపే సూత్రం లాగా ఈ సాయం సంధ్య ఆకాశంలో ఈ కొస నుండి ఆ కొస వరకూ ప్రాకిపోయింది. కణ్ణకి అక్కడ నిలబడి ఎంత సేపయిందో రెప్ప ముడవకుండా ఆ దృశ్యాన్ని చూస్తూ అలాగే నిలబడి పోయిందామె. ఆమెకు అవతల ప్రక్కన దేవంతి నిలబడి వుంది. కణ్ణకి హృదయ వేదన అంతా ఆమె కళ్ళల్లో ప్రవహిస్తూన్నది. కొద్ది క్షణాలు గడిచాక ఆమె కూర్చున్నది. ఆమె గొంతు కన్నీళ్ళతో బరువెక్కి పోయింది. దేవంతి దగ్గర వున్న స్పృహ కూడా లేకుండానే తనలో తనే గొణుక్కుంది. "అస్తమిస్తూన్న సూర్యుని కాంతినంతా దొంగిలించి ఎలా మురిసిపోతున్నాయో మబ్బులు. లోకం ఈ మబ్బుల అందానికి ముగ్ధురాలౌతుంది గానీ సూర్యుడి వివశత్వాన్ని గమనించదది.

ఒకనాటి సంధ్యాసమయం గుర్తుకు వచ్చింది కణ్ణకికి. "ఎంత అందమైన సాయంకాలమది. అయితే క్షణంలోనే అది పెను తుఫానుగా మారిపోయింది. ఆ క్షణమే మంచువలె గడ్డకట్టుకు పోయిందిప్పటికీ హృదయంలో. ఈ లోకానికి మనస్సే కాదు కళ్ళు కూడా లేనట్టేనేమో! కాలాన్ని ప్రవాహంతో పోల్చుతుందది."

కణ్ణకి మాటలు దేవంతి గుండెల్లో ఎక్కడో గూడు కట్టుకొని వున్న వేదనను పెకిలించాయి. ఆ బాధ అంతా ఒక చల్లని నిట్టూర్పుగా వెలికి వచ్చింది. సంధ్య ఒకటే కాని ఇదే సమయంలో ఇది కొందరికి ఎంతో ఆనందాన్ని కలిగిస్తూ వుంటుంది. మరి ఇక్కడో....?

"ఇక్కడ కూడా అది ఆనందాన్నే ఇస్తూ వున్నది. దేవంతీ! వారి ఆనందం మన ఆనందం కాదా?" కణ్ణకి సౌభాగ్యం ఆమె ఔదార్యానికి తగిన బహుమతి ఇవ్వదలచు కున్నదేమో! ఇంతలోనే ఒకరి వెంట ఒకరు నలుగురు పరిచారికలు రొప్పుతూ వచ్చి కోవలన్ శ్రేష్ఠి వస్తున్నాడని చెప్పారు. నగరానికి వచ్చి ఆరు నెలలయ్యింది. ఇంత కాలానికి యింటి స్పృహ కలిగింది కోవలన్‌కు. కబురు విని శాంతంగా వుండి పోయింది కణ్ణకి. చెదిరిపోయిన మనస్సును కూడదీసుకొని క్షణంలో అతి సహజంగా మారిపోయిందామె. ఈ కబురులో వింత ఏమీ లేనట్లు తన భర్త రోజూలాగానే వర్తక వ్యవహారాలు చూచుకొని సాయంత్రానికి యింటికి వస్తున్నట్లు లేచి నిలుచుంది.

పిరికివాడైన వీరునిలా ఈ వేళ కణ్ణకి ముందుకు వస్తూ వున్నాడు కోవలన్. పైకి డంబంగా కనిపించేదే వీరత్వం. లోలోపల భయం పీకుతూ వున్నది. ఆరు నెలలు యింటా బయటా ఎక్కడ చూస్తే అక్కడ కృత్రిమత్వంతో మొహం మొత్తి ఒక చిరపరిచితమైన చల్లని శాంతి కోసం అతని ఆత్మ తహతహలాడుతున్నది. రంగురంగుల సాయంకాలాన్ని చూస్తూ మబ్బుల మాయాజాలాన్ని కాదని అసలు సూర్యుని మీద తపనతో బయలుదేరాడు. దారి పొడవునా అతని అపరాధ మనస్తత్వం ఎన్నో ఊహలు పోతూ వచ్చింది. కణ్ణకి అలిగి కూర్చుంటుంది. అయినా బ్రతిమాలి ఆమెను సమాధాన పరచుకోడానికి ఎంతో ప్రయత్నం అక్కరలేదు. పాపం అల్ప సంతోషి. నిరపరాధి, దేవతలతో పోల్చదగిన స్త్రీ, ఇలా ఆమె అలకను గురించి, తన ఓదార్పును గురించి రకరకాల ఊహలు పోతూ నడుస్తున్నాడు.

మనస్సు ఈ ఊహా పోహలతో ఒక కొలిక్కి రానే లేదు. కణ్ణకి ప్రత్యక్షమయింది. ఎప్పటిలాగే అతి సహజంగా ఉందామె. ఆమె ముఖంలో ఏ విధమైన వికారమూ కనిపించక పోవడం చూచి గతుక్కుమన్నాడు కోవలన్. అప్పటి కప్పుడు తనను తాను మార్చుకొని ప్రస్తుత స్థితికి రాలేకపోయాడతను.

కోవలన్ మంచి గంధపు పట్టె మంచం మీద కూర్చున్నాడు. చక్కటి దారు శిల్పాలతో, పుష్పాలతో అందంగా అలంకరించబడి వుందది. బంగారంతో చేసిన కోళ్ళు అమర్చారు దానికి. పైన తూలికా తల్పమూ, దానిమీద బంగారు రంగు పట్టు పోగులతో కుట్టిన లతలు పువ్వులతో ధగ, ధగ లాడిపోయే మేలిమి దుప్పటి పరిచి వుంది. తలాపున కాళ్ళవైపు

మెత్తలున్నాయి. పట్టె మంచానికి అవతలగా గోడలో అమర్చిన అరలో దంతపు దేవివిగ్రహం ఒకటి మెరిసి పోతూన్నది. విగ్రహం క్రింద దంతపు పీటమీద శ్రీచందనము కుంకుమ పువ్వులు, మాతులంగపు పట్టా, తాంబూలమూ చక్కగా అమర్చి ఉన్నాయి. ఎదురుగా గోడకు బంగారు పూతపూచిన దంతపు కొక్కానికి వీణ వేలాడుతున్నది. ఒకవైపు చిత్ర లేఖనానికి వుపయోగించే తూలికలు, రంగు పేటికలు అమర్చి వున్నాయి. గోడల్ని చక్కటి రంగు చిత్రాలతో అలంకరించారు. క్రింద వర్తులాకారంలో వున్న పరుపూ మెత్తలూ పక్కనే పాచికలూ, చదరం వున్నాయి.

దేవంతి వేళాకోళానికి మాధవి ప్రసక్తిగాని ఎత్తుతుందేమోనని భయపడి ముందే ఏదో పని కల్పించి ఆమెను బైటికి పంపించి వేసింది కణ్ణకి. ఇతర పరిచారికల్ని కూడా వెళ్ళిపొమ్మని సైగచేసి తాను కాళ్ళు ఒత్తుతూ కూర్చుంది. కోవలన్ లేని సమయంలో ఏఏ సంఘటనలు జరిగాయో అన్నీ చెప్పింది. కోవలన్ పెంపుడు నెమళ్ళు రెండూ యిప్పుడు సంతానవతులయ్యాయి. పంట నూర్పిళ్ళలో అనుకున్న దానికంటే మిన్నగా రాలుబడి జరిగింది. ధాన్యాగారాధికారి గత ఐదేళ్ళలోనూ ఇంత రాలుబడి ఎప్పుడూ లేదని అంటున్నాడు. వస్త్రశాల శిల్పులు కోవలన్ కోసమని ఉత్తమ కౌశేయాన్ని బహుమతిగా యిచ్చారు. మిశ్రా నుండి వచ్చిన స్వర్ణకారుడొకడు, మిశ్రా – భారతీయ శిల్పాలను జోడించి అద్భుతమైన ఉంగరాన్ని తయారు చేసి తెచ్చాడు. ఇవేకాక కోవలన్ స్నేహితుల పరివారాల్ని గురించి తను విన్న విషయాలు వ్యాపార విషయాలు అన్నీ ఏకరవు పెట్టింది. కాని, తన తండ్రి ప్రసక్తిగాని, మాధవి విషయమై కాని పల్లెత్తుమాట అనలేదు. వేల్లినాధన్ వెళ్ళిపోయాక నౌకర్లలో ప్రబలిన అవినీతిని గురించి కాని, ఈ సంవత్సరం వర్తకంలో వాటిల్లిన పెద్ద నష్టాన్ని గురించి కాని ఏ మాత్రం తెలియనివ్వలేదు. కోవలన్ తనలోని అపరాధ వ్యక్తిత్వాన్ని కణ్ణకి ద్వారా శిక్షింపజేయాలనే బయలుదేరాడు. కాని, తీరా ఇక్కడకు వచ్చాక అదంతా తలక్రిందులై పోయిందిప్పుడు. అందుకని బాగా క్షోభపడి పోతున్నాడు. ఆ క్షోభ క్రమంగా కణ్ణకి పట్ల కోపంగా కూడా మారుతూన్నది. దాతను పొగిడి, లాలించి, ఏడ్చి, క్షమాభిక్ష కోరాలని తహ తహలాడుతున్నది కోవలన్ మనస్సు. కాని ఆ దాత అయాచితంగానే దాతకూ, పకీరుకూ వుండే తేడా తొలగిపోయేంత భిక్షపెట్టి కూర్చుంది. తత్ఫలితంగానే కోవలన్‌లో రజోగుణ సంబంధమైన 'అహం' రేగి అతన్ని బాగా పీడిస్తూన్నది. చివరకు తనే పరాజయాన్ని అంగీకరించి మొదలు పెట్టాడు. "నేనింత కాలం ఇంటి మొహం చూడలేదు. ఎక్కడెక్కడో తిరిగాను. నీ కోసమని కనీసం ఒక వర్తమానమైనా పంపలేదే! ఎక్కడికి వెళ్ళారు? ఏమి చేస్తున్నారు. అని అడగవేం?"

ఈ మాట విని చాలాసేపు అలాగే మౌనంగా వుండిపోయింది కణ్ణకి. చివరకు "మీరు ఏమి చేసినా మంచి కోసమే చేస్తారని, ఎక్కడ వున్నా భగవంతుడు మీకు సుఖ సంతోషాలనే ఇస్తాడని నాకు పూర్తిగా విశ్వాసం వుంది స్వామీ!" అంది.

ఆమె శాంత స్వభావం చిరాకు కలిగించింది కోవలన్‌కు! "నువ్వు పాషాణానివి కణ్ణకీ! నిజం చెప్పు నీకీ విషయం బాధ కలిగించలేదు? నేను ఇన్నాళ్ళు ఎక్కడ వున్నాను. ఏం చేస్తున్నానో తెలియదా నీకు?"

"ఇంట్లో వుండే అందరు ప్రాణులను గురించి తెలుసుకోవడం గృహిణి ధర్మం."

"మరి ఒక్కసారి కూడా మాట వరుసకైనా ఈ విషయంలో నన్ను నిందించవేం?"

"విజ్ఞులెప్పుడూ బాగా పూర్వాపరాలు తెలుసుకునే ఏ పనికైనా ఉపక్రమిస్తారు. ఎందుకు నిందించాలి వారిని?"

"మరి ఈ ఆరు నెలల నుండి నేనుచేస్తున్న పనులన్నీ నా విజ్ఞతకు తగిన పనులేనని నువ్వు ప్రమాణం చేసి చెప్పగలవా?" రెచ్చిపోతూ అన్నాడు కోవలన్.

ఆమె సమాధానం ఇవ్వలేదు. ప్రశ్నను మళ్ళీ రెట్టించాడు కోవలన్. ఆమె కన్నులు వాల్చుకొని శాంత స్వరంతో "కావు" అన్నది.

"మరి తగదని ఎందుకు అనలేదు."

"మీరు ముందే సలహా యిమ్మని ఆదేశించి వున్నట్లయితే తప్పకుండా చెప్పి వుండేదాన్ని. మీ ఆదేశం లేకుండా కల్పించుకునే అధికారం నాకు లేదు కదా?"

ఈ సమాధానంతో తన మీద తనకే చిరాకు కలిగింది కోవలన్‌కు. దీన్ని తను ఓర్చుకోలేక కణ్ణకి మీద గుమ్మరించాడు. "నిన్ను నేను నా ప్రాణాలకంటే అధికంగా ప్రేమిస్తున్నాను కణ్ణకి నువ్వు గాని కాస్త అలిగి వుంటే ఏమి చేసేవాడినో తెలుసా? నీ కాళ్ళమీద పడి క్షమించమని వేడుకొని వుండేవాడిని. ఆ విధంగా నా పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకునే వాడిని!! నిజంగా నా ప్రవర్తన నీకే మాత్రం దుఃఖాన్ని కలిగించలేదా కణ్ణకి! దీన్ని గురించి నువ్వెప్పుడూ చింతించవా కణ్ణకీ?"

కణ్ణకి నేత్రాలలో నీళ్ళు పొంగాయి. కాని వెంటనే చెంగుతో తుడుచుకొని ఎంతో సంయమాన్ని కూడదీసుకొని కదలకుండా కూర్చుంది. గొంతు పూర్తిగా స్వాధీనంలోకి వచ్చాక "దాసీల దుఃఖాన్ని గురించి ప్రశ్నించకూడదు స్వామీ!! మీ దుఃఖాన్ని నా దుఃఖంగా భావించుకునే సంస్కారాన్నే నాకు నా తల్లిదండ్రులు యిచ్చారు" అంది.

"అయితే అలాగే భావించుకుంటూనే వుండు. ఈ నియమాల్ని నిబంధనల్ని ఛేదించుకొని ఈ సుఖాల అంతం ఎంతవరకో నేనూ చూస్తాను" అంటూ పెద్దగా నవ్వాడు కోవలన్. కొంచెం సేపటి వరకు ఆ నవ్వు గది అంతా చెదిరిపోయింది.

కణ్ణకి కళ్ళు ఇంతింత చేసుకొని అతనివేపే చూస్తూ కూర్చుంది. కోవలన్ నవ్వులో వున్న వికృత భావానికి ఆమె అంతరాంతరాలలో వున్న ఆవేదనంతా సుళ్ళుతిరిగి కన్నుల్లోకి పొంగి వచ్చింది. కోవలన్ కూడా ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తున్నాడు. తలవంచుకొని చూపు మరల్చుకోవాలని కణ్ణకి ఎంతో ప్రయత్నించింది. కాని అతని జిజ్ఞాసాదృష్టికి కట్టుబడిపోయి చివరకు తుఫాను దెబ్బలకు చెదిరి వణికి వణికి అలసిపోయి తీగ వృక్షాన్ని చుట్టుకున్నట్టు కోవలన్ హృదయానికి హత్తుకు పోయింది. చాలా కాలం తరువాత ఆమె స్పర్శ మధురమైన అనుభూతినిస్తున్నది కోవలన్‌కు. ఆ అనుభూతి తన వ్యక్తిత్వంలోని నగ్నత్వాన్ని దేన్నో తాకినట్లనిపిస్తూన్నది. ఈ క్షణంలో ఏ సంశయమూ, ఏ ద్వంద్వమూ తనను ఆమె నుండి విడదీయ లేవనిపిస్తూన్నది. వెచ్చని కన్నీరు చుక్కలు చుక్కలుగా అతని వక్షస్థలాన్ని తడుపుతూన్నది. ఆమె కన్నీళ్ళను పైటతో తుడిచి శిరస్సు నిమిరాడు. ఆ కన్నీరు అతని హృదయంలోని జాలినంతా వెలికి తోడి ఆ క్షణం పూర్తిగా మార్చి వేసిందతన్ని.

"నువ్వు సహధర్మచారిణివి, మంత్రివి, దాసివి, కుల వధువు కోసం పూర్వులు చెప్పిన ఇన్ని నియమాల్ని ఎంతో ఘనంగా పాటించిన దానివి. శయన కక్ష్యలో కులవధువే వేశ్య అనే ముఖ్య విషయాన్ని మర్చిపోయావేం కణ్ణకీ! ఆ ధర్మాన్ని కూడా పాటించి దాని ప్రధాన గుణమైన మాయను కూడా పొంది ఉన్నట్లైతే – పురుషుణ్ణే కాదు వాడి అహాన్ని కూడా నీ పాదా క్రాంతం చేసుకొని వుండేదానివి కదా! కణ్ణకీ!!"

కణ్ణకి భర్త హృదయం మీద తలవాల్చి వింటూ కూర్చున్నది. ఆమె నేత్రాలు అర్ధనిమీలితాలుగా వున్నాయి. ఆ పారవశ్యానికి కోవలన్ కన్నులు చెమర్చాయి. ఆమెను గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు. శరీరకస్పృహకు భిన్నంగా రెండు ఆత్మల ఐక్యమైపోయిన అనుభూతి కలుగుతోన్నదిప్పుడు. ఆ తన్మయత్వంలోనే చెప్పుకుపోతున్నాడు కోవలన్.

"నన్ను రప్పించడం కోసమని విషం పుచ్చుకున్నది మాధవి. ఈ విషం అనే మాట భయంకరమైనదే కాని విషాలు మాత్రం అన్నీ భయంకరమైనవి కావు. మాయావి అయిన వేశ్య ఎప్పుడూ ఈ సూత్రాన్నే అవలంభిస్తుంది. ఈ కుతంత్రాలు, మాయోపాయాలు నాకు తెలియక కాదు కణ్ణకీ!! బాగా తెలుసుకాని ఎందుకనో నేను వివశుణ్ణయి పోతున్నాను. కారణమేమిటంటే ఈ కులట దగ్గర ఎంత మోసమూ, కుతంత్రాలూ వున్నాయో అంత నిజమైన హృదయం కూడా వున్నది. నా వివశత్వాన్ని కొంచెం అర్థం చేసుకో కణ్ణకీ! ఈ ఆకర్షణలో మీ యిద్దరి మధ్యా చీలిపోతున్నాను నేను. ఘోరమైన నేరాలు చేసినవాళ్ళను రెండుగా చీల్చివేసే శిక్ష ఏదో వున్నట్లు విన్నాను. అటువంటి శిక్షనే ఈ ప్రేమలో విధి

నాకు విధించిందేమో. మాయతోకూడిన మాధవి ప్రేమను, సహజసిద్ధమైన నీ అనురాగాన్నీ సమంగానే కోరుతున్నాను నేను. నిత్యమూ ఈ ద్వంద్వమే నన్ను తినివేస్తూన్నది. ఇప్పుడిక నాపై నాకే విశ్వాసము లేదు కణ్ణకీ. పూర్తిగా వివేకాన్ని పోగొట్టుకున్నాను. ఏ క్షణం ఏ ఆకర్షణకు లొంగిపోతానో చెప్పడం కష్టం. మీ యిద్దరితో ఏ ఒక్కరికీ పూర్తిగా చెందడం చెందకపోవడం అటుంచి నాకు నేనే కాకుండా పోతున్నానిప్పుడు. పైన విశాలమైన ఆకాశమూ, క్రింద అగాధమైన సముద్రమూ వీటి మధ్య ఎగిరే పక్షిలా అయిపోయింది నా బ్రతుకు. క్రిందికి రాలేనూ, పైకి వెళ్ళలేనూ అలసటతో, ఆవేదనతో అలా ఎగురుతూ వుండవలసిన వాడినే – నా వివశత్వాన్ని క్షమిస్తావా కణ్ణకీ."

సమాధానంగా అతని హృదయానికి మరింత హత్తుకుపోయింది కణ్ణకి.

# 20

రోజులు మామూలుగానే గడిచిపోతున్నాయి. కోవలన్ ఇప్పుడు కణ్ణకితో ఇంట్లోనే వుంటున్నాడు. తరచు మాధవి సంగతి కూడా కోవలన్‌కు జ్ఞాపకం చేస్తూ వుంటుంది కణ్ణకి. భర్త సానుభూతి పొందాలనే తలంపుతో రకరకాల బహుమతుల్ని, తినుబండారాల్ని తరచూ మాధవికి కానుకగా పంపుతూ వుంటుంది. ఇవన్నీ కోవలన్‌కు ఆనందాన్నే కలిగిస్తున్నాయి. కాని మహాశ్రేష్ఠిగారితో ఎదురుపడవలసి వచ్చే సందర్భాల్లో మాత్రం సిగ్గుతో, అపరాధ భావంతో చిత్రవధ చేస్తున్నట్లు బాధపడిపోతున్నాడు. మహాశ్రేష్ఠిగారు కూడా ఇది గమనించి కోవలన్‌తో కలవడమే మానుకున్నారు. తన వర్తక వ్యవహారాలన్నీ మామూలుగానే చూచుకుంటున్నాడు. కాని పూర్వపు ఉత్సాహం కాని, ఆసక్తి కాని చూపలేకపోతున్నాడు కోవలన్.

కొద్ది రోజులు ఇలాగే గడిచిపోయాయి. లోలోపల ఎలా వున్నా బైటికి కోవలన్ వ్యవహారం సజావుగానే కనిపించి ఫరవాలేదని అనుకుంటున్నారు అంతా. ఇంతలోనే మాధవి ఇప్పుడు గర్భిణి అన్న వార్త వ్యాపించింది.

ఇన్ని రోజుల నుండి ఎటూ మొగ్గలేకుండా సమతులనం చూపుతున్న కోవలన్ మనస్సు మళ్ళీ స్థిరత్వాన్ని కోల్పోయింది. విధివశాత్తు అప్పుడే మధుర నుంచి పన్నా శ్రేష్ఠి కూడా వచ్చి పెరియన్నాయకి యింట్లో దిగాడు. నగరం విడిచి వెళ్ళాక ఆయన రావడం యిదే ప్రథమం. వచ్చీ రావడంతోనే ఆయన గతంలో జరిగిందంతా మరిచిపోయి మహాశ్రేష్ఠిగారితో కలిశారు. నగరంలోని పాత శ్రేష్ఠులందరినీ పేరుపేరునా వెళ్ళి పలుకరించి వచ్చారు. కోవలన్ దగ్గరికి కూడా వెళ్ళి ఆలింగనం చేసుకొని కుశలం తెలుసుకున్నాడు. పాత స్నేహితులందరినీ కలుసుకోవడానికీ, పెరియన్నాయకిని తనతో మధుర తీసుకు పోవడానికి

వచ్చానని అందరితో చెప్తున్నారాయన. అంతేకాదు వచ్చీ రావడంతోనే ఆయన ఏర్పాట్లు చేస్తున్న విందులూ, విహారాలూ, ఆయన దర్పమూ దర్జా చూచి పన్నా శ్రేష్ఠి మళ్ళీ కోలుకొని మంచి స్థితికి వచ్చారని అంతా చెప్పుకుంటున్నారు.

మాధవి కోసమని కోవలన్‌తో మరింత స్నేహంగా మెలుగుతూ ప్రేమాదరాలు చూపుతున్నారాయన. ఉద్యానం కొనుగోలు కోసమని అతడు క్లాండియస్‌కు ఇచ్చిన ధనాన్ని బలవంతంగా కోవలన్‌కు తిరిగి ఇచ్చివేశారు.

అంతేకాదు ఇప్పుడు కోవలన్ పన్నా మనసులో క్రమేపీ మహాశ్రేష్ఠిగారి స్థానాన్ని పొందుతున్నాడు. కోవలన్ కూడా యిప్పుడు ఆయన్ని ఎంతో ప్రేమాదరాలతో చూస్తున్నాడు. మహాశ్రేష్ఠిగారి పేరే యిప్పుడతనికి ఎంతో చికాకునూ, ఏహ్యభావాన్ని కలిగిస్తూన్నది. ఆయన మీద కసి తీర్చుకోవాలనే ఉద్దేశంతోనే తన వర్తక నీతినంతా తల్లక్రిందులు చేసి కూర్చున్నాడు కోవలన్. ఇంతజరిగాక ఆయన మొఖం చూడాలంటేనే సిగ్గూ, సంకోచమూ అతన్ని ముంచి వేస్తున్నాయి. దాంతో లోలోపల వున్న అహం విజృంభించి అదే శ్రేష్ఠిగారి పట్ల ద్వేషంగా మారుతున్నది. కణ్ణకినీ, మాధవినీ సమదృష్టితో చూస్తూ కొంతవరకు స్థయిర్యాన్ని పొందినా కణ్ణకితో పాటు విశాలమైన సౌధం, అభిజాత్యమూ, వీటిని మంచిన వాణిజ్యమూ, మహాశ్రేష్ఠి, పూజ్యులైన తండ్రి గారు, వేల్లినాథన్‌ల జ్ఞాపకాలున్నాయి. ఈ జ్ఞాపకాలు ఇప్పుడు కోవలన్ మనస్సును అల్లకల్లోలం గావిస్తూ, అతడ్ని ఘోరమైన అశాంతికి గురి చేస్తున్నాయి. యిప్పుడు రానురాను వర్తక వ్యవహారాల్లో కూడా మునుపటి చాకచక్యాన్ని చూపలేకపోతున్నాడు. ఇద్దరు స్త్రీల ద్వంద్వాకర్షణలో పడి అతడి వ్యవహార జ్ఞానం క్షీణిస్తూన్నది. అదీగాక ఇప్పుడు ఇదివరకటిలా అనుభవజ్ఞులైన మహాశ్రేష్ఠి వేల్లినాథన్‌ల సహాయ సహకారాలు లేవు. పైపెచ్చు మాధవిని తిరిగి కలుసుకున్న తరువాత మహాశ్రేష్ఠి గారి మీద పగతో విపణిలో తీవ్రమైన సంక్షోభాన్ని పుట్టించే చర్యలు తీసుకున్నాడేమో ఆ చర్యల ఫలితంగానే నగర వాణిజ్యసూత్రాలన్నీ తారుమారై విపణిలో అతనికి లోగడ వున్న ఆధిపత్యాన్ని వమ్ముచేసే స్థితికి వస్తున్నాయి. మహాశ్రేష్ఠిగారు పెదవి కదపకుండా అల్లుడు చేసే చర్యలన్నింటినీ గమనిస్తూ మ్రుభావంగా వుండిపోయారు. ఆయనకు ఇక రాను రాను వర్తకం మీద ఆసక్తి నశిస్తూన్నది. ఆ విరక్తే ఒకొకసారి కుదిపివేస్తుంది కోవలన్‌ను, ఎప్పుడైనా తన వర్తక వ్యవహారాల స్పృహ వచ్చినప్పుడల్లా మామగారి తూష్ణీంభావాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని వ్యాకులపడిపోతున్నాడు. కోవలన్‌లోని ఈ అశాంతినీ అస్థిరత్వాన్నీ మాధవి, పెరియన్నాయకి, పన్నా ముగ్గురూ ఆజ్యంపోసి నానాటికి వృద్ధి చేసుకు వస్తున్నారు. దాని ఫలితంగానే యిప్పుడు తమ వర్తకదళంలో ముఖ్యుడైన అమహోజుశ్రేష్టిని కాని, ఇతర దళ సభ్యుల్ని కాని సంప్రదించకుండానే కోవలన్ పన్నాతో

చేరి అతని వ్యాపారంలో భాగస్వామి అయిపోయాడు. దీనితో అతనికి యిదివరకున్న కొద్దీ గొప్పా ఆధిపత్యమూ, పలుకుబడీ పూర్తిగా నశించిపోయాయి. మహాశ్రేష్ఠిగారు ఈ వార్త విని స్తంభించిపోయారు.

కొద్ది రోజులలోనే పన్నాశ్రేష్ఠి తేరుకొని కావేరీ పట్ణంలోనే తిరిగి పూర్వ వైభవాన్ని మించిన వైభవంతో వెలిగిపోతున్నాడు. మాధవి యిప్పుడు తల్లి అయింది. కణ్ణకికే సంతానం కలిగి వుంటే మహాశ్రేష్ఠిగారు ఎంత ఘనంగా బారసాల జరిపించి వుండేవారో అంతకు రెట్టింపు వైభవంతో ఎంతో ఘనంగా బారసాల జరిపించారు పన్నాశ్రేష్ఠి. వాణిజ్య పరంగానూ, నైతికపరంగానూ ఒక్క వెలుగు వెలిగి జారిపోయిన నక్షత్రంలాంటి కోవలన్ శ్రేష్ఠి ఇప్పుడీ వేశ్య సంతానానికి తండ్రి అయి మరింత అవహేళనకు గురి అవుతున్నాడు. బారసాలనాడు మాధవికీ, ఆమె బిడ్డకూ కణ్ణకి పంపిన అమూల్యమైన కానుకలు చూచి పెద్దపెద్ద వాళ్ళే ఆశ్చర్య చకితులయ్యారు.

మాధవి ఆనందానికి అవధులు లేవు. కోవలన్ సంతానానికి తల్లి అయి, ఆమెలోని గృహిణీత్వభావం మళ్ళీ మేలుకుంటున్నది. ఒకరోజు అవసరమైన కార్యమేదో వున్నట్లు సిగ్గుపడుతూ వచ్చి కోవలన్ ప్రక్కన నిలుచుంది. కోవలన్ ఏమిటన్నట్టు తల ఎత్తి చూచాడు.

"ఏమీలేదు. నా బిడ్డ మీకు పితృత్వాన్ని ఇచ్చింది. కానీ దాని తల్లికి మీరు కళ్యాణ మంజీరాలైనా ఇవ్వలేరా మహాశ్రేష్ఠి! ఈమాటే అడుగుదామని వచ్చాను" అంది అతని తల నిమురుతూ. పెద్దగా నవ్వాడు కోవలన్. ఆ వికటాట్టహాసం మాధవి మనస్సును గాయపరిచింది. "తండ్రి భోగి, తల్లి వేశ్య సంతానేచ్ఛలేకుండానే బిడ్డను కన్నతల్లికి కళ్యాణ మంజీరాలు ధరించే యోగ్యత వుండదు మాధవీ! అటువంటి తండ్రి కూడా నిజానికి తండ్రి! అనిపించుకోడు."

ఈ మాటవిని కృంగిపోయింది మాధవి. కాని ఆ భావం ఏదీ పైకి కనపడనీయకుండా నిగ్రహించుకొని నవ్వుతూ, "అయితే పోనివ్వండి వూరికే నవ్వులాటకని అన్నాను" అంది.

కోవలన్ ఆమె ముఖవైఖరిలో ఒక భావం పోయి మరొక భావం రావడాన్ని గమనించాడు. ఈ రెండు రూపాలను జయించేశక్తి ఇప్పుడు కోవలన్‌కు లేకపోతే లేకపోవచ్చు గాని గమనించే వివేకం మాత్రం ఇంకా పూర్తిగా నశించి పోలేదు. తనూ అపహాస్యభావాన్ని తెచ్చిపెట్టుకున్నట్లుగా ముఖముద్ర పెట్టి "ఓహో! నవ్వులాటకా! ఎంతకాలం ఈ నవ్వులాట! కోవలన్ ధనాగారంలో వజ్రాల, ముత్యాల నిల్వలున్నంత వరకూ! అంతేనా?" అంటూ పెద్దగా నవ్వాడు. ఆ నవ్వు కెరటాలు కెరటాలుగా విస్తరించి భవిష్యత్తుకొసను తాకుతుందా అన్నట్లు సాగిపోయింది.

# 21

కోవలన్ క్రమేపీ వర్తకపీఠం మీద కూర్చోవడం కూడా మానివేశాడు. పన్సాతో భాగస్వామి అయిపోయాక మహాశ్రేష్ఠి మాశాత్తువన్ గారి వ్యాపార కోష్టం అంతటా ఇప్పుడు పన్సాకు విశ్వాసపాత్రులైన రోమన్ వుద్యోగులే పని చేస్తున్నారు. ఏడెనిమిది తరాల నుండీ దక్షిణ భారతమంతటా పేరుమ్రోగిన మహాశ్రేష్ఠి వర్తక పీఠం మీద యిప్పుడు రోమన్ భాగస్వామి పన్సా ఆశీనుడై వ్యవహారాలు నడిపిస్తున్నాడు. అంతఃపుర భవంతుల్లో కూడా నమ్మకస్తులైన పాత నౌకర్లు ఏ ఒకరిద్దరో మిగిలారు. మిగిలిన వాళ్ళంతా పన్సాకు అమ్ముడుపోయిన దాన దాసీ జనమే కనిపిస్తున్నారు. అస్తమానం కణ్ణకిని దూషించడం, భవంతుల్లో ఎక్కడ ఏఏ అమూల్య నిధులున్నాయో తెలుసుకొని వెంటనే మాధవి చెవుల్లో వేయడం తప్ప వీళ్ళకు ప్రత్యేకించి ఓ పనీ పాటా అంటూ ఏమీలేదు.

మాధవి అది విన్న వెంటనే తనకే వస్తువు మీద మనసు పోయినా వెంటనే కోవలన్ పేర ఆదేశం పంపుతుంది. దేవంతి వద్దన్నా వినకుండా తక్షణమే ఆ ఆదేశాన్ని మన్నిస్తుంది కణ్ణకి. ఏడేడు తరాలనుండి వెండి, బంగారం మొదలైన అమూల్య నిధులతో కళకళలాడిపోయే కోష్టాలన్ని ఇప్పుడు వెలవెల పోతున్నాయి. ఒట్టిపోయిన కొట్టాలకిక తాళాలతో పనిలేదు. అయితే రాత్రిళ్ళు గాడాంధకారం తాండవించకుండా సంజచీకటి పడగానే వెళ్ళి దీపారాధన మాత్రం క్రమం తప్పకుండా చేసి వస్తుంటుంది. కణ్ణకి దీపాల సంధ్యవేళ నిత్యమూ మాశాత్తువన్ గారి పురాతన భవంతి మారుమూలల్లోనూ, ఆమె కల్యాణ మంజీరాలు మంద్ర మధురంగా మ్రోగుతూనే వుంటాయి.

ఆ రోజున గబ గబ కణ్ణకి దగ్గరకు వచ్చింది దేవంతి. ఆమె ముఖం క్రోధంతో ధుమ ధుమ లాడుతూన్నది. వచ్చీరావటంతోనే యజమానురాలి ఆదేశం కోసం ఎదురు చూడకుండానే "ఇహ లాభం లేదమ్మా! ఇహ నేను సహించనిది. వెండి బంగారాలు ధనసంపదా దోచుకుంటున్నారు. దోచుకోనివ్వండి. కాని యిప్పుడు వాళ్ళు వంశప్రతిష్ఠ మీద కూడా చేయి వేస్తున్నారు. ప్రకోష్టంలో పెట్టిన వంశవృక్షపు బంగారు పట్టా కాస్తా మాయమయింది. అది దాస దాసీ జనం దొంగిలించే వస్తువు కాదు. దాని వల్ల మాధవి కోశాగార సంపద వృద్ధి కాదు. ఆమె ఎందుకు కాజేశారో తెలుసా?..." అంది.

"వంశవృక్షంలో క్రొత్తగా మాధవి కూతురు మణిమేఖల పేరు వ్రాయడానికి" అతి శాంతంగా సమాధానం చెప్పింది కణ్ణకి.

ఈ సమాధానం విని అదిరిపడింది దేవంతి. – "అయితే ఇది మీకు తెలుసా?" అంది ఆశ్చర్యంగా. "మీతో ఎవరు చెప్పారిది?"

అమాయమైన కణ్ణకి విశాల నేత్రాలలో క్షణం ఆత్మవేదన మెరిసి మాయమయింది. "ఎవరు చెప్పాలే మామగారి వంశాంకురానికి జన్మనిచ్చిన ఆ తల్లి మనస్సే తెలుసుకోలేనా నేను?" అంటూ దేవంతిని జబ్బ పట్టుకొని ఇవతలకు లాక్కుంది. కొంచెంసేపు ఆగి, "కాని ఇది ఆత్మవంచన దేవంతీ! మాధవి పాడి తప్పి ఇలా చేసింది" అంది.

"చూస్తూ వుండండి. నేను క్షణంలో వెళ్ళి మీరు చెప్పారని ఆ పట్టకం పుచ్చుకొని వస్తాను. వంశ ప్రతిష్ఠ విషయంలో ఇలాంటి అనాచారం తగదమ్మా! నేను మీ దాసీనే అయితే మీ బాల్యసఖిని కూడా – చిన్నప్పటి నుండి మీ రెండుకుటుంబాల సొమ్ము తిని ఇంతదాన్నయాను. నేను సహించలేనమ్మా ఇది."

"పిచ్చిదానా! ఒట్టి అనవసరమైన పంతం ఇది. ఆ వంశాంకురానికి కర్తలైన వారే దానికి అన్ని అధికారాలు యిచ్చి వేశాక మాధవిని ఏమిటే అడిగేది?"

"ఇంతకు వంశ ప్రతిష్ఠకు మూలం ఎవరు?"

"పురుషుడు."

"అయితే కావచ్చు కాని అది ఎవరి మీద ఆధారపడి వుంటుంది? వంశ పరంపరకు ఆధారం ఆడది. అది లేకుండా సంప్రదాయం నిలవదు. ఈ కుల మర్యాద అంతా ఇప్పుడు మీ అధీనంలో వుందమ్మా!"

చల్లగా ఒక నిట్టూర్పు విడిచి గంభీరంగా అంది కణ్ణకి "అయితే మాధవి కూడా ఆడదేగా. నువ్వూ నేనూ ఎలాగో ఆమె కూడా అంతే."

"ఆహా! అయితే ఇంకేం ఈ కళ్యాణ మంజీరాలు కూడా పట్టుకెళ్ళి దాని కాళ్ళకు పెట్టి రండి."

మౌనంగా వుండిపోయింది కణ్ణకి. ఏమనడానికీ వీలు లేదు పంతం పట్టి కూర్చున్నది దేవంతి. అందునా ఇది వంశ ప్రతిష్టకూ, సంప్రదాయానికి చెందిన విషయమై పోయింది.

ఆమె మౌనాన్ని అంగీకారంగా ఎంచి గబ – గబా మాధవి భవంతికి పరుగెత్తింది దేవంతి.

కోవలన్ సుందరమైన పరిచారికల వేశ్యకన్యల గుంపులో కూర్చుని పాచికలు ఆడుతున్నాడు. ఎదురుగా మధుపాత్ర పెట్టి వుంది. ఇప్పుడు అస్తమానం త్రాగడం; విహారాలూ తప్ప మరొక పనంటూ లేదు కోవలన్‌కు. మాధవి పూర్తిగా డబ్బు వ్యవహారాలు లావాదేవీలలో పడిపోయి ఎక్కువసేపు కోవలన్‌తో గడపడం లేదిప్పుడు. దేవంతి నేరుగ వెళ్ళి కోవలన్‌కు అభివాదం చేసి నిలుచుంది. ఈమె వస్తున్న జాడ తెలుసుకుందిలా వుంది మాధవి కూడా అక్కడికి పరుగెత్తుకు వచ్చి శరీరాన్ని సగం కోవలన్ మీద మోపి వయ్యారంగా కూర్చుంది. కోవలన్ దేవంతి ఎవరో అపరిచితురాలిని చూచినట్లు ఒకసారి

బొమలు చిట్లించి చూచి మళ్ళీ ఆటలో మునిగిపోయాడు. కేరింతలు, ఎకసెక్కాల మధ్య ఆట సాగుతున్నది. మాధవి కాని, కోవలన్ కాని, యితర పరిచారికలు కాని ఈమె సంగతి పట్టించుకున్నట్లు లేదు. నిల్చున్న పాటున అలాగే నిలబడిపోయింది. దేవంతి అలా ఎంతసేపు వుండిపోయిందో కాళ్ళు గుంజుకు వస్తున్నాయి. చివరకు తనే ధైర్యం కూడదీసుకొని అందరికీ వినిపించేటట్లు గొంతు హెచ్చించి "స్వామీ! తమ కుల లక్ష్మి సౌభాగ్యవతి కణ్ణకి మహాశ్రేష్ఠిగారి వంశ ప్రతిష్ఠ సాక్షిగా నన్ను మీ వద్దకు న్యాయాన్ని అర్థించడానికి పంపారు" అంది.

ఆ మాటతో మాధవి ముఖం మాడ్చుకుంది. గవ్వలు పిడికిట బట్టి క్షణం దేవంతివైపు చూశాడు కోవలన్. ఆ తరువాత కుదురుకొని కూర్చొని "ఓహో! అయితే మీ యజమానురాలు న్యాయాన్ని అర్థించడానికి నిన్ను పంపిందా? ఇన్ని సంవత్సరాల తరువాత ఇదే ఆమె మొదటిసారి అర్థించడం సరే! కానీ..." అన్నాడు.

క్రోధావేశంలో దిగ్గున లేచి నిల్చుంది మాధవి. రుసరుసలాడుతూ "సంగతేమిటో గ్రహించకుండానే మాట యిచ్చి నన్ను అన్యాయం చేస్తారా" అంది.

"పరమ సహనశీలి, త్యాగమయి అయిన కణ్ణకి తన కోసమని కాదు. మహాశ్రేష్ఠి గారి వంశ ప్రతిష్ఠ కోసమని న్యాయాన్ని అర్థిస్తున్నారు స్వామీ!"

"నీ ఉద్దేశమేమిటో చెప్పు"

"మహాశ్రేష్ఠిగారి కక్ష్యనుండి తమ వంశవృక్ష పట్టకాన్ని ఎవరికీ చెప్పకుండా ఎత్తుకు వచ్చారు స్వామీ!"

తటాలున అందుకుంది మాధవి. "అందులో అప్రతిష్ఠ కాని, అన్యాయం కాని ఏమీలేదే! యజమాని నివాసగృహం ఇదే కనుక పట్టకం కూడా ఇక్కడే వుంటుంది."

తను వున్న భవనం నాలుగువైపులా తల ఎత్తి పరిశీలనగా చూశాడు కోవలన్. మాధవి అతని భావాన్ని వెంటనే గ్రహించి స్వరం మార్చుతూ "ఆ పట్టకం అక్కడ వారి అజాగ్రత్త కారణంగా దుమ్ము ధూళి కొట్టుకొని మాసిపోయి వుంటే నేనే దానిని తెప్పించి శుభ్రపరచడానికని కంసాలి దగ్గరకు పంపాను. రేపు అది రాగానే ఇక్కడ ప్రతిష్ఠాపన జరుగుతుంది" అంది.

"ఓహో! అయితే వేశ్యా గృహాలలో చచ్చిన విటులకు ఇకనుంచి పిండ ప్రదానాలు కూడా జరుగుతున్నాయన్న మాట" అన్నాడు కోవలన్ వెటకారంగా.

ఈ మాటలతో మాధవి మరింత రెచ్చిపోతూ "నేను వేశ్యను కాను. జన్మతా కర్మతా కూడా నాకు ఆ జీవితానికి సంబంధం లేదు. సప్తపది అని, అగ్నిసాక్షి అనీ బూటకాలేవీ లేకుండానే నేను మిమ్మల్ని వరించాను. ఇప్పుడు నేనూ కుల వధువునే" అంది.

"కావచ్చు. సానికూడా సంసారిగా వుండవచ్చు. కానీ లోకం దానిని సానే అంటుంది. ఇప్పుడు నీ పితృదేవులు పన్నాశ్రేష్ఠి కూడా మీ అమ్మను ధర్మపత్ని అనలేరు."

"వారి సంగతి వేరు, నేనిప్పుడు మీ సంతానానికి తల్లిని" మరింత రోషంతో అంది మాధవి.

"అయితే మణిమేఖల పేరు చెక్కడానికన్నమాట వంశ వృక్షం తెప్పించింది. పట్టకం కంసాలి దగ్గరికి ఎందుకు వెళ్ళిందో ఇప్పుడర్థమయ్యింది" అంటూ పెద్దగా నవ్వాడు కోవలన్.

దేవంతి ఎదుట తనకు పరాభవం జరిగిపోతున్నట్లు తెలుసుకొని దెబ్బతిన్న శివంగిలా లేచింది మాధవి. "అసలు మీ వంశానికి ముందు ముందు ఇంత వెలుగునిచ్చేది నా సంతానమే. వంశ వృక్షంలో మణిమేఖల పేరు వుండి తీరుతుంది అంతే. లేదంటారా చూస్తూ వుండండి మీ ముందే నేను ప్రాణాలు వదులుతాను."

శిష్టాచారం మేరకు చూపు వాల్చుకొని మౌనంగా నిలుచున్న దేవంతి క్రీగంట మాధవి పౌరుషాన్ని, అది కోవలన్ మీద చూపుతున్న ప్రభావాన్ని కూడా గమనించింది. కోవలన్ మాధవివైపే తీక్షణంగా చూస్తూ కూర్చున్నాడు. ఒక క్షణం అతని కన్నుల్లో ప్రశ్నార్థకం మెరిసింది. కనుబొమలూ, ముఖమూ, పెదవులూ వీటి భంగిమల్లో ఆలోచనా తడబాటు వ్యక్తమయ్యాయి. ఆ తరువాత చూపుదించుకొని తలవాల్చి ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఈ మౌనం దేవంతిలో అంతులేని ఔత్సుకాన్ని మాధవిలో అనుమానాన్ని, భయాన్ని ఆశంకనూ రేపుతూన్నది.

చివరకు ఒక నిట్టూర్పు విడిచి సిగ్గుతో కూడిన చిరునవ్వుతో తన కాంతి విహీనమైన ముఖాన్ని ఎత్తి మాధవి వైపు చూచాడు కోవలన్. "నీ ప్రాణాలమీద నాకింత వ్యామోహం ఎందుకో అర్థమవదు. ఈ లోకాన్ని విడిచి ఇక నీతో తిరిగి వెళ్ళడానికి వీలులేనంత దూరం వచ్చేశాను. అలాగే నీ కూతురి పేరుకూడా మహాశ్రేష్ఠిగారి వంశ వృక్షంలో వుంటుందిక. ఆ పేరుతోపాటే మహాశ్రేష్ఠిగారి వంశవృక్షంలో ఇక, కామ విలాసాలు, దైహిక ప్రేమల స్వార్థాలు సాగుతాయని కూడా వ్రాయించు. దేవంతీ! ఇక నువ్వు వెళ్ళు. ఆమెతోపాటే న్యాయాన్నీ, వివేకాన్నీ పరిత్యజించానని మీ సఖితో చెప్పు..." అన్నాడు.

"చిత్తం! కానీ ఘనత వహించిన మహాశ్రేష్ఠిగారి వంశ ప్రతిష్ఠ...?"

"ఒకప్పుడు ఆ సంస్కారాలన్నీ కూడా నాలో వున్నమాట నిజమే! ఆ వివేకం కొద్దీ అన్న ఒక చిన్న మాటకే కత్తిదూసి నేను ఈమెను ఒకప్పుడు అంతం చేయడానికి సిద్ధపడిన మాట కూడా వాస్తవమే. అప్పుడూ ఈమె ప్రాణాలమీద వ్యామోహమే నన్ను జయించింది. ఇప్పుడిక ఆ ప్రసక్తేలేదు దేవంతీ" అంటూ మంత్రముగ్ధుడైనట్లు మాధవివైపు చూచాడు. కోవలన్ ఆ చూపులో రసికతకంటే భయమే ఎక్కువ స్ఫురించింది.

ఇది విని మాధవి గర్వంతోనూ, ఉపేక్షాభావంతోనూ, అందరివైపూ ఒకసారి చూచి మరింత ఠీవిగా కూర్చుంది.

దేవంతి యథాపూర్వం తలవంచి, చేతులు జోడించి సక్రమంగానే అయినా ఎంతో దృఢంగా "స్వామి సెలవిచ్చింది తప్పకుండా కులస్వామిని సమక్షంలో విన్నవిస్తాను. కాని కేవలం వ్యక్తులకు మాత్రమే సంబంధించిన సమస్య కాదు. మొత్తం సంఘానికే సంబంధించిన సమస్య అని నా విన్నపం. నేను ఏ వంశ ప్రతిష్ఠకోసమైతే బ్రతుకుతున్నానో దాన్ని అసహ్యం పాలుజేస్తున్న ఈ చర్యను గురించి, పరమ సౌభాగ్యవతి, సుగుణశీల కణ్ణకి పక్షాన నేనే వెళ్ళి గౌరవనీయులు చోళ మహారాజు సమక్షంలో న్యాయాన్ని అర్థిస్తాను."

"సాంఘిక సమస్యా ఇది?" పెద్దగా అరిచింది మాధవి. గట్టిగా పిడికిళ్ళు బిగించి లేచి నిలుచుంది. "అయితే నేనూ న్యాయాన్ని అర్థిస్తాను. దొంగల్ని కుంటెన కత్తెల్ని, నియోగించి, పాచికలు వేసి వలలు పన్ని మమ్మల్ని అంగడి వస్తువులుగా మార్చేటప్పుడు ఏమైపోయిందీ, సంఘ ప్రతిష్ఠ. నాకు నేనై తెలిసి ఈ వేశ్యకు అమ్ముడు పోలేదు. నేనూ కుల వధువునే. నా ప్రతిష్ట ఏదో నాకుంది."

"దేవిగారి అభిప్రాయాలను ఈ దాసీ గౌరవిస్తూ వున్నది కాని సమస్య సమస్యే. రాజదర్బారులో న్యాయాన్ని ఆర్థించక తప్పదు" ఎంతో వినయంగానే అన్నా దేవంతి స్వరంలో ఉన్న దృఢత్వం అజేయం అనిపించింది అందరికీ.

"మహారాజు అక్కరలేదు. యమధర్మరాజు చాలు నీకు న్యాయాన్నివ్వడానికి" మాధవి శరీరం అగ్ని గుండంలా కణ కణ మండిపోతూన్నది. తటాలున లేచి దేవంతి మెడను గట్టిగా ఒడిసి పట్టుకున్నది. వెంటనే తీవ్రమైన కోపంతో లేచి నిల్చున్నాడు కోవలన్. విలాస జర్జరమైన తన శరీరంలో మిగిలిన బలాన్నంతా వుపయోగించి మాధవిని చెంపమీద ఒక్కటి వేసి అవతలికి నెట్టాడు. హఠాత్తుగా పడిన విఘాతానికి కొయ్యబారి నిలబడి పోయింది మాధవి. ఇంతలో నాగరత్న వచ్చి ఆదుకుంది. మిగిలిన పరిచారికలకు గాని, దాసులకు గాని, యజమానురాలు, కోవలన్‌కు మధ్య కల్పించుకునే సాహసం లేదు.

తీవ్రంగా రొప్పుతూ నిలుచున్నాడు కోవలన్. ఇన్ని సంవత్సరాల తరువాత ఇప్పుడు బలాన్ని ఉపయోగించవలసి రావడంతో తను క్రమేపీ శక్తిహీనుడనై పోతున్నానన్న సంగతి తెలిసి వచ్చి దిగులు పడిపోతున్నాడతడు. ఈ దిగులుతో పాటు నాగరత్న ధోరణి మరింత రెచ్చిపోయేట్లు చేసింది. దాంతో మరింత మండిపోయి గొంతుచించుకుంటూ "వెళ్ళు తక్షణం వెళ్ళిపో నా యింట్లో నుంచి" అన్నాడు. తర్వాత ఇంకొక దాసీ వైపు సైగచేస్తూ, దీన్ని జుట్టుపట్టుకొని బైటికి ఈడ్చి తలుపులు బంధించు అంటూ ఆదేశించాడు.

క్రోధావేశంతో లేని నిలుచుంది మాధవి. "ఇల్లునాది నా తండ్రి యౌతుకంలో ఇచ్చింది. ఆ దాసీ కూడా నాదే. నా తల్లి నా కోసమని కొన్నది" అంది.

"యౌతుకం!" బాగా రెచ్చిపోయి వికటంగా అన్నాడు కోవలన్. "వేశ్యకు అమ్ముడు పోయిన బిడ్డవి. తల్లిని వుంచుకున్నవాడి ఐశ్వర్యం చూచుకొని మహాశ్రేష్ఠి గారి కొడుకు మీదనా నీ ప్రతాపం. నేను నిన్నేకాదు, నీ తల్లినీ నీ తండ్రిని కూడా ఒకటి కాదు రెండుసార్లు కొని దానపశువుల్లాగా వీధుల్లో విడిచెయ్యగలను తెలుసా?! ఇంకా నిలుచున్నావేం వెళ్ళిపో నా ముందునుంచి. ఈ నాగరత్నను దీన్ని నేనే జుట్టు పట్టుకొని..." అంటూ తనే పళ్ళు కొరుకుతూ నాగరత్నను జుట్టుపట్టి బైటకు ఈడ్చుకు పోతున్నాడు కోవలన్. పట్టరాని ఆగ్రహంతో ప్రతీకారం కోసమని లేచి నిలుచుంది మాధవి. కాని అడుగు ముందుకు వేసిందో లేదో వెనకనించి బలంగా భుజం పట్టుకొని లాగినట్లయి తిరిగి చూచింది. ఆశ్చర్యం! నిండా కాషాయవస్త్రాలు ధరించి చేలమ్మ నిలబడి వుంది. ఆమె శరీరం మీద వికృతంగా కనిపించే కుష్టుమచ్చలు మాయమైపోయి ఇప్పుడు శరీరం బంగారు కాంతితో వింతగొలుపుతూన్నది. ఆమె నీ స్థితిలో చూచి నోటమాట రాలేదు మాధవికి.

⁂ ⁂ ⁂

మాధవినీ, నాగరత్నను తీసుకొని పెరియన్నాయకి దగ్గరకు బైలుదేరింది చేలమ్మ. ఆమెను ఇంతకాలమూ ఎక్కడికి వెళ్ళావని కాని, ఏమి చేస్తున్నావని కాని, అంత జబ్బా మాయమైపోయి ఈ ఆరోగ్యం ఎలా చేకూరిందని కానీ ప్రశ్నించలేదు మాధవి. దారి పొడుగునా తన మణిమేఖలను గురించే చెప్తూ పోయింది. కోవలన్ అధర్మ ప్రవర్తనను గురించి ఏకరువు పెట్టింది. "ఇప్పుడు బాగా సుఖభోగి అయిపోయారాయన – కామ వాంఛ తీర్చుకోవడానికి జాతి, మతాలు, ఉచ్ఛ నీచాలు ఏ మాత్రం అడ్డు రావడం లేదు. ఇష్టం వచ్చినట్లు త్రాగి తూలుతూ రాజవీధుల్లో వార కాంతల వెంటబడుతూ వుంటే మహాశ్రేష్ఠిగారి వంశానికి మచ్చరాదు. కాని నా మణి పేరు కాస్త వంశవృక్షంలో చెక్కినంత మాత్రాన్నే ఈయనగారి తల తెగిపోతుందట పాపం! ఎంత డంబాచారవోఁ! నేను చూస్తానుగా, అదీ ఎంత వరకో, నేను నా మణిమేఖలతో కూడా వెళ్ళి మహాశ్రేష్ఠిగారి భవంతిలోనే వుంటాను. ఇక మహాశ్రేష్ఠిగారి మనుమరాలిది. దానికేం తక్కువైందని, బౌద్ధాచార్యులు వచ్చి విద్య నేర్పుతున్నారు దానికి, ఉత్తమ బ్రాహ్మణ సన్యాసిని వచ్చి రోజూ కులాచారాలు బోధించి వెడుతున్నది. అదీ గాక నగరంలో యిప్పుడు మహాశ్రేష్ఠిగారికే ముందని. ఇప్పుడు పలుకుబడి అంతా తండ్రిగారిదే. ఇప్పటినుంచే ఆయన మణిమేఖల కోసం వరాన్వేషణ ప్రారంభించారు. ఉత్తమ వంశానికి చెందిన మంచి వరుడ్ని చూచి తన సంపదనంతా వాళ్ళిద్దరిపేరా పెట్టి తను విశ్రాంతి తీసుకోవాలని చూస్తున్నారాయన."

ఎత్తైన సీడీల మీదుగా క్రిందికి దొర్లిందేమో బాగా గాయాలు తగిలాయి నాగరత్నకు. ఆమె శిరస్సును చేలమ్మ హృదయం మీద ఆన్చి ఏదో తెలియని ఉపశాంతిని పొందుతూ వుండిపోయింది. చేలమ్మ తన రెండు చేతులను ఆమె భుజాల మీద వుంచి మార్గంవైపు చూస్తూ దారి పొడుగునా మాధవి చెప్పేదంతా మౌనంగా వింటూ కూర్చున్నది.

ఇన్నాళ్ళకు చేలమ్మను తిరిగి ఈ రూపంలో చూచీ చూడటంతోనే నిలువునా ఆశ్చర్యంలో మునిగి పోయింది పెరియన్నాయకి. కళ్ళు ఇంతింత చేసుకొని నిల్చున్నది నిల్చున్నట్లే వుండిపోయింది. ఆ కాషాయ వస్త్రాలు, ఆ ముఖ వర్చస్సు చూస్తూ వుంటే ఆమె కండ్లు తిరుగుతున్నాయి. ఇంతలో చేలమ్మే ఈ దిగ్భ్రాంతిని చెదరగొడ్తూ చేతులుచాచి తన బాల్య సఖిని గట్టిగా కౌగలించుకుంది. పెరియన్నాయకి హృదయంలోనూ ఎక్కడో అణిగి మణిగివున్న స్నేహ భావం పెల్లుబికి వచ్చి నేత్రాలు అశ్రుసిక్తాలయ్యాయి. మాధవి ఇదంతా చూస్తూ కూడా గమనించనట్లే తనలో తను మునిగిపోయి ఏమిటో ఆలోచిస్తూ నిలుచున్నది.

"ఒసేవ్! చచ్చిందానా! ఎక్కడికెళ్ళావే యింత కాలం? ఈ వేష మేమిటి? ఈ రూపమేమిటి? ఇన్నేళ్ళ తర్వాత వున్నట్లుండి పిడుగులా వూడి పడ్డావు కదే." అంటూ ఆపైన ఇక మాట పెగలక మళ్ళీ ఒకసారి చేలమ్మను కౌగలించుకొని కంటతడి బెట్టుకుంది పెరియన్నాయకి. ఇద్దరు స్నేహితురాండ్రు కుదురుగా కూర్చొని సుఖదుఃఖాలు చెప్పుకుంటున్నారు. మాధవికి ఈ మాటల్లో మనసు పోవడం లేదు. అన్యమనస్కంగా లేచి లోపలికి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిపోవడం చూచి మౌనం వహించింది పెరియన్నాయకి. చేలమ్మ మాధవి సంగతి ఏదో అడగాలని అనుకుంది కాని పెరియన్నాయకి ఆమెను ప్రశ్నలతో ముంచెత్తి ఆ అవకాశం లేకుండా చేసింది. చేలమ్మ ఇంతకాలమూ ఎక్కడికి వెళ్ళిందో? రోగమూ రొష్టు పోయి ఇంత చక్కటి ఆరోగ్యం, ఈ శరీరకాంతి ఎలా వచ్చిందో తెలుసుకోవడానికి తహ–తహ లాడుతున్నది పెరియన్నాయకి. ఇంత సంపదా వైభవమూ పొంది కూడా చివరికి తమ చేలమ్మ ముందు పూర్తిగా ఓడిపోయినట్లే అనిపిస్తున్నదామెకు. కాని ఇప్పుడీ పరాజయంలో ఈర్ష్యకంటే ఆదర భావమే ఎక్కువ.

పదిహేను సంవత్సరాలకు పూర్వం కణ్ణకి శోభనం నాడు మాధవి దురాగ్రహం కారణంగా మహాజన సమాజంలో రేగిన ఆందోళన మీద విజయవంతంగా పోరాడి నగరం విడిచి వెళ్ళిపోయింది చేలమ్మ. దాని ఫలితం సవ్యంగా వుండదని, మాధవికి తప్పక కీడు జరిగి తీరుతుందని, అదంతా తను చూడవలసి వస్తుందనే అలా ముఖం తప్పించింది.

అక్కడ్నించి నేరుగా ఒక యాత్రా మండలితో కలిసి కంచి వెళ్ళింది. అక్కడి నుంచి ఉత్తరదేశ యాత్రకు వెళ్ళే జట్టును పట్టుకొని కాశీ వెళ్ళింది. కాశీ నగరానికి వెలుపల గంగ ఒడ్డున ఏనాటిదో శిథిలమైన ప్రాసాదమొకటి వుంది. దాని గోడల మధ్య ఒక చోట నివాసం ఏర్పరచుకుంది. అక్కడే ఒక సాధువుతో పరిచయం ఏర్పడి చాలాకాలం అతనికి సేవలు, సపర్యలు చేస్తూ వుండిపోయింది. అతడే ఏవేవో ఔషధాలు వాడి ఈ స్థితికి తెచ్చాడు.

జబ్బు నయం అయ్యాక కూడా చాలాకాలం అక్కడే వుండిపోయిందామె. దారి ప్రక్క ఒక చెట్టు క్రింద కూర్చొని బాటసారులకు మంచినీళ్ళు అందిస్తూ ఉండేది. సంవత్సరాలు గడిచిపోయాక స్వస్థలమూ, మాధవీ గుర్తుకువచ్చి మళ్ళీ యాత్రికుల జట్టుతో కలిసి బైలుదేరింది.

"నగరంలోకి అడుగు పెట్టగానే భయపడ్తూ, భయపడ్తూనే ముందు మాధవి గురించి తెలుసుకున్నాను. ఆ తరువాత నిన్నూ నీ శ్రేష్ఠిని గురించి వాకబు చేశాను. ఆ తర్వాతే మాధవి దగ్గరకెళ్ళి ఈ దృశ్యం చూశాను" అంటూ తను మాధవి భవనంలో చూచిందంతా చెప్పింది చేలమ్మ. అంతా విని ఆలోచనలో పడిపోయింది పెరియన్నాయకి. ఆ తరువాత నుదురు బాదుకొని "ఏం చెప్పమంటావు. అంతా నా ఖర్మ. చివరి సమయంలో కూడా నన్ను నిశ్చింతగా చావనీయదిది. దీనివల్ల నా గుండె జల్లెడలా తూట్లు పడిపోయిందనుకో. కాలానికే ఎదురీదాలని చూస్తుందిది. ఆ పన్నాశ్రేష్ఠి దీనికి తగ్గట్లే దొరికారు. దేశకాలాన్ని, ఆచార సంప్రదాయాల్ని కాదని సాని కూతుర్ని కులవధువుని చేయాలని చూస్తున్నారాయన. ఇప్పుడు పూర్తి నగరమూ, నగర మహాశ్రేష్ఠులు, పెద్ద, పెద్ద రాజోద్యోగులు తన గుప్పిట్లో వున్నారని ఎవ్వరూ తను చేసిన దానికి వ్యతిరేకం చేయలేరని అంటున్నాడు. నగర పరిస్థితుల్ని చూస్తుంటే నాకూ  ఒకొకసారి హడలు పుడుతున్నదే చేలూ!"

ఎన్నో సుఖభోగాలూ, అష్టైశ్వర్యాలూ అనుభవిస్తున్నా ఒంటరిదైపోయి మనశ్శాంతిని కోల్పోయింది పెరియన్నాయకి. మాధవి వేరే వుంటున్నది. నగర వేశ్య వాడలోనే కాక వ్యాపార క్షేత్రంలో కూడా ఇప్పుడు ఎక్కడ విన్నా మాధవి పేరే వినవస్తూన్నది. పన్నా క్రమం తప్పకుండా పెరియన్నాయకి దగ్గరికి వస్తూనే వున్నారు. ఆయన ప్రేమానురాగాలలో కూడా లోపం లేదు. కాని ఆయన కూడా అస్తమానం మాధవినీ, వ్యాపార రంగంలో ఆమెకున్న నేర్పును పొగుడుతూ కూర్చోవడం రుచించడంలేదు పెరియన్నాయకికి. మొదట ఇదంతా ఆమెకు ఈర్ష్యగా వుండేది. ఇప్పుడు రాను రాను అదొక తటస్థతగా మారిపోయింది. ఆ తటస్థభావం వల్లనే ఇప్పుడు తన జీవితం తనకే నిస్సారమనిపిస్తూన్నది పెరియన్నాయకికి. ధనం వున్నది, దాసదాసీ జనమూ, సుఖ వైభవాలూ వున్నాయి. అయినా

ఏదో లోపం వుండిపోయినట్లనిపిస్తుందామెకు. మాధవి వ్యాపార కలాపాల్లో పన్నాశ్రేష్ఠికి తోడ్పడుతున్నది. మరి తను ఏం చేయాలి. గోళ్ళు గిల్లుకుంటూ కూర్చొని తను చేయవలసింది ఏమిటి? అన్నదానమా? ధర్మశాలలు కట్టించి యశస్సు పొందడమా? గుళ్ళూ, గోపురాలు నిర్మించడమా? ఏమిటి చేయాలి తను. ఈ ఏమిటనే ప్రశ్నార్థకం మాట మాటకీ ఆమె ముందుకు వచ్చి విసిగిస్తున్నదామెను. ఇంత కాలానికి తన బాల్య సఖి చేలమ్మను చూసి ఏదో మనశ్శాంతి లభించినట్లు అనిపించింది. ఆమెపట్ల లోగడ వుండిన ఈర్ష్యాద్వేషాలు, ఆగ్రహావేశాలు పూర్తిగా మరచిపోయింది. తన నిస్సహాయ స్థితికి ఆమె ఒక ఆలంబనగా లభించినట్లనిపించి కొంత ఊరట చెందింది. అయితే ఈ మనశ్శాంతి ఎంతో కాలం కొనసాగలేదు.

దేవంతి వెళ్ళి జరిగిందంతా మహాశ్రేష్ఠిగారికి నివేదించింది. సంయోగవశాత్తూ అప్పుడే కొందరు నగర శ్రేష్ఠులు కూడా ఆయనను కలుసుకోవడానికి వచ్చారు. అటు మహారాజుగారు కూడా విజయ యాత్రలు ముగించుకొని ధనరాసులతో రాజధానికి చేరుకున్నట్లు వర్తమానం వచ్చింది. రాజదర్బారులో మహాశ్రేష్ఠిగారికి తగిన గౌరవాదరాలున్నాయి. నగరశ్రేష్ఠులు అందుకే నేరుగా వచ్చి మహాశ్రేష్ఠిగారి దగ్గర మొరపెట్టుకున్నారు.

“నగరంలో ఎటుచూచినా పన్నా పలుకుబడి పెరిగిపోతూన్నది. మన యింట్లోనే యవనులు మనమీద పెత్తనం చలాయిస్తున్నారు. పరువు, మర్యాదలు, కుల మర్యాదలు భ్రష్టమైపోతున్నాయి” అంటూ “వెంటనే కల్పించుకొని దీనికేదో ప్రతిక్రియ చేయకపోతే మహాజన శ్రేష్ఠుల వంశ మర్యాదలు వేశ్యవాడలో అమ్ముడు పోవడమే కాదు. అసలు కావేరీ పట్టణమే తప్పక యవన నగరం అయిపోతూంది.”

అంతా విన్నాక కనువిప్పు కలిగింది మహాశ్రేష్ఠిగారికి. చాలాసేపు గంభీరంగా ఆలోచిస్తూ వుండి వుండి చివరికి ఒక దృఢ నిశ్చయానికి వచ్చారాయన. అప్పటికప్పుడు ఆయన నేతృత్వంలో నగర ముఖ్యులు పదిమంది మహారాజుగారి సన్నిధికి రాయబారం వెళ్ళాలనీ నిశ్చయించుకొని, అందుకు తగిన ఏర్పాట్లూ, ఆలోచనలూ కొనసాగుతున్నాయి.

ఈ సమాచారం రోమన్ వర్తక దళంలో తీవ్రమైన సంచలనాన్నే కలిగించింది. పన్నా తదితర రోమన్ శ్రేష్ఠులు సంవత్సరాలుగా ఇక్కడ తమ తమ వ్యాపారాలను యధేచ్ఛగా సాగించుకుంటున్నారు. మహాశ్రేష్ఠులిద్దరి ప్రభావాలూ అణగిపోయి వారికి పూర్తి విజయాలు లభిస్తున్న సమయంలో మళ్ళీ యిప్పుడొక పెద్ద అవరోధం ఎదురౌతున్నది వారికి. వాళ్లంతా దీనికి తగిన ప్రతీకారం చేయాలని నడుం బిగించారు. అందుకు ముందు రాజధానికి వెళ్ళే దళ సభ్యుల్ని చీలతీయాలి. సంచులకొద్దీ రోమన్ నాణాలు విరజిమ్మి, వేశ్యల్ని మప్పి, మాధవి ఆకర్షణకు ఉపయోగించుకొని వృద్ధులైన సభ్యుల సంతానాన్ని, సంబంధీకుల్ని

వాళ్ళుకొనివేశారు. పన్నాశ్రేష్టి మాటకారితనం వాళ్ళను బాగా ఆకట్టుకున్నది. ఇప్పుడా యువకులందరూ నగర ముఖ్యులు రాయబారం వెళ్ళడానికి తీవ్రంగా నిరసిస్తున్నారు.

వంశ వృక్ష పట్టకం కారణంగా ఉత్పన్నమైన ఈ తీవ్ర పరిస్థితే తన జయాపజయాలకు గీటురాయి అనిపిస్తూన్నది మాధవికి. కోవలన్ వంశ వృక్షంలో తన కూతురి పేరు వుండి తీరాలనే ఆమె తీవ్ర వాంఛను ఎప్పటికప్పుడు పెరియన్నాయకి, చేలమ్మ కూడా అణచివేయాలని చూస్తుంటే, పన్నాశ్రేష్టి మాత్రం రోజు రోజుకూ ప్రోత్సాహాన్నిచ్చి ఆమెను ముందుకు నడిపిస్తున్నారు. అయితే ఆమె స్వార్థమే కాక పన్నా స్వార్థమూ వున్నాయి యిందులో. ఏమైనా వృద్ధ సింహం మహాశ్రేష్ఠిని అణిచిపెట్టి మరి శాశ్వతంగా తల ఎత్తకుండా చేయాలి. అదీ ఆమె సంకల్పం. అందుకని అహోరాత్రులు నిద్రాహారాలు లేకుండా కృషి చేస్తుంది మాధవి. రాయబార సభ్యుల్లో కనీసం అయిదుగుర్నైనా చీల్చగలమనే విశ్వాసం వుందివారికి. అదీకాక రాజోద్యోగులలో సగానికి పైగా పన్నా ప్రభావానికి లొంగేవాళ్ళే. వాళ్ళంతా అవసరమైనప్పుడు తప్పకుండా రాజాస్థానంలో పన్నాశ్రేష్ఠి పక్షాన్ని బలపరిచేవాళ్ళే. పైపెచ్చు నగర యువకులంతా యిప్పుడు వారిచుట్టే తిరుగుతున్నారు. వీటన్నిటి దృష్ట్యా ఈసారి తమకు విజయం లభించి తీరుతుందని భావిస్తున్నారు. కాని అంతా వారు భావించినట్లే జరుగలేదు. రాయబార వర్గ సభ్యులు ఎనిమిది మందీ ఒకరాత్రి ఎవరికీ తెలియకుండానే మహాశ్రేష్ఠిగారిని తీసికొని ప్రయాణమై వెళ్ళిపోయారు. వాళ్ళిలా తప్పించుకొని వెళ్ళిపోవడం విన్న వెంటనే యువనశ్రేష్ఠులు మరింత ప్రతీకార వాంఛతో మండిపడి రాజధానికి వెళ్ళే అన్ని మార్గాలమీద దళ సభ్యుల్ని అంతం చేయవలసిందిగా ఆదేశించి జట్లు జట్లుగా హంతకుల్ని ఏర్పాటు చేశారు.

యవన శ్రేష్ఠులందరికన్నా చతురుడు, నేర్పరి, జాగ్రత్తకలవాడు మహాశ్రేష్ఠి. ఈ కుతంత్రాలన్నీ ఆయనకు కొట్టిన పిండే! అందుకే ఆయన రాజధానికి వెళ్లే మార్గాలన్నీ విడిచి తన దళంతో నేరుగా చేరనూ రాజ్యంలోకి ప్రవేశించారు. పన్నా దళానికి చెందినవారు ఇటు కావేరీ పట్టణంలోనూ, అటు రాజధానిలోనూ పూర్తిగా ఆశ్చర్యచకితులయ్యారు. మహాశ్రేష్ఠిగారి దళం రాజధాని చేరలేదు. కావేరీ పట్టణంలోనూ లేరు. మరి ఏమైపోయారో వాళ్ళకు అంతు పట్టడం లేదు.

మహాశ్రేష్ఠిగారు తన సహచరులతో చేరనూ రాజ్యంలోనే వుండి, అక్కడి ప్రసిద్ధి చెందిన ఒక బేహారీని రాజధానికి పంపారు. ఇతర దేశాలకు చెందిన ప్రముఖులు తరచూ రాజాస్థానానికి వస్తూ పోతూ వుండేవారు. అలాగే ఈ బేహారీ కూడా వెళ్ళి కావేరీ పట్టణం సంగతి అంతా మహారాజు చెవిని వేశాడు. వెంటనే మహారాజుగారు చేరనూ రాజ్య సరిహద్దులో వేటకోసం వస్తున్నట్లు వార్త వచ్చింది? అది జరిగిన కొన్ని రోజులకే

చోళరాజధాని ఇక నుండి దరయూరు కాక కావేరీ పట్టణంలోనే వుంటుందని ఇంద్రోత్సవాల నుండే మహారాజు కావేరీ పట్టణాన్ని రాజధానిగా ప్రకటించి ఇక్కడే వుండిపోతారని కూడా వార్త వచ్చింది.

ఈ వార్త విని నిలువున ముచ్చెమటలు పోశాయి పన్సాకు. ఇన్నేళ్ళ తరువాత రెండవసారి మళ్ళీ చోళరాజ్యం విడిచిపెట్టి పారిపోవడం తప్పని సరేమో అనిపిస్తూ వున్నదాయనకు.

విపరీతమైన క్రోధావేశంతో పిచ్చిదైపోయింది మాధవి. మళ్ళీ ఆమె ఆశలు భగ్నమయ్యాయి. అసలు జీవిత గమనమే స్తంభించి పోయినట్లనిపిస్తూన్నదామెకు. ఈసారి పన్సాతో బాటు పెరియన్నాయకి కూడా ప్రయాణమౌతున్నది. పైపెచ్చు మణిమేఖలను తీసుకొని తనను కూడా నగరం విడిచి తనతో రావలసిందిగా బలవంతపెడుతున్నారు వాళ్ళు.

తన సంకల్పాన్ని విడిచి పారిపోవడానికి ఏమాత్రం సంసిద్ధంగా లేదు మాధవి. పైపెచ్చు అనుకోకుండా జరిగిన ఈ విచిత్ర ఘటనలు ఆమె పట్టుదలను ఇంకా వృద్ధిచేశాయి. మహాశ్రేష్ఠి మీద పగసాధించడానికి, కణ్ణకి కళ్యాణ మంజీరాలని కూడా కోవలన్ ద్వారా రాబట్టుకుంటుంది తను. అంతేకాదు తన సవతి కణ్ణకిని తను మహాశ్రేష్ఠిగారి భవంతి నుండి కూడా వెళ్ళగొట్టించి తీరుతుంది. మహాశ్రేష్ఠికి మహారాజుగారి ఆదరం వుంటే వుండవచ్చు. ఆయనమాట మహారాజుగారికి శిరోధార్యమే కావచ్చు. అయినా మాధవిని జయించలేడాయన. ఎందువలనంటే ఆయన ప్రాణపక్షి కోవలన్ రూపంలో ఇక్కడ మాధవి చేతుల్లో చిక్కుబడిపోయింది.

పెరియన్నాయకీ, పన్సాశ్రేష్ఠీ ఆమెకు నచ్చజెప్పలేక విసుగెత్తి చివరకు విధికి ఒప్పజెప్పి ఇహను తమ ప్రయాణపు ఏర్పాట్లలో మునిగిపోయారు. సాధ్యమైనంత మేర తన ధన సంపదని, వెండి, బంగారము, విలువైన వజ్రాలు, రత్నాలు భద్రపరచుకొని మిగిలినదంతా మాధవి పరంచేసి పన్సాశ్రేష్ఠి, పెరియన్నాయకి, మరికొంతమంది యవన ప్రముఖులు రాత్రికి రాత్రి రహస్యంగా నగర పొలిమేరలు దాటి బయటపడ్డారు. కాని విధి వెంటాడుతూనే వుంది వారిని. పొలిమేరలు దాటారో, లేదో దస్యులు పెద్ద ఎత్తున చుట్టుముట్టారు. పన్సాను, పెరియన్నాయకిని, ఇంకా ఒకరిద్దరు యవనశ్రేష్ఠుల్నీ చంపివేసి, ధన సంపదా జవహరీ దోచుకొని వెళ్ళిపోయారు. ఈ వార్త విని కావేరీ పట్టణంలో అంతా చివరకు మహాశ్రేష్ఠి తన పగ తీర్చుకున్నారని చెప్పుకుంటున్నారు.

మాధవి నెత్తిమీద మరొకసారి పిడుగు పడింది. కాని దాంతో ఆమె పట్టుదల అణిగి పోవడానికి బదులు మరింత విజృంభించింది. తీవ్రమైన ప్రతీకార జ్వాల ఇప్పుడామెను నిలువునా దహించి వేస్తూన్నది.

# 22

పన్నాశ్రేష్ఠి ఇతర రోమను వ్యాపారులు వెళ్ళిపోవడం వల్ల ఏఏ పరిణామాలు తప్పనిసరని అనుభవజ్ఞులైన నగర శ్రేష్ఠులు ముందుగానే ఊహించారో అవన్నీ జరిగి తీరాయి. కావేరీ పట్టణంలో ఇప్పుడుపెద్ద పెద్ద వర్తక కోష్ఠాలన్నీ దివాలా తీశాయి. భోగ విలాసాలలో మునిగిపోయి యువశ్రేష్ఠులు తమ తమ వర్తక వ్యవహారాలను గురించి ఇంతకాలమూ పట్టించుకోవడమే మానుకున్నారు. వాళ్ళంతా పూర్తిగా వ్యాపార రీత్యా ఇంతకాలమూ పన్నామీద ఆధారపడి వున్నవాళ్ళే. వాళ్ళ వర్తకపు సరుకుల ఎగుమతి దిగుమతులన్నీ పన్నా ద్వారానే జరుగుతూ వచ్చాయి. అయిన దానికి, కాని దానికి అతనిమీద ఆధారపడడం తప్ప విదేశీ వర్తకులెవరితోనూ వారికి స్వతంత్ర సంబంధాలనేవి లేవు. ఇప్పుడు పన్నా వెళ్ళిపోవడంతో వీళ్ళ వర్తకం స్తంభించిపోయి పూర్తిగా దివాళాతీసే స్థితికి వచ్చింది. అదీగాక అసలు విపణిలో వున్న స్థిరత్వమే పూర్తిగా దెబ్బతిని పోయిందిప్పుడు. యువక శ్రేష్ఠుల భోగలాలసత్వం వల్ల వర్తక వ్యవహారాలన్నీ ఇంతకాలమూ వేశ్యల ఆదేశాల మేరకు వర్తక విపణికి బదులుగా, వేశ్య విపణిలోనే జరుగుతూ వచ్చాయి. అనుభవజ్ఞులైన దేశ దళారీల, కార్య వాహుల సలహాలను పాటించడం వాళ్ళేనాడో మానుకున్నారు. రాను రాను వారికి వర్తక వృద్ధిమీద ఆసక్తి అనేదే పూర్తిగా నశించిపోయి ఎవరి ధనమైనా సరే తమ చేతుల మీదుగా తిరుగుతూ వుంటే అంతే చాలనే స్థితికి వచ్చారు. ఫలితంగా వాళ్ళ భవంతుల్లోని రహస్య కోశాలు కూడా తరిగిపోతూ వచ్చాయి. యజమానులు దారి తప్పి నడవడంలో కార్య వాహులు ఇతర ఉద్యోగులు కూడా కట్టుదప్పి అందిన మట్టుకు చేజిక్కించుకోసాగారు. రాజోద్యోగులందరినీ కావేరీ పట్టణం నుండి రాజధాని వరకు లంచాలుపెట్టి, బహుమతులు ఇచ్చి తన గుప్పిట్లో వుంచుకున్నాడు పన్నా. మహారాజు దర్బారుకు కూడా తరచూ అమూల్యమైన బహుమతులు పంపుతూ వుండేవాడు.

మహారాజు నిత్యం యుద్ధాలలో మునిగి తేలుతున్నాడు. ఇతర విషయాలేవీ ఆలోచించే తీరిక లేదాయనకు. ఎప్పుడో ఇంద్రోత్సవాలకు కావేరీ పట్టణం రావడం తప్ప అక్కడి ఆర్థిక పరిస్థితులిలా చిన్నాభిన్నమైపోతూ వున్నవన్న సంగతే తెలియదాయనకు. పన్నా శ్రేష్ఠిగారి సమస్యను ఇంత కాలమూ కేవలం ఒక వ్యక్తిగతమైన సమస్యగానే భావిస్తూ వచ్చారాయన.

ఆర్థిక సంక్షోభంతో పాటు నైతికంగా కూడా నగర పరిస్థితి నానాటికి దిగజారి పోతున్నది. విదేశ శ్రేష్ఠుల సంపర్కం వేశ్య వాడల వృద్ధితో అసంతృప్తులైన కులస్త్రీలలో కూడా ఇప్పుడు భ్రష్టాచారాలు ప్రబలుతున్నాయి.

నగర వృద్ధ శ్రేష్ఠులు, మహాశ్రేష్ఠి ఆసరాతో శత్రువుల కుతంత్రాలను సమూలంగా అణచగలిగినా, పట్టినప్పాకం మరువూరుప్పాకం లాంటి మహాజన వాడల శ్రేష్ఠుల నివాసాలు ఇప్పుడు వేశ్య వీధులముందు వెల తెలా పోతున్నాయి. ఎటుచూచినా విశృంఖలత్వమే. అవినీతే కనిపిస్తూన్నది. నగర మహాలక్ష్మిని పునర్జీవింప చేయటం ఎలాగో తోచక అనుభవజ్ఞులైన వృద్ధ శ్రేష్ఠిగణం తికమక పడిపోతున్నారు. ఏదో ఆవేశం కొద్దీ మహాశ్రేష్ఠిగారు ఇంతవరకూ సాధించుకు వచ్చారుగాని, ఇంత జరిగాక ఇప్పుడాయనకు దేనిమీదా ఆసక్తి లేకుండా పోయింది. వున్న ఒక అల్లుడు ఆయన ఆశాసౌధాలను నేలమట్టం చేసివేశాడు. ఆశలన్నీ అడియాసలు అయిపోగా ఇప్పుడు జీవితమే నిస్సారంగా తోస్తూన్నదాయనకు.

పరిస్థితుల్ని గమనించి కోవలన్‌కు దగ్గర సంబంధీకులైన ఇద్దరు వృద్ధశ్రేష్ఠులు ఎలా అయినా సరే మహాశ్రేష్ఠిగారికి తిరిగి ఉత్సాహాన్ని కార్యాసక్తిని కలిగించాలని రంగంలోకి వచ్చారు. అందుకు ముందు కోవలన్‌తో సంప్రతించడం అవసరం అయితే కోవలన్ మాధవి అనుమతి లేకుండా మహాశ్రేష్ఠితోగాని, మరే ఇతర శ్రేష్ఠులతో గాని సంప్రతించడానికి ఎంతమాత్రం సిద్ధంగా లేడు. తాము స్వయంగానే వెళ్ళి పన్నా ఉద్యాన భవనంలో కోవలన్‌ను కలుసుకోవడం ఉచితంగా తోచడంలేదు వారికి. వ్యవహారం ముందుగానే పసికట్టి మాధవి దానికి విఘ్నం కలిగించడమే గాక వృద్ధ శ్రేష్ఠులను అవమానించినా అవమానించవచ్చు. అందుకని అసలు మాధవికే ముందు ఏదో ప్రలోభం పెట్టాలని కూడా వాళ్ళు ఆలోచించారు. మణిమేఖలను రాజరత్నం చెట్టియార్ కుమారునికిచ్చి వివాహం జరిపించే ఏర్పాటు చేస్తామనీ, అయితే ముందు కోవలన్ ఒకసారి రాజరత్నం చెట్టియార్ భవంతికి వెళ్ళి సంభాషించే ఏర్పాటు చేయమని వాళ్ళు మాధవికి వర్తమానం పంపారు. తమ ఆంతరంగికుల్ని కొందరిని ఆమె వద్దకు పంపి ఆమెకు పూర్తిగా విశ్వాసం కలిగేట్లు చేశారు. ఈ ప్రలోభానికి పూర్తిగా లొంగిపోయింది మాధవి. ఎప్పుడెప్పుడా అని అవకాశం కోసం చూచుకొని కోవలన్ దగ్గరకు వచ్చి చల్లగా ఈ విషయం కాస్తా అతని చెవుల్లో వేసింది.

అంతా విని గట్టిగా ఒక నిట్టూర్పు విడిచాడు కోవలన్. "చూడు మాధవీ! నేను పతితుణ్ణి అయిపోయిన మాట నిజమే. కాని అంతరాత్మ మాత్రం పూర్తిగా చచ్చిపోలేదింకా. మహాశ్రేష్ఠి కొడుకు అవహేళనను భరించగలడు గాని, అనకూడని మాట అతని నోటినుండి వచ్చిందన్న అపవాదును మాత్రం సహించలేడు. మణిమేఖల వివాహం నిశ్చయమే అవుతుందనుకో. అప్పుడు అది అనాచారం కాదా మాధవీ! సంఘ విచ్ఛిత్తికి దారి తీస్తుంది."

"ఎందువల్ల?" కనుబొమలు చిట్లించి తీవ్రంగా ప్రశ్నించింది మాధవి.

ఎందువల్లనో ఆమె వైపు చూడకుండానే చెప్పాడు కోవలన్. "నీకొక్కర్తికే కాదు. ఇతర వేశ్యలకు, దాసీలకు కూడా నా వల్ల సంతతి కలిగింది. నీ బిడ్డకు చేసినట్లే వాళ్ళకూ

వివాహ ఏర్పాట్లు చేయడంలో తప్పులేదు. వీళ్ళందరికీ చేసినపుడు మిగిలిన వేశ్య సంతతేనా అంత తీసిపోయారు. కాని వేశ్యలందరూ ఇలా వివాహాలు చేసుకుంటూ పోతే సంఘాచారాలు ఏమైపోతాయో ఆలోచించు. ఎక్కడికక్కడ వర్ణ సంకరమైపోతుంది. ఇదంతా జరగాలంటే నిజంగా ఎంతో గొప్ప మార్పు అవసరం. అంత గొప్ప మార్పు తెచ్చే శక్తి బలహీనమైన నా యీ భుజాలకు లేదు మాధవీ!". ఆమాట విని ఒళ్ళు మండిపోయింది మాధవికి. తగిన సమాధానం ఇవ్వాలని తీవ్రంగా లేవబోయింది. కాని కోవలన్ వారించి "నువ్వెన్ని చెప్పినా ఇక నేను వినదలచుకోలేదు మాధవీ! నా పరువు ప్రతిష్టల్ని, వంశ మర్యాదల్ని విడిచేశాను కాని సంఘాన్ని మాత్రం విడుచుకోలేను. నువ్వు మరీ అంతగా పట్టుపట్టే పక్షంలో ఇక్కడ్నించి వెళ్ళిపోవడానికైనా సిద్ధమే కాని...."

ఈ మాట విని బెదిరిపోయింది మాధవి. కోవలన్ సంరక్షణలో వున్న కారణంగానే తనూ, తన కూతురు సురక్షితంగా ఉన్నామని తెలుసామెకు. అందుకని అప్పటికప్పుడే ధోరణి మార్చి "మిమ్మల్ని కష్టపెట్టి అది స్వర్గమైనా వెళ్ళడం ఇష్టంలేదు నాకు. అయినా ఇది నా ఉద్దేశ్యం కాదు స్వామీ! మీ శ్రేష్ఠి వృద్ధులు తెచ్చిందే. అదీ నాకోసమని కాదు. కేవలం మణిమేఖల మీ సంతానమనే దృష్టితోనే వాళ్ళీ ప్రస్తావన తెచ్చారు అంటూ" ఆమె నేత్రాలు అశ్రుపూరితాలయ్యాయి.

"తర తరాలనుంచీ వేశ్య కన్యలకు కుల పుత్రుల ద్వారా సంతతి కలుగుతూనే వుంది. ఇది అపురూపమైన విషయమేం కాదు. తన అనే అనురాగంతో వాళ్ళు కులవధువుకు మించిన సౌకర్యాలను, భోగ భాగ్యాలను సమకూర్చిన సందర్భాలు కూడా కొన్ని లేకపోలేదు. కాని వేశ్య కన్యను కులీనుడు వివాహం చేసుకున్న సంఘటన ఒకటి చూపించుచూద్దాం. ఈ విషయంలో నన్ను క్షమించు మాధవీ! చూడు ఈ కన్నీళ్ళు ఇలా వృధా పరచుకోకు. మరొక సందర్భం కోసమని భద్రం చేసుకో వీటిని."

"నేనిక ఎప్పుడూ ఈ ప్రస్తావన ఎత్తను స్వామీ! కాని ఒక విచారమేమిటంటే మణిమేఖలకు; అది మహాశ్రేష్ఠి మనుమరాలైన కారణంగానే కావచ్చు కుల ధర్మాలేవీ పట్టుబడలేదు. మా కులాచారాల్ని ఇప్పుడు దానికి నేర్పడం ఎట్లా అనేదే పెద్ద సమస్య. కణ్ణకీదేవి సంతానానికి వేశ్యకాంత గుణగణాలు మప్పటం ఎవరికైనా సాధ్యమవుతుందా స్వామీ!" మణిమేఖలను కణ్ణకి సంతానం అనడం విని ఆమెవైపు తీవ్రంగా చూశాడు కోవలన్. తల దించుకొని చెప్తూ పోయింది మాధవి. "నేను అసత్యమేమీ చెప్పడం లేదు చెట్టియార్! ఈ మాధవి తప్పని సరయి మరొక దారి అంటూ లేక వేశ్య అయింది నిజమే. కాని మణిమేఖల తల్లిగా ఇదీ కణ్ణకితో సమానమే అవుతుంది. కణ్ణకిలాగే ఇది కూడా పతివ్రతే. కుల వధువే. నన్ను క్షమించండి! నా దగ్గర ఇప్పుడు సాక్ష్యాధారాలేమీ లేవు.

కాని నా అంతరాత్మ సాక్షిగా చెప్తున్నాను. నేనూ కణ్ణకిలాగే ఒక ఉత్తమ వంశంలోనే జన్మించాను. బహుశా ఆ కారణం వల్లనే కావచ్చు నా దౌర్భాగ్యం నన్నెన్ని విఘాతాలకు గురిచేసినా నేను మారలేకపోయాను. నేనే మారనప్పుడు నా సంతానం ఎలా మారుతుందో చెప్పండి."

ఇంతచెప్పినా కోవలన్ అంగీకరించక పోవడంతో పూర్తిగా నిరాశపడిపోయింది మాధవి. అసలు ప్రస్తావన తెచ్చిన వృద్ధ శ్రేష్ఠులు కూడా తమ పథకం పారనందుకు చింతిస్తున్నారు. మహాశ్రేష్ఠిగారికి తిరిగి మనస్ఫూర్తినీ, పూర్వపు ఆసక్తినీ కలిగించడానికి కోవలన్‌ను మార్చడం ముఖ్యం. అంతేకాదు. కట్టుదప్పి విచ్చలవిడిగా వ్యవహరిస్తోన్న వేశ్య కన్యల్ని అందుపులోకి తేవడానికి ముందు మాధవి అహంకారాన్ని అణచాలి. ఇందుకు అవసరమైన ఎత్తులేమిటా అని మళ్ళీ ఆలోచనలో పడ్డారు వాళ్ళు.

ఇటు ప్రతీకార జ్వాలతో లోలోపల మండిపోతూన్నది మాధవి. మణిమేఖల భవిష్యత్తుమీది దిగులు ఒక వైపు, మరొకవైపు ద్వేషం, ఆత్మహీనతా భావం, వీటన్నిటితో సతమతమవుతూ ఎత్తులమీద ఎత్తులు వేస్తూ పోతున్నది.

ఆమె భవనంలో ఇప్పుడు రోజూ వ్రతాలు, దానధర్మాలు గొప్పగా జరుగుతున్నాయి. కోవలన్ లాగే వేశ్యా వ్యామోహపరులైన కుల పుత్రులు అనేకమంది ఇప్పుడు తమ తమ ఉంపుడుకత్తెల్ని తీసికొని రోజూ ఆమె భవంతికి వచ్చి వెళుతున్నారు. హాస్య విలాసాలు, కేళీ వినోదాలకు బదులుగా ఇప్పుడు మాధవి భవంతి ధర్మోపన్యాసాలతో, మత మతాంత చర్చలతో మారుమ్రోగి పోతూన్నది. మాధవి సహాయ సహకారాలు, సలహాలతోనే వేశ్యవాడలోని మిగిలిన వేశ్యలు కూడా అనేక మంది ఇప్పుడు కులధర్మాన్ని మాని మతానుష్ఠానాలు, వ్రతాలు, ఉత్సవాలు ప్రారంభించారు. దక్షిణకు ఆశపడే బ్రాహ్మణులు, బౌద్ధశ్రవకులు, ఆళ్వారులు మొదలైన మతబోధకులు భోగవాడలో గుంపులు కట్టి తిరుగుతున్నారు. భద్రవేశ్యల పానశాలలు మూతపడ్డాయి. నగరంలో చేజేతులా ఒకానొక నైతిక ఆందోళనను మళ్ళీ మేలుకొలుపుతూన్నది మాధవి. మహారాజు కావేరీ పట్టణం రావడం అంటూ జరిగితే నగర నైతిక పతనానికి వేశ్యకన్యలు కారణం కాదని నిరూపించాలని తాపత్రయ పడుతోన్నదామె. అటు భోగలాలసులైన వ్యాపారుల కుటిలనీతికి అంటగట్టి తమకు దెబ్బరాకుండా చూచుకోవడానికి మాధవికి తమ సహాయ సహకారాలను పూర్తిగా అందిస్తున్నారు.

రాజధాని నుండి రోజుకొక వార్త వస్తున్నది. నగర ఆర్థికస్థితి ఇంతకాలమూ తనకు సూచించకుండా దాచిన అధికారుల మీద మహారాజు మండిపడుతున్నారు. ఇంత వయస్సు మళ్ళి నగర శాసన విభాగాన్ని స్వయంగా తనిఖీ చేయడానికి పూనుకొన్నారు. నగరంలో

ఎటుచూచినా భయపూరితమైన వాతావరణం అలుముకు పోయింది. అయినా తన నిశ్చయం మీద నిలబడిపోయింది మాధవి.

కోవలన్‌ను మాధవి ఇంటినుండి తప్పించడానికి వృద్ధ శ్రేష్ఠులు వేసిన ఎత్తు కోవలన్ పట్టుదల కారణంగానే విఫలం కావడంతో వెంటనే వాళ్ళు మహాశ్రేష్ఠిగారి సమక్షానికి వెళ్ళారు. విషయం అంతా ఆయనకు నివేదించి కోవలన్ ఇంత పతితుడై సర్వస్వాన్ని కోల్పోయినా వంశ ప్రతిష్ఠను మాత్రం ఇంకా వదులుకోలేదని, తామంతా ఇప్పుడు తూట్లు పడిన పడవలో ఉన్నామనీ, మాధవి అహంకారాన్ని అణచి ఈ నగరాన్ని రక్షించకపోతే ఈ నగరంతో పాటు తామూ మునిగిపోవడం తథ్యమని మొర పెట్టుకొన్నారు.

అంతా విని చల్లగా నిట్టూర్పు విడిచారు మహాశ్రేష్ఠి.

"ఇదంతా నా ఖర్మ. ఆ భగవంతుడే మాధవి చేతుల్లో ఓడిపొమ్మని నా నొసట వ్రాశాడు. విధిలిఖితం జరిగి తీరుతుందంటారు. మరి నేనేం చేయగలనో చెప్పండి."

"చిత్తం, తమరొకసారి ప్రయత్నం చేసి చూడండి. కోవలన్‌ని ముందు మాధవి ఇంటినుండి తప్పించడం ముఖ్యం. అప్పుడు గాని మనం దాని కొమ్ము అణచలేం" వృద్ధ శ్రేష్ఠి ఒకాయన అన్నాడు.

"ఇప్పుడిక మాధవే కాదు. ఆమె వెంట రాజ్యాధికారులు కూడా ఉన్నారు. కొంత మంది మతాచార్యులుకూడా ఆమె వెంట తిరుగుతున్నారు. యవన వాడలు నిర్మానుష్యంగా వున్నాయి. విదేశ సరకులు ఇబ్బడ ముబ్బడిగా వచ్చి పడుతున్నాయి. కాని అమ్మేదెవరు? అనుభవించేదెవరు? ఇక మనం ఈ వర్తకానికి తిలాంజలి ఇచ్చినట్లే." మహాశ్రేష్ఠిగారి గొంతులో ఒక విధమైన అలసట, నైరాశ్యం ధ్వనించాయి.

అయితే వృద్ధ శ్రేష్ఠులు ఆయన అభిప్రాయాన్ని అంగీకరించలేదు. "మీరు ఉన్నట్లుండి హఠాత్తుగా హత బద్ధులైపోయారు మహాశ్రేష్ఠీ. మీరొకసారి నడుం బిగించి మా వెనుక నిలబడండి. అన్ని వ్యవహారాలు వేము చూచుకుంటాం. మహారాజుగారి సహాయసహకారాల్ని కూడా మనం పొందగలము. మీరు కుదురుకొని రంగంలోకి వచ్చారని తెలిస్తే చాలు, పలుకుబడి మళ్ళీ పెరుగుతుంది. ఆ మాత్రం కృషి చేయండి చాలు.

❊ ❊ ❊

సాయంకాల సమయాల్లో సామాన్యంగా సముద్రతీరానికి వెళ్ళే అలవాటు ఉంది కోవలన్‌కు. చవకబారు వేశ్య కన్యల్ని, తనలాగే భ్రష్ఠులైపోయిన నలుగురైదుగురు శ్రేష్ఠి పుత్రుల్ని వెంటతీసికొని క్రమం తప్పకుండా సముద్రతీరాన పానగోష్ఠులు జరపడం అతనికి పరిపాటి. కోవలన్ రాగానే అక్కడ వున్న భోగం వాళ్ళంతా గుమిగూడుతారు. సాయంత్రమయ్యే సరికి భార్యల్ని తన్నో, తల్లిదండ్రుల్ని ఏడిపించో జేబులు నింపుకొని

అతని మిత్రబృందం కూడా అక్కడకు చేర్తారు. ఇహను వాళ్ళ ప్రేలాపనలు ప్రారంభమౌతాయి. పాతివ్రత్యం పిచ్చిపట్టి పాడైపోతూన్న మాధవినీ, కణ్ణకినీ కూడా వాళ్ళ ముందు తిట్టిపోస్తాడు కోవలన్. ఉన్నత వంశస్తులైన ఈ శ్రేష్ఠి పుత్రుల ప్రవర్తన చూచి ఇప్పుడు కడజాతివాళ్ళు సైతం వాళ్ళను అసహ్యించుకొంటున్నారు.

హఠాత్తుగా మహాశ్రేష్ఠిగార్ని తమముందు చూచీ చూడడంతోనే కోవలన్ మిత్ర బృందానికి పై ప్రాణాలు పైనే లేచిపోయాయి. కొందరు కళ్ళు తెరచుకొని అలాగే చూస్తూ వుండిపోయారు. కొందరు చషకాలు దూరంగా విసిరేసి ఏమీ తెలియని వారిలా మూతులు తుడుచుకుంటున్నారు. వాళ్ళ వికటాట్టహాసాలు, కేరింతలు మీట నొక్కినట్లుగా ఆగిపోయాయి. జ్యోతులు పుచ్చుకొని నిలుచున్న ఇద్దరు సేవకుల మధ్య మెరిసిపోతున్నారు మహాశ్రేష్ఠి. కోవలన్ మత్తు చూపుల్ని నిలదొక్కుకొని మామగారి వైపు చూచాడు. అతని చేతుల్లోంచి పాన పాత్ర జారి వస్త్రంమీదుగా ఒలికిపోయింది. మహాశ్రేష్ఠి మరొక పదడుగులు వేసి కోవలన్ దగ్గరికి వచ్చారు. తడబడుతూ లేచి నిలబడే ప్రయత్నం చేశాడు కోవలన్. మహాశ్రేష్ఠి వెంటనే వంగి అల్లుడి జబ్బ పట్టుకున్నారు. ఇంతకాలం తరువాత మామగారి హస్తస్పర్శ రోమాంచాన్ని కలిగించింది కోవలన్‌కు. చేయి విదిలించుకోబోయాడు. కాని మహాశ్రేష్ఠి మరింత గట్టిగా అతడ్ని తన కౌగిల్లోకి లాగుకొని "దయచేయండి" అన్నారు.

ఒకరికొకరు తదేకంగా చూచుకుంటూ ముందుకు నడిచారు. మామగారి అడుగుల్లో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాడు కోవలన్. ఇద్దరూ వెళ్ళి రథం మీద కూర్చున్నారు. వెనుక పదిమంది అశ్వారోహులైన సేవకులు, కొంతమంది అంగరక్షకులు పరుగెడుతుండగా రథం ముందుకు సాగిపోయింది. నగర ముఖ్యవీధుల్లో సముద్రతీరం గుండా మామా అల్లుళ్ళు తిరిగి ఒకే రథం మీద కలసి వెళ్తూ ఉండడం చూచి ఆశ్చర్యపోతున్నారు అందరూ. వార్త క్షణాల్లో విద్యుత్తులాగా అంటుకొని నగరమంతా పాకిపోయింది.

మహాశ్రేష్ఠి తన అల్లుణ్ణి తీసికొని భవంతివైపు వెళ్తున్నారు. దానిమీదే చూపు నిలిపి గంభీరంగా కూర్చున్నాడు కోవలన్. మహాశ్రేష్ఠి కూడా ఆలోచనల్లో మునిగిపోయి మౌనంగా వున్నారు. కొంచెం సేపు అయ్యాక హఠాత్తుగా ఆ మౌనాన్ని భగ్నం చేశాడు కోవలన్. "చాలా ఆలస్యం చేశారు తమరు...." అన్నాడు.

మహాశ్రేష్ఠి తల తిప్పి కోవలన్ వైపు చూశారు. మోకాళ్ళమీద చేతులు కట్టుకొని వాటిమీద గడ్డం ఆన్చి కూర్చున్నాడు కోవలన్. మహాశ్రేష్ఠిగారి వైపు చూడకుండానే మళ్ళీ అన్నాడు. "కొన్ని సంవత్సరాలకు పూర్వమే మీరిలా హఠాత్తుగా నా ముందుకు వచ్చి వుంటే ఇంత సర్వనాశనం జరిగి వుండేది కాదు."

మహాశ్రేష్ఠి చల్లగా ఒక నిట్టూర్పు విడిచి "నేనూ అదే ఆలోచిస్తున్నాను నాయనా" అన్నారు. ఆయన గొంతు వణికింది. ఎంతవారికైనా విధిలిఖితం తప్పనిసరి. అయినా ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు నాయనా. నగర శ్రేష్ఠులంతా మీ మీదే ఆశలు పెట్టుకొని కూర్చున్నారు. ఈ నగరానికి ఇంత ప్రసిద్ధి కలిగింది మీ వల్లనే, ఇప్పుడు మళ్ళీ మీ వల్లనే ఈ నగర భాగ్యోదయం..."

మాట మధ్యలోనే అందుకొని "అసంభవం" అన్నాడు కోవలన్. కోవలన్ వైపే చూస్తున్నారు మహాశ్రేష్ఠి. మామగారు తనవైపు చూస్తూ ఉండడం గమనించి ఆయన వైపు తల ఎత్తకుండానే "చివరి శ్వాసవరకూ ఏదో ఒక వ్యామోహం చూపి మనిషిని బ్రతికించే ప్రయత్నమయితే జరుగుతూనే వుంటుంది కాని అది వట్టి వ్యామోహం మాత్రమే అప్పా!" అన్నాడు.

ఆ తరువాత మరి సంభాషణ జరుగలేదు. ఇంతకాలానికి మామగారూ, అల్లుడూ మళ్ళీ కలిసి అడుగుపెట్టటం చూచి భవనంలోని పరిచారికలు సేవకులు ఆశ్చర్యంలో మునిగిపోయారు. ఈ శుభవార్త కణ్ణకి వరకూ వెళ్లడానికి ఎంతో సమయం పట్టలేదు. ఎంతో కాలం నుండి దుఃఖాలను, అంతులేని ఆవేదనను పెదవి కదపకుండా సహిస్తూ మానసిక ఉద్వేగాల నన్నిటినీ అణచుకోవడం బాగా అలవాటయింది కణ్ణకికి. ఆమె ముఖంలో ఏ విధమైన ఆశ్చర్యం గాని, ఆవేదన కాని వ్యక్తం అవలేదు. భర్తా తండ్రీ కలసి వస్తున్నారన్న వార్త విని శాంతంగా లేచి వెళ్ళి అంతఃపుర ప్రవేశ ద్వారం దగ్గర నిలబడిపోయింది. దేవంతి వెంటనే లేచి బైట ప్రకోష్ఠం దగ్గరకు పరుగెత్తింది. కోవలన్ తిరిగి రావడమనేది తనకు లభించిన విజయంగానే భావిస్తున్నదామె.

మహాశ్రేష్ఠి అక్కడే చాలాసేపు కూర్చొని అల్లుడికి హితబోధ చేశారు. "నాదే మున్నది నాయనా, వయసు మీరిపోయింది. ఇక నాదంటూ ఏదన్నా వుంటే అది మీదే. ఇప్పటికి నీకు వచ్చిన లోపమేమీ లేదు నాయనా. మనం వైశ్యులం ఎన్ని దివాళాలు తీసినా కుదురుకొని లేచి నిలబడడం చేతనౌతుంది మనకు."

శిరస్సు వంచుకొని మౌనంగా వింటూకూర్చున్నాడు కోవలన్. ఆ తరువాత మహాశ్రేష్ఠిగారు లోపలికి వెళ్ళి కుమార్తెతో కూడా మాట్లాడారు. సంవత్సరాలు గడిచాక తండ్రీ, కూతురు కలుసుకోవడం ఇదే మొదటిసారి. కోవలన్ ఇంటికి రావడం మానుకున్న తరువాత కణ్ణకి కూడా తండ్రిగారి భవంతికి వెళ్ళడం మానేసింది. ఎవరినడిగి వెళు తుంది? మహాశ్రేష్ఠిగారు అసలే ప్రతిష్ఠ కోసం పడిచచ్చే మనిషి. ఆయన ఏమరుపాటున కూడా మరి అల్లుడి గడప త్రొక్కలేదు.

మహాశ్రేష్ఠిగారు కూతురి కండ్లలోకి చూశారు. తండ్రిని చూచి ఆమె నేత్రాలలో ఇప్పటివరకు అచంచలంగా ఉన్న సహనం కరుగుతోన్నది. సముద్రంలా పొంగి వస్తున్న దుఃఖాన్ని తన శక్తినంతా ఉపయోగించి నేత్రాలలో బంధించి వుంచాలని ప్రయత్నిస్తున్నదామె. ఆమె శరీరం బలహీనమైన లతలా వణికిపోతూన్నది. కణ్ణకి స్థితి చూచి మహాశ్రేష్ఠిగారు దుఃఖంతో ముఖం త్రిప్పుకున్నారు. కన్నీళ్ళు కొనగోటితో తుడుచుకొని స్వరాన్ని అదుపులోకి తెచ్చుకున్నాక ఆమె శిరస్సును తన వక్షస్థలం మీదికి చేర్చుకొని “అంతా విధిలిఖితం తల్లీ జరిగితీరుతుంది. భవిష్యత్తు అగమ్య గోచరం, ఇలా జరుగుతుందని నేనేమైనా ఊహించగలిగానా?”

“జరిగినదాన్ని మరిచిపోమ్మా! నీ భర్తను ఓదార్చు. మళ్ళీ అతని వల్ల నీకే కాదు. ఈ మహానగరానికే కల్యాణం చేకూరుతుందేమో ఎవరు చూచారు?”

ఆ తరువాత కొద్దిసేపు విశ్రాంతి తీసుకొని మహాశ్రేష్ఠిగారు తన సౌధానికి వెళ్ళి పోయారు. ఇంతసేపూ కోవలన్ పరిచర్యల్లో మునిగి వున్న దేవంతి పరుగు పరుగున వచ్చి కణ్ణకిని కౌగిలించుకుంది. ఆమె జబ్బ పట్టుకొని లాగుతూ “ఓ పార్వతీదేవి గారూ! ఇక తపస్సు చాలించండి. కొంచెం ఈ సన్యాసినీ వేషాన్ని తోసివేసి మిమ్మల్ని అలంకరిస్తాను పదండి.”

నవ్వుతూనే గడపదాటి కోష్ఠం లోపలికి వచ్చాడు కోవలన్. శిరస్సు వంచుకొని కుంచించుకుపోతూ నిలబడి వుంది కణ్ణకి. ఆమె శరీర అలంకారాల కాంతి తపాస్సాధ్యమైన ముఖ జ్యోతి కావేరీ, సముద్రమూ కలిసినట్లు, విరాట్, లఘు రూపాల సంగమంలాగా వింత గొల్పుతున్నది. భర్త దగ్గరకు రావడం గమనించి సిగ్గుతో ముద్దయిపోయింది కణ్ణకి. ఆమె పాదాల కళ్యాణ మంజీరాలు మధురంగా మ్రోగాయి. నూపుర పండితాలైన ఆమె పాదాలవైపు చూస్తూ అన్నాడు కోవలన్. “ఇది వట్టి గజ్జెల ధ్వని మాత్రమే కాదు కణ్ణకీ! నీ పాదాలను చుట్టుకొని నా ఆత్మే ఇలా పలుకుతూన్నది. ఇప్పుడదంతా ఎందుకులే. ఇప్పుడు నేనూ ఆత్మ స్వరాన్ని గుర్తించడం మానివేశాను కదూ! ఏ శని పట్టుకొన్నదో కాని దివ్యమైన ఈ నూపురాలు నాకు ఒట్టి గజ్జెలలాగానే కనిపిస్తున్నాయి కణ్ణకీ! పగిలిన అద్దంలో కనిపించే ప్రతిబింబం లాగా నాకు ఏదీ స్పష్టంగా కనిపించడం లేదిప్పుడు. నిజంగా నేను దౌర్భాగ్యుణ్ని కణ్ణకీ!”

సంతోషం పట్టలేక తన్మయురాలవుతున్నది దేవంతి. “శని మీ శత్రువులకు పట్టాలి స్వామీ! మీరిద్దరు దేవీ దేవతలు – వున్నచోట శనికి తావులేదు. పదండి పార్వతీ పరమేశ్వరులకు ప్రక్క ప్రక్కనే పీటలువేసి వడ్డిస్తానీవేళ. ఈ వేళ నా జీవితం ధన్యమయింది స్వామీ!” నిజంగానే పట్టరాని సంతోషంతో పిచ్చిదయిపోతున్నది దేవంతి.

# 23

మాధవి పరిస్థితి కణ్ణకి మీద, మహాశ్రేష్ఠి గారి మీద, మొత్తం శిష్టసమాజం మీదనే తీవ్రవమైన పగతో ఉన్మాద స్థితికి చేరుకున్నది. వుండి వుండి ఆమె నేత్రాలు అశ్రు పూరితాలయి కన్నీళ్ళు చెక్కిళ్ళను తడిపేస్తున్నాయి. వున్నట్లుండి గట్టిగా పిడికిళ్ళు బిగించి, కక్ష్య అంతా బోనులో చిక్కుబడిన శివంగిలా వ్యాకులంగా తిరుగుతుంది. తన ఆగ్రహాతిశయపు ఉన్మాద చేష్టలతో తనే సతమతమై పోతూన్నది తప్ప ఎవ్వరితోనూ పెదవి విప్పి ఇదీ సంగతని చెప్పలేదు. అన్ని విధాలా వివశురాలిని చేసి ఓడించారామెను. అందుకని ఈ పరాజయం తీవ్రమైన ప్రతీకార జ్వాలతో నిలువునా దహించి వేస్తున్నదామెను. మొట్టమొదట కణ్ణకి శోభనం రోజు రాత్రి ఇలాగే ఆమె మీద మిన్ను విరిగి పడిపోయింది. అయితే అప్పటి స్థితి వేరు. అప్పుడు ఆమెకు తల్లిదండ్రి కాకపోయినా అంతకుమించిన అనురాగంతో ఆదుకునే పన్నాశ్రేష్ఠి, పెరియన్నాయకీ వున్నారు. చేలమ్మలాంటి ఆత్మీయులు, గురుజనుల ఛత్రచ్ఛాయలో పై భాగం ఎండి పగుళ్ళు వారిన భూమి లోపలి చెమ్మతో సురక్షితంగా ఉన్నట్లు ఎంతో సాంత్వన పొందింది తను. కాని ఇప్పుడు దుష్టుడైన మహాశ్రేష్ఠి తన తల్లినీ తండ్రినీ చంపించి తనను నిస్సహాయురాలిని చేశాడు. ఇప్పుడు చివరకు కోవలన్‌ను కూడా లాక్కుపోయి తనకు కాకుండా చేయాలని చూస్తున్నాడు. తననూ, తన మణిమేఖలనూ నానా యాతనలకు గురిచేసి చంపాలని వాళ్ళ ఎత్తు. నా సౌభాగ్యాన్ని దోచుకొని పోయి ఆ మహాశ్రేష్ఠి తనకూతురు మాంగల్యం నిలపాలని వేసిన పాచిక ఇది. ఆలోచించిన కొద్దీ ఆగ్రహావేశం మీరిపోతూన్నది మాధవికి. అయితే అగ్రహానికి వెనుక కించిత్ భయం కూడా లేకపోలేదు.

ఏది ఏమైనా తిరిగి తను విజయాన్ని పొందాలని దృఢ సంకల్పంతో లేచి నిలుచుంది మాధవి.

రాత్రి ఒక ఝాము గడిచాక చేలమ్మ వచ్చింది. జరిగిన కథ అంతా పుహారేశ్వరం మందిరంలో  తెలుసుకొని వెంటనే బయలుదేరిందామె. ఆమెను చూచి మాధవిలో పెల్లుబుకుతూన్న పగ కొంచెం ఉపశమించింది. బైట దెబ్బతిని వచ్చిన శిశువు తల్లిని కావటేసుకున్నట్లు చేలమ్మను గాఢంగా కౌగలించుకుంది.

"వచ్చిన విపత్తును ధైర్యంగా ఎదుర్కోవాలి బిడ్డా!" అంది చేలమ్మ ఆమె వీపు నిమురుతూ. "ఈ జీవితం ఎప్పుడూ తిన్నగానే సాగదు. అనుకోకుండానే ఎదురుదెబ్బలు తగిలి తలబొప్పి కడుతుంది. ఒక్కొక్కప్పుడు ప్రాణాంతకమైన మలుపులు వచ్చి మతిపోయే స్థితికి వస్తాము. అటువంటి సందర్భాల్లో పగవల్ల ప్రయోజనం లేదే మధూ! ఉపాయం ఉండాలి. ప్రాణిలో

ఉన్న జడత్వాన్ని వదలగొట్టడానికే విధి అటువంటి విపత్తుల్ని తెచ్చిపెడుతుంది. ప్రతీకారంతో పని జరగదు తల్లీ! కష్టాలతోనే మనం గుణపాఠం నేర్చుకోవాలి. నన్ను చూడరాదూ! ప్రతీకార జ్వాలతో మండిపోయినంత కాలం తెన్ను దొరకక కొట్టుమిట్టాడాను....”

“కాని నాకు తెన్నుదొరికి తీరుతుంది అత్తా! ఆ శ్రేష్ఠి మహారాజుగారు వచ్చే లోపుగానే కోవలన్‌ను లాక్కుపోయి తన కూతురు కాపురం చక్కదిద్ద గలనని విర్రవీగితే విర్రవీగనీ! అదంతా ఒట్టి భ్రమ అని రుజువు చేయడానికి ఎంతో కాలం పట్టదునాకు. కోవలన్‌నైతే దొంగిలించుకు పోగలడేమోగాని నన్ను ఓడించడం అతని తరం కాదు.”

చల్లగా ఒకసారి నిట్టూర్చి ఆమెను ఎన్నో విధాల ఓదార్చుతూ పోయింది చేలమ్మ. సమయం ఎంచకముందే కూతురితో సహా వేరే రాజ్యానికి వెళ్ళి స్థిరపడవలసిందిగా కూడా సలహా చెప్పింది. “ప్రతీకారం ఎప్పుడూ ప్రతీకారాన్నే కోరుతుంది తల్లీ! ఆ గొలుసుకొక అంతమంటూ వుండదు. అంతమనేది వచ్చిందంటే అది ఒకరితో ఒకరికి ప్రాణాంతకమే అవుతుందనుకో.”

“ఎన్ని యాతనలకు గురి అవుతూ వచ్చానో, ఇప్పటికి ఎవరిమీదైనా కక్ష తీర్చుకోవాలని చూశానా అత్తా! మహాశ్రేష్ఠి, ఆయన కూతురూ, ఆ దాసీ దేవంతీ మొదటి నుంచీ నేనంటే ఏడుస్తూనే వచ్చారు. ఇన్ని సంవత్సరాలలో ఎప్పుడూ, ఎప్పుడూ ఒక్క క్షణం విశ్రాంతిగా బ్రతుకనివ్వలేదు నన్ను.”

మరింత శాంత స్వరంతో అంది చేలమ్మ. “ఇన్నేళ్ళ నుండి కణ్ణకి కూడా ఇంతకు మించిన వేదనే భరించి వుంటుంది బిడ్డా! అవతలి పక్షం నుంచి కూడా ఎప్పుడయితే ఆలోచించడం నేర్చుకుంటావో అప్పుడే నీకు మనశ్శాంతి.”

కానీ ఇదంతా ఇప్పుడే మాత్రం వినే స్థితిలో లేదు మాధవి. చేలమ్మ ఉపదేశాల వల్ల ఆమె ఆగ్రహం, పట్టుదల సడలిపోవడానికి బదులు మరింత రెచ్చిపోతూన్నది. పైపెచ్చు పరిస్థితికి పూర్తి భిన్నంగా ఆలోచిస్తూన్న చేలమ్మ మీద చిరాకు కూడా కలుగుతుందామెకు. మళ్ళా ఏదో చెప్పబోతూన్న చేలమ్మ మీద ఎగిరిపడి, గదిలోంచి దూసుకు పోయి కోష్ఠం తలుపు దగ్గర నిలుచున్నది. పెద్దగా కేకవేసి నాగరత్నను పిలిచి నిద్ర పోతున్న మణిమేఖలను వెంటనే లేపి తీసుకు రమ్మని ఆదేశించింది. మాధవి వ్యవహారం అంతా చూచి ఖిన్నురాలై పోయింది చేలమ్మ. ఔదాసీన్యంతో ఆమె పెదవుల మీద సన్నటి చిరునవ్వు పరుగెత్తింది. తలపైకి ఎత్తి మాధవిని చూచి వివశురాలై చేతులూపుకుంటూ బయటికి నడిచింది.

మణిమేఖలను నిద్రలేపి తీసుకురావటానికి గదిలోకి వెళ్తూ చేలమ్మను చూచి “ఎలాగైనా చిన్న యజమానురాలిని కాపాడుఅత్తా!” అంటూ చేతులుపట్టుకుంది నాగరత్న. “తన హఠం తనదే ఎన్ని కష్టాలు వచ్చినా పట్టినపట్టు విడవడమనేది లేదు చిన్నమ్మకు.”

"విధివిధానం చాలా కటువుగా ఉంటుంది బిడ్డా? దేవుడు వ్యక్తి జీవితంలో ఏ పక్షాన్నయితే సంస్కరించాలని అనుకుంటాడో, దాన్ని హితోక్తులతో, కాకపోతే దండనతోనయినా సరే సంస్కరించి తీరుతాడనుకో దీని తలరాత ఇక ఇంతే. నేనూ ఒకప్పుడిలాగే గుడ్డి అహంకారంతో విర్రవీగి విధి తాపులు తిని తిని తల బొప్పికట్టి ఇలా అయ్యాను."

నాగరత్న అక్కడే కూర్చుని, గడ్డం క్రింద చేయి పెట్టుకొని ఆలోచనలో మునిగిపోయింది. కొంచెం సేపు గడిచాక ఏదో గుర్తుకు వచ్చినట్లు హఠాత్తుగా ప్రశ్న వేసింది. "సరేకాని ఇక వేరే ఉపాయం లేదా అత్తా?"

"దేనికి?"

"అదే సాని, సంసారి అవడానికి. చిన్నమ్మ కూడా పాటించేది పురుష వ్రతమే. కోవలన్‌తో జత కురిదింది మొదలు మరి పరపురుషుడ్ని కన్నెత్తి చూచి ఎరుగదు. చిన్నమ్మనే ఏమిటి? ఈ వాడలో ఇట్లా వ్రతం పట్టిన వాళ్ళు ఎంతోమంది ఉన్నారు కూడా. వీరికి కులవధువులకు తేడా ఏమిటత్తా? కాకపోతే వీళ్ళు కాస్త ఆటా పాటా అభ్యసించారు. సంసారులు ఇళ్లు విడిచి ఇవతలికి రారు అంతేనా. అయినా ఆటాపాటా అనేది పాపం కాదుగా. దేవుడు పరమపవిత్రమంటూ చెప్పి ఇచ్చింది. అటువంటప్పుడు చిన్నమ్మలాంటి పుణ్య స్త్రీలకు కుల వధువులయ్యే అధికారం ఎందుకు లేకుండా పోవాలత్తా? పసిగుడ్డు ఈ మణిమేఖల చేసుకొన్న పాపమేమిటో కాస్త చెప్పు?"

అంతా శ్రద్ధగా విని సమాధానం చెప్పింది చేలమ్మ. "ఈ ఇద్దరి సంస్కారాల్లోనే ఎంతో భేదం వుంది తల్లీ! వేశ్య తన హావభావాల్ని చూపించి మొగవాడి మీద అధికారాన్ని పొందుతుంది. కులస్త్రీకి అది సహజంగానే సంక్రమిస్తుంది. ఆదినుండి అంతం వరకు వేశ్యకు మాయతోనే పని చివరికి దానికా మాయే గతి అవుతుంది. కాని కులస్త్రీ అలాకాదు."

"అదే ఆ అంతరం ఎట్లా వచ్చిందనే నే నడుగుతుంటా! ఏమీ తెలియని మూర్ఖురాలినే అనుకో, అంతా చూస్తూనే వున్నానుగా అత్తా, కులస్త్రీలలో ఎంతమంది భర్తలకు సంపూర్ణంగా మనస్సుల్ని అర్పించగలుగుతున్నారు. దొంగచాటుగా గడ్డికరిచి వేశ్యలకంటే నీచపు బ్రతుకు బ్రతుకుతున్న వాళ్ళని ఎంతమందిని మనం చూడడం లేదు. అటువంటి వాళ్ళంతా మనకంటే ఎందులో గొప్పో కాస్త చెప్పు."

చేలమ్మ చాలాసేపు ఆలోచించి ఆలోచించి "అన్ని ప్రశ్నలకు సమాధానాలుండవు బిడ్డా? కొన్ని ప్రశ్నలు గుండెల్ని కదిలించి వేస్తాయి. కాని సమాధానాలు పొందలేవు.

అట్లా ఎందువల్ల జరుగుతుందో ఎవరు చెప్పగలరు? విధివిధానం కావచ్చు. లేకపోతే పూర్వజన్మ సంస్కారం అయివుండవచ్చు."

"అదేదీకాదత్తా! నాకైతే ఏమాత్రం అట్లా అనిపించడం లేదిది. చాలాకాలం క్రిందట నువ్వీ నగరంలో కోతి దంపతుల ఆట ఆడావు జ్ఞాపకముందా అత్తా! వీళ్ళ మిధ్యాహంకారాల్ని తోకలుగా తగిలించి ఆడావు. అదిగో ఆ తోకలే దీనికి కూడా కారణమని అనిపిస్తుంది నాకు. ఇది విధి చేసింది కాదు. దేవుడు చేసిందీ కాదు. మనిషి చేసిందే ఇది."

"పోనీ, ఒకవేళ అంతే అనుకో అయినా అదీ విధే తల్లీ. మానవుడికి తను చేసిన అన్యాయాన్ని సవరించడానికి తిరిగి మనిషినే ఉపయోగించుకుంటాడు దేవుడు. ఆ మనిషి కూడా తన సంస్కారాలనుబట్టే సుఖ దుఃఖాలను అనుభవిస్తూ దైవ కార్యాన్ని నిర్వహిస్తాడు. తమతమ అనుభవాల్ని బట్టే మనుషులూ మారుతారు నాగరత్నా! బోధనవల్ల మారరు."

అటు ఏకాంతంలో కూర్చొని ప్రతీకార జ్వాలతో భగభగ మండిపోతూన్నది మాధవి. కొంచెంసేపు ఏడ్చింది. మరి కంచెం సేపు క్రోధం పట్టలేక పిడికిళ్ళు బిగించి పిచ్చిదానిలా తిరిగింది. చివరకు ఒక నిశ్చయానికి వచ్చినట్లు గబ గబ లోనికి వెళ్ళి భవనంలో వున్న విలువైన వస్తువులన్నీ లాగుడు బండ్ల మీదికి మోయించి వాటిని ఉద్యానవనంలోని పెద్ద పెద్ద చెట్లచాటున దాచివేయించింది. ఆపైన ఇంచుమించు అర్థరాత్రి దాటాక ఉద్యాన భవనం ప్రకోష్ఠంలోనూ, కోష్ఠాలన్నింటికీ అగ్ని ముట్టించి తను స్వయంగా మంటలు! మంటలు!! అని అరుస్తూ వీధిన పడింది. భవనంలో వున్న ఆమె దాసీ దాసీజనం అంతా గగ్గోలుగా ఏడుస్తూ గుండెలు బాదుకుంటున్నారు. భవనంలో మిగిలిన చిన్న చిన్న వస్తువులన్నీ దాసీ జనానికి ఇచ్చివేసి తను నాగరత్నను, కొంతమంది సేవకుల్ని వెంటబెట్టుకుని హాహాకారాలు చేస్తూ మహాజనవాడ ముఖ్య వీధి గుండా బయలుదేరింది మాధవి.

అత్యంత ఉన్నతమూ, అతి సుందరమూ! విశాలమైన ఆ భవనం ఆకాశాన్ని అంటుతూన్న మంటలలో నిలువునా మండిపోతూండడం చూచి మహా జనవాడ నుండి వచ్చి అనేక మంది నిద్రల్లోంచి త్రుళ్ళిపడి భయభ్రాంతులై పరుగెత్తుకు వచ్చారు. ఆ వచ్చినవాళ్ళందరూ చుట్టూ కూడి ఇది తప్పక మహాశ్రేష్ఠి చేయించిన పనే అని చెప్పుకుంటూ అనేక రకాలైన వాఖ్యానాలు చేస్తున్నారు.

మాధవి నాగరత్నతో, దాసీజనంతో మహాజనవాడ ముఖ్యవీధినే ఏడుస్తూ వెళ్ళి సరిగ్గా మహాశ్రేష్ఠి మాశాత్తువన్ గారి భవనం ముందు ఆగిపోయింది.

# 24

మాధవి వేశ్యవాడ విడిచి కులీనుల వాడలో, అందునా ముఖ్యంగా కావేరీ పట్టణానికి తలమానికం లాంటి మహాశ్రేష్ఠిగారి భవంతిలోనే అడుగు పెట్టడంతో వాడ వాడ అంతా అట్టుడికి పోతున్నది. ఎంత చెడ్డా మహాశ్రేష్ఠి మహాశ్రేష్ఠే. మాధవి మాధవే. కూడళ్ళలో రచ్చబండల దగ్గర ఇప్పుడు దీన్ని గురించే కొందరు తర్క వితర్కాలు, వాదోప వాదాలు జరుపుతూ ఉంటే కొందరేమో ఎగతాళి చేస్తూ నవ్వుతూ కనిపిస్తున్నారు. మహాశ్రేష్ఠిగారి కనుసైగలమీద అప్పటికప్పుడే కొంతమంది కులీనులు ఇంటింటికి తిరిగి ఇది ఒక్క మహాశ్రేష్ఠిగారి సమస్యకాదని రేపు కులీనులందరికి ఇటువంటి గతే పడ్తుందనడానికి ఇది సూచన అనీ, పుచ్చును ఆదిలోనే తృంచి వేయాలి కనుక తక్షణం కుల వృద్ధుల్ని సమావేశపరచి పంచాయితీ జరిపించవలసిందని ప్రచారాలు కూడా మొదలు పెట్టారు.

రాజధాని డరయూరు నుంచి కావేరీ పట్టణానికి మారుతూన్న సమయంలో నగరంలో ఇటువంటి ఘటన జరగడం మహారాజుకు సైతం అపచారమేనని కొందరు చెప్పుకుంటున్నారు. కుల వృద్ధులు కొందరు కూడి నచ్చచెప్పడానికని కోవలన్ దగ్గరకు కూడా వెళ్ళారు. తరతరాలుగా మహాశ్రేష్ఠి మాశాత్తువన్ గారి వంశం నగర వైశ్యజాతికి, కులపెద్దలుగా వస్తూన్న వంశం. ఆ పరంపరను బట్టి ఇప్పుడు కోవలన్‌కు కూడా ఆ గౌరవం సంక్రమించవలసి వుంది."

అంతా విని "అపరాధి న్యాయాధిపతిగా వుండలేడు" అన్నాడు కోవలన్. "కారణం ఏదైనా మాధవి ఇక్కడ అడుగు పెట్టడం అపరాధమే. కాదనను. కాని ఆమెను ఇంటినుండి వెళ్ళగొట్టడం ఇప్పుడు నా వశంలోలేదు. కారణమేమిటంటే మాధవి వేశ్య అయినా నా పట్ల ఆమె ప్రేమ అపారం. ఆ అనురాగాన్ని త్రిప్పికొట్టడం నా తరం కాదు. మంచీ చెడు అంటారా అవి ప్రతి మనిషిలోనూ ఉంటాయి..."

కుల వృద్ధులు మధ్యలోనే అందుకుని "నిజమే మీరు చెప్తున్నదాన్ని కాదనము. కాని మీరిలా ఏక పక్షంగానే ఆలోచన చేసినందువల్ల సౌభాగ్యవతి కణ్ణకికి అపచారం జరుగుతున్నది. మీవంటి ఆలోచనా పరులు చేయవలసింది కాదిది."

"నేనా! ఆలోచనాపరుడ్నా. అహహ!!" అంటూ పెద్దగా నవ్వాడు కోవలన్. ఆ ఆలోచననేది ఎక్కడో కీకారణ్యంలో మంచుతో కప్పబడిన ఎగుడు దిగుడు పర్వతాల వెనుక అస్పష్టంగా వినవచ్చే పిలుపు లాంటిదయిపోయింది నాకిప్పుడు. అది ఏ దిశ నుండి వస్తుందో కూడా తెలుసుకోలేని అశక్తుడ్ని అయిపోయాను.

"ఈ లోకాన్ని పూర్తిగా విడిచి మయసభలాంటి భావ జగత్తులో బ్రతుకుతున్నాను. చైతన్యం అనేది కదా చిత్తుగాద్రౌపదిలా నవ్వకపోవడం లేదు. నవ్వనివ్వండి. దాని పరిణామమేమిటో ఎరుగనివారు కారు మీరు. ఇప్పుడు నేను నేనుగా లేనని తమకు ముందే శెలవిచ్చాను."

ఇదంతా విని శ్రేష్ఠి ఒకడు బాగా రెచ్చిపోయాడు. "ఇది నీ ఒక్కడి ఇష్టా ఇష్టాలమీద ఆధారపడిన సమస్య కాదు. మేము మహారాజు సమక్షానికి కూడా వెళ్లడానికి సిద్ధపడే ఇక్కడికి వచ్చాము. కులీనుల కొంపలో వేశ్య వుండడమనేది జరిగేపనికాదు."

ద్వారబంధం చాటున దాగి అంతా వింటూనే ఉంది మాధవి. అందరూ వెళ్ళి పోయాక మౌనంగా వచ్చి కోవలన్ ప్రక్కన కూర్చుంది. ఆమెనిప్పుడు బలత్కారంగా ఇంట్లోంచి వెళ్ళగొట్టే శక్తి కోవలన్‌కు లేని మాట నిజమే కాని సిద్ధాంతరీత్యా మాధవి ప్రవర్తన ఎంత మాత్రం సమ్మతంగా లేదతనికి. చాలాసేపు ఇద్దరి మధ్యా తర్కవితర్కాలు జరిగాక కాలిపోయిన ఉద్యాన గృహాన్ని పునర్నిర్మించి అందులోకి మారడం అనేది మంచిదనే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. అయితే దానికీ తగిన పాచిక సిద్ధంగానే వుంది మాధవి దగ్గర.

"పూర్తిగా దహనమై పోయిన ఆ సౌధాన్ని తిరిగి నిర్మించడానికి తక్కువ వ్యయంకాదు. పన్నాశ్రేష్ఠి హఠాత్తుగా పోయాక ఇప్పుడంత ధనం లేదు నా దగ్గర. ఉన్న నగ, నట్రా అమ్మి పోనీ మళ్ళీ నిర్మిస్తామే అనుకోండి. ఆ తరువాత జీవనోపాధికి మార్గమేమిటి? మీరు చూస్తే వర్తకం ఎత్తేసి ఇలా కూర్చుంటిరి. ఉన్న కాస్త బంగారమూ, నగలూ అమ్ముకుంటే మరి మీ మణిమేఖలను ఏమిపెట్టి పోషించాలో చెప్పండి స్వామీ! ఇదంతా ఆలోచించే నేనీ నిర్ణయానికి వచ్చాను. ఇక్కడే వుండడమనేది జరిగితే. అటు సోదరి కణ్ణకికి కూడా అన్యాయం జరగదు. ఇటు మీ కూతురూ, నేను సురక్షితంగా కూడా ఉంటాము."

ఈ మాట విని మౌనంగా ఉండిపోయాడు కోవలన్. అతని దగ్గర దానికి మరి సమాధానం లేదు.

వయో వృద్ధులైన శ్రేష్ఠిగణంలో ఈ విషయమై ఇంకా చర్చలు వాదోపవాదాలు జరుగుతూనే వున్నాయి. మహారాజు కావేరీ పట్టణం వచ్చిన వెంటనే మాధవికి నగర బహిష్కారం తప్పనిసరని కూడా వదంతులు వ్యాపించాయి. అయినా మాధవి పట్టుదలలో మార్పులేదు. కాని  మహారాజు వేంచేసే తిథి సమీపిస్తున్న కొద్దీ లోలోపల ఒక వైపు భయం పీకుతూనే వుందామెకు.

ఇక్కడ మాధవీ, ఆమె కూతురు మణిమేఖల సేవలు శుశ్రూషల్లో మునిగి తేలుతున్నది కణ్ణకి. మాధవి పైపైకి అక్కా! అక్కా! అనుకుంటూ పూసుకు తిరుగుతూనే దాసికంటే నీచంగా  వినియోగించుకుంటున్నదామెను.

తన ఖర్చులకు దాసదాసీ జనానికీ సొంత డబ్బు వెచ్చించడం పూర్తిగా మానుకున్నది. కణ్ణకీ తన నగలన్నీ దేవంతి ద్వారా అమ్మిందో, తాకట్టు పెట్టిందో ఖర్చులన్నీ గడుపుకు వస్తూన్నది. ఇంత ఖర్చు ఎలా సమర్థించుకు రాగలుగుతున్నదో అర్థంకాక ఆశ్చర్యపడి పోతున్నది మాధవి. కోవలన్ పేరు చెప్పి మరింత వ్యయ ప్రయాసతో కూడిన పనులు రోజూ కణ్ణకికి అప్పజెప్పుతున్నది. నోరు మెదపకుండా అన్నిటినీ నిర్వహిస్తూన్నది కణ్ణకి. ఎంత వ్యయాన్నయినా భరించడానికి వెనుకాడడం లేదు. కాని మాధవి కుటిల నీతిని గమనించి భవిష్యత్తు విషయమై ఆలోచించినప్పుడల్లా నగలన్నీ అయిపోయాక మరి దారి ఏమి దేవుడా అని తల్లడిల్లిపోతూ ఉంటుంది ఆమె మనస్సు. ఏకాంతంగా కూర్చొని తరుణోపాయం ఏమిటా అని ఆలోచిస్తూ ఉండి పోతుంది.

కణ్ణకి భయ సందేహాలు నిజాలు కావడానికి ఎంతో కాలం పట్టలేదు. నగలన్నీ ఒకటొకటిగా ఒడిసిపోయాయి. విలువైన వస్తువేదీ మిగలలేదు. రేపటినుండి ఇల్లు గడవడం ఎలా? కాని ఈ సంగతి విని భర్త ఏమనుకుంటాడో, మాధవి ఎక్కడ అపార్థం చేసుకుంటుందోనని ఒంటరిగా కూర్చొని ఆలోచిస్తున్నది కణ్ణకి. ఆమె చెక్కిళ్ళు తడిసి వక్ష స్థలం మీద కన్నీళ్ళు ధారలుకట్టాయి. దేవంతి కోష్ఠంలోకి అడుగుపెడుతూనే ఆమెను చూచి సంగతి గ్రహించింది. దగ్గరగా వెళ్ళి నిలబడి "ఎందుకమ్మా ఏడుస్తారు? నేనే వెళ్ళి అన్ని సంగతులు శ్రేష్ఠి గారితో చెప్పేస్తాను. చేతిలో చిల్లిగవ్వ లేనప్పుడు అమ్ముడు పోతామా ఏమిటి? ఉన్న నగా, నట్రా అమ్మి వాళ్ళకే పెట్టారుగా" అంది.

కణ్ణకి ఏదైతే తెలియనీయకుండా ఉంచాలని అనుకుంటున్నదో అదే వెళ్ళి చెప్తానంటున్నది దేవంతి. ఇంటి లేమిని గురించి భర్త ముందు ఏకరువు పెట్టే పద్ధతి కులవధువుది కాదు. వున్నంత వరకు అందరి అవసరాలు తీర్చడమే గృహిణి ధర్మం.ఎట్టి పరిస్థితుల్లోనూ కోవలన్‌కు గాని, మాధవికిగానీ ఈ సంగతి చెప్పవద్దని దేవంతిని బ్రతిమాలుకున్నది కణ్ణకి. తను దేవంతి నోరు మూయగల్గుతుంది. వాస్తవమే. అయినా రేపటినుండి ఖర్చులన్నీ తెచ్చిపెట్టడం ఎలాగో తోచుబడి కావడం లేదామెకు. గర్భ కోష్ఠంలో వంశకోశంలోని ధనరాసి తప్ప ఏడేడు తరాల నుండి కూడబెట్టిన సంపద అంతా తుడిచి పెట్టుకుపోయింది. కాని ఎట్టి పరిస్థితుల్లోనూ తను ఆ కోశాన్ని తాకడానికి వీలులేదు. ఎప్పుడో వృత్తి దివాళాతీసే సందర్భాలు వచ్చినప్పుడు, వంశ ప్రతిష్ఠకు, కుల ధర్మానికి విపత్తు వచ్చినప్పుడు తప్ప ఆ కోశం ముట్టడానికి లేదు. అటువంటి సందర్భాల్లోనూ కులలక్ష్మి కేవలం అప్పుగానే కొంత ధనాన్ని కోశం నుండి తీసి తిరిగి పరిస్థితి కుదురుకోగానే తిరిగి ఆ కోశానికి ఇచ్చివేయవలసి ఉంటుంది. ఆ కోశం తరువాత అతి పవిత్రమూ, అమూల్య సంపద వైశ్య గణంలో ఇహను కళ్యాణ మంజీరాలే. దురదృష్టవశాత్తు కోశాగార

ధన సంపద కూడా నష్టపడి పోవడమంటూ జరిగినప్పుడే – కుల వధువు కళ్యాణ మంజీరాలు అమ్మి పోయిన వృత్తి, వైభవాన్ని తిరిగి వైశ్య శ్రేష్ఠి కాపాడుకుంటాడు. ఇప్పుడీ కోశమూ, కళ్యాణ మంజీరాలు తప్ప మరేమీ మిగిలిలేవు కణ్ణకి వద్ద. అందుకని దేవంతిని వద్దు వద్దంటూనే గట్టిగా వారించలేక పోయిందామె. దేవంతి నేరుగా వెళ్ళి ఉన్న యధార్థమంతా కోవలన్ ముందు చెప్పి వేసింది.

ముందీమాట వినడంతోనే ఎగిరి పడింది మాధవి. కోవలన్‌ని ఉద్దేశించి "చూశారా ఇదీ మహాశ్రేష్ఠిగారి ఎత్తే. నన్నూ నా బిడ్డనూ ఆకలితో చంపాలని ఆ తండ్రీ కూతుళ్ళిద్దరూ కలిసి పన్నిన పన్నాగమిది. నేను సవతిని. అది సవతికూతురు. మా ఇద్దరి మీద కక్ష సాధిస్తే సాధిస్తారుగాని, మిమ్మల్ని కూడా ఈ రూపంలో శిక్షించాలని చూస్తున్నారు వాళ్ళు. భర్తను ఆకలితో చంపడం కూడా ఒక పతివ్రతా ధర్మమేనా అని అడుగుతున్నాను నేను. మీరు నాకా కళ్యాణ మంజీరాలు పెట్టినా పెట్టకున్నా మంచిదే. కాని ఇటువంటి పతివ్రతల కన్నా వేశ్యనైనా నేనే నయం. నేను బ్రతికుండగానే మీకే ఇబ్బంది రానివ్వను. అమ్ముడుపోయి అయినా మీకు కష్టం కలుగకుండా కాపాడు కుంటాను."

ఆ మరునాటి నుండి ఇంటి పెత్తనమంతా మాధవి చేతుల్లోకి వచ్చింది. మహాశ్రేష్ఠి గారి భవంతిలో. దాసదాసీ జనం ఇతర ఉద్యోగులు మామూలుగానే బ్రతుకుతున్నారు. అందరికీ అన్నీ సవ్యంగానే జరుగుతున్నాయి. కాని ఇద్దరు ప్రాణులు మాత్రం అర్ధాకలితో, పస్తులతో గడుపుతున్నారిప్పుడు. యజమానురాలి అంతస్తుతో భవంతి అంతా కలియ దిరుగుతూన్నది మాధవి. సౌధం మూల మూలలు గాలించివేస్తున్నది. ఏ కోష్టానికైనా బీగం వేసిగాని కనబడిందో అప్పటికప్పుడు కోవలన్ సమక్షానికి కణ్ణకిని రప్పించి దాని తాళాలు అప్పచెప్పించుకుంటున్నది. నోరు మెదపకుండా ఆజ్ఞను పాలిస్తున్నది కణ్ణకి. అన్ని కోష్ఠాలు ప్రకోష్ఠాలు అయిపోయాయి. కేవలం ఒకే ఒక గర్భకోష్ఠం మిగిలిపోయిందిక. దాని బలమైన లోహపు తలుపులు, తాళాలు చూసినప్పుడల్లా మాధవి అనేక పర్యాయాలు దాని బీగాలు కూడా ఇమ్మని కణ్ణకిని బలవంత పెడ్తూనే వున్నది. కాని ఏదో ఒక నెపంతో ఎప్పటికప్పుడు దాట వేసుకు వస్తున్నదామె. కోవలన్‌ను కూడా అడిగి అడిగి విసుగెత్తి ఒక రోజున ఇహను ఏదో ఒకటి తేల్చుకోవాలనే బిగిసి కూర్చుంది మాధవి. "ఆ కోష్ఠం బీగాలు అందరికీ ఇచ్చేవి కావు, అవి అత్త ద్వారా కోడలికి సంక్రమిస్తాయి. పురుషుడికి దాని లోపలికి ప్రవేశించే అధికారమేమీ లేదసలు. మా అమ్మగారు పోయాక నాన్నగారు కూడా వచ్చిన ఆదాయాన్ని గర్భకోష్ఠం ఇవతలే భద్రపరచి బైటనుండి తాళాలు వేసేవారు. కణ్ణకి వచ్చాకనే ఆచారం మేరకు నాన్నగారు ఆ బీగాలు ఆమెకు అప్పజెప్పి పూజాదికాలు

చేయించారు. ఇన్ని సంవత్సరాల ఆదాయమూ ఆమే లోపలి ప్రకోష్ఠంలో భద్రపరిచింది. ఇప్పుడు దానిమీద అధికారం ఆమెదే. ఏడేడు తరాల నుండీ మా పూర్వీకులు ఎవరూ దాని లోపలికి అడుగు పెట్టి ఎరుగరు" అన్నాడు కోవలన్.

గర్భకోష్ఠం లోపలి గృహంలో ఏడేడు తరాల లక్ష్మి మూలుగుతున్నదని తెలిశాక ఎలాగైనా దానిమీద అధికారాన్ని పొందాలనే కోరిక ప్రబలమై పోయింది మాధవికి. ఆనాటి నుండి కోవలన్‌ను రెచ్చగొట్టడానికి, అతడ్ని పూర్తిగా వశపరచుకోవడానికి ఆమె అవలంబించని పద్ధతంటూ లేదు. అస్తమానం ప్రక్కని కూర్చొని లాలిస్తూ మద్యపాత్ర నింపి ఇస్తూన్నది. తియ్య తియ్యటి ప్రేమాలాపాలతో, ఆలింగనాలతో అతడ్ని ఉత్తేజపరచి, రోజూ తన ఉద్దేశాన్ని అతనికి నూరి పోస్తున్నది. తాంత్రికుడు ఎలా అయితే శవసాధనచేసి అనేక ప్రక్రియల ద్వారా ఎలా శవంలో ప్రాణ సంచారం చేయిస్తాడో ఇప్పుడు మాధవి కూడా అంతకు మించిన తంత్రాలనే కోవలన్ మీద ప్రయోగిస్తున్నది. అతను బాగా ఉత్తేజితుడైనప్పుడల్లా మాట మాటకి నేను కణ్ణకికన్నా! ఏ ఇతర కులవధువులకన్నా ఎందులో తీసిపోయానో చెప్పండి" అని ప్రశ్నిస్తూ పోతుంది.

మాధవి కుతంత్రాలు ఊరికెనే పోలేదు. చెప్పగా, చెప్పగా మదోన్మత్తుడైన కోవలన్‌కు చివరకు ఒకనాటికి మాధవి చేతుల్లో చిక్కక తప్పలేదు. లీలా మాత్రంగానైనా అతనిలో ఆలోచన మేలుకొని ఎక్కడ తిరస్కరిస్తాడోనని ముందుగానే ఆ సమస్య మీద పక్షంగానూ, వ్యతిరేక పక్షంగానూ, తనే తర్క వితర్కాలు, వాదోపవాదాలు జరిపి ఒకదారికి తీసుకు వచ్చిందతన్ని. అవకాశం చూచుకొని ధారాపాతంగా కన్నీరు కురిపిస్తూ వెళ్ళి అతని ఎదుట నిలబడింది.

"నేను చెప్పేది చాలా కటువుగానే ఉండవచ్చు కాని అసత్యం మాత్రం కాదిది. నేనిది నా కోసమని కోరుతున్నానని అనుకోకండి స్వామీ! మీ పాదాల సాక్షిగా ప్రమాణం చేసి చెపుతున్నాను. మీ మాధవి అంత స్వార్థపిశాచి కాదు. ఇదంతా నా కోసమనే చేస్తున్నట్లు లోకానికి కనిపిస్తుందంటే నిజం చెప్పండి. కులీనులైన వారికి ఇద్దరు భార్యలుండడం తప్పా? నేను మీ ధర్మపత్నిని కాకపోయినా కనీసం మీ పాదదాసిగానైనా అంగీకరిస్తారా లేదా నన్ను?"

"అంగీకరిస్తాను."

"నన్నెవరైనా చంపేస్తారనుకోండి. లేదా మీ నుండి లాక్కొని తిరిగి మీ సేవాభాగ్యం లభించకుండా చేస్తారనుకోండి. అప్పుడు దాన్ని సహించగలరా మీరు?"

"ఒక్కనాటికీ సహించను.... నువ్వు.... నా – ప్ర–ప్రాణానివి మాధవీ!"

"అయితే నా రక్షణ కోసం తగిన ఏర్పాటు చేయక తప్పదు మీరు. మహారాజుగారు నగరానికి రావడం ఆలస్యం మహాశ్రేష్ఠిగారు మిమ్మల్ని నాకు కాకుండా చేసే మాట నిజం. నేనేమీ చేయలేను. అశక్తురాలిని. అందునా వేశ్యను ధర్మమూ, సంఘమూ, మహారాజు అందరూ ఆయన పక్షమే. దిక్కుమాలిన దాన్ని. మీరొక్కరు తప్ప ఈ లోకంలో ఇంకెవరున్నారో చెప్పండి స్వామీ! ఈ ఆపదనుండి నన్ను కాపాడడానికి కేవలం ఒకే ఒక ఉపాయం మిగిలిపోయిందిక."

"ఏమిటది?"

"ఏమీ లేదు మీరు నన్ను శాస్త్రోక్తంగా పెండ్లి చేసుకోవడమే."

"పెండ్లా?" అన్నాడు కోవలన్ ముఖం వికృతంగా పెట్టి. త్రాగుడువల్ల పూర్తిగా మత్తులో పడిపోయిన అతని చైతన్యానికి ఈ పెండ్లి అనే మాట తీవ్రమైన అఘాతంలా తాకింది. తడబడుతూ లేచి నిలుచున్నాడు. సాధ్యమైనంత వరకు స్వరాన్ని అదుపులోకి తెచ్చుకొని "నీ కోసం నేనేపనయినా చేయడానికి సిద్ధమే కాని ఈ పెండ్లి అనే పరీక్షకు మాత్రం నన్ను గురి చెయ్యకు మాధవీ" అన్నాడు.

"అయితే ఇక నా తలరాత ఇంతే" అంటూ చల్లగా ఒక నిట్టూర్పు విడిచి లేచి నిలుచుంది మాధవి. కోవలన్ సమాధానం విని ఆమె ముఖం పాలిపోయింది. దుఃఖపూరితమైన స్వరంతో "ఇలాగే జరుగుతుందని నాకు తెలుసు. శత్రువుల చేతుల్లో దుర్మరణం పొందేకంటే నాకు నేనే ఏ నుయ్యో గొయ్యో చూచుకోవడం మంచిది. కాని మణిమేఖల! హయ్యో నువ్వేం పాపం చేసుకుని పుట్టావే మణీ రేపటినుండి నువ్విక తల్లిలేని దానివయి పోతున్నావా అమ్మా" అంటూనే నిలువుగా విరుచుకుని పడి పోయింది తల ముక్కాలపీట అంచుకు గుద్దుకొని రక్తం ధారలు కట్టింది.

గాయం చిన్నదే అయినా రక్తం బాగా పోవడం వల్ల కొన్ని రోజులు పక్కమీదనే వుండవలసి వచ్చింది మాధవి. కణ్ణకి ఆమె సేవా సపర్యలలో మునిగి తేలుచున్నది. ప్రక్కనే కూర్చొని అహోరాత్రాలు ఆమెకేమేమి అవసరమో అందిస్తున్నది.

మాధవికి కొంచెం స్వస్థత చిక్కగానే ఆమె కోరిక తీర్చడానికి అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాడు కోవలన్. ఎవ్వరికీ తెలియకుండా తనే వెళ్ళి పెళ్ళికి ముహూర్తం పెట్టించుకు వచ్చాడు. దక్షిణ ఆశతో తలవంచే పురోహితుడ్ని ఒకడ్ని పట్టుకొని మంత్రాలు చదవడానికని ఏర్పాటు చేశారు.

ఆ సుముహూర్తమూ రానే వచ్చింది. బంధుగణం ఎవ్వరూ రాకపోయినా కూలికి వచ్చిన పురోహితుడి మంత్ర పఠనంతో మాధవి వివాహం జరిగిపోయింది.

పధ్నాలుగు సంవత్సరాలుగా కోవలన్‌తో సహచర్యం జరుపుతూన్న మాధవి ఈ వేళ మళ్ళీ పెళ్ళి కూతురై కొత్తగా కోవలన్ ముందుకు వచ్చింది.

పెళ్ళితంతు జరిగిపోయాక కూడా తన లక్ష్యాన్ని మరచిపోలేదు మాధవి. గర్భకోష్ఠంలో ఉన్న ధనమూ, కళ్యాణ మంజీరాలు ఇవి రెండే ఆమెకిప్పుడు లక్ష్యాలు. వాటిని సాధించడానికి తగిన సమయం ఎప్పుడా అని వేయికండ్లతో కాచుకు కూర్చుంది. తను ఇప్పుడు సతి అయింది. మరి సతికి సహజంగా సంక్రమించవలసిన అధికారాల్నే కదా తను కోరుతున్నది. తప్పేమున్నది ఇందులో. ముందు గీసిన గీటు దాటకుండా కోవలన్ను తన గుప్పిట్లో చిక్కించుకొని ఒకరోజు అతన్ని బాగా ఎగ(దోసి కణ్ణకి దగ్గరికి పంపింది.

కోవలన్ బాగా త్రాగి వున్నాడు. “నీ మీది నా వ్యామోహానికి ఇది చివరి పరీక్షయితే తప్పకుండా తెస్తాను మాధవీ” అంటూ తూగుతూ బైలుదేరి కణ్ణకి కోష్ఠంలోకి వచ్చాడు.

ముందు సవినయంగానే తిరస్కరించింది కణ్ణకి. దాంతో పని జరగలేదు. ఆ తరువాత కొంచెం దృఢంగానే ఇది తగదని చెప్పబోయింది. త్రాగుడువల్ల ఉన్మత్తుడై ఉన్నాడు కోవలన్. ఉద్రేకం పట్టలేక ఆమెమీద చెయ్యి చేసుకున్నాడు. దేవంతి ‘రక్షించండి, రక్షించండి’ అని పెద్దగా కేకలువేస్తూ ప్రకోష్ఠం తలుపులు దాటి ఇవతలకు వచ్చింది. దాంతో మరింత రెచ్చిపోయి కణ్ణకిని ఇష్టం వచ్చినట్లు కొడుతూ శవాన్ని ఈడ్చుకు పోయినట్లు లాక్కుపోయి అంతఃపురం మెట్లమీద కుదించాడు కోవలన్. ఆమె చెంగుకు కట్టివున్న బీగాలగుత్తి లాగుకున్నాడు. మంజీరాల వైపు కూడా చేయిజాచాడు. కాని ఎందువల్లనో ఆ సాహసం చేయలేకపోయాడు. నిలువెల్లా ఆయాసపడుతూ రక్తసిక్తమైన శరీరంతో పడివున్న కణ్ణకినీ, అరచి అరచి గొంతు బొంగురు పోయి ఇప్పుడు మౌనంగా వున్న దేవంతినీ, చుట్టూ మూగిన జనసమూహాన్ని చూచాడు. జంకు అనిపించింది. రొప్పుకుంటూ లోపలికి వెళ్ళి తన శక్తినంతా ఉపయోగించి తలుపుల్ని దగ్గరకు చేర్చి లోపలనుంచి గొండిగ వేసుకున్నాడు. అప్పటికే కదలలేకుండా వున్నాడేమో అడుగు తీసి అడుగు వేయడానికి కూడా శక్తి చాలక రొప్పుతూ ద్వారబంధం మీదే చతికిల బడిపోయాడు.

ఆ రోజల్లా ఎవ్వరూ కోవలన్ దగ్గరకు వెళ్ళే సాహసం చెయ్యలేక పోయారు. బైటనుంచి ఎవరైనా రావడానికి తలుపులోపల నుంచి గడియవేసి వుంది. అలా ద్వార బంధం దగ్గరే ఉన్న పళాన పడి ఉండిపోయాడు కోవలన్. అతనికి అతి ప్రియమైన తాగుడు కూడా తెమ్మని ఎవరినీ ఆదేశించలేదు. అంతా జరిగిపోయాక ఇప్పుడా సంఘటన తలచుకుంటే ఏదో శూన్యంగా, బాధగా, ఆవేదనగా, నరాలు తోడుతున్నట్లు ఏదో పోటులాగా అనిపిస్తుందతనికి. కళ్ళు తెరచి ఏదో ఒకసారి చుట్టూచూచి మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

మధ్యాహ్నమయింది. అక్కడే వున్నపాటున కూర్చుని వున్నాడు కోవలన్. దాసదాసీ జనంకాని, మాధవికాని అతని దగ్గరకు రాలేదు. చుట్టూవున్న ఎత్తైన కుడ్యాలు, సుందరమైన లతలు, పుష్పాలుతీర్చిన పెద్ద తలుపులకు దిగువని కాపలా వాళ్ళు కూర్చునే అరుగులు తప్ప ఎవ్వరూ అతని సమీపంలో లేరిప్పుడు. మొహం వేళ్ళాడ వేసుకుని ఇంతవరకూ ఏదో ఆలోచిస్తూ కూర్చున్న కోవలన్ హఠాత్తుగా తడబడుతూ లేచి నిలుచున్నాడు. ద్వారం గడియవేసి కాపలావాణ్ణి కేకవేశాడు. "ఆమె కాని వస్తే తలుపులు తియ్యండని" ఆదేశించి ఎవ్వరివైపూ కన్నెత్తి చూడకుండానే వడిగా అడుగులు వేసుకుంటూ తన అంతఃపుర ప్రకోష్ఠం వైపు వెళ్ళాడు. నిర్జనంగా వున్న ఆ ప్రకోష్ఠద్వారం దగ్గర మణిమేఖల నిలబడి వుంది. ఆమె తల్లికోసం నిరీక్షిస్తూ అక్కడ నిలుచున్నదేమో హఠాత్తుగా తండ్రి కనబడడంతో వులికిపడింది. ఒక్క క్షణం కోవలన్ దృష్టి భయభ్రాంత అయిన మణివైపు పోయింది. ఎందువల్లనో అతని అడుగులు అప్రయత్నంగానే ఆగిపోయాయి. తదేకంగా ఆమె వైపు చూస్తూ వుండిపోయాడు. మణిలో తన ప్రతిబింబమే కనిపిస్తున్నదతనికి. భయభ్రాంత అయిన అతని అంతరాత్మకు ప్రతిమూర్తిగా నిలబడి వున్నది మణి. కోవలన్ పట్టరాని భావావేశంలో ఆమె రెండు భుజాలు పట్టుకున్నాడు. తండ్రివైపు అమాయకంగా చూస్తూ నిలబడిపోయింది మణిమేఖల. ఆ స్పర్శలో ఆమెకేదో అపరిచితమైన ఆత్మీయతతోచింది. కోవలన్ ఆమెను గట్టిగా హృదయానికి హత్తుకొని నెమ్మదిగా ఆమె శిరస్సు నిమురుతూ "ఈ మాయానాటకం మధ్యలో నువ్వెందుకు వచ్చి పడ్డావు తల్లీ. నువ్వేం పాపం చేశావనీ" అన్నాడు. అతని కళ్ళలో నీళ్ళు పొంగాయి. ముందు నిగ్రహించుకుందామని ప్రయత్నం చెయ్యబోయాడు కాని సాధ్యం కాలేదు. కట్టతెగిన తటాకంలా దుఃఖం నిలువునా ముంచి వేసిందతన్ని, ఏడుస్తూ నిలబడిపోయాడు. తండ్రి ఏడుస్తూ వుండడం చూసి ఏమిటో అర్థంకాక తనుకూడా వెక్కిళ్ళు పడుతున్నది మణి. ఆ దుఃఖానుభూతి ఇద్దర్నీ ఏకం చేసివేసింది.

మాధవి కోష్ఠం వైపు వస్తూ దూరం నుండి ఇదంతా చూసి మొహం తప్పించి చాటుకు వెళ్ళిపోయింది. ఇంతసేపూ కోవలన్ ఉలుకూ పలుకూ లేకుండా మౌనంగా పడివుండడం చూసి భయపడి పోయిందామె. ఇప్పుడు మణిమీద ఆయనకు మక్కువ కుదిరింది. అంతే చాలు దేవుడా. మణికోసమని అయినా ఆయనకు నా పట్టులో వుండక తప్పదు అనుకుంటూ లోలోపల సంతోషంతో నిలబడి పోయింది.

# 25

తన ఇంటి ద్వారం ఎప్పుడయితే మూసుకు పోయిందో అనేక సానుభూతి ద్వారాలు తెరుచుకున్నాయి కణ్ణకి కోసం. అందరినీ మౌనంగానే తలవంచి క్షమార్పణ కోరి దేవంతిని తీసుకొని తమ మామగారు కట్టించిన ధర్మశాలవైపు నడిచింది. దేవంతి దారిచూపుతూ ముందు నడుస్తున్నది. కోటీశ్వరుల సంతానం. కులవధువు పాదచారియై నగరవీధుల్లో వెళుతూ వుండడం చూసి అనేక మంది తల్లడిల్లిపోయి కన్నీరు కారుస్తున్నారు. నగరానికి నగరమే సలసల కాగిపోతున్నది. ఎక్కడచూస్తే అక్కడ జనం మాధవినీ, కోవలన్‌ను దూషిస్తున్నారు. కణ్ణకి గుణ గణాలను పొగుడుతూ ఆమె కోసం అశ్రువులు కారుస్తున్నారు.

మహాశ్రేష్ఠిగారి ధర్మసత్రం వృద్ధ కార్యవాహుడు ఇప్పుడు యజమానురాలే ఆశ్రయం కోసమని ధర్మశాల ద్వారం దగ్గర నిలబడి వుండడం చూచి కన్నీరు కారుస్తూ ముందుకు వచ్చి రెండు చేతులు జోడించాడు. "సర్వనాశనం జరిగిపోయింది అమ్మా! ఏమీ మిగలలేదు. కలి నాలుగు కాళ్ళూ మోపిందీ లోకంలో. వినడానికి కూడా వీలులేనిది ఈ పాపిష్ఠి కళ్ళతో చూడవలసి వచ్చింది. ఈ కావేరీ పట్టణానికి చెడురోజులు వచ్చాయి తల్లీ."

ఈ వార్త మహాశ్రేష్ఠి విన్నారు. ఇంతకంటే దారుణమైన వార్త మరొకటుండదాయనకు. ఈ విఘాతాన్ని తట్టుకోలేక కూర్చున్నవాడు కూర్చున్నట్లుగానే ఆలోచిస్తూ వుండిపోయాడు. చాలాసేపు అలా వుండి వుండి హఠాత్తుగా లేచి నిలుచుని ద్వారపాలకుణ్ణి పిలిచి పల్లకీ సిద్ధం చేయమని ఆదేశించారు. కనీసం పాగా అయినా ధరించకుండానే గబగబా వెళ్ళి పల్లకీలో కూర్చున్నాడు. జీవితంలో మొదటిసారి నిండు వీధిలో తలపాగా లేకుండా వెళ్తున్నారు మహాశ్రేష్ఠి. తన ఒక్కగానొక్క కూతుర్ని కలుసుకోవడానికి తన వియ్యంకులు కట్టించిన ధర్మసత్రానికి బయలుదేరారాయన.

తండ్రిగారిని చూచి ప్రక్కమీద నుంచి లేవబోయింది కణ్ణకి. ఆమె శరీరం అంతా గాయపడి వున్నా ముఖం ఎంతో ప్రశాంతంగానూ, ప్రకాశవంతంగానూ వుంది. ఆమెను లేవవద్దని వారిస్తూ వెళ్ళి ప్రక్కనే నిలుచున్నాడు మహాశ్రేష్ఠి. ఇద్దరూ ఎంతో గంభీరంగా ఒకరినొకరు నిగ్రహించుకొని సంయమాన్ని చూపుతున్నా మహాశ్రేష్ఠిగారి హృదయంలో లోలోపల అగ్ని మసలుతూన్నది.

మహాశ్రేష్ఠిగార్ని చూచి దుఃఖాన్ని దిగమ్రింగడం సాధ్యం కాలేదు దేవంతికి. "చూడండి స్వామీ మీ కణ్ణకీదేవి ఎలా అయిపోయారో చూడండి" అంటూ పాదాలమీద పడిపోయింది. ఎడమ చేతిని ఆమె శిరస్సు మీద వుంచి అక్కడే నేలమీద చతికిలపడ్డారు మహాశ్రేష్ఠి. కుడిచేత్తో కణ్ణకి శిరస్సు నిమిరాడు. కణ్ణకి కళ్ళు మళ్ళీ మూసుకున్నాయి. ఎప్పుడో

మరణించిన తల్లి జ్ఞాపకం వచ్చి రెండు కన్నీటి చుక్కలు కనుకొనల్లో నిలచి వెచ్చగా చెక్కిళ్ళ మీదికి జారాయి.

"దుఃఖించకు అమ్మా నువ్వు నా కుమార్తెవు కాదు కొడుకువి. పితరులకు పిండం పెట్టే వాళ్ళు లేరనే చింత నాకిక లేదు. నేనంతా నిశ్చయించుకొనే వచ్చాను తల్లీ! రెండేరెండు మార్గాలున్నాయిప్పుడు. ఒకటి నిన్ను ఇంటికి పిలుచుకొని పోయి మళ్ళీ వర్తకాన్ని తీసికొని ఈ ప్రపంచంతో యుద్ధానికి దిగడం. రెండవది, నువ్వు మొదటదానికి అంగీకరించని పక్షంలో ఆచరించేది – ఉన్నదంతా రాజ్యకోశానికి అప్పచెప్పి సన్యాసం పుచ్చుకోవడం – పోదాం పద అమ్మా. అదీ నీ ఇల్లే. నిన్నే నా కొడుకుగా భావించి రెట్టింపు ఉత్సాహంతో మళ్ళీ లోకంలో దిగుతాను. ఏమంటావు తల్లీ!"

కళ్ళు మూసుకొని అలాగే ఉండిపోయింది కణ్ణకి. చాలాసేపు అలాగే ఆలోచిస్తూ వుండి వుండి "ఆ రెండో మార్గమే మంచిది. శ్రేయస్కరమైంది నాన్నా" అంది. ఇటువంటి విపత్తులో పుట్టింటికి వెళ్ళిపోయి మెట్టినింటికి మచ్చ తేవడం ఇష్టం లేదామెకు.

"నీ వల్ల రెండు వంశాలు పవిత్రమయ్యాయి తల్లీ! నీ తల్లి గర్భం ధన్యమయింది. మంచిదమ్మా! నాకే చింతా లేదిక. ఈ నాటితో నా దుఃఖాలన్నీ తీరిపోయాయి. నాకు శాంతి లభించిందిక. పరమశాంతి" అంటూ కళ్ళు మూసుకున్నాడు మహాశ్రేష్ఠి. ఆయన కళ్ళు అశ్రుసిక్తాలయి కన్నీళ్ళు చంపల మీదుగా జారుతున్నాయి.

మహాశ్రేష్ఠి సన్యాసాశ్రమం స్వీకరించడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ధన సంపదనంతా రాజ్యకోశానికి ఇచ్చివేస్తూ ఈ ధనంతో నశించిపోయిన నగర వర్తక వైభవాన్ని తిరిగి వృద్ధిలోకి తేవలసిందిగా మహారాజుగారికి వ్రాశారాయన. అంతేకాదు. ఆయన ఈ ప్రపంచ  వ్యామోహాలన్నీ విసర్జిస్తూనే మాధవి మీద తనకున్న కక్షను మళ్ళీ చివరిసారిగా తీర్చుకున్నారు. తన వియ్యంకులు మహాశ్రేష్ఠి మాశాత్తువన్ గారి సంపదనంతా ముఖ్యంగా పవిత్రమైన వారి వంశకోశాన్ని మాధవి మాయోపాయాలతో వశపరచుకుందని ప్రభుత్వం దాన్ని కూడా స్వాధీన పరచుకొని నగర వాణిజ్యాభివృద్ధికి ఉపయోగించడం ఎంతో శ్రేయస్కరమని, ఆ విధంగా చేయడం వల్ల స్వర్గీయులైన తన వియ్యంకుల ఆత్మకు ఎంతో శాంతిని చేకూర్చినట్లు కాగలదని కూడా మహారాజు వారికి వ్రాశారాయన. తన దాన పత్రములో మాధవి, కోవలన్‌ల దౌర్భాగ్య స్థితిని కూడా ఉల్లేఖిస్తూ వారి పోషణకు అయ్యే వ్యయాన్ని ఈ ధనంమీద వచ్చే వడ్డీ నుండి ఇప్పించే ఏర్పాటు చేయవలసిందిగా మహారాజా వారిని  అభ్యర్థించారు.

దానపత్రాన్ని మహారాజా వారి సన్నిధికి పంపుతూ వెంటనే ప్రభువులు తమ ప్రతినిధిని కావేరీ పట్టణానికి పంపి తనను సాధ్యమైనంత త్వరలో బంధ విముక్తుడ్ని చేయవలసిందని

కోరారు మహాశ్రేష్ఠి. పత్రం అందినదే తడవుగా రాజోద్యోగి ఒకడు బయలుదేరి కావేరీ పట్టణం వచ్చాడు. మహాశ్రేష్ఠిని సంసార పరిత్యాగం చెయ్యవద్దని అభ్యర్థిస్తూ మహారాజావారే స్వయంగా ఒక పత్రం పంపారు. కాని శ్రేష్ఠిగారు తన నిశ్చయాన్ని వదులుకోలేదు.

మహాశ్రేష్ఠిగారి సన్యాసాశ్రమ ముహూర్తాన్ని ప్రకటించారు. వారి సూచన మేరకు రాజోద్యోగి స్వయంగా వెళ్ళి స్వర్గస్తులైన మహాశ్రేష్ఠి మాశాత్తువన్ గారి వంశ కోశాన్ని వశపరచుకున్నారు. నగరం అంతా అలజడిగా వుంది. మాధవి భయంతో స్తంభించి పోయింది. ఏదీ అంటని యోగిలాగా తటస్థుడుగా వుండిపోయాడు కోవలన్.

గృహ పరిత్యాగం చేసి దరిద్రులకు భిక్షువులకు, సన్యాసులకు యధేచ్ఛగా దాన ధర్మాలు చేసి అసంఖ్యాకమైన జన సమూహంతో కావేరీ తీరానికి వచ్చాడు మహాశ్రేష్ఠి. ఆచారం మేరకు అక్కడ లౌకిక వేషభాషలు విసర్జించి కాషాయ వస్త్రాలు ధరించారు. ఆ తరువాత అందరికీ ప్రణామాలు చేసి తీరం దాటి అవతలకు వెళ్ళిపోవడానికని నావలో కూర్చున్నారు.

మహాశ్రేష్ఠిగారికి చివరి వీడుకోలు ఇవ్వడానికని నగరానికి నగరమే తరలి వచ్చినట్లుగా వుంది. కాని ఆయనకు అత్యంత ప్రేమ పాత్రురాలయిన కుమార్తె, అల్లుడూ రాలేదు. దేవంతి మాత్రం వచ్చి ప్రణామ సూచకంగా చేతులు జోడించి నిలుచున్నది. ఒకవైపు జనానికి ఇవతల కాషాయ వస్త్రాలతో చేలమ్మ కూడా నిలబడి వుంది. మహాశ్రేష్ఠిగారికి తుది వీడ్కోలు చెప్తూ తనకు చిరపరిచితమైన కావేరీ పట్టణమే తరలిపోతున్నట్లు బాధపడింది చేలమ్మ. ఏదో పోగొట్టుకున్న దానిలా అన్యమనస్కంగా నిలబడి పోయింది.

కత్తుల బోనులో చిక్కినట్లుంది మాధవి పరిస్థితి. ఎక్కడ విన్నా మహారాజు గారు నగరానికి రాగానే ఆమెకు శిక్ష తప్పదనే చర్చ తప్ప మరొకటి వినరావడం లేదు. కులట అయివుండీ కుల వధువుల్ని, కుల సంప్రదాయాన్ని అవమాన పరచిన మాధవికి శిక్షపడి తీరవలసిందే. మహారాజు రానివ్వండి ఏమవుతుందో దీని గతి. శిరోముండనం చేయించి గాడిదమీద ఊరేగించకపోతే అప్పుడడగండి. 'అబ్బే ఆ శిక్ష చాలదు ఇటువంటి ఘోరాలకు ఒడిగట్టిన వాళ్ళకు ఉప్పుపాతర వేస్తారు. గొంతు వరకు అందులో పాతివేయించి జాగిలాల్ని ఉసికొల్పుతారు. ఇహ చూచుకో నాయనా' ఇటువంటి వార్తలన్నీ ఇల్లిల్లు, వాడ వాడ తిరిగి సేకరించుకు వస్తూన్నది నాగరత్న.

ఒక రోజున దరయూరు నుంచి వచ్చిన రాజ ప్రతినిధి నుండి పిలుపు వచ్చింది మాధవికి. కొన్ని వర్తకపు దినుసులకు కీ॥శే॥ మహాశ్రేష్ఠి కట్టిన ధరల్ని గురించి తెలుసుకోవలసిన కార్యం ఉన్నదంటూ అధికారి వర్తమానం పంపాడు. వార్త విని ముందు భయంతో వణికిపోయింది మాధవి. కాని వెళ్ళక గత్యంతరం లేదు. అందునా ప్రస్తుత

విపత్కర స్థితిలో దీనివల్ల తనకేదైనా ఆలంబన దొరికినా దొరకవచ్చు. వెంటనే లేచి పల్లకీ సిద్ధం చేయించమని నాగరత్నకు చెప్పి తను వెళ్ళి అద్భుతంగా అలంకరించుకొని సిద్ధమయింది. తననూ, తన మణిమేఖలను కాపాడుకోవడం కోసమనీ ఎటువంటి యుక్తినయినా ఆచరణలో పెట్టడానికి సిద్ధంగా వుంది మాధవి అలా అని సతీత్వం సంగతి ఆమె మరచి పోయిందని కాదు. కాని పురుషుల్ని అంద చందాలతో ఆకర్షించి ఆకట్టుకునే సంస్కారం వల్ల ఏర్పడిన ప్రవృత్తే ఈ సమయంలోనూ ఆత్మ రక్షణ కోసమని ఆమె బాహ్యా జీవితం అంతటా వ్యక్తమవుతూన్నది.

రాజోద్యోగిని తన వాక్చమత్కారంతో ఆకట్టుకోవడానికి బాగా ప్రయత్నం చేసింది మాధవి. అతనికి తన పట్ల జాలి పుట్టేటట్లు చేయాలని ఆమె సంకల్పం. కాని అప్రయత్నంగానే తన రూపు రేఖా విలాసాలు, అతడ్ని మోహపాశంలో చిక్కుకునేటట్లు చేస్తే ఆ అపరాధం ఎవరిది? మాధవి తన సతీత్వాన్ని గురించి, ఏక పురుషవ్రతమూ మొదలైన శిష్టాచారాలను గురించి పదే పదే అతని ముందు ఏకరువు పెట్టింది. కాని వినే వాడికి ఇటువంటి గుణాలన్నింటిని నా కొరకు కూడా ఈమె పాటించగలదనే అపోహను కలిగించే విధంగా ఉందా చెప్పే పద్ధతి.

మాధవి తన కార్యాన్ని సాధించుకొని మరీ తిరిగి వచ్చింది. అయితే ఆ రోజు నుండే అదే నెపంతో తరచూ వెళ్ళడం మామూలై పోయిందామెకు. కోవలన్‌తో చెప్పకుండానే రోజూ వెళ్ళి వస్తున్నది. కోవలన్ పట్ల ఆమె హృదయంలో ఉన్న ప్రేమ అపారం, పర పురుషుడికి సంబంధించిన ఆలోచనే లేదామె  మనస్సులో. కాని పురుషుడ్ని ఆకర్షించడంలో తనకున్న అపూర్వ కౌశలాన్ని అవకాశం కలిగినప్పుడు ఉపయోగించు కోవడం అపరాధంగా భావించడం లేదామె. అయితే క్రమేపీ రాజోద్యోగితో వ్యవహారం రసఘట్టంలో పడుతూన్నది. వుండి వుండి తీవ్రమైన అంతఃస్సంఘర్షణకు లోనవుతూన్నదామె. రెండు మార్గాల్లోనూ దేన్నో ఒకదాన్ని అనుసరించడం మంచిదనే భావన కూడా అప్పుడప్పుడూ కలుగుతూన్నదిప్పుడు. అటేమో రాజోద్యోగి ఆమె పొందుకోసం తహ తహ లాడుతున్నాడు. అతని తొందరపాటు చూచి తను విసరిన పాచికలో తనే చిక్కినట్లు భయభీత అవుతూన్నది మాధవి. ముందుకు సాగుతున్న అడుగులు కొద్దికొద్దిగా జంకుతున్నాయి. ఆమె మనస్సులో సతీత్వానికీ, వేశ్యా ప్రవృత్తికీ మధ్య తీవ్రమైన సంఘర్షణ చెలరేగుతూన్నదిప్పుడు. అవసరం కోసమని రాజోద్యోగిని అలరించి వచ్చి దానికి పశ్చాత్తాపంగా కోవలన్‌ను సంతోష పరచడంలో తనను తాను లీనం చేసుకుంటున్నది. రాజోద్యోగి చేతుల్లోంచి నేర్పుగా తప్పుకొని బైట పడి ఇంటికి రాగానే తనను అగాధమైన

పాతాళకూపంలో పడకుండా కాపాడగలిగేవాడు కోవలన్ ఒక్కడు తప్ప మరొకడు లేనట్లు అతని హృదయానికి హత్తుకుపోతుంది. అన్నిటిలోనూ అపజయమే ఎదరౌతున్నట్లు అనిపిస్తూన్నదామెకు. ఎటు చూచినా నిరాశ నిస్పృహలే ఎదురౌతున్నాయి. ఎంతో ప్రయాసతో మహాశ్రేష్ఠిగారి భవంతికి యజమానురాలయింది. కులలక్ష్మి అధికారాన్ని కణ్ణకి నుండి లాక్కొని మొత్తం ప్రపంచాన్నే జయించిన ఆనందాన్ని పొందింది. కాని ఏం లాభం? అంత సుందరమైన ఆశా సౌధాన్ని కుటిలుడైన మహాశ్రేష్ఠి కేవలం ఒకే ఎత్తులో నేలమట్టం చేసి మరీ వెళ్ళిపోయాడు. తన్ను కోవలన్ ప్రేమిస్తున్నాడు. అగ్ని హెూత్రం సాక్షిగా అతణ్ణి పెళ్ళాడి ప్రదక్షిణాలు కూడా చేసింది తను. తను కోవలన్‌కు ఇప్పుడు రక్షిత వేశ్యకాదు. ధర్మపత్నే. కాని సాక్ష్యమేమున్నది దానికి? లోకం ఎలా నమ్ముతుంది? తన పత్నీత్వానికి బలమైన ప్రమాణమేదో కావాలి మాధవికి.

సతీత్వానికి చిహ్నాలయిన కళ్యాణ మంజీరాలు పొందాలనే కోరిక మళ్ళీ ప్రబలమౌతున్నది మాధవిలో. కణ్ణకిని బైటికి గెంటినప్పుడు ఆమె మంజీరాలను కోవలన్ లాక్కోబోవడం చూచిందామె. తరువాత మణిమేఖల మీద అతని ప్రేమానురాగాలు వృద్ధికావడం గమనిస్తూన్నది. ముఖ్యంగా పెద్ద అవరోధం మహాశ్రేష్ఠిగారిది ఇప్పుడు తొలగిపోయింది. ఇహను జీవితమంతటికీ మహత్తరమైన ఈ కోరికను సాధించి తీరుతుంది తను. కణ్ణకిని జయించి తీరుతుంది. ఆ తరువాత ఒక వేళ తన శిరస్సు పోతే పోనీ అనుకుంటుందామె.

మళ్ళీ తీవ్రమైన అంతర్ద్వంద్వంతో సంఘర్షణ పడుతూన్నది మాధవి.

## 26

నగరంలో తిరిగి ఇంద్రోత్సవాల కోసమని పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. చోళదేశానికంతటికీ ఇప్పుడు రాజధానియైన కారణంగా కావేరీపట్టణానికి నూతన వధువులాగా అలంకారాలు చేస్తున్నారు. దూర దూర ప్రాంతాల నుండి నాట్యకత్తెలు, ఇంద్రజాలికలు, వర్తకులు శ్రేష్ఠులు జట్లు జట్లుగా నగరానికి వస్తున్నారు. మహారాజు యికనుండి నగరంలోనే స్థిరంగా వుంటారు గనుక తమ పరిస్థితి మెరుగు పడవచ్చని మహాజనవాడలోని శ్రేష్ఠులందరూ ఆశపడుతున్నారు. కావేరీ పట్టణం రాజధాని అవడంతోనే ఉత్తరాపథానికి, దక్షిణాపథానికి సంబంధించిన వర్తక కేంద్రాలలో మళ్ళీ ఒక విధమైన ఉత్తేజన ప్రారంభమయింది. అయినా మహాశ్రేష్ఠిగారు సంసార పరిత్యాగం చేయడంతో ప్రజల హృదయాలలో గూడు కట్టుకున్న శంకలు సందేహాలు ఇంకా పూర్తిగా తొలగిపోవడం లేదు.

మహారాజుగారు వేంచేసే తిథి సమీపిస్తున్న కొద్దీ నగరంలో అలజడి పెరిగిపోతూన్నది. మాధవీ, పన్నాల ప్రేరణతో కట్టు తప్పి ప్రవర్తించిన వేశ్యలంతా ఇప్పుడు భయకంపితులై పోతున్నారు. మహారాజుగారు వచ్చీ రావడంతోనే వేశ్యకన్యల మీద తీవ్రమైన చర్యలు తీసుకునే ఉద్దేశంతో వున్నారనీ ధన వైభవాలతో మహాజనవాడ శ్రేష్ఠుల్ని మించి పోయిన వేశ్యల ధన సంపదనంతా స్వాధీన పరచుకుంటారని వదంతులు వ్యాపించడంతో ధనిక వేశ్యలందరూ తమ తమ ధన సంపదనంతా భూస్థాపితం చేసివేస్తున్నారు. కొందరు వేశ్యలు భీతావహంతో అప్పుడే నగరం విడిచి పారిపోయారు కూడా! మహారాజు విచ్చేయడానికి కేవలం నాలుగు రోజులు మాత్రమే గడువు వుండి పోయిందిక.

ఇంతలోనే నగరం మీద అనుకోకుండా మరొక ఉపద్రవం వచ్చి పడింది. హఠాత్తుగా కావేరీ నదికి కొత్తనీరు తగిలి వరద పెరిగిపోతున్నదన్న వార్త వ్యాపించింది. అంతేకాదు. ఆ వార్త వ్యాపించిన రాత్రే నదీ తీరానవున్న వాడల్లోకి నీరు ప్రవేశించి కొన్ని యిళ్ళు కొట్టుకుపోయాయి. కొన్ని నేలమట్టమయ్యాయి. ఇంద్రోత్సవాల కని తీరం మీద వెలసిన చిన్న చిన్న శ్రేష్ఠుల గుడారాలన్నీ కొట్టుకుపోయాయి. కొంత జననష్టం కూడా జరిగింది. రాజోద్యోగులు కొందరు పెద్ద పెద్ద కాగడాలు పట్టుకొని ప్రవాహంలోకి పరుగెత్తారు. కాని వారికి జనాన్ని రక్షించాలనే ఉద్దేశం కన్నా మహారాజు మెప్పు ముఖ్యమైనందువల్ల ఎవరినీ కాపాడలేకపోయారు. కావేరీ నది నౌకాశ్రయం అంతటా హాహాకారాలు చెలరేగాయి. విదేశ సరుకులు తెచ్చిన నౌకలు కొన్ని మునిగిపోయాయి. కొన్ని సముద్రంలోకి కొట్టుకు పోయాయి. నదీ సంగమం నుండి సముద్ర తీరం వరకు విహారం కోసం వచ్చిన స్త్రీలు, పురుషులు గుంపులు గుంపులుగా తిరుగుతుండేవారు. అక్కడ ఎప్పుడూ జన సంచారం వుంటూ వుండేది. ఏటేటా నృత్యోత్సవాలు జరిగే ప్రదేశం కూడా ఇదే. ఈ ఏడు నృత్యోత్సవాల కోసం చేసిన అద్భుతమైన అలంకారాలన్నీ ఏటిపాలయ్యాయి.

తెల్లవారు ఝామున్నే నగరంలో చాలా మంది వెల్లువ చూడడానికని వెళ్తున్నారు. "మనం కూడా వరద చూడడానికని వెళ్దామా మధూ!" అంటూ వచ్చిన కోవలన్‌ని చూసి ముఖం తిప్పుకున్నది మాధవి. రుస రుసలాడుతూ "ఇప్పుడు నేను వరదలోనే వున్నాను. కన్నీళ్ళ పొంగులో కొట్టుకుపోవడానికి సిద్ధంగా నిలుచున్నాను. ఆ కావేరీలో కొట్టుకు పోయేవాళ్ళే అదృష్టవంతులు మీ అందరి సానుభూతి దొరుకుతుంది వాళ్ళకు. నావంటి దురదృష్టవంతులు చచ్చినా బ్రతికినా ఒకటే."

కోవలన్ చిరాకుపడ్డాడు. "ఇటువంటి కల్లబొల్లి కబుర్లు ఇక నన్ను సంతోషపెట్టలేవు మాధవి! ఈ లోకంలో ఏ మగవాడూ ఏ స్త్రీకి ఇవ్వలేని దాన్ని నీకు యిచ్చాను నేను.

కావేరీ పట్టణానికే గర్వకారణమైన మా మామగారి ప్రతిష్ఠను, వృత్తినీ, వైభవాన్నీ నీకోసం ధారాదత్తం చేశాను. నీకోసమని తీరని కళంకాన్ని, అపఖ్యాతినీ, అవహేళనాన్ని సహించాను. ఇంత చేసినా నిన్ను సంతోషపరచలేక పోయానంటే...”

“కావచ్చు కాని అన్ని రకాల మృష్టాన్నాలు వుండి వాటిల్లో ఉప్పులేకపోతే, దేవుడు అద్భుతమైన రూపాలు సృష్టించిన వాటికి ప్రాణం పోయడం మానివేస్తే, కేవలం రాజు మాత్రమే వుండి రాజ్యం లేకపోతే ఎల్లా వుంటుందో ఆలోచించండి. నేను వేశ్య యింట పెరిగాను. నగర వధువుగా పిలువబడుతున్నాను. మీరూ అదొక్కటే చూడగలిగారు కాని సతిగా ఎప్పుడైనా గుర్తించారా నన్ను. ఇంత ప్రేమించినా, గుండెకోసి మీ కాళ్ళముందు వుంచినా, నా జీవితాన్నే మీ కోసం హోమం చేసినా? మీరు నాకోసం ఎంతో త్యాగం చేశానన్నారు. కావచ్చు ఇదేనా విలువ నా ప్రేమకు?”

“నీ ప్రేమ ఎంతో విలువయిందే కావచ్చు కాని నా హృదయానికి శాంతి నివ్వడం లేదది.”

“అవును మేమేమి శాంతినివ్వగలం లెండి. వుందిగా మహాశ్రేష్ఠిగారి కూతురు శాంతి నివ్వడానికి. ఆమె శాంతిదూత, దేవత, సాక్షాత్తూ దేవకన్య. నేనే దెయ్యాన్ని, శాపాన్ని, ఈ లోకానికే తీరని మచ్చని.”

రోషంతో, కన్నీళ్ళతో తడిసిపోయిన మాధవి ముఖం వైపు చూస్తూ కూర్చున్నాడు కోవలన్. అతడికి జాలి కలిగింది. “ఇంకా నువ్వు కణ్ణకిని ద్వేషించడం అనవసరం మధూ? ప్రసిద్ధమయిన ఈ భవంతికి యజమానురాలి వయ్యావు. ఎవ్వరికీ సాధ్యం కాని దాన్ని పొందావు. పాపం కణ్ణకి అన్ని అధికారాలను పోగొట్టుకొని నిరాశ్రయురాలై వెళ్ళిపోయింది.”

“ఔను పాపం! ఎవరు వెళ్ళగొట్టమన్నారు. ఆమెతోనే వుండవలసిందిగా! ఇంత ప్రసిద్ధ భవంతికి ఈ దాసీని యజమానురాలిని చేసిన దానశీలురు మీరు. కాదనను. కాని ఇంకెంత కాలం వుంటానీ భవంతిలో, ముందే రాజాజ్ఞ నా అధికారాన్ని లాక్కుంది. ఇక రాజుగారు రాగానే ఈ కాస్త తలనీడ కూడా పోయి నేనూ మళ్ళీ వీధులపాలే అవుతానో, దేశ బహిష్కారానికే, గురి అవుతానో” అంటూనే అందమైన విశాలమైన ఆమె నేత్రాలు కన్నీళ్ళతో నిండిపోయాయి.

సుందరమైన మాధవి ముఖం ఈ భయాందోళనలతో మరింత అందంగా కనిపించింది కోవలన్‌కు. దగ్గరకు లాక్కుని హృదయానికి హత్తుకున్నాడు. కన్నీళ్ళు తుడుస్తూ “పిచ్చిదానా ఇదేమంత భయపడవలసిన విషయం కాదు. మహారాజు నిన్నీ ఇంటినుండి వెళ్ళగొడ్తే వెళ్ళగొట్టగలరేమో. కాని నా నుండి మాత్రం వేరుచేయలేరు. ఒకప్పుడు నాకు వంశగౌరవం

మీద, ఈ యింటి వైభవం మీద ఎంతో అభిమానం వుండేది. ఆ గర్వంతోనే నిన్ను చంపడానికి కూడా సిద్ధపడ్డాను ఒకప్పుడు జ్ఞాపకం వుందా? కణ్ణకిని ఈ ఇంట్లోంచి వెళ్లగొట్టాక అవన్నీ పోయాయి. ఇక నాకు మిగిలింది నువ్వొక్కర్తివే. నా జీవిత సర్వస్వం ఇక నువ్వే మాధవీ."

"నేను మహా వుంటే మరో నాలుగు రోజులుంటాను." గళం రద్ధమైపోయి ఆ పైన మాట పెగలలేదు మాధవికి. వెక్కిళ్ళు పడుతూ వుండిపోయింది.

"ఏమిటి నువ్వనేది? ఏమవుతుందని నీ ఉద్దేశం. నన్ను నీకు కాకుండా లాక్కుంటారా మహారాజు? ఎప్పటికీ జరుగదు. ధనం తీసుకుపోతారు. కావాలంటే ఈ భవంతిని కూడా స్వాధీన పరుచుకుంటారు పోనీ. అంతకుమించిన శిక్షకే పూనుకుంటే దేశ బహిష్కారం చేయిస్తారు. చేయించనీ ముందే నేను నిన్ను తీసుకొని ఈ నగరం విడిచిపెట్టి పోవాలనుకుంటున్నాను."

"నిజమే ఎక్కడికని వెళ్తాము" తపించిపోతూ అంది మాధవి. "మనిద్దరమే అయితే భిక్షమెత్తుకొని బ్రతుకుతాము" కాని ఈ నిస్సహాయ స్థితిలో మణిమేఖలతో కాని బయలుదేరామా! ఏది కాకూడదని భయపడుతున్నానో అదే జరిగి తీరుతుంది. చివరకు ఏ దోపిడీ దొంగలో పువ్వులాంటి నా మణిని ఎత్తుకుపోయి నాలాగే ఏ వేశ్యకో అమ్ముకుంటారు."

కోవలన్ చాలాసేపు ఆలోచిస్తూ వుండి వుండి శూన్య దృష్టితో మాధవిని చూస్తూ "అయితే తరుణోపాయం ఏమిటంటావ్! అంతకీ ఈ భవంతి లాక్కుంటే వేరే చిన్నయిల్లు ఎక్కడయినా తీసుకొని వుందాం. పొదుపుగా జరుపుకుంటే నీ దగ్గర వున్న ధనం చాలు ఈ తనువులు వెళ్ళడానికి."

"అదీ లాక్కుంటేనో? మహారాజు తలచుకుంటే వేయరాని శిక్ష అంటూ లేదు వేశ్యకు. కర్కోటకమైన రాజదండన పనిచేయంది ఒక పతివ్రత మీదనే. భర్తపట్ల అపచారం చేసి వుండకపోతే భర్తకు విషం పెట్టిందనే అభియోగం ఒకటి లేకపోతే రాజదండనకు భయపడవలసిన అవసరం కులవధువుకు లేదు."

మాధవి ఉద్దేశమేమిటో స్పష్టమవలేదు కోవలన్‌కు. ఇంకా ఏమైనా చెప్తుందేమోనని అలాగే ఆమె వైపు చూస్తూ వుండిపోయాడు. కాని ఆ పైన మరి పెదవి కదపలేక పోయింది మాధవి. తనను తాను కోల్పోయినట్లు ఎక్కడో చూపు నిలిపి నిలబడిపోయింది. ఆమె నేత్రాలు మళ్ళీ కాల్వలు కట్టాయి. ముఖం భయంతో పాలిపోయి, పెదవులు వణుకు తున్నాయి.

హృదయం ద్రవించి నెమ్మదిగా వెళ్ళి ఆమె ప్రక్కనే నిలుచున్నాడు కోవలన్. శిరస్సు నిమురుతూ "అర్థం పర్థంలేని భయాలతో మనసు పాడుచేసుకోకు మధూ. మనమీద ఎంతో క్రోధావేశాలతో వున్నా మనకు మరీ అంతక్రూరమైన శిక్ష విధించడానికి మనసొప్పదు మహారాజుగారికి. నీకు జ్ఞాపకం లేదా మాధవీ చాలా రోజుల క్రితం ఒక్క సభలోనే మనిద్దరినీ ఎంతగానో సన్మానించారు వారు. కనీసం ఆ సానుభూతయినా వుండక పోదిప్పుడు. సంఘదృష్టిలో నేను పతితుడ్నే. ద్రోహినే. కాని మంచిదైనా, చెడ్డదైనా ఒక్క స్త్రీ కోసం నేనింత గొప్ప త్యాగం చేశాననే విషయం కూడా కొంతప్రభావాన్ని చూపకపోదు. అప్పుడు అంతకీ అవసరమైతే నేనే వెళ్ళి మహారాజా వారితో చెప్పేస్తాను. ప్రేమకూ, సంఘాచారాలకు, కులమర్యాదకు పొత్తు కుదరదని, ప్రేమాచారం వేరు. లోకాచారం వేరు. ప్రేమ అనే గరుత్మంతుని ముందు వటవృక్షం లాంటిది ఈ సంఘం. ఈ వటవృక్షం ఉన్నతమైందే! చల్లని నీడనిస్తూ, విస్తరిస్తుందది. కాని కొన్ని అవధులు దాటి విస్తరించే శక్తిలేదు దానికి. ప్రేమ అనేది అలాకాదు. అదెప్పుడూ అన్ని కట్టుబాట్లను కాలదన్ని అపారమైన ఆకాశంలో విహరిస్తూ బ్రతుకుతుంది. నీతో నేను కూడా ఇప్పుడా అపారమైన ఆకాశంలోని కెళ్ళి పోయాను మధూ! ఈ లోకానికి భయపడనిక."

కోవలన్ మాట్లాడుతున్నంత సేపూ అతని మాటల ప్రభావం ఎంతగానో పని చేసింది మాధవి మీద. కాని అతను ఆగిపోగానే ఆమె పరిస్థితి మొదటికి వచ్చింది. "మీ దృష్టి యింకా ఆకాశయానమే చేస్తున్నది స్వామీ! యదార్థలోకానికి దానికీ సంబంధం లేదు. మీ హృదయంలో నాకెంత అనురాగం వున్నా, నా శత్రువులు మహారాజుగారితో చెప్పేదిదే; నగరాన్ని అదుపులోకి తేవడానికి ముందు పన్నాశ్రేష్ఠి పెంపుడు కూతురు మాధవిని ఉరితీయండి' ఆశ్చర్యపడకండి. ఇవి కేవలం నేను అంటున్న మాటలు కావు. నగరంలో వాడ వాడ చెప్తూన్నవే. మహాశ్రేష్ఠిగారు సన్యాసం పుచ్చుకున్న ఘటనను ఆధారం చేసుకొని, పన్నా ప్రతికక్షులందరు దానికంతటికీ కారణం పన్నాయేనని ప్రచారం చేస్తున్నారు. తగిన ప్రతీకారం చేయడానికి ఇప్పుడు వారీ లోకంలో లేరు. కనుకనే ఆ కక్ష అంతా నా మీదుగా పోతున్నది."

కోవలన్ కొంచెంసేపు మౌనంగా ఆలోచిస్తూ వుండి "నగరం విడిచి వెళ్ళడానికి ఒక భయం, నగరంలోనే వుంటే ఇంకో భయం. ముందు నుయ్యి వెనుక గొయ్యి. ఇద్దరం కలసి ఆ వరదల్లోకి పరుగెత్తుదాం పద. మరి వేరేదారి లేదు మనకు. ఇక మణి సంగతి అంటావా దాన్ని కణ్ణకి చేతుల్లోపెట్టి మరీ పోదాం. ఆమె తప్పకుండా పువ్వులాగా పెంచి పెద్దచేస్తుంది. తీర్చి దిద్దుతుంది. అంతేకాదు ఇంతవరకు ఏ జీవితాన్నయితే నువ్వు దానికి

ఇవ్వలేకపోయావో, ఇక ముందుకూడా ఇవ్వలేవో దాన్ని కూడా ఆమె దానికి ఇవ్వగలుగుతుంది.”

మాధవి దీనికి ప్రతిసమాధానం ఏమీ ఇవ్వక మౌనం వహించడంతో కోవలన్ క్షణం ఆలోచించి “నువ్వు నాతో మునగడానికి సిద్ధంగా లేవు. అయితే నీ తలరాత ఎల్లా వుంటే అలా అనుభవించు” అన్నాడు.

“అనుభవించక తప్పుతుందా మరి. అసమర్థుడు, సోమరి అయిన మగవాడ్ని కట్టుకున్న ఆడది అనుభవించేది కష్టాలే.”

మాధవి అన్నమాటలకు క్రోధంతో వణికిపోతున్నాడు కోవలన్. సంవత్సరాలకు పూర్వం అచ్చం యిటువంటి ఘటనే ఎదురైె కత్తిదూశాడు తను, అంతకుమించిన ఆవేశం ఇప్పుడతని నరాలను ఉద్రేకపరూస్తున్నది. క్షణంలో కళ్ళు చింత నిప్పుల్లాగ కణకణ మండుతున్నాయి. భగభగలాడుతున్న చూపులతో మాధవివైపు చూచాడు. కాని ఆమె పెడమొఖం పెట్టి కూర్చున్నది. చూపు మళ్ళించి కొంచెంసేపు అటూ ఇటూ తచ్చాడి ఆమెకు సమీపంగా వెళ్ళి నిలుచొని “నేను అశక్తుడ్నని నీ ఉద్దేశం అయితే చూస్తావా మరి నా శక్తిని” అన్నాడు.

“శక్తిశాలి అయిన మొగవాడి భార్యకు ఎవరో లాక్కుపోయి ఉరితీస్తారనే భీతి వుండదు.”

“ఇంతకు ఇప్పుడు నిన్ను ఆ ఉరికంబం ఎక్కిస్తున్నదెవరో కాస్త చెప్పు? లేని పోని భయాలన్నీ తలకు చుట్టుకొని లేని దుఃఖాన్ని కల్పించుకోవడం ఒక జబ్బు, పిచ్చి అంతకుమించి యింకేమీ కాదు.”

“రోగమూ, పిచ్చి అనండి, మీ ఇష్టం వచ్చినట్లు అనండి. నేను చచ్చిపోయాక కూడా చక్కగా ఆ కణ్ణకి ప్రక్కని కూర్చొని, నా సోమరితనం వల్ల కాదు దాని రోగం వల్లనే అది చచ్చిపోయిందని చాటండి. మీ యిష్టం.”

“లేని చావును మాటిమాటికి తెచ్చిపెట్టుకొని నన్ను ఇరుకులో పెట్టాలని నీ ఉద్దేశం అంతేనా మాధవీ? నీ ప్రాణాలమీది వ్యామోహంతోనే నేనీ ప్రపంచాన్నే పరిత్యజించాను. నేనిప్పుడు బ్రతుకుతున్నది నాకోసం కాదు నీ ప్రాణాల కోసమే!”

మాధవి ఒకసారి నిట్టూర్చి “చాలా విన్నాములెండి ఇటువంటి కబుర్లు. ఇవి క్రొత్తకాదుగా, మనస్సున్నచోట మార్గముండకపోతుందా! నా ప్రాణాలమీద నిజంగా మీకంత వ్యామోహమే వుంటే, నన్ను కాపాడడానికి ఈపాటికి ఏదో ఒక ఉపాయం చూడకుండా వుండే వారేనా?”

“నీ కోసమని నేను చేయంది ఏమైనా ఉందా మాధవి. కాని తెచ్చిపెట్టుకున్న ఈ దుఃఖాన్ని పోగొట్టడానికి వున్న వుపాయమేమిటో కాస్త చెప్పు.”

అతన్ని పరీక్షిస్తున్నట్టు కోవలన్ వైపు చూస్తూ దగ్గరగా జరిగి వచ్చింది మాధవి. మెత్తగా అతని భుజంమీద చేయివేసి "కేవలం ఒకే ఒక ఉపాయం మిగిలిపోయిందిక" అంది. ఆమె స్వరం దుఃఖంతోనూ, ఆందోళనతోనూ వణికింది. "ఏమీలేదు కొద్దిరోజుల కోసమని, శాశ్వతంగా కాదు, సోదరి కణ్ణకి తన కళ్యాణ మంజీరాలను ఇవ్వాలి నాకు. పత్నీత్వానికి గుర్తులయిన ఆ మంజీరాలు నా దగ్గరే వున్నట్లు మహారాజుకు తెలిసిందా నా ప్రాణాలు దక్కినట్లే, నన్నిక ఏమీ చేయలేరాయన. పరిస్థితులు కొంచెం కుదుటపడగానే తప్పకుండా తిరిగి వాటిని ఆమెకు పంపించి వేద్దాము. నిజానికి వాటిని ధరించే అధికారం నాదే అనుకోండి. అయినా మీ మాట కాదనకుండా ఒప్పుజెప్పే బాధ్యత నాది. ఏమంటారు?"

దానికి కోవలన్ మౌనం వహించడంతో, తనూ కొద్దిసేపు మౌనం వహించి మరింత దగ్గరకు జరిగి అతనిచేయి తన చేతుల్లోకి తీసుకొని లాలనగా నుదురు ముద్దాడి "నేను చెప్పింది అర్థం అవలేదా మీకు?" అంది. ప్రక్కనే కూర్చొని మళ్ళీ మొదలు పెట్టింది. "ఇంద్రోత్సవం రోజున అంతమంది ఎదుట కళ్యాణ మంజీరాలు ధరించి మీ ప్రక్కనే నడుస్తుంటే ఎలా వుంటుందో ఆలోచించండి. నన్ను చూచి అంతా అసూయపడడమే కాదు మీ శక్తి సామర్థ్యాలను ఎంత కీర్తిస్తారో చూడండి. నిజమైన ప్రేమ అంటే ఇదే అని అంతా చెప్పుకుంటారు. కాని ఈ ఒక్క పనిని మీరు సాధించలేకపోయారో....ఆ 'రో'...." తరువాతది ఏమిటో పూరించలేక పోయింది మాధవి. ఆ తరువాత తను పూరించలేనంత భయంకరమైంది అన్నట్లు అక్కడే దాన్ని ఆపివేసి ఆశగా కోవలన్‌వైపు చూచింది.

ఇప్పటికీ మౌనంగానే వున్నాడు కోవలన్. మాధవి కూడా ఆలోచనలో మునిగిపోయి మెదలకుండా కూర్చుంది. చాలాసేపు గడిచాక హఠాత్తుగా అందుకొని "అయితే ఆ పానపాత్ర ఇలా పట్రా బాగా త్రాగించు. బాగా, బాగా, నీ ప్రాణాలకోసం, కణ్ణకి ప్రాణాలు తియ్యడానికి కూడా జంకనివాడ్నిగా తయారు చేయాలి నన్ను."

"నాకు కావాల్సింది ప్రాణాలు కాదు, కళ్యాణ మంజీరాలు. ఆమె ప్రాణాలు పోతే నాప్రాణం నిలువునా తీసేస్తారు మహారాజు."

"అయితే మరి ప్రాణం వుండగా తన అధికారాన్ని ఆమె వదులుకోదు."

"మీవంటి మొగధీరులు వుంటే ఎందుకు వదులు కుంటుంది. నిజం చెప్తున్నాను మీవంటి శక్తిహీనుడ్ని, సోమరిని, పిరికిపందను మరి చూడబోను."

కోవలన్ నవ్వాడు. "ఈ తిట్లూ, శాపనార్థాలు నన్నిక ఉద్రేకపరచవు మాధవీ, ఎందుకంటే జీవితాన్నే ఒక పెద్ద తిట్టుగా మార్చుకునే సామర్థ్యం వుండిపోయింది నాలో. అదుగో ఆ సామర్థ్యాన్నే మళ్ళీ ఒకసారి నిరూపించుకుంటాను చూడు."

❊ ❊ ❊

తప్పత్రాగి తూలుతూ ఒకచేత్తో పానపాత్ర పట్టుకొని ధర్మశాల ముందు నిలుచున్నాడు కోవలన్. ధర్మశాల ఇప్పుడు బాగా జీర్ణావస్థలో వుంది. మహాశ్రేష్ఠిగారు వుండగా ఇక్కడ యాత్రికులకు ఉచిత భోజన సౌకర్యం వుండేది. సేవకులు వుండేవారు. ఆయన కన్ను మూశాక యిప్పుడా సౌకర్యాలూ లేవు. ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు. కేవలం ఒక వృద్ధ కార్యవాహుడు మాత్రం తను జీవితమంతా గడిపిన ఈ ధర్మశాలను విడువలేక తినో తినకో గడుపుకుంటూ ఇందులో పడి వుంటున్నాడు.

బాగా నురుగుపొంగిన కల్లుకుండలా వున్నాడు కోవలన్. త్రాగుడువల్ల, అందులోని భోగ విలాసాల వల్ల పూర్వపు మనః సౌందర్యంతో పాటు శారీరక అందాన్ని కూడా అతడు పూర్తిగా పోగొట్టుకున్నాడు. ఇంతకాలం తరువాత తన యజమానిని ఈ స్థితిలో చూచి ఆ వృద్ధుడు స్తంభించి పోయాడు. నగరంలో వుంటున్నా ఎప్పుడూ ఇటువచ్చే అవసరం లేకపోయిందతనికి. యింతలోనే నోటికి వచ్చినట్టల్లా కూస్తూ లోపలికి వచ్చేశాడు కోవలన్. మత్తులో వశం తప్పి వున్న అతని శరీరాన్ని ఆదుకోడానికి ఇద్దరు పరిచారికలు కూడా వెంట వున్నారు.

“ఎవడురా యిక్కడ? ఎక్కడ వుందా మహాశ్రేష్ఠి కూతురు. ముందు దాన్ని బైటికి వెళ్ళగొట్టు. అందరిని వెళ్ళగొట్టు ఈ ధర్మశాల నాది. నా తండ్రిగారు కట్టించింది. నేనొక్కడ్నే యిక్కడ వుంటాను. అంటూ పెద్దగా కేకలు వేస్తూ ముందుకు నడిచాడు.”

ముసలివాడు భయంతో చేతులు కట్టుకొని వణుకుతూ నిలుచున్నాడు. మళ్ళీ తన ప్రశ్నను రెట్టించాడు కోవలన్. కాని సమాధానం ఏదీ రాకపోవడంతో అతని కోపం తారాస్థాయికి వెళ్ళిపోయింది. పరిచారికలు పట్టుకొని ఉన్న తన చేతిని విదిలించుకొని వృద్ధుడ్ని కొట్టడానికి చేయి ఎత్తాడో లేదో ఎదుట మెట్లమీద కదులుతూన్న స్త్రీ ఆకారం వైపు దృష్టిపోయి ఎత్తిన చేతిని దింపుకున్నాడు. ఆ ఆకారం మరింత దగ్గరికి వచ్చింది. కాషాయ వస్త్రాలలో ఎదుట చేలమ్మను చూచి పూర్తిగా ఆశ్చర్యంలో మునిగిపోయాడు.

వెంటవున్న దాసీలవైపు తీవ్రంగా చూస్తూ “నన్ను వేశ్య వీధికి లాక్కొచ్చారేమిటే ముండల్లారా? యిది మా నాయనగారు కట్టించిన సత్రశాల కాదా” అన్నాడు.

“ఔను. ఇది మీ నాయనగారి సత్రశాలే శ్రేష్ఠి!” సమాధానం చేలమ్మ యిచ్చింది. ‘పూజ్యులయిన మీ తండ్రిగారి పేరున ఒక్కనాటికీ కళంకం రాదు. పుణ్యాత్ముల ఛత్ర ఛాయల్లోకి వస్తే అన్ని పాపాలు పటాపంచలైపోతాయి చెట్టియార్! అందుకనే నేనూ తరచూ ఇక్కడికి వచ్చిపోతుంటాను. అందునా పుహారేశ్వరం తరువాత మాతా రుద్రమాళ్ వంటి దేవత ఇక్కడ వుంటున్నదిప్పుడు.”

మిడి గ్రుడ్లతో, త్రాగుడు మత్తులో, వ్యంగ్యంతో కూడిన చిత్రమైన ముఖముద్రతో చేలమ్మ మాటల్ని వింటూ నిలుచున్నాడు కోవలన్. ఆమె ఆగిపోగానే ముందు ముసి ముసిగా నవ్వాడు. ఆ తరువాత పెద్దగా వికటాట్టహాసం మొదలయింది. అంతూ పంతూ లేకుండా అలలు అలలుగా విరిగి పడుతూందా నవ్వు. ఆ నవ్వుకు నిలద్రొక్కుకోలేక తూలి పోతున్న తన శరీరాన్ని ఆదుకోవడానికని ముందుకు వచ్చిన దాసీల్ని విదిలించికొట్టి కార్యవాహుడి ముక్కాలిపీట మీద గత్తుమని చతికిలబడ్డాడు. ఆ వికట హాసం మాత్రం గది అంతా చెదిరి పడుతూనే వుంది. ఇంతలో దగ్గుపొర ఒకటి వచ్చి అడ్డం పడింది. నిలువెల్లా ముచ్చెమటలు పోశాయి. రొప్పు, ఆయాసంతో సతమతమవుతుండడాన్ని చూచి దాసీలు విసరుతూ, చెమట తుడుస్తూ ఉపచారాలు మొదలు పెట్టారు. రొప్పుతూనే "లే పానపాత్ర నింపుకురా" అన్నాడు. తక్షణం ఒక దాసీది పరుగెత్తింది. అప్పటికప్పుడు రెండు పాన పాత్రలు కుడివైపునుండి ఒకటి, ఎడమ వైపు నుండి ఒకటి వచ్చి నిలుచున్నాయి కోవలన్ ముందు. ఉలికిపడి నీరసంగా అటూ ఇటూ చూశాడు. ఆ సురా పాత్రతోపాటే జలపాత్ర పుచ్చుకొని నిలబడింది దేవంతి. కోవలన్ తల ఎత్తి దేవంతి వైపు చూశాడు. ఆ తరువాత వరుసగా చేలమ్మవైపు, సత్రశాల వృద్ధుడివైపు చూచాడు. చెదిరిపోతున్న అతని దృష్టిని ఆకట్టుకుంటూ ముందు ఈ జలంతో కొంచెం గొంతు తడిచేసుకోండి స్వామీ! ఆ తరువాత తమ ఇష్ట ప్రకారం మధువే పుచ్చుకోవచ్చు. ఇది మా అమ్మగారి అభ్యర్థన" అంది దేవంతి.

కోవలన్ సమాధానం యివ్వకుండానే దేవంతి చేతుల్లోంచి పాత్రను లాక్కొని గట గటా త్రాగేశాడు. అతను త్రాగుతున్నంత సేపూ తనూ ఒక వైపు పాత్రను పట్టుకుని నిలుచుంది దేవంతి. కోవలన్ తృప్తిగా నీళ్ళు త్రాగి పాత్రను దేవంతి చేతుల్లో పెట్టాడు. మళ్ళీ ఏమనుకున్నాడో హఠాత్తుగా దాన్ని లాక్కొని దాంట్లో మిగిలిన దాన్ని చెంపలు వాయించుకుంటున్నట్లు గట్టిగా ముఖం మీద జల్లుకున్నాడు. నుదురూ, కళ్ళూ మళ్ళీ మళ్ళీ కడుక్కొని మిగిలిన నీళ్ళు నెత్తిమీద బోర్లించుకొని ఖాళీ పాత్రను అవతలికి విసిరేసి తృప్తిగా నవ్వాడు. ఆపైని మెత్తని అంగ వస్త్రాలతో అతని ముఖమూ, శరీరమూ తుడుస్తున్న దాసీలవైపు చూస్తూ మొదలు పెట్టాడు.

"ఒసేవ్! చూచారా! నా ఆత్మగాడు మేలుకుంటున్నాడిప్పుడు. మళ్ళీ వాడు పూర్తిగా తలెత్తక ముందే మధుపాత్ర కాని తేకపోయారో... పొండి, తీసుకురాండి. బాగా పొయ్యండి. బాగా త్రాగించండి. ఇంకా! ఇంకా! అహహ!! చల్లని జలంతో దాహం తీర్చి పాపం నన్ను జోకొట్టాలని చూస్తున్నారేమో ఇక ఆ పప్పులు వుడకవు చంపడమో! చావడమో! ఈ

రెంటిలో ఏదో ఒకటి తేల్చుకుంటానీ వేళ అహహ...!!!" కోవలన్ నవ్వు నలుమూలలా ప్రతిధ్వనిస్తోంది. దాసీల వైపు తిరిగి నోటికి వచ్చినట్టల్లా పేలుతున్నాడు.

చేలమ్మ వచ్చి అతని కెదురుగా నేలమీద కూర్చుంటూ "ఈ చంపడమూ, చావడమూ ఎందుకో కొంచెం తెలుసుకోవచ్చునా చెట్టియార్!" అంది.

కోవలన్ నేత్రాలలోకి మళ్ళీ క్రోధం పరుగెత్తింది. పరిచారిక చేతుల్లోంచి సురాపాత్ర లాక్కుంటూ, చేలమ్మ వైపు తీక్షణంగా చూచి "ఓహో! మాధవితో వైరం వచ్చింది కదూ! అందుకని కణ్ణకి దగ్గర చేరావన్నమాట. కాషాయ వస్త్రాలు వేసుకొని వేదాంతాలు కోస్తున్నా తార్పుడు శాస్త్రం మాత్రం వదిలిపెట్టలేదు" అంటూ పాత్రను పెదాలకు అంటించుకున్నాడు.

చేలమ్మ నవ్వింది. "బొగ్గు మాడిమాడి వజ్రం అవుతుందంటారే అలాగే నా తార్పుడు శాస్త్రం కూడా వేదాంతం అయిపోయింది చెట్టియార్."

గాంభీర్యం నటిస్తూ మెల్లగా నవ్వాడు కోవలన్. "ఔను నువ్వు చెప్పేది ఒప్పే అత్తా! నేనూ ఇప్పుడు ఆ శాస్త్రం మూలంగానే జీవిత తత్వం తెలుసుకుంటున్నాను.'' ఒప్పుకుంటున్నాను నీ మాటని.

చేలమ్మ మళ్ళీ ముసి ముసిగా నవ్వింది. "ఏమిటో మీరు తెలుసుకుంటున్న ఆ జీవిత తత్వం కాస్త శెలవిస్తారా చెట్టియార్."

మరింత గంభీరంగా నిగిడి కూర్చొని "మొట్ట మొదట నేను తెలుసుకున్నదేమిటంటే ఆడ జాతిలో ఏదీ ఈ తేడా ఏదైతే ఉందో అది ప్రాణాంతకం మొగవాడికి. వాడ్ని నాశనం చేస్తుంది. చంపేస్తుంది. ఆ తరువాత ఇక రెండవది...." అంటూ వాక్యాన్ని మధ్యలోనే ఆపివేశాడు కోవలన్. ఇంతలో పైన సీడీల మీదినుంచి దిగుతూ కణ్ణకి అతని కంట పడింది. దిగుడు మెట్లమీద ఆమె మంజీరాల మంద్ర ధ్వని పైకి దూసుకుపోతున్నది. అప్రయత్నంగానే కోవలన్ దృష్టి ఆమెవైపు పోయింది. మరి నాలుగు సీడీలు మిగిలి వున్నాయి మధ్యని. కణ్ణకి అక్కడే ఆగిపోయి "దేవంతీ లోపలికి పిలుచుకురా వారిని. యింటి విషయాలు బైట కూర్చొని చర్చించడం బాగా వుండదు" అంటూ దేవంతికి ఆదేశమిచ్చి మళ్ళీ పైకి వెళ్ళిపోతున్నదామె.

కణ్ణకి వైపే చూస్తున్నాడు కోవలన్. లిప్తలిప్తకూ అతని గుండె పొంగు మారుతూన్నది. వెనక్కి ముందుకు ఊగిసలాడుతున్నాడు. మనస్సులో ఎక్కడో, ఎక్కడో అంతరాత్మ కాళ్ళు చేతులు కొట్టుకుంటున్నది. మళ్ళీ దాన్ని నెట్టివేసి పట్టుదల, ఈర్ష్య, క్రోధం ముందుకు తోసుకుని వచ్చాయి. "యింటి సంగతి ఎత్తి మభ్య పెట్టాలని చూస్తున్నావా నన్ను. ఈ నడివీధే నా యిల్లు ఇప్పుడు. క్రిందకు దిగిరా ముందు."

పైకి పడుతున్న అడుగులు ఒక్కసారిగా ఆగిపోయాయి. ఆ స్తబ్ధ వాతావరణంలో వాటి మంద్ర ధ్వని ప్రాణస్పందనలా అందరి మనస్సుల్లోనూ నిండిపోయింది.

"విప్పు ఆ మంజీరాల్ని" మళ్ళీ గర్జించాడు కోవలన్. మెట్లుదిగి సమతలం మీదికి వచ్చిన మంజీరాల మధుర ధ్వని అతని గర్జనకు చెదిరిపోయింది.

"తే! మద్యం తే!!" వెంటనే ఒక పరిచారిక అతని ఆజ్ఞను పాలించింది. ఎత్తిన పాత్ర దింపకుండా నాలుగైదు గిన్నెలు ఖాళీ చేసి పాత్రను అవతలికి విసిరేశాడు. కణ్ణకి మెట్ల దగ్గరే నిలబడి వుంది. సత్రం కార్యవాహుడు వణకుతూ ఒకవైపు దూరంగా నిలబడ్డాడు. తూలుతూ లేవబోతున్న కోవలన్‌ని చూసి గజ గజ లాడిపోతున్నది దేవంతి. త్రాగుడు కైపు తలకెక్కి అతని కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి. వెంట వచ్చిన దాసీలు సాయం పట్టి నుంచోబెట్టారతన్ని. అంతా చూస్తూ కూర్చున్న తావునుండి కదలలేక పోతున్నది చేలమ్మ. కోవలన్ తూలిపోతూ కణ్ణకి వైపు చూచి "నా ఆదేశాల్ని పాలించు పతివ్రతా శిరోమణి!" అన్నాడు. "నేను నిన్నేనాడో పరిత్యజించి పారేశాను. అంతేకాదు నా యింట్లో నుంచి కూడా వెళ్ళగొట్టేశాను. ఇప్పుడీ సౌభాగ్యదానాన్ని కూడా నీ దగ్గర్నుంచి లాక్కుని ఇంకొకరికి ఇస్తాను నేను. దీనిమీద నీకే మాత్రం హక్కు లేదిక."

శిరస్సు ఎత్తి భర్తవైపు చూచింది కణ్ణకి. కోవలన్ ముఖం మరొక ప్రక్కకు త్రిప్పుకున్నాడు. ఆపైని చూపులు వాల్చుకొని "ఈ సౌభాగ్యాన్ని పూజ్యులయిన మామగారు దానం చేశారు నాకు. మీకు సహధర్మచారిణిగా వుండే అధికారాన్ని కూడా నాకు యిచ్చింది వారే" అంది. మాట పూర్తవకుండానే చేయి ఎత్తి బలంగా ఆమె ముఖం మీద కొట్టాడు కోవలన్. మళ్ళీ చేయి ఎత్తబోతుండగానే గబ గబా పరుగెత్తుకొచ్చి అతడ్ని విదిలించి వేసింది చేలమ్మ. జబ్బ పట్టుకొని బలంగా ఇవతలికి లాగుతూ "జాగ్రత్త చెట్టియార్ ఈ సారి గాని చెయ్యి చేసుకున్నారో సన్యాసం పుచ్చుకున్న చేలమ్మను మళ్ళీ తార్పుడు శాస్త్రంలోకి దింపినవారవుతారు. నేను మహాశ్రేష్ఠిని కాను. కణ్ణకిని అంతకంటే కాను. ముఖ ప్రీతికోసం మాట్లాడే అలవాటు నాకు లేదు. మాధవీ నా శిష్యురాలే. కాని నేను బ్రతికుండగా ఎవరికీ అన్యాయం జరగడానికి వీలు లేదు. ఇద్దరూ నాకు సమానమే. అంతెందుకు మీ కంతటి సామర్థ్యమే వుంటే ఏది ఈ జబ్బ విడిపించుకోండి చూద్దాం."

కోవలన్ ముఖం క్రోధంతో ఎర్రగా కందిపోయింది. జబ్బ విడిపించుకోవడానికి పెనుగులాడుతూ, ఆయాసపడుతూ చేలమ్మను కొట్టవలసిందిగా దాసీల వైపు సైగ చేస్తూ రొప్పుతున్నాడు. ఇంతలో కార్యవాహుడూ, నాగరత్న చెరొక వైపు నుండి పరుగెత్తుకు వచ్చారు. అతని వైఖరి చూచి చేలమ్మలో కూడా ఆవేశం హెచ్చిపోతున్నది. "దాసీల చేత నన్ను కొట్టిస్తావన్నమాట. అయితే పద మహాజనవాడ కూడలికి లాక్కుంటూ పోతాను

నిన్ను. ఆ కొట్టించేదేదో అక్కడే కొట్టిద్దువుగాని పద" అంటూ అతని జబ్బను బలంగా పట్టి ఈడ్చుకు పోతున్న చేలమ్మను, గబ గబా వచ్చి అటకాయించింది కణ్ణకి. "వద్దు. వద్దు అమ్మా! బాగా అలసిపోయారు వారు ఇదిగో ఈ ముక్కాలిపీటమీద కూర్చోబెట్టు వారిని. దేవంతీ! యిటు వచ్చి కొంచెం విసురుతూ వుండు. నేనిప్పుడే వస్తాను" అంటూ వెనుకకు మళ్ళింది కణ్ణకి.

మెట్లు ఎక్కుతూన్న కణ్ణకిని చూచి అలసిన గొంతుతో మళ్ళీ గర్జించాడు కోవలన్. "ఆ మంజీరాలు ఇచ్చి మరీ వెళ్ళు" వెంటనే ఆమె వెనక్కు తిరిగి వచ్చింది. "కులస్త్రీ జీవించి వుండగా కళ్యాణ మంజీరాలు ఇంకొకరికివ్వడం ధర్మవిరుద్ధం. ముందు నన్ను చంపి ఆ తరువాత ఈ బంగారాన్ని పట్టుకెళ్ళి ఏమైనా చేసుకోండి మీ యిష్టం."

"ఈ పంతం మంచిది కాదని ఎన్నిసార్లు బుద్ధి చెప్పాను కాను మాధవికి. పెరియన్నాయకి ఎన్నిసార్లు తల బాదుకోలేదు? మీ మట్టుకు మీరు హృదయం మీద చేయి వేసుకొని న్యాయం చెప్పండి చెట్టియార్. మీకు సమ్మతమేనా ఈ పని. భోగం వాడలో మీరు నేర్చుకున్న జీవిత తత్వం యిదేనా?" అంది చేలమ్మ.

"మద్యం" అన్నాడు కోవలన్. నేత్రాలు అర్ధనిమీలితాలు చేసి పాత్ర కోసం చేయిజాపాడు. ఆ తర్వాత చేలమ్మను చూస్తూ పకపక నవ్వాడు. కణ్ణకి వేపు చూస్తూ ఆమె ముందు చేయి జాపి "తేవే నాకేదైనా తినడానికి పెట్టు" అన్నాడు.

ఆ మాటవిన్న కణ్ణకి కాళ్ళకు రెక్కలే మొలిచాయి. గబ గబా మెట్లమీదికి పరుగెత్తింది. మంజీరాల ధ్వని ప్రతిధ్వనిస్తూన్నది. చెలికత్తె మద్య పాత్ర తెచ్చి కోవలన్ చేతికిచ్చింది. దాన్ని ఆత్రంగా అందుకుంటూ చేలమ్మ వేపుచూచి "నా జీవిత సిద్ధి ఇదే! భోజనము, భోగమూ ఇవి రెండూ నా జీవిత తత్వాలు" అన్నాడు.

"అవి రెండూ కలిసి మీకు నేర్పిన తత్వమేమిటో కాస్త చెప్పండి మహాశ్రేష్ఠీ"

కోవలన్ మళ్ళీ ముఖం గంభీరంగా పెట్టి కూర్చున్నాడు. "ఏమీ లేదు. వివశత్వం పూర్తి వివశత్వం, నాలుగు వైపులా వివశత్వమే. మరొకటి ఏమీలేదు. నా కోరికల్ని చక్రవ్యూహంలో పెట్టి వాటిని ఢీ కొంటున్నాను నేను" అన్నాడు. గొంతులో పూర్వపు బిగింపే ఉన్నా రవ్వంత దుఃఖం కూడా కలిసి బొంగురు పోయింది.

"మరి దీనికి కారణమేమిటి చెట్టియార్!" మళ్ళీ ప్రశ్నించింది చేలమ్మ.

ప్రశ్న విని ముఖం చిట్లించాడు కోవలన్. "ఆ కారణాల్లో ఏమి వుండిపోయిందింక. జరగవలసిందేదో జరిగిపోయాక. కాని... కాని అనుభవం వల్ల నేనేమి తెలుసుకున్నానంటే భయస్తుడ్ని నేను. మొదటినుండి ఈ భయమే తినివేసింది నన్ను చిట్టచివరకు ఆ భయాన్ని

జయించాలనే బైలుదేరి ఈ స్థితికి వచ్చాను. నేను బొత్తిగా శరీర స్పృహ లేకుండా వున్నానని అనుకుంటున్నావు కదూ? అత్తా! ఎప్పటికీ కాదు. నా అంతరాత్మ నిత్యం మేలుకొనే వుంటుంది. కాని ఏం లాభం దాన్ని చేరలేను నేను. దాన్ని సహించలేను. దాన్ని భరించలేను. దాన్ని మరచిపోవడానికే ఏకైక మార్గం కనిపెట్టాను. మత్తు.... ఇక నన్ను వెళ్ళనివ్వండి. 'ఏరీ దాసీలు' కొంచెం లేపండి నన్ను. వస్తాను అత్తా, నా తత్వార్థం అసంపూర్తిగానే వుండిపోయింది ఇంకా."

కోవలన్ లేచి నిలుచున్నాడు. దేవంతి వెంటనే ఎదురుగా వచ్చి నిలుచొని "అమ్మగారు భోజనం తేవడానికి వెళ్ళారు స్వామీ" అంది.

కోవలన్ క్షణం ఆగిపోయాడు. మళ్ళీ తలవూపుతూ "నిరీక్షిస్తూ వుండమని చెప్పండి ఆమెని. మళ్ళీ జీవితంలో ఎప్పుడో ఒకసారి తప్పకుండా వస్తాను తినడానికి" అంటూ ముందుకు సాగి ధర్మశాల ద్వారబంధం దాటాడు. "ఈ కళ్యాణ మంజీరాలంటే నాకు భయం. బాబోయ్ వాటి ధ్వనిలో నిప్పువుంది నిప్పు" అంటూ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్లిపోయాడు.

# 27

ధర్మశాల నుండి నేరుగా మాధవి దగ్గరకు వచ్చి సుఖ దుఃఖాలు, ఆశ నిరాశలకు అతీతుడైన వేదాంతిలా నవ్వుతూ చతికిలబడి పోయాడు కోవలన్.

ఆ వైఖరి చూచి ముఖం మాడ్చుకుంది మాధవి. కోపంగా చూస్తూ "తెచ్చారా?" అంది.

"తెచ్చి వుంటే ఇలానే కూర్చునే వాణ్నా?" కోవలన్ నవ్వాడు.

ఈ సమాధానంతో మరింత రెచ్చిపోయి "అయితే మీకీపాటి కూర్చునే అవకాశం లేకుండా చేస్తాను చూడండి నేను" అంది మాధవి పట్టరాని ఆగ్రహావేశాలతో. గజగజ వణికిపోతున్నదామె. "నా జీవితమంతా మీ కోసం ధారపోశాను. పూర్తిగా మీ కోసం ఆహుతి అయిపోయాను. అయినా రావిగింజంత సుఖం ఇవ్వలేక పోయారు మీరు నాకు. ఇంతచేసినా మీరు నన్ను సతిని చేయలేకపోతే చివరకు నేను సానినే అయితీర్తాను. "వెళ్ళండి నా యింట్లో నుంచి తక్షణం వెళ్ళిపొండి. వెళ్ళండి" గొంతు పగిలిపోయేలా అరుస్తూ ముందుకు నడిచింది మాధవి.

కించిత్ ఆశ్చర్యమూ, కొద్దిగా పరిశీలనా నిండిన దృష్టితో మెల్లగా తల ఎత్తి మాధవివైపు చూచాడు కోవలన్. ఆమె ప్రవర్తన విశ్వసించడానికి శక్యం కాకుండా వుందతనికి. కాని ఇప్పుడేదో తాత్కాలిక ఉద్వేగం వల్లకాక దృఢమైన పట్టుదలతోనే సిద్ధమయి వున్నది మాధవి.

అన్ని విధాలా ఆలోచించి, అన్ని రకాలయిన వ్యామోహాలను త్రెంచుకునే ఆమె ఈ దశకు వచ్చింది. తనను, తన ముద్దులబిడ్డ మణిమేఖలను రక్షించుకోవడం అన్నిటికంటె ప్రధాన సమస్య అయిపోయింది ఆమెకిప్పుడు. దాని ముందు అన్ని ప్రేమానురాగాలను దిగదుడిచి పారేసింది. తమ ఇద్దరి భవిష్యత్తు కోసం కోవలన్ తనకు శాస్త్రోక్తంగా పత్నీత్వాన్ని ఇవ్వలేకపోతే తప్పనిసరిగా ఆ రాజధాని నుండి వచ్చిన రాజోద్యోగిని ఆకర్షించుకుంటుంది తను. అంతకుమించిన అవకాశం గానీ, సమయం గాని లేనప్పుడు. మణిమేఖల అమాయక స్వరూపం ఆమె కన్నులలో మెదిలింది. మళ్ళీ గొంతుచించుకుంటూ "నేను ముందే మర్యాదగా చెప్తున్నాను. వెళ్ళి పొండి ఇక్కడ్నించి, లేదంటారా చీపురు తీసుకొని నాగరత్నను రమ్మంటాను" అంది.

కోవలన్ మళ్ళీ నవ్వాడు, 'సత్కరించే పద్ధతి ఉత్తమంగానే వున్నది. కాని ఒక లక్షా ఎనిమిదివేల కలంజులు పెట్టి నీ విజయమాల కొన్నప్పుడే ఈ పద్ధతి ఉపయోగిస్తే ఉచితంగా ఉండేది."

"ఈపాటి చాతుర్యం నాకూ లేకపోలేదు చెట్టియార్! అటువంటి సందర్భాలలో సాని ఎప్పుడూ కోరచూపులతోనే కొడుతుంది. చీపురుతో కాదు. అప్పుడు మీరు నాకు దాతలు, ఇప్పుడు బికారులు" అంటూనే మళ్ళీ తీవ్రస్థాయికి వెళ్ళిపోయి "ముందు మాటలు కట్టిపెట్టి వెళ్తారా వెళ్ళరా?" అంది. ఆమె గొంతు కక్ష్య అంతా ప్రతిధ్వనించింది.

"వెళ్ళమనడానికి నువ్వెవ్వరసలు? ఈ ఇల్లు నాది నా పూర్వీకులది."

"ఒకప్పుడు కాని ఇప్పుడది నాదే. సాని దగ్గరకు వచ్చిన ప్రతీదీ దానిదే అయిపోతుంది. అంతెందుకు ముందు మీరు వెళ్తారా లేదా?" అంటూ అతనిచేయి పట్టుకొని గట్టిగా విదిలించింది.

"ఈసారి చేయి ఎత్తానో రక్తం కళ్ళచూస్తాను. ఎందుకైనా మంచిది కొంచెం దూరంగా ఉండు."

ఈ మాటలతో మరింత మండిపడింది మాధవి.

"నాగరత్నా! ముందీ దుర్మార్గుణ్ణి, చపల చిత్తుడ్ని తన్ని బైటికి ఈడ్చు. చేయిపట్టుకో ముందు. మొదట్నించీ వీడు నన్ను వేశ్యగానే చూస్తున్నాడు. నేనూ ఇప్పుడు వేశ్యలాగే వ్యవహరిస్తాను. చూస్తావేమే పట్టుకో ఆ చేయి. భయపడకు. నేనిప్పుడు పూర్తిగా మారిపోయాను, పూర్తిగా. ఇక ఈ పిరికిపందని, అసమర్థుణ్ని ఏ మాత్రం సహించలేను. ఊఁ నడువు ముందు" అంటూ పిచ్చిదానిలా అతని రెండు చేతులు బలంగా ఎత్తిపట్టి క్రిందికి లాగింది. పట్టుదప్పి పీట మీద నుండి క్రిందకు దొర్లిపడ్డాడు కోవలన్. అయినా

ఆగలేదు మాధవి. అంతులేని ఉన్మాదస్థితిలో అలాగే ప్రకోష్ఠం తలుపువరకు ఈడ్చుకు పోయింది. ఇంతలో నాగరత్న కూడా వచ్చి ఆమెకు సహాయం చేసింది.

అదే సమయానికి మణిమేఖల లోపలకు వస్తూ నాగరత్నా, తల్లీ చెరొకవైపు పట్టుకొని తండ్రిని అలా ఈడ్చుకుపోతూ వుండడం చూచి భయంతో, నివ్వెరపాటుతో "అప్పా" అని పెద్ద కేక వేసి ఏడుస్తూ పరుగెత్తింది. హింసావేశంతో కోవలన్‌ను ఈడ్చుకుపోతూనే వుంది మాధవి. రాపిడికి, ద్వారబంధాల తాకిడికి అతని శరీరం రక్తసిక్తమై పోతున్నది. అయినా పెదవి విప్పి ఇదేమిటని అనడం లేదు కోవలన్. అన్నిటినీ సహిస్తూ మౌనం వహించాడు. తల్లి భయంకర రూపం చూచి ఏడుస్తూ ఒక ప్రక్క నిలుచుంది మణిమేఖల. అతన్ని అలాగే అంతఃపుర ప్రకోష్ఠం అవతలవరకూ ఈడ్చి వేసి తలుపు లోపల్నించి గడియ వేసుకుంది. తలను ద్వారానికి ఆనించి అక్కడే నిలబడిపోయింది మాధవి.

తన ఇంటి ద్వారం ముందే తను శవంలాగా పడి వున్నాడు కోవలన్. రాయిలా పూర్తిగా స్తంభించి పోయాడతను. బలహీనమైన గుండె సముద్రంలాగా ఎగిరిపడుతూ ఉన్నది. నరాలు తోడుకువస్తున్నాయి. అంతులేని దాహంతో నాలుక పీక్కుపోతున్నది. కాని నాలుక తడిపే నాథుడెవడు?

పగలల్లా తిండీ తిప్పలూ లేకుండా అక్కడే పడివున్నాడు కోవలన్. మదిర లేదు. సుఖశయ్యలేదు. దాసదాసీల పరిచర్యలు లేవు. కనీసం గొంతు తడుపుకొనటానికి ఇన్ని నీళ్ళైనా లేవు. ఇటువంటి దుర్దినం ఎదురవుతుందని ఊహించి అయినా ఎరుగడతడు.

పగలెలాగో గడిచిపోయింది. దుఃఖసముద్రంలా చీకటి మేడ అంతా అలుము కుంటూన్నది. బాధ దుఃఖం ఈ చీకటి రాయిలా గడ్డకట్టి ఆ సమాధిలో తన్ను లీనం చేసుకుంటే బాగుండు ననుకుంటున్నాడు కోవలన్. అంతులేని ఆవేదనతో దుఃఖంతో కుమిలిపోతున్నాడతను. ఈ బాధ, ఈ దుఃఖం, ఈ తాపం, మధువూ, సుఖశయ్యా లేవనీ కానీ, ఆహారం లేదని కానీ, పరిచర్యలు లేవని కానీ కాదు. వస్తూపోతూ పగలల్లా మాధవి దాసదాసీ జనం తనమీద విసురుతూన్న వ్యంగ్యబాణాలకు, హేళనలకు, పరిహారాలకు కూడా ఏ మాత్రం బాధపడడం లేదతను. ఈ స్థితిలో ఎందుకు జీవించి ఉన్నానని మాత్రం దుఃఖపడుతున్నాడు. తనను తాను అంతం చేసుకునే శక్తి లేకపోయిందే అని వాపోతున్నాడు.

జీవితాన్ని మరణాన్ని కూడా సమాన రూపంలోనే బలంగా కోరుతూ ఈ దుఃఖకూపంలో పడిపోతున్నాడు కోవలన్. అతడు చావాలనుకుంటున్నాడు కాని చచ్చే సాహసం లేదు. బ్రతకాలని కోరుతున్నాడు కాని బ్రతికే శక్తి లేదు. సాహసమూ, శక్తీ రెండూ లేక ఏమిచేయాలతను? వేదన వెయ్యిరెట్లు పెరిగి ముంచెత్తుతూన్నది పూర్తిగా, ఆ ప్రవాహంలో కొట్టుకుపోతున్నాడతను.

భవంతిలో చీకటి క్రమంగ పలచబడుతూన్నది. మెల్ల మెల్లగా పచ్చని వెలుగు గోడల మీద ప్రాకుతోంది. దివిటీ ఒకటి చేతపట్టుకొని దాసుడొకడు అటు వస్తూ వుండడం గమనించి నిద్రనటిస్తూ కళ్ళు మూసుకున్నాడు కోవలన్. ఆ తరువాత చాలామంది దాసుల కంఠస్వరాలు, ఏవో పెద్ద పెద్ద సరంజామా మోస్తూన్న చప్పుళ్ళు వినిపించాయి. మెల్లగా కళ్ళు విప్పి వారగా చూస్తూ గమనించాడతను. వాళ్ళేవేవో పెద్ద పెద్ద ఇనుప పెట్టెలు బైటికి మోసుకుపోతున్నారు. ఇంచుమించు అర్ధరాత్రి దాటేవరకు అలా మోస్తూనే వున్నారు వాళ్ళు. బాధ అనిపించింది కోవలన్‌కు. కాని సాహసం లేక అలాగే పడివుండిపోయాడు. చివరకు బిగ్గరగా నాగరత్న స్వరం వినిపించింది. "నేను మణిని తీసుకొని వెళ్ళి పోతున్నానమ్మా! రాజకుమారుడి శిబిక వచ్చేవరకు మీరిక్కడే నిలబడి నిరీక్షిస్తూ వుండండి" అంటుంది నాగరత్న. ఆ తరువాత మాధవి గొంతు వినిపించింది. "ఉత్తి శిబిక మాత్రమే పంపి ఊరుకుంటే రానని చెప్పు. ఆయన్నే స్వయంగా వచ్చేయమను నన్ను పిలుచుకు పోవడానికి" అంటుందామె బిగ్గరగా. అభినయంతో పాటు గర్వమూ ధ్వనించిందామె గొంతులో. నిజానికి తను చేజేతులా నిప్పుపెట్టిన ఉద్యానగృహం శిథిలభాగంలో వుండడానికి వెళుతున్నదామె. కోవలన్‌ను పీడించడం కోసమనే ఈ రాజకుమారుడి కల్పన చేసింది.

"లోపలికి వెళ్ళి అమ్మగార్ని జాగ్రత్తగా చూస్తూ వుండు" అని దివిటీ పట్టుకుని నిలుచున్న సేవకుడ్ని ఆదేశించి ముందుకు అడుగు వేసింది నాగరత్న.

నాగరత్న వెళ్ళిపోయింది. ఆమె అడుగుల చప్పుడు క్రమంగా దూరమవుతూ మణిగి పోయింది. ఆ తరువాత చాలసేపటి వరకు మరి ఎవ్వరి అడుగుల చప్పుళ్ళూ వినరాలేదు. మాధవి వెళ్ళిపోయే ముందు చివరిసారిగా తనతో మాట్లాడడానికి వస్తుందని అనుకుంటున్నాడు కోవలన్. కాని ఎంత సేపటికి ఆమె జాడ కనిపించలేదు. తనే నెమ్మదిగా లేచి లోపలికి తొంగి చూశాడు. లోపలి చావడిలో గాడాంధకారం అలముకొని ఉంది. జనసంచారం అలికిడి ఏదీ వినరావడం లేదు. పెద్ద పెద్ద అడుగులు వేస్తూ లోపలికి వచ్చాడు. సేవకుడెవడయినా చూస్తే చెవులు పట్టి మళ్ళీ బయటికి లాగేస్తాడేమోననే భయం కూడా పీకుతోందతన్ని. తన ఇంట్లోకి తనే దొంగలాగా నక్కుతూ నక్కుతూ అడుగులు వేస్తున్నాడు. క్రింది కోష్టాల్లో ఎక్కడా దీపం లేదు. ఎవ్వరూ అక్కడ ఉన్నట్లు లేదు చీకట్లో తడుముకుంటూ మెట్లమీదుగా గబ గబా పైకి వెళ్ళాడు. అక్కడ కూడ నాలుగు వైపులా అంధకారమూ, శూన్యమూ తప్ప మరేమీ కనిపించలేదు. ఒక్కొక్క కోష్టమే తడుముకుంటూ చూస్తూ ముందుకు నడుస్తున్నాడు. ఎక్కడా దీపం లేదు. జనసంచారం అంతకన్నా లేదు. మెట్లెక్కి మూడో అంతస్తు మీదికి వెళ్ళాడు. లోపలికి వెళ్ళే ద్వారానికి బైట నుంచి పెద్ద

తాళం వేళాడుతున్నది. 'మాధవి కూడా వెళ్లిపోయిందా?' అని తనను తాను ప్రశ్నించుకున్నాడు. కాని ఎలా వెళ్ళిపోయిందామె. వెళ్ళిన అలికిడి ఏదీ వినపడలేదే. ఆ దివి పట్టుకున్న సేవకుడు కూడా తిరిగి రాలేదు. నిగ్రహించుకోలేక "మాధవీ మాధవీ' అంటూ పెద్దగా పిలిచాడు. అతని స్వరమే ఆ చీకటిలో ప్రతిధ్వనించింది.

రాజ కుమారుడూ, శిబికా అంటూ అభినయించి మాధవి రహస్య ద్వారం గుండా వెళ్ళిపోలేదు గదా! సందేహం కలిగిందతనికి. కాని ఎలా వెళ్తుంది? రహస్య ద్వారాన్ని గురించి తనెప్పుడూ చెప్పినట్లే లేదే మాధవికి. అయినా చూద్దామని గబగబా అటు వైపు నడిచాడు. సరిగ్గా ఊహించినట్లే జరిగింది. రహస్య ద్వారం తలుపులు బార్లాగా తెరిచి వున్నాయి. వాళ్ళు వెళ్తూ అక్కడ పారేసిన కాగడా గాలి విసుర్లకు పలచటి కాంతిని లోపలకు విసురుతూన్నది.

తను చూడడం కోసమని తన ముందుగానే సామానంతా పంపి మోసపు మాటలతో తనను వంచించి గుప్త ద్వారం గుండా మాధవి వెళ్ళిపోయినట్లు రూఢి అయిపోయిందతనికి. మాధవి అనేకసార్లు అనేక విధాలుగా వంచించి వుందతన్ని, కాని ఈ వంచన అన్నిటికంటే ఘోరమయిందనిపించింది కోవలన్‌కు. ఆ కాగడా చేత్తో పట్టుకొని భవనం అంతా తిరిగాడు. అపారమైన లక్ష్మితో అంతులేని జనసంచారంతో కళ కళలాడుతూ వుండే తాత ముత్తాతలనాటి ఈ భవంతి దెయ్యాల కొంపలా, నిర్జనంగా చీకట్లు తాండవిస్తూ భీతి గొలుపుతూన్నదిప్పుడు. అంత విశాలమైన భవంతిలో చిన్న కాగడా ఒకటి పట్టుకొని ఏకాకిగా నిలుచున్న కోవలన్ తనకు తానే ఒక భూతంగా కనిపించాడు.

తిరిగి తిరిగి అలసిపోయి తన కోష్ఠంలోకి వెళ్ళి ధడాలున క్రిందే చతికిలబడ్డాడు. చమురు ఇంకి ఆ కాస్త కాగడా ఆరిపోయింది. దాని కఱ్ఱ ముక్కని అవతలికి విసిరి వేశాడు.

మళ్లీ నాలుగు వైపులా గాఢాంధకారం అలుముకుంది. శక్తి సాహసమూ లేని అంధకారం.

రెండోరోజు ఉదయాన్నే తన భవంతిలోంచి బయటికి వచ్చాడు కోవలన్. ఎటు చూచినా జనం అతని ముఖం మీదే విరగబడి నవ్వుతున్నారు. సూటిగా బైలుదేరి పానశాలవైపు నడిచాడు. వేలి ఉంగరాన్నొకదాన్ని యజమాని చేతుల్లో పెట్టి భోజనమూ, మద్యమూ తెప్పించమని కోరాడు. బాగా తిని స్పృహ తప్పేట్లు త్రాగి అక్కడే పడిపోయాడు.

రాత్రి ఎప్పుడో మూడో ఝాముకు మత్తుదిగి మగతగా కళ్ళు తెరిచి చూచాడు. తను పానశాలలో లేడిప్పుడు. అంతా చిత్తడిగా దుర్గంధంగా ఉంది. వొళ్ళు దులుపుకొని లేచి

నిలుచున్నాడు. శరీరమంతా కుళ్ళు, దుర్వాసన, ఎక్కడో పెంట కుప్పమీద పడి ఉన్నాడతను. శరీరం మీది అభూషణాలు చూచుకున్నాడు. ఒక్కటి కూడా లేదు, తన స్థితికి తనకే నవ్వు వచ్చింది కోవలన్‌కు.

## 28

కావేరీ నది వరద రోజు రోజుకు ఉధృతమవుతూన్నది. అప్పుడే నదీ తీరం మీది నగరం సగం వరకు మునిగిపోయింది. మహారాజు స్వాగతార్థమై కట్టిన తోరణాలు, అలంకారాలు పెద్ద పెద్ద మండపాలు కొట్టుకొని పోయాయి. ఆ భాగమంతా ఇప్పుడు ఎటు చూచినా ప్రజల హాహా కారమే వినిపిస్తూన్నది. రాజోద్యోగులు ప్రజా రక్షణ అనేది పూర్తిగా విడిచిపెట్టి మరీ రెండు రోజుల్లో విచ్చేయనున్న మహారాజు కోసం మరొకచోట అలంకారాలు తీర్చడంలో మునిగి ఉన్నారు. నీటి పాలయిన ఇళ్ళు, క్రొత్తగా వరదలోపలికి చొచ్చుకు వస్తూన్నవి. ప్రజలు పిల్లా పాపా పెట్టే బేడా మోసుకొని మెట్ట ప్రాంతాలకు తరలి పోతున్నారు. సర్వస్వమూ నీటిపాలయిన బీదజనం గుడ్లలో నీళ్ళు కుక్కుకుని నదీ తీరం మీద శోక మూర్తుల్లాగా నిలబడిపోయి కనిపిస్తున్నారు.

ఆకలితో, ఆవేదనతో దుమ్ము కొట్టుకొంటూ వీధి వీధి తిరుగుతున్నాడు కోవలన్. అతను ఎటు వెళ్తే అటు జనం గుమిగూడి అతన్ని అపహాస్యం చేస్తున్నారు. నగరానికి వచ్చిన ఈతి బాధలన్నిటికీ వీడి పాపాలే కారణమని కొందరు తిడుతూ వుంటే కొందరేమో మాధవినీ, అతన్ని కలిపి తిట్టిపోస్తున్నారు. ఎదురుపడ్డ ఆడవాళ్ళు "మహాపాపి బాబోయ్" అని తప్పుకు పోతున్నారు. మిత్రులు, పరిచయస్తులు ఎక్కడ సహాయం అర్థిస్తాడో అని ముఖం చాటు చేసుకొంటున్నారు. పొద్దు వాలే వరకు తిరిగి తిరిగి ఒక చెట్టు క్రింద కూలబడ్డాడు. ఆకలి నరాలు తోడి వేస్తున్నది. తిరిగి తిరిగి కాళ్ళు చచ్చుబడ్డాయి. రెండు చేతులతోనూ తన కాలి పిక్కలు తనే గట్టిగా ఒత్తుకుంటూ ఉసూరుమని ఒక నిట్టూర్పు విడిచాడు. అక్కడి కక్కడే పడి నిద్రపోతే బాగుండుననిపించింది. కాని ఆకలి భగభగ లాడుతున్నది. కదలనివ్వదు, మెదలనివ్వదు, ఒక చోట నిలబడనివ్వదు ఆకలి బాధ. నెమ్మదిగా లేచి సముద్ర తీరం కేసి నడిచాడు.

సముద్ర తీరం మీద మామూలు కన్నా ఎక్కువ జన సమ్మర్థం వుంటూన్నదిప్పుడు. వరదకు గురయిన పల్లపు ప్రాంతాల బీదా బిక్కి జనం అంతా అక్కడే నివాసాలు ఏర్పరచుకొంటున్నారు. అక్కడే ఒక చోట అన్నదానం కూడ జరుగుతుందని తెలిసి కోవలన్ కాళ్లు అప్రయత్నంగానే అటు నడిచాయి. ఎంతో మందికి నిత్యాన్నదానాలు చేసిన తను

పరమ దరిద్రుడిలా భిక్షాన్నాన్ని స్వీకరించడం కంటె ఆకలితో చచ్చిపోవడమే మేలనిపిస్తున్న దతనికి. అయినా అతని కాళ్లు అతనికి తెలియకుండానే ముందుకు లాక్కుపోతున్నాయి.

కోవలన్ ముందుకుసాగిపోతూనే ఉన్నాడు. దూరంగా అన్నదానం జరుగుతూన్న ప్రదేశం కనిపిస్తున్నది. జనం త్రొక్కిసలాడుతూ దాన పిండాల్ని గ్రహించడానికి ముందుకు త్రోసుకు పోతున్నారు. ఆ కోలాహలంలోనే ఈ రోజు మాధవే వరద బాధితులకు అన్నదానాలు చేయిస్తూన్నదని విని అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అడుగులు మరి ముందుకు సాగలేదు. అలా అని వెనక్కి తిరిగి వెళ్లే శక్తీ లేదు. నిస్త్రాణ వల్ల కళ్ళు తేలిపోతున్నాయి. వచ్చే పోయే జనాన్ని కూడా లెక్క చేయకుండా అక్కడికక్కడే ఆ ఇసుక తిన్నెమీద కాళ్ళు జాపి పడిపోయాడు. ఒకనాడు దక్షిణ భారతమంతా ప్రసిద్ధి కెక్కిన కోటీశ్వరుడు, మహాశ్రేష్ఠికి ఈనాడు ఈ సముద్ర తీరం మీది మట్టే మిగిలింది. రథాలు లేవు, దాస దాసీ జనమూ, అలంకారాలు లేవు. కేవలం ఒక ఆకలిని మాత్రం కప్పుకొని కళ్ళు మూసుకున్నాడు.

వస్తూ పోతూ జనం విసురుతూన్న వ్యంగ్యోక్తులు, అవహేళనలు, అపహాస్యాలు ఆ ఆకలికంటే వాడిగా గాయపరుస్తున్నాయతన్ని. కాని నిస్సహాయుడు, అలసట, అవేశం. లేచి నిలబడే శక్తి లేదు. తీవ్రమైన బాధతో ఒకసారి కళ్ళు తెరచి చూచి మళ్ళీ కళ్ళు మూసుకుంటున్నాడు. "చూడండీ, చూడండి, ఇప్పుడా మాధవిని! ఎంచక్కా ఇంకొకడితో కులుకుతుందోను. ఇటు ఈ కోవలన్‌ని చూడండి. ఇప్పుడా మాధవి ప్రక్కని రథం మీద ఠీవిగా కులుకుతూన్న వాడి గతి కూడా రేపటికి ఇంతేరా నాన్నా! అహహ! వేశ్యల్ని మరిగినవాడికి జరిగే ప్రాయశ్చిత్తం చూశారా?" అంటూ దారినిపోయే వాడొకడు చేస్తున్న వ్యాఖ్యానం లీలగా చెవిని పడింది కోవలన్‌కు.

మాధవి పరపురుషుడితో తిరుగుతూన్న సంగతి విని వెంటనే లేచి కూర్చున్నాడు. క్రోధమూ, కుతూహలమూ, ఈర్ష్యా అతని ఆకలిదప్పుల్ని, నీరసత్వాన్ని జయించాయి. జనాన్ని చెడామడా త్రొక్కుకుంటూ రథమార్గం వైపు నడిచాడు.

ఇంద్రోత్సవాల కోసమని క్రొత్తగా ఎన్నికచేసిన ప్రదేశానికి వచ్చాడు కోవలన్. మహారాజు యాత్రను చిరస్మరణీయం చేయడానికి అన్ని రకాల ఏర్పాట్లు జరిగాయి ఇక్కడ. ముఖ్య మంటపాన్నీ, కీర్తి స్తంభాన్నీ పరివేష్ఠించి సుందర శిల్పాలతో తీర్చిన దారుబిత్తిక చుట్టూ, గోపురం చుట్టూ జనం మూగి వున్నారు. అస్త్రధారులైన సైనికులు కొందరు వారిని లోపలికి చొచ్చుకొని పోకుండా అదుపుచేస్తున్నారు. జనంలో అలజడి రేగింది. 'అడుగో, అడుగో కోవలన్, కోవలన్' అంటూ లేచారు. ఎవడికి నచ్చిన వాగ్బాణాన్ని వాడు పదునుపెట్టి అతని మీదికి విసురుతున్నారు. "చూచారా ఇక్కడ కోవలన్

కూటికి లేక బికారి అయిపోయాడు. అక్కడ చూడండి మాధవి ఆ రాజోద్యోగితో ఎలా వెలిగిపోతున్నదో. వేశ్య కూడా పతివ్రత అవుతుందంటారా పిచ్చినాగన్నలార'' అంటున్నాడొకడు. ఈ దూషణల్ని ఎత్తిపొడుపుల్ని వినివిని రాయి అయివున్నాడు కోవలన్. అతనికి వాటి బాధ లేదిక. కాని మాధవి నూతన జీవితాన్ని గురించిన ద్వేషంతోనే ముందుకు సాగిపోతున్నాడు. కీర్తిస్తంభం దగ్గర బాగా ముస్తాబు చేసుకొని రాజధాని నుండి వచ్చిన రాజోద్యోగి పక్కన నిలబడి వుంది మాధవి. రాజాజ్ఞతో మహాశ్రేష్ఠిగారి దానసంపదనంతా స్వీకరించిందీ ఇతడే. మహాశ్రేష్ఠి వంశకోశాన్ని స్వాధీనపరచుకున్నది కూడా ఇతడే. ఇప్పుడు నగర ఆర్థిక సంక్షోభాన్ని గురించి మహారాజుగారికి సమర్పించ వలసిన నివేదికను కూడా ఈ రాజోద్యోగే తయారు చేస్తున్నాడు.

రాజోద్యోగి తన చేతిని మాధవి మెడపై వేసి రెండవచేత్తో ఆమెకేమిటో చెపుతూ నిలుచున్నాడు. ఆ దృశ్యం చూచి నిలువునా నిప్పంటించినట్లయింది కోవలన్‌కు. "మాధవీ" అంటూ పెద్దగా కేక వేసి అడ్డం వున్న దారుకుడ్యాన్ని దాటి వాళ్ల దగ్గరకు చేరుకోవాలని చూచాడు. కాని ద్వారపాలకులు తమ పొడుగాటి బాణాకఱ్ఱల్ని అడ్డం వుంచి పోకుండా అడ్డుకున్నారు. కోవలన్ పెద్దగా గర్జిస్తూ, మాధవిని బూతులు తిడ్తూ రెచ్చిపోతున్నాడు. జనం అతని చుట్టూ గుమిగూడి విరగబడి నవ్వుతున్నారు. శిష్ట సమాజం ఎప్పుడూ విని ఎరుగని తిట్లు అతని నోట ధారాపాతంగా వెలువడుతున్నాయి. జనం నవ్వుతూ చప్పట్లు చరుస్తున్న కొద్దీ పిచ్చివానిలా రెచ్చిపోయి పైపైకి వెళ్తున్న కోవలన్‌ను చూచి రాజోద్యోగి కళ్ళు చిట్లించాడు. మాధవి కూడా వెనక్కు తిరిగి కోపంగా అతనివైపు చూచింది. కోవలన్‌నూ, అతనిచుట్టూ మూగిన అలగాజనాన్ని దండించవలసిందిగా చేయెత్తి ద్వారపాలకుల్ని ఆదేశిస్తున్న రాజోద్యోగిని వారించి తనే కోవలన్ వైపు నడిచింది మాధవి.

మాధవి తన ముందుకు వస్తూండడం చూచి నరాల శక్తినంతా కూడదీసుకుని, నిలువెల్లా వణికిపోతూ బిగ్గరగా అరిచాడు కోవలన్. "చూడండి, చూడండి విషకన్య వస్తున్నది చూడండి. నగరంలో ఉన్న ధనికశ్రేష్ఠులందర్నీ ముద్దులతో కాటువేసి చంపివేస్తుందీ విషకన్య. ఈ కులట, విశ్వాసఘాతకురాలు, నన్ను సర్వనాశనం చేసింది. రేపు వీడ్ని చేస్తుంది. ఎల్లుండి మిమ్మల్ని పట్టుకుంటుంది. వందలు, వేలు, లక్షలు, అందర్నీ చంపి వేస్తుందీ విషకన్య."

"అబ్బా! ఇప్పటికి గ్రహించాడురా ఈ నగ్న సత్యాన్ని" గుంపులోనుండి ఒకడు అరిచాడు. "నాయనా అది అసలే వేశ్య. మొత్తం మనుష్య సమాజం అంటేనే ద్వేషం దానికి. మరి వేశ్య అంటేనే సంఘాన్ని సర్వనాశనం చేసేదని అర్థం."

మాధవి కోవలన్ ముందుకు వచ్చింది. జనం విసురుతున్న వ్యంగ్యాలకు, ఎత్తి పొడుపులకు, నవ్వులకు భయం భయంగా నవ్వింది. ఆ తరువాత ద్వేషమూ, పగా కక్కుతూన్న ఆమె మాటలు పాముల్లాగా ముందుకు దూకాయి. "ఔను నేను వేశ్యనే, మీరన్నట్లు మనిషి అంటేనే ద్వేషం నాకు. ఇంకా మీలో కొందరు అంటున్నట్లు కులవధువుల్ని, పతివ్రతల్ని, సతుల్ని ద్వేషిస్తాను నేను. వాళ్ళను తమలో తాము కుళ్ళి కుళ్ళి చచ్చేట్లు చేస్తాను. అంతేకాదు. తనను తనే ద్వేషించుకుంటుంది వేశ్య. అది ద్వేషంలో పుట్టి ద్వేషంలో పెరుగుతుంది. మీరు చెప్పేది వాస్తవమే కాని దానికంతటికీ కారణం ఎవరు? మీరే. మీరు, మీరు, మీరందరూ దీనికి కారకులే. అందరు స్త్రీలలాగే గృహిణి అయి, పిల్లల్ని కని, సంసారాన్ని నడపడానికి యోగ్యురాలైన స్త్రీని కేవలం కామవాంఛ తీర్చుకునే పనిముట్టుగా వాడుకొని వేశ్యను చేసింది మీరే. దాన్ని మరి ఎందుకూ పనికిరానిదానిగా చేసి ఈ సంఘంలో విడిచిపెట్టారు మీరు. అది మరి సమాజాన్ని నాశనం చేయక ఏం చేస్తుంది? ఈ సంఘాన్ని ద్వేషించే అధికారం పూర్తిగా వుంది దానికి..."

"కాని నిన్ను ప్రేమించాను. నీకోసమని ఎన్నో త్యాగాలు చేశాను. చివరకు దేవి లాంటి నా భార్యను కూడా నీకోసమని పరిత్యజించాను."

"నాకోసమని ఏమీ చేయలేదు మీరు. ఏదైనా చేస్తే అది మీ కామ సంతృప్తి కోసమే చేసుకున్నారు. ఉత్తమురాలైన అటువంటి పత్నినే ప్రేమించలేకపోయావే, నన్నా ప్రేమిస్తారు. వెళ్ళిపొండి ముందిక్కడ్నుంచి."

మాధవి సమాధానం విని మరింత ఆగ్రహావేశంలో వశం తప్పిపోయాడు కోవలన్. "విశ్వాస ఘాతకీ; పిశాచీ, నువ్వా నన్ను అవమానిస్తావు" అంటూ ముందుకు దూకి ఆమె మెడ ఒడిసి పట్టుకోబోయాడు.

వెంటనే రక్షక భటులు ముందుకు వచ్చి అతణ్ని పట్టుకున్నారు. మాధవి అవేశంతో వణికిపోతూ "ఇంత నిండు సభలో నా మీద చేయి చేసుకొంటావా నువ్వు, నేనేనా అంత చేతకాని దాన్ని ఏమిచేసినా పడి ఉండడానికి, ఇప్పుడీ కోవలన్ సముద్రాంతరాల ప్రసిద్ధి ఉన్నవాడు కాదు తెలుసా? పో ముందు కుక్క ఎక్కడో" అంది.

కోవలన్ దుర్గతి చూసి జనం పరమానంద భరితులౌతున్నారు. ఆకలి దప్పులతో నీరసించి వున్న తన శక్తినంతా పుంజుకొని పట్టు విడిపించుకోవాలని పెనుగులాడుతున్నాడు కోవలన్. పచ్చి బూతులు తిడ్తూ రక్షక భటుల్ని విదిలించి వేస్తున్నాడు. రాజోద్యోగి అతన్ని కఠినంగా శిక్షించమన్నట్లు సైగ చేశాడో లేదో రక్షక భటుల లాఠీలు ఎడా పెడా అతని శరీరం మీద పడుతున్నాయి. అతని నోటినుండీ, ముక్కు నుండీ రక్తం కారుతున్నది.

కోవలన్ స్థితి చూచి మాధవి హృదయం ద్రవించింది. రాజోద్యోగిని చేయి పట్టుకొని ముందుకు నడిపించింది. దెబ్బలతో నీరసంతో స్పృహ తప్పిన కోవలన్‌ను రక్షక భటులు పట్టుకుపోయి గోపురానికి అవతల ఇసుక మీద పడవేశారు.

## 29

అర్ధరాత్రి ధర్మశాలపై మెట్లమీద దన ధన అడుగుల చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. జనం కోలాహలానికి ప్రక్క మీది నుంచి అదాటుగా లేచి కూర్చుంది కణ్ణకి. ప్రక్కనే నిద్రలో వున్న దేవంతిని కూడా లేపింది. నిన్నటి నుండీ ఏమీ తినలేదు వాళ్ళు. కణ్ణకి ఒంటి మీద కళ్యాణ మంజీరాలు తప్ప మరేమీ మిగిలి లేవిక. తైలం కొనడానికి కూడా లేక దీపం వెలిగించలేదు. అప్పుడప్పుడూ సాయం చేస్తూ వుండే ధర్మశాల కార్యవాహుడు తన దౌహిత్రుడి వివాహమంటూ పొరుగూరు వెళ్ళి ఇంకా తిరిగి రాలేదు. సందడి క్రమంగా సమీపిస్తూ వుండడం చూచి "ఏమిటే ఈ అలజడి" అంది కణ్ణకి.

"ఎవరైనా యాత్రికులేమో?"

"కాదు. యాత్రికుల్ని పైకి రానివ్వరు. క్రింద బోలెడు కోష్ఠాలు పడి ఉన్నాయి వారికి."

ఇంతలో చేలమ్మ కంఠస్వరం వినిపించింది. "బిడ్డా! దీపం పట్టుకురా. కోవలన్ చెట్టియార్ వచ్చారు" అంటూ చీకట్లో తడుముకుంటూ పైకి వస్తున్నదామె.

తలుపు వెంటనే తెరుచుకుంది. దేవంతి బైటికి వస్తూ "అక్కడే ఉండు అత్తా. ఇదిగో ఇప్పుడే తెస్తున్నాను. చీకటి వుందు, వుందు" అంటూ గబ గబా మెట్లమీదికి పరుగెత్తింది.

"వేగిరం రా తల్లీ! చెట్టియార్‌కు బాగా గాయాలు తగిలాయి స్పృహలో లేరు."

చేలమ్మ మాటలకు దేవంతీ, కణ్ణకీ నిర్విణ్ణులయ్యారు. క్రింద ఏడెనిమిది మంది చుట్టూ మూగి వున్నారు. వారి మధ్య గాయాలతో స్పృహ తప్పి పడి వున్న కోవలన్ ఆకారం అస్పష్టంగా కనిపించి పెద్దగా కేక వేసింది కణ్ణకి.

"వెంటనే దీపం తేవే దేవంతీ!" విసుక్కుంది చేలమ్మ.

"మీరు అక్కడే వుండండి అమ్మా, పైకి తీసుకు వస్తున్నాం మహాశ్రేష్ఠిని" అంది.

❊ ❊ ❊

మరునాడు తెల్లవారు ఝామునకు తెలివి వచ్చింది కోవలన్‌కు. మత్తుగా కళ్ళు విప్పి చుట్టూ కలియ చూచాడు. దాంతో అందరికీ కొంచెం ప్రాణాలు కుదుటపడ్డాయి. కణ్ణకి దేవంతితో ఎంతో వినయంగా కబురు పంపిన మీదట పూర్వ ప్రతిష్ఠనీ, సంబంధ బాంధవ్యాలనీ దృష్టిలో వుంచుకొని ఆ అర్ధరాత్రి అప్పటికప్పుడు రాజవైద్యులు ధర్మశాలకు పరుగెత్తుకు వచ్చారు. తెల్లవార్లూ ఏవేవో ఔషధాలు వాడుతూనే ఉన్నారాయన. చివరకు

కోవలన్‌కు స్పృహ వచ్చి ఆయనవైపు చూస్తూ నమస్కార సూచకంగా చేయి ఎత్తబోయాడు. అతని ముందు దేవంతి నిలబడి వుంది. చేలమ్మ వెనుక ప్రక్క నిలుచున్నది. కణ్ణకి కోసమని అతని చూపులు నీరసంగా వెతుకుతున్నాయి. తన వెనుకనే ఉన్న చేలమ్మను చూడలేక పోయాడతను.

మధ్యాహ్ననికల్లా ప్రక్కమీదే లేచి కూర్చోగలిగాడు కోవలన్. ఆత్మ సంతాపసూచకంగా రాజవైద్యుల వారి చేతులు పట్టుకున్నాడు. చేలమ్మను, దేవంతినీ కన్నీటితో క్షమాపణ కోరాడు. మళ్ళీ స్వస్థత చిక్కుతుందని, పరిస్థితులు కుదుటపడతాయని క్రమేపీ అంతా అదే సవ్యమైన మార్గంలో పడుతుందని అందరూ ధైర్యం చెప్తున్నారతనికి. అందరి ఓదార్పు, ఆశ్వాసన వింటూంటే మళ్ళీ నూతన జీవితం మీద కొద్దికొద్దిగ ఆశ కలుగుతూన్నదతనికి.

రాత్రల్లా మేలుకొని అందరూ పూర్తిగా అలసిపోయి ఉన్నారు. రాజవైద్యులు సూచనలిచ్చి, పథ్యం చెప్పి తమ శిష్యులతో వెళ్ళిపోయారు. కణ్ణకీ, దేవంతీ బ్రతిమాలినా ఆగకుండా సాయంత్రానికి తిరిగి వస్తానని చెప్పి వెళ్ళిపోయింది చేలమ్మ.

దారిద్ర్య బాధ మళ్ళీ పీడిస్తున్నది కణ్ణకిని. ఇంట్లో ఎటు చూచినా మహాశూన్యం. కోవలన్ చికిత్స కోసం, ఉపచారాలకు దారి ఏమిటా అని దిగులుగా ఆలోచిస్తూ వుండివుండి వెళ్ళి దేవంతిని పిలిచింది.

అరికాళ్ళు మర్దన చేస్తూ కోవలన్ మంచం దగ్గర కూర్చొని వుంది దేవంతి. ఆ పిలుపు విని లేవబోతూ వుండగా కోవలన్ కళ్ళు తెరిచి "మీ అమ్మగారు ఇక నా ముఖం చూడరా దేవంతీ" అన్నాడు. కణ్ణకి వచ్చి భర్త పాదాల దగ్గర కూర్చున్నది.

లోలోపల కణకణ మండిపోతూన్న కోవలన్ మనస్సుకు ఆ మృదుహస్తాల శీతల స్పర్శ ఎంతో హాయిని కలిగిస్తూన్నది. అంతులేని ఉపశాంతిని పొందుతూ అలాగే కొద్ది క్షణాలు పడివుండి ఆ తరువాత లేచి కూర్చున్నాడు. ఆమె రెండు చేతులు పట్టుకొని తనవైపు లాక్కున్నాడు. కణ్ణకి విశాల నేత్రాలలో పొంగి వచ్చిన అశ్రుగంగ చెక్కిళ్ళ మీదుగా జారి భర్త పాదాలను తడుపుతూన్నది. కోవలన్ కళ్ళు కూడా పశ్చాత్తాప జలంతో తడిసిపోయాయి. దేవంతి మెల్లగా బైటికి వెళ్ళిపోయింది. ఉద్వేగాన్ని బలవంతాన అణచుకొని, "సంకోచించకు ఇటు వచ్చి కూర్చో కణ్ణకీ! ఈ వేళ నీ పాదాలుపట్టుకొని క్షమార్పణలు కోరుకుంటాను" అన్నాడు.

ఆమె మెల్లగా తల ఎత్తి భర్త ముఖం వైపు చూచింది. రెండు కన్నీటి చూపులు పరస్పరం కలుసుకున్నాయి. ఇద్దరి హృదయాలు ఒక విధమైన శాంతితో, స్థిరత్వంతో తొణికిసలాడాయి. ఒక క్షణం ఆమె కన్నుల్లో అతి అలభ్యమైనదేదో పొందిన సంతృప్తి మెరిసింది. ఆపైన సిగ్గు ముంచుకు వచ్చి తల దించుకొని భర్త హృదయం మీద

వాలిపోయింది. కోవలన్ ఆమెను రెండు బాహువుల్లో పొదివిపట్టుకొని హృదయానికి హత్తుకున్నాడు. గడ్డాన్ని ఆమె శిరస్సు మీద మోపాడు. అతని నేత్రాలు అర్థనిమీలితాలయ్యాయి.

"గడిచిపోయిన దుఃఖాన్ని మరిచి ఇప్పుడు ఎంతో ఆనందాన్ని అనుభవిస్తున్నాను కణ్ణకీ!! కాని ఇంత సోమరి జీవితాన్ని ఏం చేసుకోను. రాను, రాను నీకు కూడా భారాన్ని అయిపోతానేమో అని భయపడుతున్నాను."

కణ్ణకి మళ్ళీ శిరసెత్తి భర్తవైపు చూచింది. "మీరు లభించారు. అంతే చాలు. మాకే భారమూ లేదిక! ఏ దుఃఖమూ, ఆవేదనా నా మనస్సుకు అంటవిక."

"మనస్సు సంగతి కాదు. శరీరాన్ని గురించి ఆలోచిస్తున్నాను. శరీరానికి ఏదో ఒక వ్యాపారం, పలుకుబడి, ధనం అవసరం."

"అంతా సరి అవుతుంది. తిరిగి వ్యాపారాన్ని ప్రారంభించడానికి కూడా ఎంతో సమయం పట్టదు. కాల పరివర్తనకు ఎక్కువ సమయం అక్కర్లేదు స్వామీ"

"అసంభవం. ఏది చేయడానికైనా ఏదో కొంత పెట్టుబడి అనేది ఉండాలా, ఎక్కడ్నించి తేను ఆ మూలధనమిప్పుడు" అంటూ చల్లగా ఒక నిట్టూర్పు విడిచాడు కోవలన్.

కణ్ణకి పెదవుల మీద సిగ్గుతో కూడిన చిరునవ్వు పరుగెత్తింది. "మామగారు నా పాదాలకు లక్ష్మిని బంధించి వెళ్ళారు. ఈ కళ్యాణ మంజీరాల్ని అమ్మివేస్తే పెట్టుబడికి మరి చింత ఉండదు."

తన చెవుల మీద తనకే విశ్వాసం లేనట్టు ఆశ్చర్యచకితుడై ఆమె వైపు చూచాడు కోవలన్. ఆమె అలాగే తలవంచుకొని అతి సహజంగా "అప్పుడివి తొమ్మిది లక్షల ముద్రల వరకూ అయ్యాయని విన్నాను. ఇప్పుడు మన దౌర్భాగ్య దశలో వీధిని పెట్టి అమ్మినా నాలుగు లక్షలకు ఎవరైనా కొంటారు" అంది.

"ఎన్నో యాతనలను సహించి భద్రపరచుకున్న వాటిని ఇట్టే వదులుకోవడానికి సిద్ధపడుతున్నావిప్పుడు. నిజంగా నువ్వెంతో అద్భుతమైన దానివి కణ్ణకీ."

"ఈ నూపురాలు మీ విలాసానికి కాదు. మీ ప్రతిష్ఠకు చిహ్నాలు! నేను అప్పుడూ ఇప్పుడూ క్రొత్తదిగాని, అద్భుతమైంది కాని చేస్తున్నదేదీ లేదు. వీలైనంత తొందరలో వీటిని అమ్మి ఏదో ఒకటి చూడండి."

"కాని వీటినికూడా అమ్మి స్వర్గంలో వున్న తండ్రిగారికి ఏమని ముఖం చూపను."

"అక్కర్లేదు. అలా అని సంకోచపడకండి. నేనీ మంజీరాలతోనే చితిమీదికి వెళ్తానని నా అంతరాత్మ చెప్తూన్నది. మీ వర్తక వ్యాపారాలు కాస్త కుదురుకోగానే మళ్ళీ చేయించుకుందాము. ఇంతవి కొనలేకపోయినా మాంగల్య చిహ్నాల విలువని ధనంతో

కొలువనవసరం లేదు. నిజానికి మామగారికి కూడా అభ్యంతరమేమీ ఉండకూడదిందులో. ఇవి వారి దానమే, వారి ప్రసాదంతోనే తిరిగి చేయిస్తాము."

"ఏదైనా ఇక అక్కడే వుండి ఏది చెయ్యడానికి నా మనస్సు అంగీకరించదు కణ్ణకీ. పువ్వులమ్మిన అంగడిలోనే కట్టెలు మోస్తూ ఎలా తిరగమంటావు."

"వేరే చోటికి ఎక్కడకయినా వెళ్ళిపోదాం పదండి."

"ఎక్కడికని వెళ్తాము?"

కణ్ణకి కొద్ది క్షణాలు తలవంచుకొని మౌనంగా ఆలోచిస్తూ కూర్చొని "మధుర వెళ్దామా?" అంది. "ఇవి అక్కడి కంసాలితో చేయించినవే అందుకని అక్కడే వీటిని అమ్మివేయడం సులభం. క్రొత్తప్రదేశం క్రొత్త పరిసరాలు అన్ని విధాలా నూతన జీవితానికి అనువుగా వుంటాయి."

తిరిగి ప్రారంభించబోతున్న ఆ నూతన జీవితాన్ని గురించి ఆలోచిస్తూ మౌనంగా వుండిపోయాడు కోవలన్. ఆమె లేచి నిలుచున్నది. ఇంతలో చేయిపట్టుకొని తన ఎదుట కూచోబెట్టుకోవడానికి ప్రయత్నిస్తూన్న కోవలన్‌ని ఉద్దేశించి "నిన్న మీ చికిత్సకోసం డబ్బు లేక నానా మధనపడ్డాను. చివరకు రాత్రి జ్ఞాపకం వచ్చింది. మన భవంతిలో పశ్చిమ ద్వారం దగ్గర భోషాణం సొరుగులో కొన్ని పైడిముద్రలు వుండాలని ఎప్పుడో మన వేల్లినాథన్ వడ్డీ అంటూ తెచ్చి ఇచ్చిన సొమ్ము అక్కడ పడవేశాను. సమయం వచ్చినప్పుడు ఇటువంటి చిల్లర మొత్తాలే ఎంతో అక్కరకు వస్తాయి. ఇదో మన దేవంతిని పంపించి వస్తానుండండి. మనకు ప్రయాణ ఖర్చులకన్నా వస్తాయి" అంటూ బయటికి వెళ్ళింది కణ్ణకి.

దేవంతిని పంపించి వచ్చి అతనికెదురుగా కూర్చున్నది. ఇద్దరు ఎదురుబొదురుగా కూర్చొని తాము తిరిగి ప్రారంభించనున్న నూతన జీవితానికి సంబంధించిన ఆలోచనల్లో మునిగిపోయారు.

❊ ❊ ❊

మధ్యాహ్నమయింది. సూర్యుడు నడినెత్తిమీద మండిపడుతున్నాడు. కోవలన్ కణ్ణకి దేవంతి కొరకు నిరీక్షిస్తూ మళ్ళీ కబుర్లలో పడ్డారు. చాలాసేపు గడిచాక బైట అలికిడికి తొంగి చూచింది కణ్ణకి. చేలమ్మ కంగారుగా లోపలికి పరుగెత్తి వస్తూ దంపతులిద్దరూ ఎంతో సంతోషంగా ఉండడం చూచి కొంచెం జంకింది. అలాగే ద్వారబంధం పట్టుకొని ఒక క్షణం నిలబడిపోయి "రాత్రి మిమ్మల్నాస్థితిలో చూచి మీ కులలక్ష్మి చూపిన ఓర్పూ, ధైర్యమూ నిన్న మీరు చూడలేకపోయారు. ఇప్పుడు కళ్ళారా చూడబోతున్నారు చెట్టియార్" అంటూ కణ్ణకి వైపు తిరిగి "గుండెరాయి చేసుకో తల్లీ! నీకు మరో దుఃఖవార్త తెచ్చాను" అంది.

కోవలన్, కణ్ణకి ప్రతిమల్లాగా స్తంభించిపోయి ఆమెవైపు చూస్తూ అలాగే వుండి పోయారు. చేలమ్మ ముందుకు అడుగువేస్తూ "చాలా దుర్వార్త. మీ భవంతిలో దేవంతిని ఎవరో హత్య చేశారు" అంది.

ఆమె మాట పూర్తవకముందే పెద్ద కేకవేసి కొయ్యబారిపోయింది కణ్ణకి. కొద్దిసేపు ఆగి ఆ తర్వాత మళ్ళీ మొదలు పెట్టింది చేలమ్మ. "తలుపులన్నీ బార్లాగా తెరచి నిర్జనంగా వున్న ఆ భవంతిలో ఏ హంతకుడు దూరి కూర్చున్నాడో కాని దేవంతి శవం నుండి బైటి సింహద్వారం వరకూ కొన్ని బంగారు ముద్రలు విరజిమ్మి ఉన్నాయి. వాటిని చూచి ఎవడో ఆ బంగారం కోసమనే ఇంతపని చేసి ఉంటాడని చెప్పుకుంటున్నారంతా. ఆ తరువాత ఎవరో ఆట గోలు పిల్లలు లోపలికి వెళ్ళి చూచి పొలికేకలు వేస్తూ పరుగెత్తుకు వచ్చారట. జనం గుమిగూడారు. దండనాయకుడు స్వయంగా రక్షకభటులతో వచ్చి శవ పంచాయితీ జరిపించాడు. శవాన్ని దహన సంస్కారాల కోసమని తీసుకు వెళ్తున్నారు."

"ఇది తప్పకుండా ఆ కులట మాధవి పనే అయివుంటుంది."

"కాదు చెట్టియార్! ఇది మాధవి పని కాదు. అనుకోకుండా జరిగిన దుర్ఘటన ఇది. మాధవి కణ్ణకి పైన అయితే ఇటువంటి ఘోరం తలపెడుతుందేమో కాని..."

"అయితే తప్పనిసరిగా దేవంతిని కూడా అదే చంపించి వుంటుంది. నిన్న రాత్రి మీరు నన్ను ఇక్కడికి తెస్తున్నప్పుడే దాని గుప్తచరులు కూడా నా వెంట వచ్చి ఉంటారు. వాళ్ళీ పరిసరాల్లోనే ఎక్కడో దాగి ఉండి ఉదయాన్నే బైలుదేరిన దేవంతిని అనుసరించి ఉంటారు, వాళ్ళే భవంతిలో ఒంటరిదాన్ని చేసి ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారు."

"కాదుస్వామీ! ఇదే నిజమయితే నిన్న అర్ధరాత్రి కూడా వైద్యులవారి కోసమని బైటికి వెళ్ళింది దేవంతి. సోదరి మాధవి పంపిన గుప్తచరులే వుంటే రాత్రే..." అంటూ ఆగిపోయింది కణ్ణకి. ఆ తరువాత ఆమె నోట మాట పెగలలేదు. కన్నీళ్ళు ధారాపాతంగా చెక్కిళ్ళు మీదికి జారాయి.

"ఏమైనా కానివ్వండి. ఇక ఇక్కడ మీరు ఒక్క క్షణం ఉండకండి చెట్టియార్. కణ్ణకిని వెంటపెట్టుకొని ఎటన్నా దూరంగా వెళ్ళిపొండి. ఏ క్షణం ఏ అఘాయిత్యం జరుగుతుందో చెప్పలేము. మృత్యువు తాండవిస్తూన్నదిక్కడ. మీరు వెంటనే సిద్ధమయితే ఇక్కడ్నుంచి బైట పడడానికి ఏదో ఒక ఉపాయం ఆలోచిస్తాను నేను. మాధవి సంగతి పూర్తిగా ఎరుగుదును నేను. దాని ఈర్ష్యా, దాని పట్టుదలా నాకు తెలియనివి కావు. దాని కాళ్ళకు కళ్యాణ మంజీరాల్ని కట్టలేదు మీరు. జీవితంలో ఇంతపెద్ద అపజయాన్ని మోస్తూ అదే హఠంతో, ద్వేషంతో పూర్తిగా గుడ్డిదయిపోయిందది" అంటూ గాఢంగా ఒక నిట్టూర్పు

విడిచి ఈ "ఈర్ష్యాద్వేషాలు ఎంత బలమైనవో కూడ బాగా ఎరుగుదును చెట్టియార్! నేనూ జీవితాంతం ఇటువంటి గుడ్డితనంతోనే తలబాదుకున్నాను."

"ఇంకా ఈ నూపురాల వెంట ఎందుకు పడిందా రాక్షసి. నేనూ, ఆ పన్నా(శేష్ఠి ఇచ్చిన ధనం చాలకనా? అదీగాక ఇప్పుడా కులట చోళ రాజవంశంలో కూడా ప్రాపకం సంపాదించుకుందిగా. దాని కళ్ళ ముందు ఇక ఈ కళ్యాణ మంజీరాలు విలువ ఎంత?"

"ఈ మంజీరాల మూల్యాన్నిధనంతో కట్టకండి. చెట్టియార్! ధనం ఇవ్వలేని ఆ విలువను పొందాలనే పట్టుదలతోనే మాధవి ఇలా అయిపోయింది. నిజానికి అది మనం అనుకునేంత నీచురాలూకాదు, వ్యభిచారీ కాదు. దాని తత్వం బాగా ఎరుగుదును నేను, పట్టుదల కోసం బ్రతికి దాని కోసమే చస్తుందది. తన అహం కోసమనే ఏమి చేయటానికైనా సిద్ధమే అది. కణ్ణకి మీద పగ తీర్చుకుంటుంది. కాని మిమ్మల్నేమీ చేయదు చెట్టియార్! ఎందుకంటే మిమ్మల్ని నిజంగానే ప్రేమిస్తుంది. కాకపోతే మిమ్మల్ని మరీ మరీ ఇటువంటి బాధలకు గురి చేస్తుంది. వీటికారణంగా మీరు మళ్ళీ తన దగ్గరకు వచ్చి క్షమాపణ కోరుకుంటారని దాని ఉద్దేశం."

"ఇక అది అసంభవం." కోవలన్ స్వరంలో ఎంతో దృఢత్వమూ, కోపమూ ధ్వనించాయి. క్రోధంతో కళ్ళు జేవురించాయి."

"అందుకనే కణ్ణకి పట్ల నా భయం ఆధార రహితమైంది కాదు. మీకు ఏ మాత్రం సత్తువ చేకూరినా నేను చెప్పినట్లు ఈ రోజే వెళ్ళిపొండి చెట్టియార్. కణ్ణకీ! నీవు కుల లక్ష్మివి తల్లీ! నాకు బిడ్డలాంటి దానివి. నువ్వీ మంజీరాల్ని తీసుకొని తక్షణం బయలుదేరు అమ్మా! ఒక్క క్షణం జాగుచేయకు. దేవుడు నీ మాంగల్యాన్ని సదా కాపాడాలి బిడ్డా!"

# 30

అసూయా, ద్వేషాలు రెండూ గుండె అంచుల్ని కోసివేస్తూ ఉన్మత్తంగా ప్రవహిస్తున్నా, కోవలన్ మీద దెబ్బ పడుతూ ఉండడం చూచి లోలోపల సహించలేక పోయింది మాధవి. ఆ అహంకారానికి, అభిజాత్యానికి ఇటువంటి ప్రాయశ్చిత్తం జరిగి తీరవలసిందే అని మొదట అనిపించింది. ఏ జాత్యహంకారంతోనైతే తనమీద కత్తి దూయడానికి కూడా కోవలన్ సిద్ధపడ్డాడో అటువంటి మహా మహా ఘనత వహించిన మహా(శేష్ఠిగారి వంశ ప్రతిష్ఠ నడి వీధిలో ఇలా నవ్వుల పాలవుతూండడం చూచి ఆనందించింది. తన ప్రేమను, తన జీవిత సర్వస్వాన్ని పుచ్చుకొని తనను ఘోరమైన నిరాశకు గురి చేసిన వ్యక్తి పట్ల కోపం పెల్లుబికి వచ్చి ఇంకా, ఇంకా దండించవలసిందే అనుకుంది. కాని అప్పటికప్పుడు

ఆ ఆనందం కాస్తా విషాదంగా మారిపోయింది మాధవికి. అంతలో స్త్రీ సహజమైన మృదుత్వం, ఎక్కడో నిద్రావస్థలోనున్న ప్రేమ రెక్కలు విప్పుకుని విజృంభించి ఆమెను వివశను చేశాయి. ఆమె గుండె వణికింది, శరీరమూ గజగజ వణికిపోతూన్నది. రాజ్యోద్యోగిని చేయి పట్టుకొని బలవంతాన ముందుకు లాక్కుపోయింది. ఇద్దరూ వెళ్ళి రథం మీద కూర్చున్నారు. రథం ముందుకు సాగిపోయింది. కాని మాధవి మనస్సు మాత్రం వెనుకే దిగబడిపోయింది. జనసమూహం మధ్య కోవలన్ మరుగైపోయినా, ఆమె మనస్సులో మాత్రం రక్తసిక్తమైన అతని ఆకృతి, గాయాలతో, ఆవేదనతో, ఆయాసంతో విలవిల్లాడిపోతున్న కోవలన్ కనిపిస్తూనే వున్నాడు.

దారి పొడుగునా మాధవితో ఏదో ఏదో సంభాషిస్తూనే వున్నాడు రాజోద్యోగి. అతని మాటలు తేనెలో ముంచిన ఈటెల్లాగా తగుల్తున్నాయి మాధవికి. అంతూ పంతూ లేకుండా అనర్గళంగా అలా మాట్లాడుతూనే పోతున్నాడతను. “నేనెంతో మంది వేశ్యల్ని చూచాను. కాని నీవంటి చతురురాల్ని మాత్రం చూడలేదంటే నమ్ము. ఎందుచేతనంటే ఈ జీవితంలో శాశ్వతమైన అంశాలతో పాటు తాత్కాలికమైనవి కూడా కొన్ని వుంటాయనే గొప్ప సత్యాన్ని ఆ మహాశ్రేష్ఠి మరచిపోయేట్లు చేశావు నీవు. జీవితంలో తాత్కాలిక వాంఛల్ని తీర్చుకునే ఇటువంటి స్వల్ప విషయాలు వేరు. జీవితాన్ని నడిపించే శాశ్వత అంశాలు వేరు, తాత్కాలిక ఉద్వేగాలకు లొంగిపోయి ఇటువంటి క్షణికమైన వాటినే శాశ్వతాలు అనుకునేవాడికి ఏనాటికైనా ఆ మహామూర్ఖుడు కోవలన్‌కు పట్టిన దుర్గతే పట్టక తప్పదు” అంటూ క్షణం ఆగి మాధవి చేయి గట్టిగా పట్టుకొని, “పోనీ భోగభాగ్యాల ప్రలోభంతోనే అనుకో. ఎప్పుడో ఒకసారి తాత్కాలికంగానే అయినా అతడ్ని ప్రేమించి వుండకపోవు. చివరకు సర్వస్వమూ పోగొట్టుకొని దారుణమైన దెబ్బలకు కూడా అతడు గురి అవుతూండడం చూచి – నిజం చెప్పు ప్రియా! ఏమనిపించింది నీ మనస్సుకు? ఏమయినా ధర్మాచరణలో ఎంతయినా పొగడాలి నిన్ను. వేశ్యాధర్మాల్ని పాటించడమంటే మాటలు కాదు. కోవలన్‌ని ఈ స్థితికి తేవడానికి ఏయే ప్రయోగాలయితే చేశావో అవన్నీ నామీద కూడా ప్రయోగించి చూడు ప్రియా! నా చాతుర్యం కూడా నేను చూపుతాను అప్పుడు నువ్వే ఒక నూతన గుణపాఠాన్ని నేర్చుకుంటావు.”

ఆ మాటలకు లోలోపల గుండె కుమిలిపోతున్నా నోరు మెదపకుండా మౌనంగానే కూర్చుంది మాధవి.

రథం కాస్త నిర్జనప్రదేశంలోకి రాగానే ఆమెను గట్టిగా హృదయానికి హత్తుకొని మెత్తటి తలగడని నలిపి వేసినట్టు నలిపివేశాడు రాజోద్యోగి. తన శిరస్సు ఆమె శిరస్సుకు

తాటించి "ఈవేళ నాతోపాటే రావాలి సుమా. అలా అని మీ భవంతికి కబురు పంపుతాను" అంటూ మళ్ళీ నడుము చుట్టూ చేయి త్రిప్పి మరింత దగ్గరగా లాక్కొని కణతలమీద ముద్దుపెట్టుకున్నాడు.

శరీర స్పృహ లేదు మాధవికి. అంతరాత్మ సంగతి అసలు మరిచేపోయింది. వేశ్య అయినా ఇంతవరకూ పర పురుష స్పర్శ ఎరుగదామె. ఇప్పుడీ రాజోద్యోగి తన భయాందోళనల్నీ ఉపద్రవాల్ని అడ్డుపెట్టుకొని తనను పూర్తి వేశ్యను చేసి అనుభవించాలని చూస్తున్నాడు. తను త్రిప్పికొడితే, లేకపోతే పరుగెడుతూన్న ఈ రథం మీద నుంచి క్రిందికి దూకితేనో, ఏమి చేయాలి? ఏమి చేయాలి తను? ఏమిటి చేస్తుంది? అయ్యయ్యో!"

రథాన్ని తన సౌధం కేసి మళ్ళించవలసిందిగా ఆజ్ఞాపించాడు రాజోద్యోగి.

మాధవి తన శక్తినంతా కూడతీసుకొని వద్దు. వద్దు... ఈవేళ వద్దు అన్నది.

ఆపైన మరి నోరు మెదపలేకపోయిందామె. రథం పరుగెత్తుతూన్నది. ఆ రథం కన్నా ముందుకు మాధవి మనస్సు దౌడు తీస్తుంది. మరి తనూ, తన మణిమేఖల ప్రాణాల సంగతో ఏది దారి దేవుడా? తన జీవితంలో ముఖ్యమైన కోరిక అనేది తీరక ముందే చచ్చిపోవాలని లేదు మాధవికి. కాని ఏమిటా కోరిక తన అన్ని వాంఛలకూ మూలమైన వాడు సర్వస్వమూ పోగొట్టుకొని ఆకలితో, ఆయాసంతో, గాయాలతో సముద్రం ఒడ్డున రక్తం కక్కుతూ వుంటే ఇంకొకడి ప్రక్కలో కులుకుతుందా తను. వీల్లేదు. "వద్దు... వద్దు కుమార్. ఈ వేళటికి నన్ను ఇంటికి పోనివ్వండి. నా మనస్సు మీ సేవకు బొత్తిగా అనుకూలంగా లేదీవేళ. మళ్ళీ ఎప్పుడైనా..."

"కేవలం నీ మనస్సుకే కాదు. నా మనస్సుకూ సంబంధించిన విషయం ఇది. నా మనస్సు ఈవేళే అనుకూలంగా వుంది. రేపు మహారాజుగారు వేంచేస్తే మళ్ళీ ఎంతో కాలానికి గాని ఇటువంటి అవకాశం లభించదు. నిజానికి అంతకాలం నేను తాళలేను కూడా" ఎదురుగా మార్గంమీద చూపునిల్పి ఏకబిగిని చెప్పుకుపోయాడు రాజోద్యోగి. ఆ గాంభీర్యంలో కొంత అధికారదర్పం కూడా ధ్వనించింది.

భయంతో రక్తం గడ్డ కట్టుకు పోతూన్నది మాధవికి. ఆమె శరీరం వణుకుతున్నది. ఆమెవైపు క్రీగంటచూస్తూ మళ్ళీ మొదలుపెట్టాడు.

"రాజదండన నుండి నిన్ను కాపాడేందుకు లంచంగా నీమీద ఈ అఘాయిత్యం చేస్తున్నానని అనుకోవద్దు. విశ్వాసముంచు ప్రియా! ధనరూపేణా, శారీరకంగా నిన్నెంతయినా తృప్తి పరుస్తాను. కాని హృదయం సంగతి అంటావా, దాని నీడ కూడా నీ మీద సోకదు. అర్థమయిందిగా నా తత్వమేమిటో."

అంటూనే తన శరీరం మీద ప్రాకుతున్న అతని కర్కశ హస్తాలను తొలగిస్తూ, వణుకుతున్న గొంతుతో వేడుకుంది మాధవి. "మీరు ఎంతో ఉదారులు. నా మనఃగతిని తప్పకుండా అర్థం చేసుకోగలరు. ఎవరితోనైతే ఇంత కాలమూ..."

"తార్పుడు కళలో ఆరితేరిన వేశ్యకాంతల మనఃస్థితి సంగతి బాగా ఎరుగుదును నేను. అటువంటి మనః స్థితిని సృష్టించడంలో నిజానికి వాళ్ళు ఎంతో నేర్పును, చాతుర్యాన్ని ప్రదర్శిస్తారు. పాత ప్రేమికుడి పతనంతో పుట్టిన కరుణరసం, కొత్త ప్రేమికుడి మీద శృంగార రసానికి ఉద్దీపకమౌతుంది వారిలో."

ఈ కటు విమర్శకు లోలోపల ఎంతగానో నొచ్చుకుంది మాధవి. కాని నోరు మెదిపే ధైర్యం లేదు. చివరకు తన ధైర్యసాహసాలన్నీ ప్రోగుచేసుకొని ఎలా అయితేనేం : "నేను వేశ్యవాడలో పెరిగినా సతిగానే ఉన్నాను" అంది.

"ఓ, ఇప్పటికీ అలాగే వుంటావు. భద్ర వేశ్యలందరూ ఒక విటుడి ప్రక్కలో ఉండగా ఇంకొకడిని పొరపాటున కూడా తలవరు. పాతివ్రత్య బాధ్యత అంత వరకే మరి."

సతీత్వానికి రాజోద్యోగి ఇస్తున్న క్రొత్త నిర్వచనం విని విలవిల్లాడి పోయింది మాధవి. అతని చేతులుమళ్ళీ ఆమె శరీరం మీద ప్రాకుతున్నాయి. ఆమె నరాల్లో రక్తం పేరుకు పోతూన్నది. నీరసత్వం, భయం, తల తిరిగిపోతూన్నది. చివరకు నోట మాట రాక స్పృహ తప్పి పడిపోయింది.

ఈ మూర్ఛే అప్పటికప్పుడు రాజోద్యోగినుండి ఆమెను కాపాడింది. ఇంటికి వచ్చి కొంచెం కోలుకోగానే ముందు మణిమేఖలను గురించి అడిగింది. ఆ తరువాత "వారిని గురించి ఏమయినా తెలిసిందా నాగరత్నా?" అని రెండవ ప్రశ్న కోవలన్‌ని గురించి వేసింది.

"లేదమ్మా!"

తెలియకపోవడం కూడా ఒకందుకు మంచిదేనన్నట్లు చల్లగా ఒక నిట్టూర్పు విడిచింది. కాని నిజానికి తరువాత అతని సంగతి ఏమయిందో తెలుసుకోవడానికి లోలోపల తహతహ లాడుతుందామె. "ఎవరినైనా పంపి సమాచారం తెప్పించు నాగరత్నా! ఈవేళ వారికి బాగా దెబ్బలు తగిలాయని విన్నాను" అంది. తన అబద్ధం తనకే బాధాకరం అనిపించి వెల వెల బోయింది.

నాగరత్నను బైటికి పంపి తను గబగబ మణిమేఖల దగ్గరకు వచ్చింది. మణి ఇంకా మేలుకునే వుంది. దూరంగా గర్జిస్తోన్న సముద్రం వైపు దృష్టి నిల్పి కిటికీ ముందు కూర్చుని వుంది. వచ్చీ రావడంతోనే ఆమెను దగ్గరకు లాక్కొని గట్టిగా హృదయానికి హత్తుకుంది మాధవి.

"మణీ నువ్వింకా నిద్రపోలేదామ్మా?"

"నిద్ర రావడం లేదమ్మా!"

"ఎందుకని రాలేదు తల్లీ! ఏమైనా బాధగా వున్నదా?"

"లేదు."

"మరి నిద్రెందుకు రాలేదు తల్లీ!"

"వూరికే ఏవో ఆలోచిస్తూ కూర్చున్నానమ్మా."

"ఏమిటో ఆ ఆలోచన?"

"గురుదేవులు ఇప్పుడే ఈ ప్రపంచమంతా దుఃఖమయమని బోధించి వెళ్ళారు. నిజమేనమ్మా! చూడరాదు. ఆ సముద్రం ఎట్లా రోదిస్తున్నదో నల్లని మేఘాలు కప్పుకొని ఈ ఆకాశం కూడా ఏడుస్తుందంట. భూమి ఏడుస్తుంది. అంతా దుఃఖితులే అమ్మా. కేవలం ఒక బుద్ధుడికే దుఃఖస్పర్శ లేదు. ఆయన తథాగతుడు. గురుదేవులు, ఈ రోజు చెప్పి వెళ్ళిన పాఠం ఇదే. అరే నువ్వా ఏడుస్తున్నావా అమ్మా..?" మణిమేఖల చల్లని స్పర్శలో దుఃఖం పొంగి వచ్చి మాధవి కళ్ళు ధారలు కట్టాయి. ఈ మణిరూపంలో కోవలన్  తన మీద పగతీర్చుకుంటున్నట్లు అనిపిస్తున్నదామెకు. "ఔను. జీవితమంతా దుఃఖమే. అందునా ఈ మాధవి జీవితం... ఏది దారి. ఏది శాంతి ఈ బ్రతుక్కి."

బైటికి వెళ్ళి నాగరత్న సమాచారం తీసుకొని లోపలికి వచ్చింది. "గాయాలతో స్పృహ తప్పి పడివున్న కోవలన్‌ను చేలమ్మ కణ్ణకి దగ్గరికి చేర్చిందిట. రాజవైద్యుల వారు వెళ్ళి చికిత్స చేస్తున్నారట. పరిస్థితి ప్రమాదకరంగానే వుంది."

ఈ సమాచారంతో మరింత కొయ్యబారిపోయి నిలువు గుడ్లు వేసింది మాధవి

"మీరు చాలా చెడ్డపనే చేశారు అమ్మా!"

మాధవి తదేకంగా నాగరత్నను చూస్తూ అలాగే నిలబడిపోయింది. తనే చెప్పుకుపోయింది నాగరత్న. "నగరంలో క్రొత్తగా వ్యాపించిన వదంతుల వల్ల మనం పూర్తిగా ప్రమాదంలో వున్నామిప్పుడు. కావేరి వరద ఉధృతంగా పెరిగిపోతూన్నది. ఏం చేయడానికైనా మిగిలింది ఈ రోజు మాత్రమే. రేపు మహారాజు వస్తారట. అప్పుడిక ఏదారి వుండదు మనకు."

"కాని ఇప్పుడు వున్న తీరున అన్ని ఏర్పాట్లు ఎలా జరుగుతాయి."

"జరిగినా జరక్కపోయినా అంతే. రేపు మహారాజు వచ్చే సమయానికి నగరం పొలిమేరలన్నిటి మీదా రక్షక భటుల కాపలా వుంటుంది. అటు వెళ్ళే మార్గాలన్నీ మూసి వేస్తారు. మిగిలిన దారులన్నీ కావేరీతల్లి ఏనాడో మూసివేసింది."

“భయపడకు నాగరత్నా! దొరికిన క్రొత్త సహాయాన్ని ఊతగా పట్టుకొని అన్ని ఆపదలు దాటివెళ్తాము. అంతా అదే సరిఅవుతుంది.” అని అనడానికయితే ఆవేశం కొద్దీ అన్నది. కాని, నిజానికి ఆ మాట అనడానికే లోలోపల ఎంతో తల్లడిల్లి పోయింది మాధవి. ఏమిటా కొత్త సహాయం? ఇంతేనా తన సతీత్వం? ఏదో తాత్కాలిక కోపం కొద్దీ, అసూయకొద్దీ తను వేశ్య అవాలనే నిర్ణయించుకున్నదే కాని, ఆ నిర్ణయమూ కోవలన్‌ను ఉడికించాలని, అతను లోలోపల ఉడికి కుమిలిపోయేట్టు చేయాలని తీసుకున్నదే కాని ఇలా దిగజారిపోవడానికి ఎంతమాత్రమూ కాదు. ఏది ఏమయినా ఈదారిమీద మరి ముందుకు అడుగు వేయదు తను. తన పతిత అవదు. వేశ్య అవదు. ఈనాడు ఎవడో పరపురుషుడి ప్రక్కన పడుకొని ఇన్నాళ్ళుగా తను కన్న కలల్ని తన వ్రతాన్ని ధర్మాన్ని మంటకలుపుకోదు. అసంభవం. అసంభవం. పూర్తిగా అసంభవమిది.

కాని మరి మణిమేఖల ప్రాణాల సంగతో? ఈప్రశ్నార్థకమే ఒక పదునయిన కొడవలిలా ఆమె గుండెను లాగివేస్తున్నది. ఏదో ఒక విధంగా కక్కుర్తికి లొంగి ప్రాణాలు రక్షించుకున్నా మణి భావి జీవితాన్ని గూర్చి తను కట్టుకున్న మేడలన్నీ నేలపాలు అయి తీరుతాయి. సాని సంసారి అవడం అసంభవమంటూ పెరియన్నాయకీ, చేలమ్మా తరచూ చెప్తూ ఉండే మాటలన్నీ గుర్తుకు వచ్చి “చివరకు అదే నిజం కానున్నదా దేవుడా? అనుకుంది మాధవి. పోనీ తనే ఆత్మహత్య చేసుకొని ఈ మార్గం నుండి నిష్క్రమిస్తేనో అప్పుడు మరి మణి గతేమికాను? ఏమీ అవదు. తండ్రిగారి తలనీడ ఉంటుంది దానికి. కణ్ణకి ఆమెను పెంచి, విద్యాబుద్ధులు చెప్పించి కులీనురాల్ని చేస్తుంది. మణిపట్ల తన ఆశయం నెరవేరుతుంది. తనలా కాకుండా మణి సంతానవతియై సంసారియై ఎంతో వృద్ధిలోకి వస్తుంది.

కాని తనబిడ్డ బాగోగులు మరి అప్పుడు తనెలా చూడగలుగుతుంది? మణిని అడ్డం పెట్టుకొని తన జీవిత వ్యామోహమే చుట్టి వేస్తున్నది మాధవిని. ఆ వ్యామోహమే ఉప్పొంగుతున్న కావేరిలా మూడు దిక్కుల మార్గాల్ని నిరోధిస్తూ ప్రవహిస్తూన్నది. నాలుగో దిశని రాజోద్యోగి నిలబడి వున్నాడు. ఆమెను కణ కణ మండుతూన్న కామాగ్నికి ఆహుతి చేయాలని చూస్తున్నాడా రాజోద్యోగి. అదే నిజమయితే తను తన పాతివ్రత్య ధర్మాన్ని పోగొట్టుకొని కణ్ణకి దృష్టిలో చులకనయి పోతుంది. అప్పుడు ఏ ముఖంతో మళ్ళీ ఈ లోకాన్ని చూస్తుంది? నాలుగు దిక్కులా పిచ్చిగా పరుగులు తీసి తిరిగి వచ్చి తన దుఃఖకూపంలోనే పడిపోయింది మాధవి. తిరిగింది తిరిగినట్లు ఆ సుడిగుండంలో అలా

తిరుగుతూనే ఉండిపోయింది. అన్ని దారులూ మూసుకుపోయిన అంధకార కూపంలో అలమటిస్తూనే రాత్రి అంతా గడిపి వేసింది.

❊ ❊ ❊

మర్నాడు తెల్లవారి ప్రక్కమీద నుంచి లేచేసరికి రాజోద్యోగి సేవకుడు సిద్ధంగా వున్నాడు." మాధవీ దేవిని పిలుచుకు రమ్మని ప్రభువుల వారి ఆదేశం రథం సిద్ధంగా వున్నది."

ఆ ఆదేశం విని గజ గజ లాడిపోయింది మాధవి. ఆ భయమే ఒక పెనుభూతంలాగా ఆమె హృదయం అంతా నిండిపోయింది. తెల్లవార్లూ జరిగిన మానసిక సంక్షోభాన్ని ఊహాపోహల్ని కబళించి వేసింది. తను తిరిగి వచ్చేవరకూ మణిని జాగ్రత్తగా చూస్తూండమని నాగరత్నకు ఒప్పచెప్పి తను వెళ్ళి రథం మీద కూర్చుంది. ఉదయం నుండీ ఆకాశం మేఘావృతమై ఉంది. సన్నగా తుంపర్లు పడుతున్నాయి. దట్టంగా కమ్మిన పొగమంచును చీల్చుకుంటూ రథం ముందుకు దూసుకు పోయింది.

❊ ❊ ❊

ఇంచుమించు మధ్యాహ్నం వరకూ చిత్రశాలలో ఒంటరిగా బిక్కు బిక్కుమంటూ కూర్చున్నది కూర్చునట్లుగానే ఉండిపోయింది మాధవి. గొంతు తడుపుకోవడానికి ఇన్ని నీళ్ళు కావాలా అని అయినా ఎవ్వరూ వచ్చి పలకరించిన పాపాన పోలేదు. ఒక వైపున ఆకాశం మూసుకుపోయి వర్షం ఎడాపెడా కొడుతూన్నది. ఆకాశంలో ఆ కొస నుండి ఈ కొసవరకు మెరుపులు భయంకరంగా దూసుకుపోతున్నాయి. చూస్తూ చూస్తూ వుండగానే పెనుగాలి ప్రారంభమై పెద్ద పెద్ద వటవృక్షాలు సైతం గజగజ లాగుతున్నాయి. మహారాజు స్వాగతానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ ముగించుకొని వర్షంలోనే పడివచ్చాడు రాజ్యాధికారి. లోపలికి అడుగుపెడుతూనే మాధవిని చూచి "నిన్న సముద్రతీరం మీద జరిగిన సంఘటన కారణంగా నీ కష్టాలు మరింత పెరిగిపోయాయి మాధవీ. నిన్నటి స్థితి చూచి నగర పెద్దలందరూ ఆగ్రహావేశాలతో మహారాజుగారి దగ్గర ఫిర్యాదు చేయడానికి సిద్ధపడుతున్నారు అన్నాడు."

నిశ్చేష్టురాలై అలాగే స్తంభించిపోయిన మాధవిని సమీపిస్తూ మళ్ళీ "అయినా నా ప్రభావం కూడా కొంతవరకు నగరశ్రేష్ఠుల మీద వుంటుందనుకుంటాను. ఎందువల్ల నంటే వాళ్ళు పొందే రాజకీయ సహాయ సహకారాలన్నీ నా ద్వారానే వాళ్ళకు అందుతుంటాయి. ఆ కారణంగా కూడా కొంతవరకు మహారాజు ఎదుట పూర్తిగా నీకు వ్యతిరేకం చెప్పడానికి వాళ్ళు జంకవచ్చు. ఏమైనా ఈ కాని సమయంలో ఏది ఎట్లా

పరిణమిస్తుందో నిశ్చింతగా చెప్పడం కష్టం.” బైట వర్షం క్రమేపీ ఇంకా తీవ్రమవుతూన్నది. గాడాంధకారం ఆకాశానికి దట్టంగా మసిబూసినట్లు అలుముకుపోయి సాయంకాలమన్నా కాకముందే అమావాస్య అర్ధరాత్రిలాగా కనిపిస్తూన్నది. ఆ చలివల్ల కాక భయంతో వణుకు పుడుతున్నది మాధవికి.

“అయినా భయపడకు మాధవీ! సాక్షాత్తు మహారాజు జ్ఞాతి అయిన ఉన్నతాధికారిని, తన హావభావాలతో, అభినయంతో వాక్చాతుర్యంతో సంతృప్తి పరచిన వేశ్య కన్యకు క్షమాదానమూ లభించవచ్చు. క్షణం తీరిక ఉండగూడని ఈ రోజున కూడా మనకు ఇటువంటి అవకాశాన్ని కల్పించిన ఈ సాయంకాలాన్ని వ్యర్థంగా పోనీయకు అంటూ లేచి నడుముకు వున్న ఖడ్గమూ, దుస్తులూ తీసి కొక్కానికి తగిలించాడు. ఒక సారి వొళ్ళు విరుచుకొని “గవాక్షం వైపు నడుస్తూ” ఈసారి స్వయంగా ఇంద్రుడే తన ఉత్సవాల ఏర్పాట్లన్నీ చూచుకుంటున్నట్లుగా వుంది. ఈవేళ అర్ధరాతే మహారాజు నగర ప్రవేశం, ఈవేళే ఇంత భయంకరమైన వర్షం. ఒకవైపు వుప్పొంగిపోతున్న కావేరీ ఏమిటో.”

కోష్ఠం లోపలికి జడి కొడుతున్నది. ఆ జడికి తడుస్తూన్న భాగానికి కొంచెం ఇవతలగా నిలుచుని గవాక్షం నుండి బైటికి చూస్తున్నాడు రాజ్యాధికారి. రోకళ్ళతో బాదుతున్నట్టు ఎడా పెడా ముంచి వేస్తున్నది వర్షం. కమ్ముకు వచ్చిన చీకట్లలో మెరుపులకు వర్షధారలు మెరుస్తున్నాయి. తీవ్రమైన ఆవేదనతో, సంఘర్షణతో దిగాలు పడి పోయి ఏ గత్యంతరమూ లేని ఖైదీలా వణికిపోతూన్న చేతిలో మద్య పాత్ర తీసుకొని ముందుకు వచ్చింది మాధవి. జీవితంలోని ఎన్నో అఘాత విఘాతాల్ని కేవలం అభిమానంతో ఎదుర్కొంటూ ఎంతో అలసిపోయిన దానిలా కనిపిస్తున్నదామె. ఆ అలసట అంతా ఆమె ముఖంలో వుట్టి పడుతూన్నది. రాజ్యధికారి ముందు, ఒక్కసారి ఆమె వైపు ఎంతో వాడిగా, పరిశీలనగా పరికించి చూచి మరుక్షణంలో ఎంతో ప్రేమను ఒలకబోస్తూ ముందుకు జరిగాడు. ఆమె చేతిని గట్టిగా ఒత్తుతూ తన బాహువుల్లోకి లాక్కున్నాడు. తను కొద్దిగా ఒంగి, ఆమె చేతిని కొంత పైకెత్తి మద్యం గటగట రెండు గుటకలు మింగి పాత్రను మాధవి పెదాలదగ్గర పెట్టాడు. విషపానం చేస్తున్నట్టు కళ్ళు మూసుకొని బలవంతంగా రెండు గుటకలు మింగింది మాధవి.

క్షణంలో పాత్ర ఖాళీచేసి మళ్ళీ నింపుకున్నాడతను. అది కూడా గటగటా తాగివేసి మళ్ళీ నింపి మాధవి నోటికి అందించాడు. పట్టుబట్టి ఆమెను కూడా త్రాగించి పాత్రను అవతలకు విసిరేసి ఆమెను లాగి గట్టిగా కౌగలించుకున్నాడు. తల ఎత్తి అతనివైపు చూడలేక పోతూన్నది మాధవి. ముఖం ప్రక్కకు తిప్పుకొని కళ్ళు మూసుకుంది. మూసుకొని ఉన్న

ఆమె కన్నుల్ని గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు రాజ్యాధికారి. ఎదుటి గవాక్షం నుండి బైటి దృశ్యాన్ని చూపుతూ "ఆ ఆకాశాన్ని చూడు, దాని పౌరుషాన్ని చూడు మాధవీ! భూమిని ఎలా నలిపివేస్తున్నదో" అన్నాడు. అతని చేయి ఆమె వక్షస్థలం మీద వజ్ర ప్రహారాలు చేస్తూన్నది. విధిలేక నవ్వింది మాధవి. తన ప్రాణానికి కవచం లాంటి వాడైన రాజ్యాధికారిని సంతోషపెట్టక తప్పడం లేదామెకు. మరి మార్గాంతరం లేదు. ఆ తరువాత మళ్ళీ అన్న పానాదులు మొదలయ్యాయి. క్రమేపీ తన శరీరం మీది అధికారాన్ని పోగొట్టుకుంటూన్నది మాధవి.

వర్షం క్రమేపీ తీవ్రమవుతూనే వుంది. ఎక్కడో పిడుగు పడిందిలావుంది. మేఘాలు భయంకరంగా గర్జించాయి. భూమి, రాజ్యాధికారి చిత్రశాల, పట్టుపాన్పు, మాధవి శరీరంలోని అణువణువూ గడ గడలాడాయి. ప్రాణం మీది వ్యామోహంతో దానికంటే గొప్పదయిన స్వేచ్ఛను కోల్పోయి సిగ్గు లేనిదానిలా ఆ పాన్పుమీదే పడివుంది మాధవి. ఆమె జీవితంలోని నూతన పురుషుడూ ఆమెలాగే అర్ధనగ్నంగా ఎదుట నిలబడి ఎత్తిన పాత్ర దింపకుండా తాగుతూ పోతున్నాడు.

మళ్ళీ ఆకాశం ఉరిమింది. క్షణం చిత్రశాల కాంతితో నిండిపోయింది. కళ్ళు మూసుకుంది మాధవి. అప్పుడే ఆమె మెడ గట్టిగా పట్టుకొని పైకి ఎత్తి మధ్య పాత్ర ముఖం దగ్గర పెట్టాడు రాజ్యధికారి. అలాగే కళ్ళు మూసుకొని నెమ్మదిగా చేదు గుటకలు మింగుతూ పోయింది. ఆ మధువు విషంలా ఆమె హృదయాన్ని రక్తనాడుల్ని బద్దలు కొడుతూ చిత్రవధ చేస్తున్నట్లుంది ఆమెకు. "అయిపోయింది. అంతా అయిపోయింది. నీ అహంకారానికి, నీకు జరగవలసిన శాస్తి జరిగింది. ఓ! కళ్యాణ మంజీరాల ఉన్మాదమా? చావు. చచ్చిపో. ఓ! పతివ్రతా శిరోమణీ చావు." తల తిరిగిపోతున్నది. ఆ మైకంలో తను పట్టుబట్టి జరిపించుకున్న వివాహం కళ్ళ ముందుకు వస్తున్నది మాధవికి. యజ్ఞగుండం భగభగ మండుతున్నది. పురోహితుడి మంత్రాలు మారు మ్రోగుతున్నాయి. తను కోవలన్‌తో ప్రదక్షిణాలు చేస్తున్నది. ఆ సప్తపది, ఆ యజ్ఞగుండం ఎప్పుడూ తన గుండెల్లో భగభగ మండుతూనే వున్నది. కాని ఇప్పుడో భయం ఆ అగ్నిని చల్లార్చి వేసింది. భయంకరంగా ఉరిమింది. మళ్ళా ఎక్కడో పిడుగు పడింది. అది తన మీదే పడ్డట్లు అనిపించింది. గట్టిగా కళ్ళు మూసుకుంది మాధవి.

ఎంతసేపటికీ ఆ వర్షం అలా పెరుగుతూనే పోతూన్నది. నగరం పుట్టిన తరువాత ఎప్పుడూ ఇటువంటి ఉత్పాతం ఎరుగదు. ఆకాశం మీద మెరుపులు సర్పాల్లా దౌడు తీస్తున్నాయి. భయంకరమైన ఆ ధ్వనికి భూమి ఎగిరిపోతున్నట్లు అనిపిస్తూన్నది. ఆ

మెరుపులకు, గర్జనలకు ఎడా తెరిపీ లేవు. దిక్కులు దద్దరిల్లి పోతున్నాయి. వర్ష ధారలు పదును పెట్టిన ఈటెల్లాగా భూమిని కోసివేస్తూ వుంటే శీతగాలి బోయ్‌మంటూ గుండెల్ని దూసుకుపోతూన్నది.

ఇద్దరూ దుస్తులు సవరించుకొని కూర్చున్నాక తను ద్వారం దగ్గరకు వెళ్ళి దాసీని పిలిచి ఏదో ఆదేశించాడు రాజ్యాధికారి. దాసీ ప్రణామం చేసి వెళ్ళిపోయింది. ఇంకొక దాసీని పిలిచి మద్యమూ మృష్టాన్నమూ సిద్ధం చేయమని ఆజ్ఞాపించాడు. క్షణంలోపెద్ద పళ్ళెంలో భోజన పదార్థాలు అన్నీ అమర్చుకొని ఒక పెద్ద చషకమూ, మద్య పాత్ర తీసికొని సిద్ధమయింది దాసీ, అన్నీ ముందు అమర్చిపెట్టి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన కొంత సేపటికి మొదటి దాసీ పైడి ముద్రల పట్టుసంచీ ఒకటి తెచ్చి యజమాని పీఠం ప్రక్కని వుంచి ప్రణామం చేసి నిలుచుని "తమ ఆజ్ఞానుసారం నగరాధికారి బైట వేచి ఉన్నారు స్వామీ!" అంది.

"లోపలికి పంపించు."

నగరాధికారి లోపలికి వచ్చి ప్రణామం చేశాడు.

"నగర సమాచారం ఏమయినా అందిందా?"

"అందింది ప్రభూ! ప్రజల కష్ట నష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి నగరంలో పురాతనమైన భవంతులన్నీ పడిపోతున్నాయి. సముద్ర తీరం మీద చేసిన అలంకారాలన్నీ ధ్వంసమైపోయాయి. వరద బాధితుల కుటీరాలన్నీ కొట్టుకుపోయాయి. జనం ఎందరు ప్రవాహంలో కలిసిపోయారో ఇంకా లెక్క తేలలేదు. సముద్రం భయంకరంగా లోపలకు చొచ్చుకు వస్తూన్నది. ఇటువంటి తుఫాను, ఇటువంటి ఉరుములు, మెరుపులు పుట్టి పెరిగి తామెప్పుడూ ఎరుగమని నగర వృద్ధులు అంటున్నారు."

"కాని నన్ను చూడండి నగరాధికారీ! ఈ ప్రకృతి బీభత్సమే నాకు మదనోత్సవమై పోయింది. మీ నగరవేశ్యలు నెరజాణలని లోగడ విన్నాను. ఇప్పుడు కళ్ళారా చూచాను. నిజంగా అసమర్థులకు వీళ్ళు మృత్యువులాంటి వారు. సమర్థులకు అలసటను, తాపాన్ని పోగొట్టే మూర్తీభవించిన ఆనందోత్సాహాలు. వీళ్ళు నిజమైన వేదాంతుల్లాగా తమ సొంత వ్యామోహాల్నీ, శోకాల్నీ మరచిపోయి తమ కళాచాతుర్యంతో ఇతరులకు ఆనందాన్ని కలిగిస్తుంటారు. అవునా మాధవీ."

ఈ తియ్యని తాపుకు తల్లడిల్లిపోయింది మాధవి. భూమి బ్రద్ధలైపోయి తను అందులో లీనమైపోతే బాగుండుననిపించింది. పాలిపోయిన ముఖాన్ని నేలకువాల్చి గట్టిగా కళ్ళు మూసుకుంది. అప్పుడే పైడిముద్రల పట్టు సంచీ వచ్చి గల్లుమంటూ ఆమె పాన్పు మీద పడింది. రాజ్యాధికారి కటుస్వరం వినిపిస్తూన్నది.

"నగరాధికారీ వర్షం తగ్గగానే ఈ వారకాంతను ఆమె భవంతికి చేర్చండి. జాగ్రత్త. ఇప్పుడీమె నా రక్షిత. రేపు రాత్రి కూడా ఈమె ఇక్కడికి వస్తుంది. ఈమె కాదు. ఈసారి ఈమె నృత్యమంజీరాలు కూడా వస్తాయి. అంతేకాదు. ఇకముందు ఎన్నడూ ఈ నృత్య మంజీరాలు కళ్యాణ మంజీరాలవాలని పట్టుబట్టడమనేది జరుగదు. ఏం ఇంకా ఇతరుల మాంగల్యం మీద ఆశపడ్తావా? మాధవీ."

భయంకరమైన సర్పమేదో పడగెత్తి కాటువేసినట్లు మూర్ఛలో మునిగిపోయింది మాధవి. మళ్ళీ రాజ్యాధికారి గొంతు వినిపించింది. "ఇక మీదట ఏ వేశ్యా దాన ధర్మాల్ని వర్తక వాణిజ్యాల్ని అడ్డం పెట్టుకొని నగర కుల వధువుల్ని పీడించగూడదు నగరాధికారీ! అటువంటి దేదైనా జరిగినట్లు విన్నానో! మీ నగర వేశ్యాశిరోమణి ఈ మాధవిని పట్టపగలు నగర రాజవీధిలో పాటకజనం ముందు నాట్యం చేయిస్తాను తెలుసా?" అంటూ లేచి నిలుచొని "ధైర్యసాహసాలున్న ఇద్దరు సేవకుల్ని సిద్ధం చెయ్యండి నగర స్థితి గతులెలా వున్నాయో ఒకసారి వెళ్ళి చూడాలనుకుంటున్నాను" అన్నాడు.

నగరాధికారి చేతులు జోడించి "ఇప్పుడా ప్రభూ! బైట నేలమీద కాళ్ళు ఆనేటట్లులేవు. పిడుగులు, కూలుతోన్న భవంతులతో మార్గం ప్రమాద భూయిష్టంగా వుంది" అన్నాడు.

"మరేం భయంలేదు. రాచకార్యంలో ప్రాణాలు పోయినా మంచిదే. కర్తవ్య పాలన ప్రాణాలకంటే గొప్పది."

నగరాధికారి మళ్ళీ చేతులుజోడించి బైటికి వెళ్ళిపోయాడు. మళ్ళీ అన్నాడు రాజ్యాధికారి; "ఇక ఈ నగరంలో మహారాజు ఆదేశించిన పనులన్నీ పూర్తిచేశాను. నాగ లోకంతో పోటీ పడుతున్న నక్కలకు వాటి నిజస్థితేమిటో గూడ తెలియజెప్పాను. అహ! హ! నీకు దండన ఇదే మాధవీ! వెళ్తూ "మహారాజు ఇచ్చిన ఆదేశమేమిటో తెలిసే వుంటుంది నీకు. కులవధువుల ప్రతిష్ఠని కాపాడేందుకని నగర వధువుల అవసరం ఎప్పుడూ వుంటూనే వుంటుంది. నగర వధువులకు వాళ్ళ ధర్మమేమిటో వాళ్ళకు తెలిసేటట్టు చేయించండి చాలు, అన్నారాయన. మహారాజు ధర్మమూర్తి."

తలవంచుకొని అంతా వింటూకూర్చున్నది మాధవి. చివరకు వెక్కిళ్ళు పడుతున్న కంఠస్వరాన్ని అదుపులోకి తెచ్చుకొని, "నాదొక ప్రార్థన" అంది చేతులు జోడించి. "నా కూతురు మణిమేఖలను వర్షం ఆగిపోగానే కణ్ణకి దగ్గరకు పంపండి."

"అలాగే జరుగుతుంది" అనుకుంటూ రాజ్యాధికారి ఆ వర్షంలోనే గబగబా బైటికి వెళ్ళిపోయాడు. మాధవి బైట భీభత్సాన్ని చూస్తూ అలాగే నిలబడి పోయింది. ఇప్పుడు ఆమె లోలోపల గూడుకట్టుకొని ఉన్న భయాలన్నీ ఎగిరిపోయాయి. మణిని కణ్ణకి చేతుల్లో

పెట్టవలసిందిగా కోరి మాతృత్వ బాధ్యత నుండి కూడా విముక్తి పొందింది. ఇంతకాలం ప్రాణప్రదంగా భద్రపరుచుకుంటూ వచ్చిన శీలమూ సతీత్వమూ బలవంతంగా చంపబడి ఇప్పుడు కేవలం వేశ్యగా మాత్రమే మిగిలిపోయింది తను. తనకిక ఏ విధమైన ఊహాపోహలు, తటపటాయింపులు లేవు. తను ఇక సతికాదు, వృత్తి వేశ్య మాత్రమే. అయినా చావదు తను. ఎందుకు చచ్చిపోవాలి? వయస్సు ఉన్నది. అందచందాలున్నాయి. శరీరపొంకం వున్నది. వాటిమీద వ్యామోహం వున్నది. కోరికలు వున్నాయి... ఓ నాలోని సతీ! చచ్చిపో. ఇంతకాలమూ నన్ను పట్టి పిండి వేసిన వంచకీ! చావు. ఓ మణిని కన్నతల్లీ చావు. శరీరమా! రూపమా! అందచందాల్లారా! బ్రతకండి. వేశ్యాశిరోమణి మాధవీ చిరంజీవికా!"

వర్షం పెరిగిపోతూనే ఉన్నది. పెద్ద పెద్ద సింహద్వారాల మధ్య శిథిలమైన భవంతుల మీదుగా ప్రవాహాలు పిచ్చిగా పరుగెత్తుతున్నాయి. వాటివేగానికి నేల తెగి అనేక చోట్ల పెద్ద పెద్ద సుడిగుండాలు ఏర్పడ్డాయి. కొట్టుకుపోతూన్న పశువులు, ఏనుగులు, గుర్రాలు, మనుష్యుల శరీరాలు భవన శిథిలాలకు ఢీకొని ముక్కలు, ముక్కలు అయిపోతున్నాయి. ఎటు చూచినా హాహాకారం, రోదన, భయంకర ఘీత్కారాలు క్రమేపీ పెరుగుతూనే పోతున్నాయి.

హఠాత్తుగా భూమి కంపించింది, భూకంపం భూకంపం ఉప్పెన అన్న గగ్గోలు వినిపించింది. ఆరిపోయే దీపశిఖలాగాపెద్ద పెద్ద భవంతులు వణుకుతూ కుప్పకూలి పోతున్నాయి. మనుష్యుల ఆర్తనాదం ప్రకృతి బీభత్సాన్ని కూడా చీల్చుకొని దూరదూరాల వరకూ వ్యాపించింది. అగాధమైన ఆ జలప్రవాహంలో అయిదారు అంతస్తుల మేడలు కూడా మునిగి కేవలం అట్టాలికల చివరలు మాత్రమే కనిపిస్తున్నాయి.

భూకంపం మళ్ళీ ఒక తెర వచ్చింది, ఇప్పుడు నగరంలో శిథిలం కాకుండా ఏమీ మిగలలేదు. రాజభవనాల ద్వారాలు, సింహద్వారాలు కూడా పగుళ్ళు వారి పడిపోయాయి చిత్రశాల కుప్పకూలి పోయింది. రెండు గోడలు కూడా పడిపోయాయి. బంగారు పట్టెమంచం, పూలపాన్పు శిథిలమైన భాగంతో పాటు ఎప్పుడో కొట్టుకు పోయింది. ఒక స్తంభాన్ని గట్టిగా కౌగిలించుకొని గాలి ఊపులను తట్టుకుంటూ నిలుచుంది మాధవి. గవాక్షం నుండి కొడుతూన్న జడికి కప్పు కూలిన భాగంలో కురుస్తూన్న వర్షానికి పూర్తిగా తడిసిపోయింది. కూలిపోయిన భాగం మీదుగా లోపలికి ఎక్కి వస్తూన్న ప్రవాహాన్ని చూస్తూ వణుకుతూ నిలుచుంది.

ఇంకా ఇంకా వర్షం పెరిగిపోతూనే వుంది. చినుకులు పదునైన ఈటెల్లాగా మాధవి శరీరాన్ని ముంచివేస్తున్నాయి. అయినా భయం లేదు మరణ భీతి ఏనాడో తొలగిపోయింది. సంఘర్షణ పడి పడి చైతన్యం ఓడిపోయింది, ఓ మరణమా! రా! కౌగిలించుకో అంది. ఆమె కను కొనల్లో రెండు అశ్రుబిందువులు నిలిచాయి. మణిమేఖల ముద్దురూపం కన్నుల ముందు నిలిచింది. గుంపులో ఆవేశంతో, ఆయాసంతో, దెబ్బలతో, రక్తం కక్కుతూన్న కోవలన్ కళ్ళముందుకు వచ్చాడు. చాలా కాలం క్రితం ఒక అర్ధరాత్రి అది కణ్ణకి తొలిరాత్రి తన ముందు నిలబడి "నీపట్ల నాకు ద్వేషం లేదు సోదరీ." అంటున్నది కణ్ణకి.

రాతి స్తంభాన్ని మరింత గట్టిగా కౌగలించుకుంది మాధవి. బయట ప్రపంచం నుండి కళ్ళు మూసుకుంది. అంతా పోయింది. భయమూ, శోకమూ, మోహమూ, మమతా ఏవీ మిగిలిలేవు. అన్నీ పోయాయి. ఆమె గుండె వేగంగా కొట్టుకుంటూన్నది. ఆమె గుండె చప్పుడు ఆమెకే ఎంతో పెద్దగా, స్పష్టంగా వినిపిస్తూన్నది. ఈ ఉరుములు, ఈ మెరుపులు అంతా అందులోనే లీనమైపోయినట్లు తన గుండె చప్పుళ్ళే ఉరుములుగా మెరుపులుగా బీభత్సంగా మారి బ్రహ్మాండమంతా నిండిపోయినట్లు అనిపిస్తూన్నది మాధవికి. మృత్యువు జలరూపంలో వచ్చి ఆమె పాదాలు తాకింది. ఆమె మనస్సు ఏనాడో మునిగిపోయింది. ఇప్పుడు శరీరం క్రమంగా మునిగిపోతూన్నది.

## 31

మధుర వెళ్ళే మార్గం మీద ఒక పల్లెలో కోవలన్ కణ్ణకీ సత్రంలో బసచేశారు. కణ్ణకికి కొద్దిరోజులుగా జ్వరం వస్తూన్నది. గ్రామ వైద్యుడు వచ్చి ఔషధం వాడి వెళ్ళాక స్వస్థత అయితే చేకూరింది కాని బలహీనత మాత్రం అలాగే ఉండిపోయింది.

ప్రొద్దుగూకుతున్నది. మళ్ళీ క్రొత్తగా యాత్రీకుల జట్టు ఒకటి వచ్చి దిగింది. ప్రయాణీకులు మీరు, మీరంటూ పరిచయాలు చేసుకుంటున్నారు.

"ఇక్కడ ఎక్కడయినా వెచ్చాలు అమ్మే అంగడి ఉందా బాబు?"

"గ్రామస్థులు మంచివారేనా? దస్యుల భయం కాని, దొంగల తాకిడికాని లేదు కదా?"

"చిత్తం. ఎక్కడ్నుంచి తమరు రావడం?"

"కావేరీ పట్టణం పరిసరాలనుంచేనా! ఆc దాని పరిస్థితి ఎలా ఉందో కాస్త చెప్పరూ?"

"ఇంకా ఎక్కడి కావేరీ పట్నమండీ స్వామీ! ఆ మాట పూర్తిగా మరచిపొండికను. ఏనాడో సముద్ర గర్భంలో కలిసిపోయింది. పుట్టి పెరిగి ఎప్పుడూ ఎరుగని ఉప్పెన

ముంచుకు వచ్చింది. రాజసౌధాల వరకూ సముద్రం చొచ్చుకుపోయింది. ఇసుక వేస్తే రాలని రాజవీధులు, అంగళ్ళు, ఏడేడు అంతస్తుల మిద్దెలు అన్నీ శాశ్వతంగా సముద్రంలో లీనమయిపోయాయి. జనం కుప్పలు కుప్పలుగా జలప్రళయానికి ఆహుతై పోయారు. ఎవరో కొందరు పసిపిల్లలు, స్త్రీలు, బౌద్ధ భిక్షుల దృష్టిలో పడ్డవాళ్ళు మాత్రం మిగిలారు.

పిడుగుపాటులాంటి ఈ సమాచారం విని మ్రాన్పడిపోయాడు కోవలన్. హృదయం రెండు చేతులతోనూ పట్టుకొని అలాగే కూర్చుండిపోయాడు. ఆ ప్రయాణీకుల సంభాషణలో తమ కథ కూడా చర్చకు వస్తూన్నది. కోవలన్, కణ్ణకి, మాధవి అంటూ ఏమిటేమిటో వింతగా చెప్పుకుంటున్నారు. మణిమేఖలను ప్రవాహంలో కొట్టుకు పోతూ వుండడం చూచి ఎవరో బౌద్ధ భిక్షువు కాపాడాడట. కాని మాధవి ఏమయిందీ ఆచూకీలేదు.

'ఏమి వింటున్నాను దేవుడా' అంటూ ఒక నిట్టూర్పు విడిచాడు కోవలన్. ప్రయాణమయి వచ్చేటప్పుడు కణ్ణకి అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి. పుట్టి పెరిగి మహా వైభవాన్ని అనుభవించిన నగరాన్ని విడిచి వచ్చేటప్పుడు ఆమె కన్నులు కాల్వలు కట్టాయి. "ఇక ఈ భూమాతను చూడడం ఇదే చివరి సారేమో. దీనికీ, నాకు ఋణం తీరిపోయిందిక" అంటూ ఆమె చెక్కిళ్ళు తడిసిపోయాయి. ఆమెను దగ్గరకు తీసుకొని సముదాయించాడు తను. "ఏం మాటలవి కణ్ణకీ! భగవంతుడి అనుగ్రహం వల్ల పరిస్థితి కాస్త కుదురుకోగానే తిరిగి రామా?" అన్నాడు. కాని ఇంతట్లోనే ఇటువంటి ప్రళయం ముంచుకు వస్తుందని ఎవరు మాత్రం ఎలా అనుకోగలరు?

❊ ❊ ❊

వెంట తెచ్చిన ప్రయాణ ఖర్చు కాస్తా కణ్ణకి జబ్బు కారణంగా మధ్యదారిలోనే అయిపోయింది. మరి ముందుకు సాగడం ఎలాగా అని ఆలోచనలో పడ్డాడు కోవలన్. అయితే అన్ని ఆలోచనల్ని, అలసటనీ, తాపాన్నీ తియ్యని కబుర్లలోనే ఎగరగొట్టి వేస్తూన్నది కణ్ణకి. తన చల్లని చిరునవ్వుతోనే అతనికి ఎంతో ఉత్సాహాన్నిచ్చి ముందుకు లాక్కుపోతూన్నది. రథం కుదుర్చుకోవడానికి కూడా డబ్బు మిగలక పోయినా ఆ ఉత్సాహం కారణంగానే మజిలీలు మజిలీలుగా కాలినడకని ప్రయాణం చేస్తూ ఇద్దరూ మధుర చేరుకొన్నారు.

నగర ధర్మశాలలో బస కుదుర్చుకొని ప్రయాణపు బడలిక తీర్చుకున్నారో లేదో మీనాక్షి దేవిని దర్శించడానికి వెళ్దాం పదండంటూ తొందర పెట్టసాగింది కణ్ణకి. ఇద్దరూ శిర స్నానాలు చేసి మందిరానికి బైలుదేరారు. అక్కడే మధుర మహారాణికి జగత్ప్రసిద్ధమైన కళ్యాణ మంజీరాలను తయారుచేసిన కుప్పుస్వామిని గురించి కూడా వాకబు చేసి అన్ని

వివరాలు తెలుసుకున్నాడు కోవలన్. మరునాడు ఉదయాన్నే కాలకృత్యాలు తీర్చుకొని కుప్పుస్వామి దగ్గరకు బైలుదేరాడు.

కోవలన్ దరిద్రస్థితి చూచి కుప్పుస్వామి వెంటనే అతన్ని పోలిక పట్టలేక పోయాడు. అందునా ఇప్పుడతను కూడా తీరని దుఃఖంలో మునిగి తేలుతున్నాడేమో ముందు కొంచెం చీదరింపుగా మాట్లాడాడు. కాని పూర్వాపరాలన్నీ తెలుసుకొని గుర్తించి ఆదరంగా కూచోబెట్టాడు.

ఈ కమసాలి కుప్పుస్వామి దక్షిణ భారత మంతటికీ పేరుమోసిన స్వర్ణ శిల్పి. అయితే ఇతగాడు కొద్ది రోజుల క్రితం ఒక మహాపరాధం చేసి కూర్చున్నాడు. ఏదో మరమ్మత్తు కోసమనీ పంపిన పాండ్యరాణి కళ్యాణ మంజీరాల్లో ఒకదాన్ని ఇతడూ మరికొందరు రాజ్యాధికారులూ ధనలోభానికి లొంగిపోయి కరగబోసి అమ్ముకున్నారు. మిగిలిన ఒక మంజీరాన్ని ఏడుస్తూ వెళ్ళి మహారాణికి ఒప్పచెప్పి, ఒకటి అపహరింపబడిందని, ఒక మాసం లోపులోనే దొంగనిపట్టి అప్పగిస్తామనీ బొంకి అప్పటికెలాగో ప్రాణాలు దక్కించుకున్నారు. కాని మహారాణి మాత్రం అంతటితో సమాధానపడి ఊరుకోలేదు. వ్యవధిలోపల దొంగని మంజీరంతో సహా పట్టి అప్పగించక పోతే ఉరిశిక్ష తప్పదని హెచ్చరించింది. ఇది నగర రక్షక దళానికి కూడా సంబంధించిన సమస్య గనుక మంజీరాన్ని కాజేసిన దొంగ పారిపోకుండా నగర ప్రవేశ ద్వారాలు అన్నిటిమీదా గట్టి కాపలా ఏర్పాటు చేయించవలసిందనీ, వ్యవధిలోపల దొంగ ఆచూకీ తీసి శిక్ష విధించని పక్షంలో దళాధికారులకు కూడా ఉరిశిక్ష తప్పదని ఆదేశాలు వచ్చాయి.

రక్షక దళం అధికారులు రోజూ వచ్చి అటువంటిదే మరొక మంజీరాన్ని తయారుచేసి మహారాణికి అప్పగించవలసిందనీ, లేని తీరుకు కుప్పుస్వామినే దొంగగా పట్టి చూపించవలసి వస్తుందనీ హెచ్చరికలు చేసి వెళ్తున్నారు.

దీనితో బాగా ఇరుకులో పడిపోయాడు కుప్పుస్వామి. కుట్రలో పెద్ద పెద్ద రాజ్యాధికారులకు కూడా పొత్తు వుంది కనుక, ఇంతగా పీకెలమీదికి వస్తుందని ముందు వూహించలేక పోయాడు. మంజీరాన్ని అమ్మినప్పుడు తామంటే తామని ముందుకు వచ్చి భాగాలైతే పంచుకున్నారు కాని ఇప్పుడు ఎవ్వరూ ముందుకు వచ్చిన పాపాన పోవడం లేదు. పోనీ అటువంటిదే మంజీరం క్రొత్తగా తయారు చేద్దామా అంటే ఏడెనిమిది లక్షలదాకా అవుతాయి. దొంగసొత్తు లక్షో, రెండులక్షలో పంచుకొని దానికోసమని జీవిత సంపాదన అంతా ఎదురు పెట్టడానికి ఏ మాత్రం సిద్ధంగా లేడతను. అలా అని మరి చచ్చిపోవడానికీ మనసొప్పడం లేదు. ఈ చావు బ్రతుకుల మధ్య నలిగిపోతున్న కుప్పుస్వామికి మంజీరం

అమ్మడానికి వచ్చిన కోవలన్‌ని చూచి ప్రాణాలు లేచివచ్చాయి. అప్పటికప్పుడు అతని బుఱ్ఱలో అద్భుతమైన ఆలోచన కొట్టుకు వచ్చింది. ఇప్పుడే వస్తానని కోవలన్‌ని అక్కడే కూచోబెట్టి మంజీరం తీసుకొని రాజాంతఃపురానికి పరుగెత్తాడు.

☼ ☼ ☼

కణ్ణకికి మనస్సు మనస్సులో లేదు. భర్త మంజీరం తీసుకొని వెళ్ళి ఎంతో సమయమయింది. ఇంత జాగు ఎందుకు చేశారో ఆయన. ఒకవేళ సమయానికి ఆ కుప్పుస్వామి లేడేమో, అతని కోసం వేచి వున్నారేమో అనుకొని కొంతసేపు సరిపెట్టుకుంది. కాని ఎంతకూ మరి ఆయన జాడ లేకపోవడంతో తత్తరలాడుతూ సత్రశాల కోష్టం అంతా నిరుద్దేశంగా తిరిగింది. తిరుగుతూనే వుండిపోయింది. ఎందువల్లనో ఆమెకు ఒకచోట కాలు నిలువడం లేదు. ఏదో భయం, దుఃఖం అంతరాళం నుండి పొంగి వచ్చి శరీరం తీగలా వణికిపోతూన్నది. వుండి వుండి కారణ రహితంగానే కళ్ళు నిండివస్తున్నాయి. ఏది ఏమయినా అంతా నీదే భారం తల్లీ అంటూ మీనాక్షీదేవిని మనసారా ధ్యానించుకుంది.

బైట క్రమేపీ సంధ్య జారిపోతూన్నది. చీకట్లు భయం భయంగా రెక్కలు విప్పి లోకాన్ని పొదవుకుంటున్నాయి. చీకట్లు విప్పుకుంటూన్న కొద్దీ ఆమె మనస్సులో గూడు కట్టుకున్న భయం కూడా నీడలు నీడలుగా ప్రాకుతూన్నది. ఆ రాత్రి అంతా ఆమె కన్నుల్లో అలాగే నిలిచిపోయింది. ఆ చీకటి రాయిలాగా ఆమె గుండెల మీద నిలబడిపోయింది. తెల్లవారుఝామున తోటి ప్రయాణీకుల్లో, రకరకాలుగా వ్యాపించిన సమాచారం లీలామాత్రంగా వినిపించి ఒక్క ఉదుటున ఆ మాట్లాడుకుంటున్న జట్టు దగ్గరకి పరుగెత్తింది. "ఎవరో దొంగ వెధవ కావేరీ పట్టణం నుంచీ వచ్చాడట! కుప్పుస్వామి అంగడిలో మహారాణి మంజీరం ఎత్తుకొని పారిపోతుంటే పట్టుకుని ఉరిశిక్ష వేశారట" ఆ పైని మరి ఏమీ వినలేక పోయింది కణ్ణకి. అప్రయత్నంగానే ఆమె నోటినుండి ఓ పెద్ద కేక వెలువడింది. సందేహమూ, బిడియమూ విడిచిపెట్టి అప్పటికప్పుడు తనవద్ద మిగిలిన రెండవ మంజీరాన్ని తీసుకొని ఒక్క ఉదుటున వీధిలోకి పరుగెత్తింది.

☼ ☼ ☼

దండధరులు, నగరకూడళ్ళు, శృంగాటకాలు అన్నిటి వద్ద కోవలన్ని నిలబెట్టి కొరడాలతో కొడ్తూ మహారాణి మంజీరాన్ని అపహరించిన అపరాధిగా ప్రకటించారు. ప్రతిచోటా చుట్టూ మూగిన జనం, గేలిచేస్తూ, చప్పట్లు చరచి అతనిపట్ల అసహ్యాన్ని జుగుప్సను వ్యక్తం చేశాక కొరడాలు ఝుళిపిస్తూ పశువులాగా అతన్ని ఈడ్చుకొని ముందుకు నడిచారు. రాయిలాగా అన్నిటినీ సహిస్తూ మౌనం వహించాడు కోవలన్. ఇటీవల

చాలాకాలంగా అతను ఎన్నో కష్ట నష్టాలను సహిస్తూ దుఃఖాలకు ఎదురీది, ఈది ఒక విధంగా వాటిపట్ల ఉదాసీనతను అలవర్చుకొని వున్నాడు. అందుకని ఇప్పుడీ అఘాయిత్యానికి స్తంభించి పోయినట్లు కనిపిస్తున్నా లోలోపల అతని ఆలోచన పనిచేస్తూనే వుంది. దెబ్బలు, అవమానం, భయం వీటిమధ్య అతని మనస్సు బురదలో తామరలాగా లేచి ఈ జీవితపు అంగడి ఎత్తివేసే ముందు చతురుడైన కోమటిలాగే లాభనష్టాలు బేరీజు వేసుకుంటూన్నది. ఏమి వచ్చింది? ఏమిపోయింది? లాభలబ్ధాలేమిటి? అన్నీ పోగా లాభంలో తనకు ఒక కణ్ణకి మిగిలింది. తన సుఖ దుఃఖాలను ఏ మాత్రం లెక్క చెయ్యకుండా ప్రేమ కోసం, పత్నీత్వ గౌరవం కోసం ప్రాణాల్ని అర్పించే కణ్ణకి. ఆ పెట్టుబడితోనే జీవితంలో తిరిగి పైకి రావాలని చూశాడు తను. కాని విధి మరొకలా సంకల్పించింది.

దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచాడు కోవలన్. అతనికి మళ్ళీ శరీరస్పృహ కలిగింది. వీపుమీద దండధరుని లాఠీలు మోగుతున్నాయి. అలగాజనం తిట్లూ, వెకిలింతలు వినిపిస్తూన్నాయి. తన శరీరం మీద తనకే జుగుప్స కలిగింది. అతనిని దొంగ, దొంగ అని కొడుతూన్న ప్రపంచం పట్ల నిర్లిప్తంగా కళ్ళు మూసుకోవాలని చూస్తున్నాడు. కాని మహాశ్రేష్ఠిగా ఎంతో ఉన్నతిని, పేరు ప్రఖ్యాతుల్ని పొంది అన్నిటిని రోసివేసిన అతని మనస్సును ఈ దొంగ అనే మాట నిలువునా కోసివేస్తూన్నది. తన పాపాలకు తనను ఎన్నో విధాల చిత్రహింసలకు గురిచేసిన విధి పైపెచ్చు దొంగను కూడా చేసి ఇలా ప్రపంచం ముందు ఎందుకు నిలబెట్టిందా అని కుమిలి పోతున్నాడు 'ఎందుకు? నాకీ కఠిన శిక్ష ఎందుకు? ఏ పాపానికి ప్రతిఫలంగా విధించావు ఈ ఉరిశిక్ష. పాపాత్ముల స్పర్శతో వాళ్ళు చేసే పుణ్యకార్యాలు కూడా మలినమూ, త్యాజ్యమూ అయిపోతాయా దేవుడా!'

ఈ ప్రశ్నల తీవ్రతతో ఎక్కడో మనస్సు గుహలోపల చైతన్యం మళ్ళీ వెలికి వచ్చింది. ఒక్క క్షణం అతనికి మళ్ళీ ఈ ప్రపంచస్పృహ కలిగింది. ఎవరో అంటున్నారు. "చూడడానికి ఎంతో సత్పురుషుడిలాగే కనిపిస్తున్నాడండీ, దొంగతనం చేశాడా ఛూ."

అవును నువ్వు దొంగవే అనుకున్నాడు కోవలన్. నువ్వు కర్మను, వివేకాన్ని అనేక పర్యాయాలు నీ చేతుల మీదుగా వురికంబ మెక్కించావు. ఇప్పుడిక దాని ఫలితాన్ని అనుభవించు, అనుభవించు నువ్వు కోమటి బిడ్డవు. ఒక జీవితం దివాళా తీసిందని నిరాశ పడిపోకు. చస్తూ చస్తూ కూడా నీ గొప్పతనాన్ని నిలుపుకొని మరీ చచ్చిపో. ఒక జన్మకాదు, అనేక జన్మల వ్యవధానం వుంది. కార్యశూరులకు పడిపోయినప్పుడల్లా పైకి తేలాలని ప్రయత్నించే వారికోసమని అవకాశాలు ఎదురు చూస్తుంటాయి.

చావబోయే సమయంలో కూడా ఆశ అనేది కొస మెరుపులు చూపడంతో తలపైకి ఎత్తి నాలుగువైపులా గమనించాడు కోవలన్. ఎదురుగా తాము బసచేసిన సత్రం ముఖద్వారం మీద దృష్టిపడింది. అతని పాదాలు అక్కడ తటాలున ఆగిపోయాయి. దండధరుడ్ని ఉద్దేశించి అన్నాడు "అయ్యా! ఇక్కడే నా భార్య ఉన్నది, చివరిసారి..."

"ముండమోసే కబురు. పాపం. ముందే ఎందుకయ్యా సెప్తావ్! బిడ్డా ఇక నీకీ లోకంతో పనిలేదు. ఇక ఉరికొయ్యే నీకు చుట్టం పెద్దల్ని తలుసుకోవయ్యా!"

దండధరుడి సమాధానంతో అతని గుండె కుమిలి పోయింది. అయినా చివరిసారి ప్రయాణం కోసమని ధైర్యాన్ని పోగుచేసుకున్నాడు. తలఎత్తి ముందుకు అడుగు వేశాడు. ఏనాటికైనా చావు అనేది తప్పనప్పుడు ఎప్పుడు చస్తే ఏమిటి? చావు తథ్యమే అయితే చివరి సమయంలో కూడా నా గొప్పను నిలుపుకొని మరీ చస్తాను. చచ్చిన తర్వాత నా నిర్దోషిత్వాన్ని తలచుకొని ఇప్పుడు నవ్వుతున్న వాళ్ళందరినీ కుళ్ళి కుళ్ళి ఏడ్చేటట్లు చేసి మరీ చస్తాను. ఈ మంచి చెడుల దౌర్భాగ్యగాథ అందరూ జీవితాంతం జ్ఞాపకం ఉంచుకునేటట్లు చేసి చస్తాను. రసరాజు కోవలన్ దివాళా తీసినా రసరాజే. పలుకులో, ప్రాణంలో శక్తి ఉన్నంతవరకూ జీవితంలోని అనుభూతుల్ని ఎంత ఉదాత్తంగా అనుభవించి, ఎంత ఉదాత్తంగా చచ్చిపోయాడో చూడండి, అని అందరూ చెప్పుకునేటట్టు చేసి చచ్చిపోతాను.

కోవలన్ అతి శాంతిగా ముందుకు సాగిపోయాడు.

* * *

క్షోభతో, భయంతో, ఆవేశంతో నగరం అంతా వెదకి వెదకి చివరకు గుంపును కలుసుకున్నది కణ్ణకి. రక్తసిక్తమైన శరీరంతో జనం మధ్య వున్న భర్తను చూచింది. గొలుసులతో బంధింపబడి వున్న అతని శరీరం మీద దండధరుల కొరడాలు మోగుతున్నాయి. ఆవేశంతో కణ్ణకి కళ్ళు నిప్పులు కురిసాయి. "ఆగండి" అంటూ పెద్దగా ఓ కేక వేసింది. ఎర్రగా కాల్చిన పలుగు గుండెలమీద అంటించబోతుండగా అసహాయురాలు చేసే ఆర్తనాదంలా ఆ చీత్కారం నాలుగు దిక్కులా ప్రతిధ్వనించింది. అలగాజనం కేరింతలు, అట్టహాసాలు చటుక్కున ఆగిపోయాయి.

"విడవండి నా భర్తను. ఆయన నిర్దోషి. ఆయన దొంగకారు దొంగతనం చేయలేదు" అంటూ జనాన్ని పాయలు పాయలుగా విడదీసుకొని ముందుకు నడిచింది. "పాండ్యరాజు అఘాయిత్యం నశించాలి. ఒక నిర్దోషికి దొంగతనం అంటగట్టి అన్యాయంగా ఉరిశిక్ష

విధించిన ఆయన న్యాయబుద్ధిని నేను ధిక్కరిస్తున్నాను. ఈ శిక్ష ఇలాగే కాని కొనసాగిందో పాండ్యరాణి కళ్యాణ మంజీరాలు శాశ్వతంగా ఆమెకు కాకుండా పోతాయి."

కణ్ణకి ముఖంలో ఒక విధమైన వింత తేజస్సు ఉట్టిపడుతున్నది. ఆగ్రహావేశంతో ఎఱ్ఱబారిన ఆమెకళ్ళు విస్ఫులింగాలు చిమ్ముతున్నాయి. అప్పటివరకు వికటాట్టహాసాలు చేస్తూన్న జనం ఆ తేజస్సును, భద్రకాళిలాగా వున్న ఆమె రౌద్రాకారాన్ని చూచి విభ్రాంతులై నిలుచున్నారు. ఎవరో ఒక అపరిచితురాలు ఇంతమంది ఎదుట తమ మహారాజును, మహారాణిని నిందిస్తూ వుండడం చూచి కొందరు లోలోపల ఆవేశపడుతున్నారు. కాని ఆమె రౌద్రరూపాన్ని చూచి ఎవరూ ముందుకు వచ్చే సాహసం చేయలేకపోతున్నారు. చివరకు ఒక వృద్ధశ్రేష్ఠి జనాన్ని ఒత్తిగించుకొని ముందుకు వచ్చి "తల్లీ నీవు మంచి కుటుంబీకురాలిగానే కనిపిస్తున్నావు కాని ఇక్కడి దానివి మాత్రం కావని తెలుస్తూనే వుంది. ఎక్కడ్నుంచి వచ్చావో! ధర్మ ప్రభువులైన పాండ్యరాజు న్యాయాన్నే నిందిస్తున్నావా అమ్మా?" అన్నాడు.

"పరమ ప్రతాపులైన చోళ మహారాజు పరిపాలించే కావేరీ పట్టణం మాది. నోరులేని ఒక ఆవుకు న్యాయాన్ని కలిగించడంకోసం కన్న కొడుకుకే మరణశిక్ష విధించిన ధర్మమూర్తి చోళ మహారాజు. విధి చెడి నా భర్తతో కూడా తలదాచుకుందామని మధుర వచ్చాను. కాని అక్రమంగా, అధర్మంగా తన సొత్తును తానే అపహరించినట్టు నిందమోపి మీ రాజు నిర్దోషికి ఇలా మరణశిక్ష విధిస్తారని ఊహించలేకపోయాను. ఇది అన్యాయం కాక, అక్రమం కాక మరేమవుతుందో చెప్పండి."

"నిజంగా మీ ప్రభువు ధర్మమూర్తే అయివుంటే పదండి మీ అందరి ఎదుట నా భర్త నిర్దోషిత్వాన్ని ఋజువు పరచుకుంటాను. కాని తీరుకు నేనూ ఉరికంబమెక్కుతాను. ఆయనతోపాటు నన్నూ చంపండి."

చుట్టూ మూగిన జనంలో కుతూహలం చెలరేగింది. కణ్ణకి కంఠస్వరంలోని ఏదో ప్రత్యేకత, జాలి, ఆవేదన వాళ్ళను ఆకట్టుకున్నాయి. దండధరులు ఎంత ప్రయత్నించినా కోవలన్‌ను మరి వధ్యభూమివైపు నడిపించలేక పోతున్నారు సరికదా, జన సమూహం కోవలన్‌తో సహా వాళ్ళను కూడా తోసుకుంటూ రాజసౌధం దారి పట్టింది. మధ్యలో విన్న వాళ్ళు విన్నట్టు వచ్చి గుంపులో చేరిపోతున్నారు. నిరపరాధిని రక్షించడానికి సాక్షాత్తూ మీనాక్షీ దేవీ ప్రత్యక్షమయిందన్న వదంతి కాస్తలో నగరం అంతా వ్యాపించింది. ఇళ్ళలో వున్న స్త్రీలు, పురుషులు, పిల్లా, పాపా నగరానికి నగరమే కదలి వస్తూన్నది. ఆ అపార

జనవాహినిని చూచి కుట్రతో, సంబంధం వున్న రాజ్యాధికారుల గుండెలు జారిపోయాయి. వాళ్ళు జనాన్ని ప్రాకారం ముఖ ద్వారం వరకూ రాకుండా అడ్డుకోలేకపోయారు.

ప్రాకారం సింహద్వారం ముందు అపారజన సందోహం కోలాహలం గమనించి అట్టాలిక మీద మహారాజే స్వయంగా దర్శనమిచ్చారు. మహారాజును చూచి సమ్మర్థం సద్దుమణిగింది. "ఇంత మంది మహాజనం రాజసౌధం ఎదుట సమావేశ మవడానికి కారణం తెలుసుకోవచ్చా?" మహారాజు గంభీర స్వరం నాలుగు దిక్కులా ప్రతిధ్వనించింది.

ప్రతి సమాధానంగా జనం కోవలన్‌ను, కణ్ణకినీ ముందుకు నెట్టారు. జనంలో కణ్ణకిపట్ల ఉన్న సానుభూతిని, ప్రజలలో మొలకెత్తిన ఉత్సాహావేశాలను గమనించి కోవలన్ కూడా ధైర్యాన్ని పుంజుకున్నాడు. గొంతెత్తి "రాజ శాసనం చేసిన అన్యాయం నుండి ఒక నిరపరాధి ప్రభువుల్ని రక్షణ కోరుతున్నాడు" అన్నాడు.

"మహారాణి కళ్యాణ మంజీరాన్ని అపహరించిన వాడికి మరణశిక్ష చట్టసమ్మతమే" మళ్ళీ మహారాజు స్వరం మారు మ్రోగింది.

"అన్యాయం మహారాజా! పూర్తిగా అన్యాయం" కణ్ణకి గొంతు జన సందోహం గుసగుసల్ని దాటి ఆకాశాన్ని చీల్చుకుంటూ పైకి వెళ్ళింది. "మహారాణి మంజీరాన్ని నా భర్త అపహరించలేదు. అటువంటి అవసరమూ లేదు. అంతటి మంజీరాలు మా వద్ద కూడా వున్నాయి. విధివక్రించి వాటిల్లోనే ఒకటి విక్రయించి నూతన జీవితాన్ని ప్రారంభించాలనే ఆశతో మేము మధుర వచ్చాము. కాని అవినీతిపరులైన అధికారులు ఉన్న రాజ్యంలో...."

కణ్ణకి మాట పూర్తవకుండానే మహారాజు కంఠస్వరం వినిపించింది. "ఆగు. వట్టి శుష్క ప్రియాల వల్ల ఫలితం లేదు అమ్మాయీ! ప్రమాణం కావాలి. తగిన ప్రమాణం ఏదయినా వుందా నీ వద్ద."

కణ్ణకి వెంటనే దుస్తుల మూట విప్పి రెండవ మంజీరాన్ని తీసి మహారాజుతో సహా ప్రజలందరి వైపు చూపుతూ "ఇదిగో ప్రమాణం చూడండి మహారాజా! ప్రజలారా మీరూ చూడండి. సత్యాన్ని నిరూపించడానికి ప్రమాణాల కొరతలేదు. అధర్మపరుల పాలనలో ఒక న్యాయానికి మాత్రమే లోటు వుండిపోతుంది. ఏ రాజ్యంలోనైతే, ఏ యుగంలో నయితే అధర్మపరులు; అవినీతి పరులు ఆదరించబడి ఉన్నత పదవుల్ని అలంకరిస్తారో తప్పనిసరిగా ఆ రాజ్యం, ఆ యుగం నశించి తీరుతాయి. నా జన్మభూమి వినాశనంతో నేను నేర్చుకున్న సత్యం ఇదే. నా వంటి దరిద్రురాలి మాటను వట్టి శుష్క ప్రియంగా భావించి కొట్టివేయవద్దని మీకు నేను మనవి చేస్తున్నాను. దరిద్రులు, అనాధుల గుండె

మంట ఒక నాటికి కావేరీ పట్టణంలాగే మీ నగరాన్ని కూడా భస్మం చేసి తీరుతుంది. నా మాట నమ్మండి."

"కట్టిపెట్టు నీ వాచాలత్వాన్ని"

పాండ్య మహారాణి కంఠస్వరం నాలుగు దిక్కులా ప్రతిధ్వనించింది. "సరయిన ప్రమాణం చూపకుండా ధర్మమూర్తులయిన ప్రభువుల వారిని దూషించడం నీ వాచాలత్వాన్ని సూచిస్తుంది తప్ప నిర్దోషిత్వాన్ని నిరూపించదు."

"ప్రమాణం వుంది మహారాణీ."

కణ్ణకి కంఠస్వరం భవన ప్రాంగణమంతా మారుమ్రోగింది. ఆమె కన్నులు నిప్పులు చెరుగుతున్నాయి. ఆమె శిరోజాలు చెదిరి నేలకు జీరాడుతున్నాయి. చేతిలో మంజీరంతో ఆమె ముందుకు సాగింది. భద్రకాళిలా వున్న ఆమె రూపాన్ని, ఆ తేజస్సును చూచి, రక్షకభటులు పక్కకు తప్పుకున్నారు. జనం సద్దుమణిగింది. ఆమె చేతిలో వున్న మంజీరాన్ని బలంగా నేలకు విసిరికొట్టింది. ఘల్లుమని మంజీరం రెండు ముక్కలయి మేలి ముత్యాలు రత్నకంబళం నిండా చెదిరిపడ్డాయి.

కణ్ణకి మరోమారు గర్జించింది.

"ఇదే ప్రమాణం మహారాణీ! మీ మంజీరాలలో మేలి ముత్యాలు లేవు. గులక రాళ్ళు వున్నాయి."

పాండ్య మహారాణి ముసి ముసిగా నవ్వింది. అయితే ఆగ్రహావేశంతో ఆమె వదనం ఎర్రబారింది. "సౌభాగ్య చిహ్నాలయిన మంజీరాలను కాలినుండి తీయడం అనాచారమే అయినా సత్య నిరూపణ కోసం ఈ పాండ్య మహారాణి దేనికీ వెనుకాడదు" అంటూ ఆమె తన కాలికి వున్న ఒక మంజీరాన్ని విప్పి కిందకు విసిరింది.

ఆశ్చర్యం, మంజీరం పగిలిపోయి దానిలో వున్న గులకరాళ్ళు చెదిరి పడ్డాయి. సభికులు కొయ్యబారిపోయారు. కొందరు మీనాక్షీదేవి! మీనాక్షీదేవి!! అంటూ ముందుకు వచ్చి కణ్ణకి ముందు సాగిలబడడం కూడా ప్రారంభించారు.

"పరమ పూజ్యులయిన మా మామగారు మహాశ్రేష్ఠిగారే నాకీ రహస్యం చెప్పారు, మహారాణీ! మహారాణి మంజీరాలను తయారు చేసిన స్వర్ణ శిల్పి తాగిన మైకంలో ఈ సంగతి వారితో చెప్పాడట."

మహారాజు, మహారాణి వెంటనే ఉప్పరిగ నుండి దిగివచ్చి కణ్ణకినీ, కోవలన్‌నూ రాజప్రాసాదం లోపలికి తీసుకొని వెళ్ళారు. కణ్ణకి చేతుల్లోంచి మంజీరాన్ని స్వయంగా

అందుకొని పరీక్షించి మహారాజు మహారాణి వారికి ఇచ్చారు. మహారాణి కూడా జాగ్రత్తగా పరిశీలించిన మీదట "మీకు జ్ఞాపకం వుందా మహారాణీ! కొన్ని సంవత్సరాలకు పూర్వం కావేరీ పట్టణంలో ఎవరో చెట్టియార్ కోడలి కోసమని కుప్పుస్వామి అచ్చం మీ మంజీరాల వంటివే తయారు చేశాడు."

"అవును. నాకూ కొద్దికొద్దిగా స్మృతికి వస్తూన్నది మహారాజా! నేను అభ్యర్థించిన మీదట ఒకసారి ప్రభువులు మహారాణి మంజీరాలకు ప్రతిరూపాలను ఎందుకు చేశావని కుప్పుస్వామిని తప్పుపట్టారు కూడా, అయితే ఇప్పుడు మీరు మహా సంపన్నుడయిన ఆ చెట్టియార్ కొడుకూ, కోడలూనా ఏమిటి?" మహారాణి ఆశ్చర్యాన్ని ప్రకటించారు.

కోవలన్ శిరస్సు వంచుకున్నాడు. ఆపైన సిగ్గూ, బాధా ముప్పిరి గొంటూన్న కళ్ళతో అందరివైపూ చూచి తన దురదృష్టగాథ మొదలు పెట్టాడు.

కావేరీ పట్టణం జల ప్రళయానికి సంబంధించిన వృత్తాంతం అంతా విని "అవును మాకు ఇదంతా విదితమే" అన్నారు మహారాజు. "చోళ మహారాజు నిత్యం నూతన రాజ్యాలను జయించే ప్రలోభంలో పడిపోయే ఒక విధంగా ఒక రాజ్యంలోని మహాశ్రేష్ఠులకూ, ఉన్నత ఉద్యోగులకు బానిస అయిపోయారు. మేమూ ఈ దోషాన్ని గుర్తించాము. దేశ సంపద అంతా ఎవరో కొద్దిమంది మహాశ్రేష్ఠుల, వాణిజ్యవేత్తల చేతుల్లో ప్రోగు పడటం వల్ల ఎదురయ్యే విపత్తుల్ని, ఆర్థిక సంక్షోభాన్ని మేమేనాడో గమనించాము. ముఖ్యంగా మహాశ్రేష్ఠుల మీద ప్రభుత్వ అజ్మాయిషీ వుండాలి, వాళ్ళు బలసిపోయి కీచులాడుకొని దేశాలకు దేశాలనే నాశనం చేయకుండా ముందే తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కాని పక్షంలో మీ కావేరీ పట్టణానికి పట్టినగతే అన్ని రాజ్యాలకూ తప్పదు."

రాజదంపతులు ఎంతోసేపు కోవలన్, కణ్ణకిలతో వారి కష్ట సుఖాలను గురించి మాట్లాడుతూనే వుండిపోయారు. మహారాణి కణ్ణకిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని "ఈనాటి నుండి నువ్వే మాకు కోడలివి తల్లీ!" అన్నారు.

తిరిగి నూతన జీవితాన్ని ప్రారంభించడం కోసమని కోవలన్‌కు అయిదు లక్షల బంగారు ముద్రలు రాజ్య కోశం నుండి ఇప్పిస్తున్నట్లు ప్రకటించిన మహారాజు అన్నారు – "రెండు పడవల మీద ప్రయాణం చేసే ఆడదాన్ని ఎప్పుడూ విశ్వసించకు శ్రేష్ఠిపుత్రా! అటువంటి ద్వంద్వ స్వభావం కలిగిన స్త్రీవల్ల ఏనాటి కయినా ముప్పు తప్పదు. ఏక నిష్ఠ కలిగిన స్త్రీ వల్లనే మగవాడి జీవితం సార్థకమవుతుంది. జీవితాంతం జ్ఞాపకముంచుకో ఈ విషయాన్ని."

# 32

కాంచీపురం దివ్యారామ బౌద్ధ విహారంలో ఒక పిచ్చిది కూడా వుంటూన్నది. మూడు సంవత్సరాలకు పూర్వం మహాస్థవిరులు ప్రవాహంలో కొట్టుకొని పోతూండగా ఆమెను రక్షించారు. మృత ప్రాయంగా వున్న ఆమెకు తగిన ఉపచారాలు చేసి ఔషధాలు వాడి మృత్యుముఖం నుండి కాపాడారు. పాపం ఇప్పటికీ ఆ పిచ్చిది జీవశ్చవమే, చెప్పిన పనల్లా చేస్తుంది. ఆపైని చైతన్యంలోకి వెళ్ళి గంటలతరబడి బుద్ధ ప్రతిమను చూస్తూ కూర్చుండి పోతుంది. ఇన్ని సంవత్సరాలుగా "వద్దు", "ఔను", "మంచిది" అన్న మూడు మాటలు తప్ప ఆమె నోట ఎట్టిపలుకూ ఎవరూ విని ఉండలేదు. ఏదైనా మాట్లాడవలసిందిగా ఎవరైనా మరీ మరీ ఒత్తిడి చేసినప్పుడు శబ్దాల్ని వెతుక్కోవడానికి ఆమె పడే తాపత్రయాన్ని చూస్తే మహాస్థవిరుల హృదయం ద్రవించి పోతుంది. చేయి ఎత్తి ఆమెను బాధించవద్దని వారిస్తూ వుంటారు. విహారంలో వున్న భిక్షువులు ఆమెను చూచి "పూర్తిగా మోడుబారిన బ్రతుకు. ఈ జీవితానికి ఇక వసంతం లేదుకదా. పాపం ఏ ఘోరశాపాలవల్ల ఈ దశకు వచ్చిందో" అని జాలి పడుతూ వుంటారు.

బౌద్ధ భిక్షువుల్లో మంచి చిత్రకారులు కూడా వున్నారు. వాళ్ళు చిత్రాలు వేస్తున్న సమయంలో పిచ్చిది కూడా వెళ్ళి ఎంతో ఆసక్తితో చూస్తూ నిలబడి పోతుంది. చూస్తూ చూస్తూనే ఏ ఆంతరిక ప్రేరణతోనో తనూ కుంచె అందుకొని అద్భుతంగా చిత్రాలు వేయడం మొదలు పెడుతుంది. మళ్ళీ ఏమి పురుగు తొలుస్తుందో వాటిని అసంపూర్తిగానే వదిలి ఎటో వెళ్ళిపోతుంది.

భిక్షాటన కోసమని నగరానికి వెళ్ళే దళాలతో ఈమెను కూడా అప్పుడప్పుడు మహాస్థవిరులు పంపుతూ వుంటారు.

నిపుణులయిన వాదకుల వీణా వాయిద్యం కాని, మృదంగ వాయిద్యం కాని, అందెల ధ్వనికాని విన్నదో పిచ్చిదానికిక ఈలోకం స్పృహ వుండదు. తనను తాను మరచి నిలబడిపోతుంది. ఆ సమయంలో ఆమెనిక అక్కడ్నించి ఎవరూ కదిలించలేరు.

నగర శ్రేష్ఠులు బౌద్ధ భిక్షుల్ని ఎంతగానో ఆదరిస్తూ వుంటారు. బౌద్ధరామం నుండి వారి సౌధాలకు తరచూ రాకపోకలు జరుగుతూ వుంటాయి. పిచ్చిది కూడ అప్పుడప్పుడు భిక్షువులతో కలసి వెళ్తూ వుంటుంది. ఒకసారి ఒక బేహారి సౌధంలో ఒకచోట ముత్యాలు పోగుపెట్టి వుండటం చూచి మేలిమి ముత్యాలను వేరుచేస్తూ అక్కడే కూర్చుండి పోయింది పిచ్చిది.

అలా ఏరుతూ ఏరుతూనే హఠాత్తుగా వాటిని గుర్తించడం మరచిపోయింది. అంతలోనే అలసిపోయి దృష్టి మరొక దిక్కుకు మరల్చుకుంది. చూస్తూ చూస్తూ వుండగానే ఆమె చూపులు ఏ అగాధ సాగరాల లోతుల్లోనో మునిగిపోయాయి. తిరిగి స్మృతిని రప్పించు కోడానికి ఆమె పడే బాధచూచి అందరి కళ్ళూ చెమర్చాయి. "ఎవరో ఉన్నత సంస్కారం కలిగిన స్త్రీయే పాపం. ఏ భయంకరమైన మానసికాఘాతం వల్లనో ఇలా అయిపోయింది" అనుకున్నారు అంతా.

ఒకనాడు చేరణ మహారాజు శెంగట్టువన్ కనిష్ఠ సోదరులు మహాకవి ఇల్లంగో ఆడిగళ్ కాంచీపురం వేంచేశారు. ఇల్లంగో ఏనాడో దీక్ష స్వీకరించి బౌద్ధభిక్షువు అయ్యారు. ఇప్పుడు వీరు మహాస్థవిరులు. మహాకవిగా దక్షిణ భారతమంతా వారికి ప్రసిద్ధివుంది.

కావేరీ పట్టణం జలప్రళయాన్ని కళ్ళారా చూచి ప్రభావితులయిన మహాకవి శిలప్పది కారం (కళ్యాణ మంజీరాలు) అనే పేరుతో ఒక మహాకావ్యాన్ని రచించారు. ఇప్పుడా కావ్యాన్నే గానం చేస్తూ దేశమంతా తిరుగుతున్నారు. కాంచీపురంలో వారికి ఘనమైన స్వాగతం లభించింది. బౌద్ధారామంలోనే మహాస్థవిరులకు వారు అతిథిగా వున్నారు. మహాకవి కావ్య గానాన్ని రోజూ నగర ప్రజలు ఆబాలగోపాలం వింటూ తన్మయులవు తున్నారు. రోజు రోజుకు కావ్యగానాన్ని వినడానికి వచ్చే ప్రజల సంఖ్య పెరుగుతూ పోతూన్నది.

పిచ్చిది రోజూ అందరికంటే ముందు వరుసలో వెళ్ళి ఆ కావ్యగానం వింటూ కూర్చుంటుంది. అలా వింటూవింటూనే ఏయే ఆలోచనల్లో మునిగిపోతుందో గాని మరి ఈ లోకం స్పృహ వుండదు. ఆమె మౌనమూ, పరధ్యానమూ ఎప్పటిలాగే ఉన్నా జాగ్రత్తగా గమనించే వాళ్ళకు ఆమెలో క్రమేపీ ఏదో మార్పు వస్తూన్నట్టు అనిపిస్తున్నది. కావ్యం వినడం వల్ల భగ్నమయిపోయిన ఆమె మనస్సులో ఆలోచనల కొసలు కొంచెం కొంచెంగా ముడిపడ్డట్టు కనిపిస్తున్నాయి.

చివరి రోజున కావ్యగానం ముగిసి అందరూ వెళ్ళిపోయాక పిచ్చిది గబగబా వెళ్ళి మహాస్థవిరుల ప్రక్కన ఆసీనులై వున్న మహాకవి ఎదుట నిలబడింది. "అంతా జరిగింది జరిగినట్టుగానే వ్రాశారు కాని కవీ! ఆ మహాకావ్యానికి ఇంకొక విషయం కూడా జోడించండి" అంది.

మహాస్థవిరులూ, మహాకవీ ఆశ్చర్యంగా ఆమెవైపు చూశారు.

మళ్ళీ మొదలు పెట్టింది పిచ్చిది. "ఆ విషయం ఏమిటంటారా? మొగవాడి అహంకారంతో కూడిన స్వార్థమే అన్ని పాపాలకు తల్లి. వాడి ఈ స్వార్థం కారణంగానే

వాడి అర్ధాంగమైన "స్త్రీ" అణగారిపోతున్నది. తన పక్షపాత బుద్ధివల్లనే మొగవాడు స్త్రీని సానిని చేసినా, సంసారిని చేసినా సుఖపెట్టలేక పోతున్నాడు. కాగా వాడి పక్షపాతం చివరకు వాడినే సంక్షోభంలో పడవేస్తూన్నది. ఆడదాని రూపంలో ఇక్కడ న్యాయం రోదిస్తూన్నది మహాకవీ! అగ్ని ప్రళయమూ, జలప్రళయమూ రెండూ దాని కన్నీళ్ళలోనే ఇమిడి పోయాయి."

మహాస్థవిరులూ, మహాకవి ఇద్దరూ ఆశ్చర్యంలో మునిగిపోయారు. మహాకవి ఆమెను పరిశీలనగా చూచి, చూచి హఠాత్తుగా "నువ్వు మాధవివేనా?" అన్నారు.

"నేను స్త్రీని మానవ సమాజం యొక్క వ్యధిత అర్ధాంగాన్ని" అంటూ పిచ్చిది గబగబా అడుగులు వేసుకుంటూ బౌద్ధారామం వైపు వెళ్ళిపోయింది.

# KALYANA MANJEERALU

*by Amruthlal Naagar*



అమృత్‌లాల్ నాగర్

హిందీ సాహిత్యంలో సుప్రసిద్ధ నవలా రచయిత అమృత్ లాల్ నాగర్‌కు ఒక విశిష్టమైన స్థానమున్నది. మౌలికమైన ప్రతిభాసంపన్నుడిగా నాగర్ తమ నవలల్లో అనుభూతి ప్రధానమైన వాతావరణాన్ని అల్లుతారు. పాత్రల మానసిక అగాధాల్లోకి చొచ్చుకపోతారు. వ్యంగ్య ప్రధానమైన శైలిలో దేశకాల పరిస్థితులకు అద్దం పడతారు. అలాగే వస్తుపరంగా ఇతివృత్తాన్ని అనుసరించి తమ శైలీ సంవిధానాన్ని రూపొందించు కుంటారు. నాగర్ సమకాలీన సమస్యలను, సామాజికపరమైన ఇతివృత్తాలను తీసుకొని సజీవమైన హిందీ నవలలు రచించారు. వారు రచించిన నవలల్లో బాగా పేరు తెచ్చుకున్నవి – నవాబీ మసనద్, మహాకాల్, బూంద్ ఔర్ సముద్ర, నాచ్యో బహుత్ గోపాల్, మానస్ కాహన్స్ – మొదలైనవి. ఈ నవలల్లో మధ్య తరగతి, బడుగు జీవితాల గురించి ఆయన శక్తివంతంగా చిత్రించారు. పల్లె జీవితాల గురించి కూడా నాగర్ రచనలు చేసారు. భారతీయ సంస్కృతికి వున్న మౌలిక పునాదులను ఆయన విస్మరించలేదు.

కళ్యాణ మంజీరాలు (సుహాగ్ కే నూపుర్) అనే ఈ నవలను అమృత్‌లాల్ నాగర్, తమిళ కావ్యం 'శిలప్పదికారం' ఆధారం చేసుకొని రాసారు. తమిళనాడులోని పేర్లు, సంఘటనలు వీటిలో కనపడతాయి. జైన బౌద్ధ మతాల ప్రభావం వున్న రోజుల్లో సాంఘిక పరిణామాలు, ఆచార వ్యవహారాలను ఈ నవల ప్రతిబింబిస్తున్నది.

₹ 120/-


విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520 004